# యోజన

జనవరి 2014 అభివృద్ధి మాసపత్రిక రూ. 10

పురోగతి వైపు పయనం యోజన 40 సంవత్సరాలు

## గిరిజనులు, అణగారిన వర్గాలు

- రాజ్యాంగ నిబంధనలు, చట్టాలు, గిరిజనులు
- ఆహార బిల్లు - అటవీ ఆహార ఉత్పత్తులు - ఆదివాసీ ప్రజలు
- ఆదివాసీ స్వయంపాలన సాకారం - ఏకైక సర్వరోగ నివారిణి
- షెడ్యూల్డ్ కులాల ఉపప్రణాళిక - గిరిజనుల ఉపప్రణాళిక
- అణగారిన వర్గాలు : ప్రభుత్వ విధానము, అమలు , సమస్యలు
- అలుపెరుగనిస్వేచ్ఛా ప్రియుడు "నెల్సన్ మండేలా "
- విజ్ఞాన విపంచి
- ఇండియన్ ఫారెస్ట్ సర్వీసు - విహంగ వీక్షణం







సంపాదకీయం

# నెహ్రూ మరో పంచశీలను మరచిపోతున్నాం!




భారత దేశం అంతర్జాతీయ సంబంధాలు నెరపడం గురించి మన ప్రథమ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ ప్రవచించిన పంచ సూత్రాలను మనం 'పంచశీల'గా పిలుచుకుంటున్నాం. అయితే, దేశంలోని గిరిజనుల అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళిక రూపకల్పన దిశగా ఆయన మరో ఐదు ప్రాథమిక సూత్రాలను నిర్దేశించారని అతి తక్కువ మందికి మాత్రమే తెలుసు.'ఈశాన్య సరిహద్దు ప్రాంత దర్శనం' (*A Philosophy for North Eastern Frontier Area* (NEFA) పేరిట తానెంతో అభిమానించి, గౌరవించే ప్రసిద్ధ పరిశోధకుడు వెరియర్ ఎల్విన్ రచించిన పుస్తకానికి నెహ్రూ రాసిన పీఠికలో ఈ 'పంచశీల' ప్రస్తావన కనిపిస్తుంది. గిరిజనాభివృద్ధిపై నెహ్రూ దృక్పథం కీలకాంశం భూమి, అడవులపై గిరిజన హక్కులు ఆధారంగా రూపొందింది. గిరిజనులపై బయటివారి ఆలోచనలను, విలువలను రుద్దడాన్ని అది వ్యతిరేకిస్తుంది. వారి సొంత మేధస్సు నుంచే స్వీయాభివృద్ధి మార్గాన్ని ఎంచుకునేలా వారి మార్గాన వారిని నడవనివ్వాలని కూడా నిర్దేశిస్తుంది. గిరిజన వ్యవస్థల సామాజిక, సాంస్కృతిక స్వయంప్రతిపత్తిని గౌరవించి, కొనసాగించాల్సిన అవసరం గురించి ఆయన నిర్దేశించిన సూత్రాలు నొక్కి చెబుతాయి. అంతేకాదు... షెడ్యూల్డు తెగల-ప్రాంతాల సంప్రదాయాలను, సంస్కృతి పరిరక్షణను తప్పనిసరిగా పేర్కొంటున్న రాజ్యాంగంలోని 244 అధికరణం నిర్దేశాన్ని ఆయన ఆలోచనలు ప్రతిబింబిస్తాయి.

గిరిజన ప్రజల వెనుకబాటుతనానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. భూమి, అడవులు, సహజ వనరులపై గిరిజనుల సంప్రదాయ హక్కులను వలస పాలకుల హయాంలో రూపొందించిన అనేక రాజ్యాంగ నిబంధనలు కాలరాశాయని స్పష్టమవుతుంది. 'భారత అటవీ చట్టం-1927' ఇందుకు నిదర్శనం. ఎలాంటి ఆస్తులైనా చట్టబద్ధ యజమాని పేరిట పత్రసహితంగా నమోదు కానట్లయితే అవి ప్రభుత్వానికే చెందుతాయని ఈ చట్టం పేర్కొంటుంది. ఈ చట్టం అమలు కోసమే ఏర్పాటుచేసిన అటవీ శాఖకు అదే చట్టం ఆధారంగా నాటి బ్రిటిష్ ప్రభుత్వం విశాలమైన అటవీ ప్రాంతాన్ని అప్పగించేసింది. దీంతోపాటు ఎక్కడ, ఎలాంటి భూమినైనా ప్రజా ప్రయోజనం పేరిట ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు వీలుకల్పించే 'భూ సేకరణ చట్టం-1894' కూడా ఇలాంటిదే. సహజ వనరులు, అటవీ భూమిపై గిరిజనుల హక్కులు హరించడంలో ఈ చట్టాలు కీలకపాత్ర పోషించాయి. అభివృద్ధి పేరిట పరిశ్రమల స్థాపన, ఖనిజాల వెలికితీత-అన్వేషణ, భారీ జలాశయాల నిర్మాణం వంటివి గిరిజనులు తమ జన్మభూమికి దూరమై నిరాశ్రయులు కావడానికి దారితీశాయనడం మరో చేదు నిజం. ఇటువంటి ప్రాజెక్టుల కారణంగా దేశంలో కోటిమందికిపైగా గిరిజనులు అడవి తల్లికి దూరమై, ఉపాధి కోల్పోయారని అంచనా. ఆధునిక ప్రభుత్వాలు కొన్ని లక్ష్యాల సాధన కోసం వారి సరిహద్దులను రాజకీయ, ఆర్థిక మండళ్లుగా కలగలిపాయి... విడగొట్టాయి. వాటి పరిధిలో ప్రజలను-వనరులను విభజించాయి. వీటిని ఎవరు, ఎలా ఉపయోగించుకోవాలో నిర్దేశిస్తూ నిబంధనల చట్రంలో బిగించాయి. అయితే, గిరిజనుల హక్కుల రక్షణ, వారి సంస్కృతి పరిరక్షణ, జీవనోపాధి కల్పనను తమ ప్రాథమిక బాధ్యతగా అంగీకరించాయి.

భారత దేశంలోనూ రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూళ్లలోని నిబంధనలు భూమిపై ఆదివాసీల హక్కుకు చారిత్రక హామీ ఇచ్చాయి. గిరిజనం హక్కులకు సంబంధించి వీటిని 'రాజ్యంగంలో రాజ్యాంగం' గానూ అభివర్ణిస్తున్నారు. 'పంచాయతీ విస్తరణ, షెడ్యూల్డు ప్రాంతాల చట్టం' (పెసా) సహజ వనరుల నిర్వహణ, స్వయం పాలనకు సంబంధించి గిరిజనులకు విశేషాధికారాలిచ్చింది. అలాగే అటవీ హక్కుల చట్టం కూడా ఉమ్మడి వనరుల మీద వ్యక్తిగత హక్కులతోపాటు సామాజిక హక్కులు కల్పించింది. దేశంలోని అత్యంత పేదల వ్యక్తిగత హక్కులను సంరక్షణ, జీవన హక్కులతో మమేకం చేసింది. ఇటీవల పార్లమెంటు ఆమోదించిన సరికొత్త భూ సేకరణ చట్టం ఇందుకో ఉదాహరణ. షెడ్యూల్డు ప్రాంతాల్లో స్థానిక, స్వపరిపాలన సంస్థల ఆమోదం లేకుండా భూమి క్రయవిక్రయాలను ఈ చట్టం నిరోధిస్తుంది. వెనుకబడిన ప్రజల భూమి హక్కు, జీవనోపాధి అంశాలపై ఆందోళనను ఇది చాలావరకు తొలగించింది. ఒకనాటి వేట-సేకరణ జీవన విధానంగా ఉన్న మూలవాసులు, స్థానికులను 'అసలైన సౌభాగ్య సమాజం'గా, ఐశ్వర్యవంతమైన సమాజం దిశగా పయనించినవారుగా మార్షల్ సాలిన్స్ అభివర్ణించారు. అయితే, గౌరవప్రదమైన జీవితం గడపడానికి తగిన వసతులు, సదుపాయాలు అవసరం. కానీ, ఆధునిక-పాశ్చాత్య గాల్బ్రెయిత్ తరహా సౌభాగ్యం పరిమిత వనరులతో మానవుడి అపరిమిత కోర్కెలను సంతృప్తిపరచుకోవడమే అంటుంది. అయితే, గిరిజనులతోపాటు వెనుకబడిన ప్రజానీకాన్ని బాధలకు గురిచేసి సంపన్న సమాజానికి వారధి నిర్మించే ప్రయత్నం తగదు. లేకపోతే మన మెరుపుకలలు సింహస్వప్నాలుగా మారడానికి తరతరాలుగా అణచివేతకు గురైన ఆ పేదల ఒక్క కన్నీటి చుక్క చాలు!

**ఇదే నెహ్రూ మరో పంచశీల**

1. గిరిజనులు ఇలా అభివృద్ధి చెందాలి, స్వీయ మేధస్సుతో పురోగమించాలి వారిపై మన పద్ధతులు రుద్దకూడదు.
2. ఎదిగేందుకు వారికి సహకరించాలి.వారి సంప్రదాయ కళలను, సంస్కృతిని ప్రోత్సహించాలి. భూమి, అడవులు, వనరులపై గిరిజన హక్కులను గౌరవించాలి
3. మనం స్వజనంతో సొంతజట్టును నిర్మించుకునేలా తర్ఫీదు ఇచ్చేందుకు యత్నించాలి పాలన, అభివృద్ధిలో సహజంగానే ఆరంభదశలో అవసరమైన సాంకేతిక నిపుణులను వినియోగించాలి. అయితే, గిరిజన ప్రాంతంలోకి ఎక్కువమంది బయటివారిని రప్పించతగదు. ఆ ప్రాంతాల పాలన వ్యవహారాల్లో అపరిమిత జోక్యంతో, మితిమీరిన పథకాలతో అతి చేయతగదు.
4. గిరిజనంతో మమేకమై పనిచేయవచ్చు కానీ, వారి సొంత సామాజిక, సాంస్కృతిక వ్యవస్థలపై విముఖత ప్రదర్శించరాదు.
5. ఫలితాల మదింపు అవసరమే. అయితే... గణాంకాలు, వెచ్చించిన నిధులనుబట్టి కాకుండా అక్కడ వెల్లివిరిసిన నాణ్యమైన మానవ ప్రమాణాల ఆధారంగానే ఇది జరగాలి సుమా!

న్యూఢిల్లీ 1958 అక్టోబరు 9. జవహర్లాల్ నెహ్రూ

(*A Philosophy for North Eastern Frontier Area* (NEFA) పుస్తకానికి రాసిన పీఠికనుంచి సంగ్రహణం)

**చీఫ్ ఎడిటర్**

ISSN : 0091 : 8729

# యోజన

అభివృద్ధి మాసపత్రిక

జనవరి 2014

సంపుటి : 42    సంచిక : 3

చీఫ్ ఎడిటర్
**రాజేష్ కె.ఝా**

సీనియర్ ఎడిటర్
**సురేష్ ధర్మపురి**

ఎడిటర్
**షఫి మహమ్మద్**

జాయింట్ డైరెక్టర్ (ప్రొడక్షన్)
**వి.కె. మీనా**

కవర్ డిజైన్
**గజానన్ పి. ధోపే**

**ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాల గురించిన సమాచారాన్ని అందజేసేందుకు తెలుగు, హిందీ, ఇంగ్లీషు, అస్సామి, బెంగాలి, తమిళం, ఉర్దూ, మరాఠీ, గుజరాతీ, మళయాళం, పంజాబీ, కన్నడ, ఒడియా భాషలలో వెలువడుతున్న మాసపత్రిక.**

**యోజన (తెలుగు) చందా వివరాలు**

| | |
|---|---|
| 1 సంవత్సరానికి | రూ. 100/- |
| 2 సంవత్సరాలకు | రూ. 180/- |
| 3 సంవత్సరాలకు | రూ. 250/- |

**మరిన్ని వివరాలకోసం : 040-23310162**


**చందాను మనియార్డరు/డి.డి. ద్వారా పంపవలసిన చిరునామా**

ఎడిటర్, యోజన (తెలుగు),10-2-1
ఎఫ్‌డిసి కాంప్లెక్స్, మహవీర్ హాస్పిటల్ ఎదురుగా
ఏ.సి. గార్డ్స్, హైదరాబాద్ – 500 028
ఫోన్ : 23315288, 23314823
చందా వివరాలకు : 23310162
e-mail : yojana_telugu@yahoo.co.in

## ఈ సంచికలో...

| | | | |
|---|---|---|---|
| 1. | సంపాదకీయం | చీఫ్ ఎడిటర్ | 2 |
| 2. | రాజ్యాంగ నిబంధనలు, చట్టాలు, గిరిజనులు వర్జీనియస్ ‌జాజా | | 4 |
| 3. | ఆహారబిల్లు – అటవీ ఆహార ఉత్పత్తులు – ఆదివాసీ ప్రజలు | మధు రాంనాథ్ | 7 |
| 4. | ఆదివాసీ స్వయం పాలన సాకారం – ఏకైక సర్వరోగనివారిణి | రాహుల్ బెనర్జీ | 10 |
| 5. | అణగారిన వర్గాలు : ప్రభుత్వవిధానము అమలు, సమస్యలు | ప్రొ. పంజాల నరసయ్య | 14 |
| 6. | ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన తెగలు | డా.కె.ఐలయ్య, పోలం సైదులు | 16 |
| 7. | అలుపెరుగని స్వేచ్ఛా ప్రియుడు - నెల్సన్ మండేలా - | డా. జి.ఆర్. జయానందం | 18 |
| 8. | షెడ్యూల్డ్ కులాల ఉపప్రణాళిక – గిరిజనుల ఉప ప్రణాళిక | సౌమ్య శ్రీ వాత్సవ | 20 |
| 9. | భారతదేశంలో మహిళల రక్షణ చర్యలు | షేక్ జాహెదా బేగం | 24 |
| 10. | విజ్ఞాన విపంచి | ప్రాతూరి పోతయ్యశర్మ | 26 |
| 11. | ఇండియన్ ఫారెస్టు సర్వీసు - విహంగ వీక్షణం | డా.ఆర్. అనంత పద్మనాభరావు | 26 |
| 12. | సమష్టి కృషి ఆలంబనగా స్వాలంబన | శైలేంద్ర సిన్హా | 31 |
| 13. | హిమాలయ ఆవరణ వ్యవస్థ - ఆర్థిక స్థిరత్వం | ప్రొ. బి.కె. కొన్వర్ | 33 |
| 14. | శీతోష్ణస్థితి మార్పు – భారత్ సంసిద్ధత | డా. సుభాష్ శర్మ | 37 |
| 15. | గ్రామీణ భూ నిర్వహణలో మార్పు | సంజయ్ పట్నాయక్ | 41 |
| 16. | మీకు తెలుసా? | యోజన సంపాదకవర్గం | 44 |
| 17. | మహా ప్రతిభావంతుడు కొమర్రాజు వెంకట లక్ష్మణరావు | మోసర్ల శ్రీ అంజని | 46 |
| 18. | ప్రాథమిక విధులు – ఒక పరిశీలన | మార్క కిరణ్, రాపెల్లి వెంకటేష్ | 48 |
| 19. | త్యాగరాజకృతుల ప్రచార సారథి సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రులు | రేవూరి ఉమా సంజీవిని రామకృష్ణ | 49 |
| 20. | వారసత్వపు సంపద ఈ విద్యాలయం | జి.ఎన్. సూరి | 51 |

యోజనలో ప్రచురించిన వ్యాసాలలో వ్యక్తపరచిన భావాలు ఆయా రచయితలవే. వారు పనిచేస్తున్న సంస్థలు, ప్రభుత్వ అభిప్రాయాలను అవి ప్రతిబింబించవు.
యోజనలో ప్రచురించే ప్రకటనలలోని అంశాలు ఆయా సంస్థలు వారి ప్రతినిధులకు చెందినవి. ప్రకటన పాఠం/సారాంశం మూలంగా ఎదురయ్యే ఎటువంటి పర్యవసానాలకు యోజన బాధ్యత వహించదు




# రాజ్యాంగ నిబంధనలు, చట్టాలు, గిరిజనులు

భారత దేశంలో సామాన్యంగా గిరిజనులు వారి భౌగోళిక ప్రాంతానికే పరిమితమై, సామాజిక ఏర్పాటుతో సంబంధం లేకుండా విశాలమైన భారతీయ సమాజానికి దూరంగా, ఏకాంతంగా ఉంటున్నారనే ప్రాథమిక భావన నెలకొంది. అందువల్లే సామాజిక ఏర్పాటులో వివిధ స్థాయిలలో గ్రూపులు, సంఘాలుగా గిరిజనులను వర్గీకరించారు. వాస్తవంగా వీరు భారతీయ సమాజానికి దూరంగా ఉంటూ, వారు నివసిస్తున్న ప్రాంతంలో స్వయం పాలనను అనుభవిస్తున్నారు. భూమి, అటవీ, ఇతర సహజ వనరులపై వారి సొంత చట్టాలు, ఆచారాలు, సాంప్రదాయాల ప్రకారం తమను తామే పాలించుకుంటున్నారు. వలస పాలన ప్రారంభంతో యుద్ధం, గెలుపు, ఆక్రమణ ద్వారా గిరిజనులు, గిరిజనేతరులను ఒకే రాజకీయ, పరిపాలన కిందకు తీసుకు వచ్చారు. ఆ తర్వాత గిరిజనుల సంప్రదాయాలకు, స్ఫూర్తికి దూరంగా నూతన,ఉమ్మడి పౌర, క్రిమినల్ చట్టాలు, ఇంకా పరిపాలనా నిర్మాణం ఏర్పాటు అయ్యాయి

మోసం, దగా, తనఖా మొదలైన పద్ధతుల ద్వారా గిరిజనుల నుంచి పెద్ద ఎత్తున భూములను గిరిజనేతరులు అన్యాక్రాంతానికి పాల్పడ్డారు. దీంతో జాతీయ నాయకత్వం స్వాతంత్ర్యానంతరం గిరిజనులపై ప్రత్యేక శ్రద్ధ చూపి, రాజ్యాంగంలో వారి కోసం నిబంధనలు పొందుపరిచారు. స్వతంత్ర భారత దేశంలో గిరిజనులకు పౌర, రాజకీయ హక్కులను ఇతరులతో సమానంగా కల్పించారు. ప్రాథమిక హక్కుల్లో భాగంగా పౌర, రాజకీయ హక్కులు కల్పించగా సామాజిక హక్కులను ఆదేశిక సూత్రాలలో నిర్దేశించారు.

పై వాటితో పాటు గిరిజనులకు కొన్ని ప్రత్యేక హక్కులు కల్పించారు. మిగతా వాటితో పాటు చట్టబద్ధమైన గుర్తింపు నిబంధనలు (అధికరణ–342) ; పార్లమెంట్, శాసనసభలలో నైష్పత్తిక ప్రాతినిధ్యం (అధికరణం 330, 332) ; స్వేచ్ఛగా సంచరించడం లేదా సంబంధిత ప్రాంతంలో స్థిర నివాసం లేదా ఆస్తులు సం పాదించుకోవడం (అధికరణ

**వర్జీనియస్ ఖాఖా**
డిప్యూటీ డైరెక్టర్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, గౌహతి



19(5) ; ప్రతి ఒక్కరి భాష, లిపి, సంస్కృతి మొదలగు వాటిని పరిరక్షించడం (అధికరణం–29) సాధారణంగా రిజర్వేషన్ నిబంధన ( అధికరణ14(4)లో, గిరిజన కమ్యూనిటీ ఉద్యోగ, నియామకాల కోసం (అధికరణ 16(4) ప్రభుత్వాలు నిబంధనలు చేసే విధంగా రాజ్యాంగంలోని క్లాజులో పొందుపరిచారు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో సమాజంలోని వెనుకబడిన వర్గాలను, గిరిజనులతో సహా ప్రత్యేకంగా (అధికరణ46లో) ప్రోత్సహించి విద్యా పరంగా, ఆర్థికంగా వారి కోసం కృషి చేయడం. దీనితో పాటుగా రాజ్యాంగంలోని 5వ లేదా ఆరో షెడ్యూల్‌లోని నిబంధనలో (అధికరణం 244 మరియు 244 (ఏ) గిరిజన జాతులు నివసించే ప్రాంతాలలో పరిపాలన పరంగా ప్రత్యేక పాలన సౌలభ్యం కోసం ప్రభుత్వాలకు అధికారం కల్పించడం, ప్రభుత్వ సర్వీసులలో ఉద్యోగాలు విద్యాసంస్థలలోని సీట్లలో కొంత శాతం రిజర్వేషన్ అనే ప్రత్యేక హక్కుతో పాటు రాజ్యాంగ నిబంధనల ప్రకారం షెడ్యూల్డ్ మరియు గిరిజన ప్రాంతాలను ఏర్పాటుచేసి పార్లమెంట్, రాష్ట్ర శాసన సభలలో ప్రాతినిధ్యం కల్పించడం. దీనినే సూక్ష్మంగా చెప్పాలంటే గిరిజన ప్రజల ప్రయోజనార్థం రాజ్యాంగ పరమైన రక్షణలు కల్పించారు.


ఈ అన్ని నిబంధనలలో రక్షణాత్మక వివక్షత అనేది గిరిజన ప్రజలకు కల్పించిన అతి ముఖ్యమైన హక్కులలో ఒకటిగా భావించవచ్చు. రాజ్యాంగంలో గిరిజన ప్రజలకు కల్పించిన అతి


ముఖ్యమైన హక్కులలో ఇది ఒకటి. రాజ్యాంగంలో గిరిజన ప్రజలకు ఉన్న హక్కులను అమలు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుంది. ప్రభుత్వం ప్రభుత్వ సంబంధ ఇంకా విద్యా సంస్థలలో గిరిజన తరగతికి చెందిన వారికి 7.5% ఉద్యోగాలు కల్పిస్తారు. షెడ్యూల్డ్ జాతుల తరగతులలో రక్షణాత్మక వివక్షత కల్పించడానికి ఈ గ్రూపుల వారికి కొన్ని మినహాయింపులు ఇస్తున్నారు. ఇన్ని నిబంధనలు ఉన్నప్పటికీ షెడ్యూల్డ్ కులాల వారితో పోలిస్తే, షెడ్యూల్డ్ జాతులలో ఫలితాలు అంత ఆశాజనకంగా లేవు. వారికి కేటాయించిన కోటాను పూరించడంలో ప్రభుత్వ అసమర్థత ఉన్నప్పటికీ రాజ్యాంగంలో వారికి కల్పించిన హక్కులను ఉల్లంఘించినట్లుగా భావించరాదు. కాబట్టి రాజ్యాంగంలో పొందు పరచిన హక్కుల అమలుకు అవసరమైన చర్యలు చేపట్టడంలో ఇది మొదటిదిగా భావించవచ్చు. రెండోది ఈ కేటగిరీల నుంచి అభ్యర్థుల రిజర్వేషన్ పొడిగింపు దానికదే జరగదు. వాస్తవానికి రాజ్యాంగంలో కూడా కొన్ని నియమాలలో అనిశ్చితికర పరిస్థితి ఉంది. ఉదాహరణకు 335 అధికరణలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారిని ఉద్యోగాల్లో నియామకం చేయడంలో పరిపాలన సామర్థ్య నిర్వహణకు అనుగుణంగా వారిని పరిగణనలోకి తీసుకోవాలి. మూడోది గిరిజనులకు కల్పించిన హక్కులు గిరిజన కమ్యూనిటీలోని సభ్యులు మాత్రమే ఉపయోగించుకోవాలి. ఇది ఇతరులతో సమానంగా వ్యక్తిగత హక్కు కలిగి ఉండడం లాంటిది.

హక్కు వ్యక్తిగతమైనా దానిని సాధించడానికి కొన్ని బాధ్యతలు నెరవేర్చవలసి ఉంటుంది. పై అంశాలకు సంబంధించి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని కోర్టులో సవాలు చేయడం అనేది అంత సులభం కాదు. వివక్షత లేదా నిరాకరణకు సంబంధించిన కొన్ని ప్రత్యేక కేసులను మాత్రమే కోర్ట్ స్వీకరించినప్పటికీ వాటిని రాజ్యాంగంలోని అధికరణ 335 ప్రకారం నిరూపించుకోవాల్సి ఉంటుంది. నిజానికి రక్షణాత్మక విచక్షణ ఒక్కటే సరిపోదు. అది సమర్థవంతంగా పని చేయాలంటే దానికి అనుబంధంగా ముఖ్యమైనటువంటి సమానత్వం, సామర్థ్యం, వనరులు, నిజమైన అవకాశాలు సృష్టించాలి. అప్పుడే రక్షణాత్మక విచక్షణ సమర్థంగా పని చేస్తుంది. రాజ్యాంగంలోని నిబంధనలు లేదా శాసనాల ద్వారా ఆర్థిక, సామాజిక హక్కులు కల్పించడమే కాకుండా చట్టపరంగా సమర్థవంతమైన, పరిపాలన, మౌలిక, ఆర్థికంగా సహాయమందించాలి. ఈ నిబంధనలకు తోడు కొన్ని అనుబంధ సహాయ వ్యవస్థలను అందుబాటులోకి తేవాలి. ఉదాహరణకు రక్షణాత్మక విచక్షణ వంటి నిబంధన ద్వారా పూర్తిగా కాకపోయినా కొంత వరకు ఫలితం ఉంటుంది. ఏమైనప్పటికీ ఇటువంటి చర్యలు లేకపోతే లేదా సమర్థంగా లేకపోయినా రాజ్యాంగంలో పొందుపరిచిన నిబంధనల వలన గిరిజనులకు ఆశించిన ఫలితాలు చేకూరవు.

గిరిజనులకు సమర్థమైన ఆర్థిక, సామాజిక హక్కులను వారికి అందించక పోవడమే కాకుండా, వారు గతంలో అనుభవించిన భూమి, అటవీ హక్కులను వలస పాలకులు, స్వాతంత్ర్యానంతర పాలకులు అనుభవించకుండా చేశారు. గిరిజనులు ముఖ్యంగా మైదాన ప్రాంతాలకు దూరంగా, అటవీ ప్రాంతాలలో జీవిస్తారనేది అందరికీ తెలిసిన విషయమే. భూమి అన్యాక్రాంతం కావడమనేది బ్రిటీష్ కాలంలో ప్రారంభమై స్వాతంత్ర్యానంతరం వరకూ కొనసాగుతూ ఉంది. ఈ అంశాన్ని గతంలో ప్రస్తావించడం జరిగింది. గిరిజనేతరులు భూమి అన్యాక్రాంతం కావించడం వంటి సమస్యను పరిష్కరించడానికి గిరిజన జనాభాగల అన్ని రాష్ట్రాలలో చట్టాలు చేశారు. కొన్ని ప్రాంతాలలో చోటా నాగ్‌పూర్ కౌలుదారి చట్టం 1908, సంతాల్ పరగనా కౌలుదారీ చట్టం 1940 వంటివి బ్రిటీష్ కాలం నుంచే అమలులో ఉన్నాయి. బ్రిటీష్ వారు పరిపాలన పరంగా, రాజకీయ పరంగా ఆవశ్యకం అని భావించిన చోటే ఇటువంటి చట్టాలు తీసుకొచ్చారు తప్ప గిరిజనుల కోసం ఇటువంటి చట్టాలను విస్తృతంగా తీసుకు రాలేదు. ఇవి గిరిజనుల భూమి అన్యాక్రాంతం కాకుండా రక్షణ కల్పించి, గిరిజన ప్రాంతాలలో గిరిజనేతరులు స్థిర పడకుండా పరిమితులు విధించాయి.

స్వాతంత్ర్యానంతరం గిరిజన జనాభా ఉన్న అన్ని రాష్ట్రాలు గిరిజనులకు చెందిన భూములు గిరిజనేతరుల పరం కాకుండా నివారించడానికి ఇంకా అలా జరిగిన వాటిని తిరిగి గిరిజనులకు అందించడానికి కూడా చట్టాలు చేశారు. కొన్ని రాష్ట్రాల్లో గిరిజనేతరుల ప్రయోజనాలు సంరక్షించే ఉద్దేశంతో కూడా చట్టాలకు సవరణలు చేశారు. ఆంధ్రప్రదేశ్ (సెలెక్టెడ్ ఏరియాస్) ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ 1959 ను గిరిజనేతరుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని 1970లో సవరించారు. గిరిజనేతరులకు కల్పించిన మినహాయింపులను ఆచరణలోకి తేవడానికి కేరళ షెడ్యూల్డ్ ట్రైబ్స్ (రెగ్యులేషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ల్యాండ్ అండ్ రెస్టోరేషన్ ఆఫ్ అలైనేటెడ్ ల్యాండ్) యాక్ట్, 1975 ను తొలగించారు. ఇలాంటి చర్యలు చేపట్టినా గిరిజనుల భూములు గిరిజనేతరుల పరం కావడం కొనసాగింది. ఇటీవలి కాలంలో గిరిజనుల సంరక్షణ కోసం రాజ్యాంగంలో ఉన్న నిబంధనలు అమలు చేయడానికి రెండు ముఖ్యమైన చట్టాలు రూపొందించారు. వాటిలో ఒకటి ప్రావిజన్స్ ఆఫ్ ది పంచాయత్ (ఎక్స్‌టెన్షన్ టుది షెడ్యూల్డ్ ఏరియాస్) యాక్ట్ 1996. ఈ చట్టం షెడ్యూల్డ్ తెగలకు చెందిన ప్రజలు తమ సాంప్రదాయాలు, ఆచారాలను సాంస్కృతిక గుర్తింపును, సామాజిక వనరులను గ్రామ సభ ద్వారా వివాదాల తీర్మానం ఆచారాన్ని కాపాడుకునే అధికారాన్ని కల్పించింది. అయితే ఈ చట్టంలోని అంశాలు, వాస్తవంగా అమలు కాలేదు. ఉదాహరణకు వివిధ రాష్ట్రాల్లో ఆరో షెడ్యూలుకు సంబంధించిన అంశాలు. తొమ్మిది ఏ భాగాన్ని షెడ్యూల్డ్ ప్రాంతాలకు విస్తరిస్తూ ఎటువంటి చట్టం చేయకపోయినా షెడ్యూల్డ్ ప్రాంతాలు ఉన్న అన్ని రాష్ట్రాల్లో ఇది నెమ్మదిగా సాగుతోంది. మరొక చట్టం 'ద షెడ్యూల్డ్ ట్రైబ్ అండ్ అదర్ ట్రెడిషనల్ ఫారెస్ట్ డ్వెల్లర్స్ యాక్ట్ 2006. పూర్వ కాలంలో వారికి ఉన్న హక్కులను గుర్తించి వాటిని తిరిగి కల్పించడం ద్వారా ఏళ్ల తరబడి వారికి జరిగిన అన్యాయాన్ని ఆపడం, ఈ చట్టం లక్ష్యం అయితే ఇలా గుర్తించి తిరిగి హక్కులు కల్పించడం అమలులో అనేక ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటోంది.






రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల ప్రకారం గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన బాధ్యత. వెరియస్ ఎర్విన్ రచించిన **'ఏ ఫిలాసఫి ఆఫ్ నెఫో'** అనే పుస్తకానికి రాసిన ముందు మాటలో నెహ్రూ ఉదాహరించిన 5 సూత్రాలు (పంచశీల)లో ఇవి ప్రతిఫలించాయి. అప్పటి నుంచి స్వాతంత్ర్యానంతరం ఈ అయిదు సూత్రాలు గిరిజనుల అభివృద్ధికి స్ఫూర్తిగా తీసుకోవడం జరిగింది. ఈ సూత్రాలు భూమి, అడవికి సంబంధించి గిరిజనుల సొంత హక్కును, పాలన, అభివృద్ధికి వారి సొంత మనుషుల సుశిక్షిత బృందాన్ని నిర్మించి వారి సామాజిక, సాంస్కృతిక వ్యవస్థల ద్వారానే అభివృద్ధి కల్పించడం తప్పని సరి చేశాయి. అయినప్పటికీ గిరిజనుల పట్ల పాటించిన విధానం దీనికి విరుద్ధంగానే ఉంది. ఇది ముఖ్యంగా దేశాభివృద్ధి ప్రాముఖ్యతల కారణం వలనే. నిజానికి వేగవంతమైన జాతీయ అభివృద్ధి కోసం చేపట్టిన చర్యలు గిరిజనుల సామాజిక సమగ్రత సాధించడానికి ముఖ్యమైన విధానంగా పరిగణించడం జరిగింది. నిజానికి గిరిజనుల సంక్షేమం ప్రయోజనాలకు సంబంధించిన అంశాల కంటే, వనరుల సమీకరణ, భవిష్యత్తు అభివృద్ధి కోసం ఉత్పాదక రూపాన్ని నిర్మించడం అనే జాతీయ లక్ష్యం చాలా ప్రధానం అయింది. అందువలన జాతీయ అభివృద్ధికి గిరిజనుల ప్రయోజనాలు, సంక్షేమం బలిపెట్టడం జరిగాయి

రాజ్యాంగంలోని 19(5) అధికరణం సాంస్కృతిక లేదా భాషాపరమైన మైనార్టీ వర్గం తన భాష సంస్కృతిని సంరంక్షించుకునే హక్కును కలిగి ఉన్నప్పటికీ గిరిజన జాతులు వారి భాష, సంస్కృతి, మతాన్ని రక్షించుకొని అభివృద్ధి చేయలేక పోతున్నారు. అంటే గిరిజన జాతులు వ్యక్తులు, సమూహం వలే వారి సొంత భాష ఉపయోగించి వారి సొంత మతాన్ని అవలంభించి వారి చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు అధ్యయనం చేసే హక్కును కలిగి ఉన్నాయి. ప్రభుత్వం వారిపై బలవంతంగా ఇతర భాష లేదా సంస్కృతిని చట్టం ద్వారా బలవంతంగా రుద్దలేదు. ప్రభుత్వం వారిపై ఎలాంటి భాషను, సంస్కృతిని రుద్దకపోయినా రాజ్యాంగంలోని ఈ నిబంధనను పాటించడానికి ఎలాంటి అనుకూల చర్యలు తీసుకోలేదు. పైగా తీసుకున్న చర్యలు రాజ్యాంగంలో పేర్కొన్న నిబంధనలకు అనుగుణంగా లేవు. అలా చేపట్టిన చర్యలు గిరిజనుల ప్రత్యేకమైన భాష, సంస్కృతిని అభివృద్ధి పరిచే విధంగా కాకుండా సమాజంలో ప్రముఖమైన సంస్కృతి, భాషలో కలిపివేసే దిశలో ఉంటున్నాయి. ఉదాహరణకు గిరిజన జాతులకు అందిస్తున్న స్కూలు విద్య, ఆయా రాష్ట్రాలలోని బలమైన ప్రాంతీయ వర్గాల భాషలోనే ఎల్లప్పుడూ అందిస్తున్నారు. దీని ఫలితంగా గిరిజన జాతులు వారి భాష, సంస్కృతికి సంబంధించిన జ్ఞానాన్ని కోల్పోతున్నారు. నిజానికి భాష, సంస్కృతి అభివృద్ధి గిరిజనులకే వదిలేయడం జరిగింది. అయినప్పటికీ మానవ వనరుల నిర్వహణ, ఆర్థికపరమైన వనరులపై నియంత్రణ లేకపోవడం వలన గిరిజనులు ఆ దశలో పటిష్టమైన చర్యలు చేపట్టలేకపోతున్నారు. ఎక్కడైతే ఈ విధమైన మద్దతు లభిస్తుందో అక్కడ గిరిజనులు వారి సంస్కృతిని సంరంక్షించుకోగలుగుతున్నారు. భారత దేశంలో ఉత్తర, దక్షిణ, పశ్చిమ ప్రాంతాలలో ఎందుకు గిరిజనుల భాష, సంస్కృతి క్షీణించిపోతున్నాయో ఇది తెలుపుతోంది. భారత దేశంలోని తూర్పు ప్రాంతంలో ముఖ్యంగా ఈశాన్య ప్రాంతంలో ఈ పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. దీనికి ప్రధాన కారణం, ఈశాన్య భారత దేశంలో ఆ విధమైన అభివృద్ధి కల్పించే సంస్థాగత ఏర్పాటు ఉండడం. గిరిజనుల రాష్ట్రాలు, స్వయం పాలిత జిల్లాల ఏర్పాటుతో వీటికి మరింత ప్రోత్సాహం ఏర్పడింది. గిరిజనుల సంక్షేమాన్ని ప్రయోజనాలను సంరక్షించే లక్ష్యంతో అనేక రాజ్యాంగ నిబంధనలు, చట్టాలు ఉన్నప్పటికీ ఆశ్చర్యకరంగా గిరిజనులను అలక్ష్యం చేసే విధానాలు అంతకు ముందు ఉన్నట్లుగా కొనసాగాయి.

గిరిజన జాతులకు చదవడం, రాయడం, అనే సాంప్రదాయం లేదు. అందువలన వారు రికార్డులు దాయడం, అలాంటి చట్టాలతో సంబంధం కలిగి ఉండడం అనే అలవాటు లేదు. కోర్టు వ్యవహారాలు, భాష వారికి అందుబాటులో ఉండేది కావు. ఇటువంటి పరిస్థితుల్లో గిరిజనేతరులు ఆ చట్టాలను అవకాశంగా తీసుకొని రకరకాల మార్గాల ద్వారా గిరిజనులకు చెందిన భూములను చట్టవిరుద్ధంగా తమ సొంత ప్రయోజనాలకు వినియోగించుకునేవారు, ఆప్రాంత పరిపాలనను నిర్వహించే వారు సాధారణంగా గిరిజనేతరులు అయి ఉండి గిరిజనుల భూములు గిరిజనేతరులకు సాఫీగా బదలాయించేలా చూడడానికి తమ వారితో కలిసి పని చేస్తున్నారు. పైన పేర్కొన్న వాటితో గిరిజన జాతులను సంరక్షించే చట్టాలు ఇంకా, సాధారణ ప్రజలు, మానవులకు సంబంధించిన చట్టాలు కూడా పెనవేసుకొని ఉన్నాయి. రెండో రకం చట్టాలు పౌరసత్వం, మానవ హక్కులు వంటి అంశాలను, స్పష్టీకరించారు. నిజానికి గిరిజన జాతులకు ఉద్దేశించిన హక్కులు పౌరసత్వ హక్కులు, ముఖ్యంగా మానవ హక్కులు ఫలితంగా ఎల్లప్పుడూ అలక్ష్యం చేయబడ్డాయి. ఈ క్రమంలో ఒక సమూహానికి ఉద్దేశించిన నిర్ధిష్ట చట్టాలు ఎల్లప్పుడూ సాధారణ చట్టాలతో కలిపివేయడం జరిగింది. గిరిజన జాతులను సంరక్షించే చట్టాలు, సాధారణ ప్రజానీకం ప్రయోజనాలకు ఉద్దేశించిన భూ సేకరణ చట్టం, సంరక్షణ చట్టం, అటవీ చట్టం, వన్యప్రాణి సంరక్షణ చట్టం మొదలైనవి కూడా ఇదే విధానంలో ఉన్నాయి. వాటిలో రెండో రకం చట్టాలు ఎల్లప్పుడూ ప్రజా ప్రయోజనాలు అవసరాల ముసుగులో గిరిజనుల చట్టాలపై ప్రభావం చూపాయి. దేశం ప్రజా ప్రయోజనాల కోసం గిరిజన హక్కులను బలి చేయడం జరిగింది. భారత దేశంలో న్యాయ వ్యవస్థ, దానిని నిర్వహిస్తున్న వారు గిరిజనులకు సంబంధించిన రాజ్యాంగ నిబంధనలు, చట్టపరమైన అంశాల పట్ల సరైన శ్రద్ధ చూపడం లేదు.

***అనువాదం : ఎస్.వి.డి. ప్రసాద్***

# ఆహారబిల్లు - అటవీ ఆహార ఉత్పత్తులు - ఆదివాసీ ప్రజలు

గంధమర్ధన్ కొండల దిగువన కేంద్రభట గ్రామం. బోలంగీర్‌కు దాదాపు 60 కిలోమీటర్ల దూరంలో అడివికి సమీపంలో ఉంది. పొరుగునే ఉన్న నబ్రాంగ్‌పూర్ జిల్లా ఈ గ్రామాన్ని ఆనుకునే ఉంటుంది. నబ్రాంగ్‌పూర్ జిల్లాలో మొక్క జొన్న ఎక్కువగా సాగు చేస్తే కేంద్రభట గ్రామంలోని పొలాల్లో పత్తి ఎక్కువగా సాగు చేస్తారు. రామాయణ కాలం నుంచీ ఈ కొండ ప్రాంతాల్లోని అడవులు కలప, అరుదైన ఔషధ మొక్కలకు పెట్టింది పేరు. ఇప్పటికీ చాలా మంది ఇక్కడి నుంచి కలప, ఔషధ మొక్కలను అకక్రమంగా రవాణా చేస్తుంటారు. నేను ఇక్కడి స్థానికులతో మాట్లాడేటపుడుఈ విషయాలతో పాటు కేంద్రభట గ్రామ గిరిజనులు స్థానిక అడవుల నుంచి ఎలాంటి ఆహార ఉత్పత్తులు సేకరిస్తారనే విషయం ఆసక్తిగా తెలుసుకునే ప్రయత్నం చేశా. ఇందుకోసం ఒక ఇంటికి వెళ్లి కూర్చుని ఆ ఇంట్లోని వ్యక్తులతో మాట్లాడా. మాటల మధ్య వారు చెప్పింది ఏమిటంటే గత నాలుగేళ్లలో తామెన్నడూ ఆహార యోగ్యమైన దుంపల్ని అడివి నుంచి సేకరించడంగానీ, తినడంగానీ చేయలేదని చెప్పారు. ఎందుకని ప్రశ్నిస్తే అడవుల్లో అవి దొరక్క కాదు!. మా గ్రామ మహిళలు, యువకులు వంట చెరకు, వెదురు కోసం తప్ప ఆహార ఉత్పత్తులు సేకరించేందుకు అడవుల్లోకి వెళ్లడమే మానేశారని చెప్పారు. ఆ ప్రాంతంలోని ఇతర గ్రామాల్లో కూడా ఇదేపరిస్థితి. దీంతో అడవుల నుంచి ఆహార ఉత్పత్తులు సేకరించి వినియోగించడం బాగా తగ్గిపోతుంది. పాత తరం వారితో పాటు అనేక మంది ఆహార ఉత్పత్తులు అందించే చెట్లు, మొక్కలను కూడా గుర్తించలేని స్థితిలో ఉన్నారు. ఆహార యోగ్యమైన పుట్టగొడుగులను గుర్తించే విషయంలో ఈ మార్పు మరింత స్పష్టంగా కనిపించింది. చాలా మంది అడవికి వెళ్లి ఆహార పదార్థాలు సేకరించుకోవడం కంటే ఊరికి దూరంగా అయినా వెళ్లి ఏదో ఒక కూలి పని చేసి ఆ వచ్చిన వేతనాలతో తిండి గింజలు కొనుక్కునేందుకు ఇష్టపడుతున్నారు. ఈ మార్పు గిరిజనుల ఆరోగ్యంపైనా ప్రభావం చూపిస్తోంది. మహిళల ఆరోగ్యం మరింత దెబ్బతింటోంది. ప్రస్తుతం చాలా మంది గిరిజన మహిళలు రక్తలేమి(అనేమియా)తో బాధపడుతున్నారు.


**మధు రాంనాథ్**

ఫ్రీలాన్స్ జర్నలిస్టు




జీవిత పర్యంతం పేదలందరికీ పోషక విలువలున్న ఆహార భద్రత కల్పించడమే జాతీయ ఆహార భద్రత బిల్లు, 2013 లక్ష్యం. పేదలు హుందాగా, గౌరవంగా బతికేందుకు సరిపడినన్ని నాణ్యమైన తిండి గింజల్ని ఈ బిల్లు ద్వారా అందుబాటు ధరల్లో అందించాలని నిర్ణయించారు. బిల్లుకు సంబంధించిన మొత్తం 15 అధ్యాయా(చాప్టర్ల)ల్లో ఈ బృహత్తర లక్ష్య సాధన కోసం అనుసరించాల్సిన విధి విధానాల్ని కూడా స్పష్టం చేశారు. 14వ అధ్యాయం గిరిజన ప్రాంతాలు, ఇతర బలహీన వర్గాలకు జాతీయ ఆహార భద్రత బిల్లు ప్రయోజనాలు ఎలా అందించాలనే విషయాన్ని చాలా స్పష్టంగా పేర్కొంది. రెండో షెడ్యూల్ పోషకాహార ప్రమాణాల గురించి వివరించింది. ఇక మూడో షెడ్యూల్‌లోని (1) (డి) భూమి, నీటిని ఆహారేతర అవసరాలకు మళ్లించడాన్ని నిషేధించడం ద్వారా వ్యవసాయానికి మళ్లీ ఎలా కొత్త జవసత్వాలు తేవచ్చో స్పష్టం చేస్తోంది. జాతీయ ఆహార భద్రతా బిల్లు పూర్తిగా బియ్యం, గోధుమలు, తృణ ధాన్యాలతో పాటు కొన్ని ఇతర వ్యవసాయ ఉత్పత్తులపైనే దృష్టి పెట్టింది. గిరిజనులు, గ్రామీణ ప్రజలు సాగు చేయకుండా వినియోగించే కొన్ని రకాల అటవీ ఉత్పత్తుల గురించి ఈ బిల్లు ఏ మాత్రం పట్టించుకోలేదు. దేశ మధ్య ప్రాంతంలో ఇలాంటి ఆహార ఉత్పత్తులు అందించే చెట్లు, మొక్కల రకాలు 400కంటే ఎక్కువే ఉంటాయని అంచనా. ఇవి పెరిగే ప్రాంతాలకు వెళ్లి వాటిని సేకరించుకోవడం తప్ప ఖర్చంటూ ఉండదు.

ఇంతకీ భద్రత అంటే అర్థం ఏమిటి? అని ఆలోచిస్తే ప్రమాదం లేదా భయం నుంచి స్వాతంత్ర్యం అని అర్థం చేసుకోవాలి. ఇక్కడ ఆహార భద్రత బిల్లు ద్వారా ప్రభుత్వమే ప్రజలకు ఆహారం, పోషకాహార భద్రతలపై హామీ ఇస్తోంది. అయినా గ్రామీణ, అటవీ ప్రాంతాల్లోని ప్రజలు తమకు చాలినన్ని తిండి గింజలు, పోషకాహారం లభిస్తుందో? లేదో? అనే అభద్రతా భావనలో ఉన్నారు. తమ సంప్రదాయ ఆహార వనరుల మనుగడ, వాటి అందుబాటుపై కూడా దేశంలోని గిరిజనులు, గ్రామీణ ప్రజల్లో అనేక అనుమానాలు ఉన్నాయి. నిజంగా ఇవి చాలా కీలకమైన ప్రశ్నలు.అందుబాటులో ఉండే సహజ వనరుల ఆధారంగా... దీనికి ఒక్కో ప్రాంతంలో ఒక్కో సమాధానంచెప్పుకోవాల్సి ఉంటుంది. గత 20-30 సంవత్సరాల్లో మన జనాభాలో ఎక్కువ మందికి ఆహారభద్రతఏర్పడింది. అయితే దురదృష్టవశాత్తూ ప్రభుత్వ విధానాలు, ఉపేక్ష వలన ఇందుకు సంబంధించిన పథకాల ప్రయోజనాలు ఆశించిన స్థాయిలో పేదలకు చేరడం లేదు. గనుల తవ్వకం, నదులు, ఇతర జల వనరులు కలుషితమై పోవడం, అవసరాలకు మళ్లించడం వంటి కారణాలతో దేశ ప్రజలు జాతీయ ఆహార భద్రత బిల్లు, 2013ను ఆమోదించాల్సి వస్తోంది.

భూమి జల వనరుల్లో ఎక్కువ భాగాన్ని ఆహారేతర అవసరాలకు మళ్లించడం వంటి కారణాలతో దేశ ప్రజలు జాతీయ ఆహార భద్రత బిల్లు, 2013ను ఆమోదించాల్సి వస్తోంది. మధ్య ఈశాన్య భారతంలోని గ్రామీణ ప్రజలు 400 రకాలకు పైగాసంప్రదాయ అటవీ ఆహార ఉత్పత్తులను సేకరించి వినియోగిస్తుంటారని మనం ఇంతకు ముందే చెప్పుకున్నాం. వీటిలో పెండలాన్ని పోలిన అనేక రకాల దుంపలు, పుట్టగొడుగులు, పెరుగుతోటకూర లాంటి ఆకుకూరలు, కొన్ని రకాల కీటకాలు, చేపలు, పీతలు, వేటాడి చంపితినే కొన్ని చిన్న జంతువులు ఉన్నాయి. ఇందులో ప్రతి ఒక్కదానిలో ఒక్కో ప్రత్యేక పోషకాహారం లభిస్తుంది. వీటి ద్వారా లభించే ఖనిజ లవణాలు, విటమిన్లు, సూక్ష్మ పోషకాలు సాగు చేయడం ద్వారా పండించే ఆహార పదార్థాల్లోగానీ, దుకాణాల్లో కొనుగోలు చేసే ఆహార ధాన్యాల్లోగానీ లభించవు. అటవీ ప్రాంతాల నుంచి గిరిజనులు సేకరించే ఆహార ఉత్పత్తుల నాణ్యత, రుచి సేంద్రియ ఆహారోత్పత్తుల కంటే ఎంతో మెరుగ్గా ఉంటాయి. ఇవన్నీ గ్రామాల చుట్టుపక్కల ఉన్న ఖాళీ స్థలాలు, బంజరు భూములు, వాగులు-వంకలు, పొలాల గట్లపైనా, అడవుల్లోని ప్రత్యేక ప్రాంతాల్లో లభిస్తాయి.

గిరిజనులు తమ ప్రధాన ఆహార అవసరాలను అడవుల నుంచే సేకరిస్తారనే విషయం అందరికీ తెలుసు. అయితే వారి ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితులపై వీటి ప్రభావం ఎలా ఉంటుందనే విషయాన్ని ఇప్పటి వరకు అధికారికంగా గుర్తించలేదు. అడవుల నుంచి సేకరించే ఆహార పదార్థాలు, చేపలు, పీతలు, వేటాడి చంపితినే చిన్న చిన్న జంతువులు, ఆయా కాలాల్లో లభించే పండ్లు సరిగా తీసుకుంటే గిరిజనులు, గ్రామీణ ప్రజల్లో పోషకాహార లోపం ఆమడ దూరంలో ఉంటుంది. వీటిల్లో అనేక ఔషధ గుణాలు కూడా ఉంటాయి. వీటి సేకరణకు అవసరమైన నేర్పు, విషయ పరిజ్ఞానం ఉంటే వీటిని తేలిగ్గా సేకరించి వినియోగించుకోవచ్చు. అటవీ ప్రాంతాల్లో నివసించేవారిలో ఎక్కువ మంది తమ ఆహార అవసరాల్లో ఎక్కువ భాగాన్ని తమ పరిసరాల నుంచే కొనుగోలు చేసి వినియోగిస్తుంటారు. దురదృష్టవశాత్తూ ప్రభుత్వం ప్రజల జీవితాల్లో అటవీ ఉత్పత్తుల ప్రాముఖ్యతను ఇప్పటికీ సరిగా గుర్తించ లేదు. గత పదేళ్లలో దేశంలో అటవీ, వ్యవసాయ భూములను ఇతర అవసరాలకు మళ్లించడం పెరిగి పోయింది. దీంతో ఆహార భద్రత, ఆహార హక్కు రాజకీయ ప్రయోజనాలు తెచ్చిపెట్టే సాధనాలుగా మారాయి. ఆహార భద్రతా బిల్లు ద్వారా సరఫరా చేసే తిండి గింజల్లో కూడా బియ్యం, గోధుమలే ప్రధాన వాటా. సంప్రదాయ జొన్న, పప్పు ధాన్యాలకు కూడా పెద్దగా స్థానం లేకుండా పోయింది.
హైబ్రిడ్ వరి, మొక్కజొన్న సాగు కూడా సంప్రదాయ పంటల సాగును దెబ్బతీసింది.

అడవుల నుంచి ఆదివాసీలు సేకరించే దాదాపు అన్ని ఆహార ఉత్పత్తులు ఆ ప్రాంత భూమి, నీటి యొక్క జీవ రసాయన లక్షణాలకు సంబంధించిన సూచికలు కూడా. స్థానిక జీవావరణం (ఇకాలజీ), వాతావరణంలో వచ్చే సూక్ష్మమైన మార్పులను కూడా వీటి ద్వారా తెలుసుకోవచ్చు. నదుల్లో కొన్ని రకాల చేపలు దొరక్కపోతే ఆ నది కలుషితమైందని తెలుసుకోవచ్చు. అలాగే కొన్ని రకాల పుట్టగొడుగులు కనిపించకపోతే అడవుల్లో పచ్చదనం కూడా పెద్దగా కనిపించదు. చెట్లు పుష్పించడం, కాయలు కాయడాన్ని బట్టి కూడా రుతుపవనాలు, వేసవి తీవ్రతలను తెలుసుకోవచ్చు. జీవావరణం, వాతావరణాన్ని అంచనా వేయాలనుకున్నపుడు ఇలాంటి అరుదైన చెట్లు కనిపించక వృక్ష శాస్త్రవేత్తలు చాలా కష్టపడుతుంటారు. స్థానిక ఆదివాసీ ప్రజలకు మాత్రం ఇలాంటి చెట్లు కొట్టిన పిండి.వారి జీవితంలో భాగమైన ఈ చెట్లు, చేమలు వివిధ విషయాలకు సంబంధించిమనకు అత్యంత విలువైన సమాచారం అందిస్తాయి.

అడవుల్లో లభించే అనేక ఆహార ఉత్పత్తులు సేకరించేందుకు, వినియోగించేందుకు ప్రత్యేక నైపుణ్యం, సామాగ్రి అవసరం. కాలువలు, చెరువుల్లో చేపలు పట్టాలంటే సన్నటి వెదురు పుల్లలతో చేసిన బోనుల్లాంటి పెద్దపెద్ద బుట్టలు కావాలి. మళ్లీ వీటిని చేపలు తిరిగే ప్రాంతాలను జాగ్రత్తగా కనిపెట్టి అక్కడే ఏర్పాటు చేసే నేర్పు కూడా కావాలి. కొన్ని రకాల చెట్ల నుంచి సేకరించిన విషం ఉపయోగిస్తేగానీ కొన్ని రకాల చేపలు దొరకవు. మళ్లీ ఇక్కడ ఆ చెట్టుకు సంబంధించి ఏ భాగం నుంచి విషం తీయాలి? చేపలు పట్టేందుకు ఎంత విషం సరిపోతుందనే విషయం కూడా చేపలు పట్టేవారికి తెలిసి ఉండాలి. అలాగే కల్లు తీసే వారికి ఏ సమయంలో చెట్టు నుంచి కల్లు ధార సరిగా వస్తుందో తెలిసి ఉండాలి. గొంతు నొప్పులు, ఇతర అనారోగ్య సమస్యలు రాకుండా ఉండాలంటే దుంపల్ని ప్రాసెస్ చేయాలి. దీని వలన వ్యవసాయ రంగంలో ఉత్పాదకాల వినియోగం మరింత పెరిగి దీర్ఘకాలంలో భూమి, నీరు మరింత కలుషితం అయ్యే ప్రమాదం ఉంది. ఇది ఆహార భద్రత బిల్లు లక్ష్యానికి వ్యతిరేకం. అడవుల నుంచి

గిరిజనులు ఆహార ఉత్పత్తులు సేకరించడంలో మాత్రం ఎలాంటి ప్రమాదాలు ఉండవు. పర్యావరణాన్ని నిశితంగా గమనిస్తూ తమ తెలివితేటలు, నైపుణ్యాలను ఉపయోగిస్తే సరిపోతుంది. ఇక్కడ ప్రతి ఒక్కరూ అటవీ ప్రాంతాల నుంచి ఆహార ఉత్పత్తులు సేకరించుకోవాలని చెప్పడం రచయిత ఉద్దేశం కాదు. పెద్ద సంఖ్యలో ఉన్న గిరిజనుల్ని కూడా ఆహార భద్రత బిల్లు పరిధిలోకి తేవడం వలన వారి సంప్రదాయవిజ్ఞానం ఎలా మసకబారి పోతుందో చెప్పేందుకే ఇదంతా చెప్పాల్సి వస్తోంది.

అటవీ ప్రాంతాల నుంచి ఆహార ఉత్పత్తుల సేకరణకు ఇటీవల అనేక రకాలుగా ప్రమాదం ఏర్పడుతోంది. ఇందులో అత్యంత ముఖ్యమైంది. గ్రామాలు, అటవీ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఆదివాసీ యువకులు నగరాలకు వలస పోవడం. ఇలా నగరాలకు వలస పోయిన ఆదివాసీ యువకులు అడవుల నుంచి ఆహార ఉత్పత్తులు సేకరించడంలో తమ పెద్దలకు ఉండే సంప్రదాయ విజ్ఞాన,నైపుణ్యాలను కోల్పోతున్నారు. వీరు తమ ఆహార అవసరాల కోసం దుకాణాల్లో కొనుక్కోవడం లేదా ప్రభుత్వం అందించే సబ్సిడీ తిండి గింజలపై ఆధారపడుతున్నారు. దీంతో అడివికి సంబంధించి వీరి ఆలోచనా విధానం కూడా మారిపోతోంది. అటవీ భూముల పరిరక్షణ పట్ల కూడా వీరికి ఎలాంటి ఆసక్తి ఉండడం లేదు. వేసవిలో అడివి తగలబడిపోయినా, ఇతరఅవసరాల కోసం అడవులు నరికేసినా, పెద్ద ఎత్తున రసాయన ఎరువులు ఉపయోగించి అటవీ భూముల్లో పత్తి, మొక్కజొన్న, ఇతర వాణిజ్య పంటలు సాగు చేస్తున్నా వీరికి పట్టడం లేదు. గత తరం గిరిజనులందరూ అటవీ వనరులపై ఆధారపడే జీవించే వారు. ప్రజాస్వామ్య పాలన, గిరిజన ప్రాంతాల్లో గ్రామ సభలకు ప్రముఖ స్థానం ఉన్నా నేటి తరం గిరిజన యువకులు మాత్రం తమ సంప్రదాయ వనరులకు దూరమై పోతున్నారు.

ఆహార భద్రత బిల్లు అటవీ ప్రాంతాల నుంచి గిరిజనులు సేకరించే ఆహార ఉత్పత్తులపైనా ప్రభావం చూపిస్తుంది. దీని వలన దీర్ఘకాలంలో ఆదివాసీల సంప్రదాయ విజ్ఞానం, కల్చర్‌కు కూడాముప్పు ఏర్పడే అవకాశం ఉంది. కాబట్టి జాతీయ ఆహార భద్రత బిల్లును అమలు చేసే ముందే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన ప్రాంతాల్లో కింది విషయాలపై పరిశీలన చేయాలి. అవేంటంటే :

(ఎ) స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉన్న ఆహార ఉత్పత్తుల వివరాలు.

(బి) ఈ ఆహార ఉత్పత్తులు గతంలోలానే లభిస్తున్నాయా? లేక వాటి దిగుబడి తగ్గిందా?

(సి) ఇపుడు కాకుండా..గతంలో వేరే రకాల ఆహార ఉత్పత్తులు లభించేవా?

(డి) ఆయా ప్రాంతాల్లో వివిధ ఆహార వృక్ష, జంతు జాతులు అంతరించి పోవడానికి లేదా తగ్గి పోవడానికి కారణం ఏమిటి?

(ఇ) ఈ ప్రాంతాల్లో అంతరించి పోయిన ఆహార వృక్ష, జంతు జాతుల్ని మళ్లీ పునరుద్ధరించే ప్రయత్నాలు జరిగాయా?

ఈ అనుబంధ ఆహార ఉత్పత్తుల వివరాలతో కూడిన ప్రాథమిక అంచనా తయారు చేసుకుంటే....గ్రామీణ, అటవీ ప్రాంతాల ప్రజల ప్రస్తుత ఆహార భద్రతపై ఒక అవగాహన ఏర్పడుతుంది. కండోల్లే అనే శాస్త్రవేత్త ఒరిజన్ ఆఫ్ కల్టివేటెడ్ ప్లాంట్స్ అనే తన గ్రంథంలో ఆహార యోగ్యమైన 249 రకాల వృక్ష, జంతు జాతుల గురించి చెప్పాడు. ఇప్పటికీ ఇందులో పెద్దగా మార్పులు లేవు. కండొల్లే పేర్కొన్న అటవీ వృక్ష, జంతుజాలాల్లో కొన్నిటినైనా పెద్ద ఎత్తున సాగు చేసి లేదా పెంచి మన ఆహార అవసరాలు తీర్చుకోవచ్చా? అనే విషయంపై పరిశోధనలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గిరిజన ప్రాంతాల్లో ఆహార భద్రత బిల్లును ఏదో దాన ధర్మాలు చేసినట్టు అమలు చేయకూడదన్నదే నా వాదన. అలా చేయడం పరోక్షంగా ఆ ప్రాంతంలోని జీవావరణానికి మంచిది కాదు. సమాజంపైనా ఆ ప్రభావం ఉంటుంది. మధ్య భారతంలో 2003 తర్వాత రాయితీ ధరకు తిండి గింజల పంపిణీ ప్రారంభించారు. దాంతో ఆ ప్రాంతంలోని చాలా గ్రామాల్లో పశువుల కాపరులు దొరకడమే కష్టమై పోయింది. దీంతో పశువుల మందలు సమీపంలోని అటవీ భూముల్లో యథేచ్ఛగా చొరబడి మేయడంతో అక్కడి అడవుల్లో పచ్చదనం తగ్గిపోయింది. కాపరులు లేకపోవడంతో పశువులు పంట పొలాల్లోకి కూడా వెళ్లి పంటలు నాశనం చేస్తున్నాయి. ఇదే సమయంలో వ్యవసాయ కూలీల రేట్లు పెరిగి పోయాయి. పంట పొలాల చుట్టూ కంచె వేద్దామంటే అందుకు అవసరమైన వస్తువులు కూడా దొరకని పరిస్థితి. దీంతో చాలా పంట పొలాలు బీడు భూములుగా మారాయి. తిండి గింజలు దాదాపు ఉచితంగా లభించడంతో గ్రామీణ ప్రజలు, గిరిజనులు అసలు ఈ విషయాలేవీ ఆలోచించడం లేదు.

ఆహార భద్రత బిల్లు అనుకున్న విధంగా పని చేయాలంటే బిల్లు మూడో షెడ్యూల్‌లోని 1 (డి)ని బాగా అర్థం చేసుకోవాలి. ఈ అధికరణం ప్రధాన ఆహార ధాన్యాలు, అనుబంధ ఆహార ఉత్పత్తులు స్థానికులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెపుతోంది.అందుకోసం భూమి, జల వనరులను ఇతర అవసరాలకు మళ్లించకుండా తీసుకోవాల్సిన చర్యలను కూడా చర్చించింది. సమాజంలోని కొన్ని వర్గాలైనా ఆహార పదార్థాలు కొనుగోలు చేస్తుంటేనే సంప్రదాయ నైపుణ్యాలు, జీవావరణం, కల్చర్‌కు సంబంధించి అనేక అంశాలు పదిలంగా ఉంటాయి. స్థానిక పర్యావరణాన్ని పరిశీలించడంలో కూడా ఇటువంటి సంఘాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. చివరిగా నేను చెప్పదలచుకున్నది ఏమిటంటే నిరంతర ఉపయోగం ద్వారానే అడవుల నిర్వహణ మెరుగ్గా ఉంటుంది. ఇందుకోసం వారు తమ ఆహార అవసరాల్లో కొంత భాగాన్నయినా అడవుల నుంచి సేకరించుకోవడాన్ని ప్రోత్సహించాలి. అంతే తప్ప వారిని దాని నుంచి దూరం చేయకూడదు. గిరిజనులు గౌరవంగా బతికేందుకు అంటూ వారికి సబ్సిడీ ధరలకు తిండి గింజలు సరఫరా చేయడం ద్వారా ఈ ప్రయోజనాన్ని సాధించలేము.

***అనువాదం : ఎస్. శ్రీనివాస రావు***

# ఆదివాసీ స్వయంపాలన సాకారం - ఏకైక సర్వరోగనివారిణి

### 1. రాజ్యాంగపరమైన చిక్కుముళ్లు

అది 2001 సంవత్సరం ఏప్రిల్ నెల. భగభగ మండే వేసవికాలం మధ్యాహ్న సమయం. మధ్యప్రదేశ్ లోని దివాస్ జిల్లాలో బాగ్లి తాలూకా కాటుకియ గ్రామానికి చెందిన భిలాలా ఆదివాసి పటేల్ మోతీభాయ్ అతని నివాసంలోని శిథిలాల మధ్య కూర్చుని భారత పౌరుడిగా తనకు తన ఇంటి పైకప్పు కింద గౌరవంగా జీవించే హక్కు లేదా అని అప్పటి జాతీయ షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల కమిషన్ ఛైర్మన్ దిలీప్ సింగ్ భూరియాను ప్రశ్నించారు.

స్వతంత్ర భారతదేశంలో మోతియా పటేల్ వంటి ఆదివాసీలు సంతృప్తి పరిచే సమాధానం లభించక ఎందుకు మాటిమాటికీ ఈ ప్రశ్నను సంధించాల్సివస్తోంది? రాజ్యాంగ రక్షణలు, ఉపశమన చట్టాలు ఉన్నప్పటికీ ఆదివాసీలు హక్కుల కోసం ఏదైనా ప్రముఖ పద్ధతిలో డిమాండ్ చేసినప్పుడు వారు ప్రభుత్వ ఉక్కుపిడికిలి కింద అణచివేతను నిరంతరం ఎదుర్కొంటున్నారెందుకు?సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఆదివాసీల అవసవ్య అభివృద్ధి దుష్ప్రభావాలన్నింటికీ సర్వరోగనివారిణిగా ప్రారంభించిన పంచాయత్ ప్రొవిజన్స్ ఎక్స్ టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్ యాక్ట్ 1996 (షెడ్యూల్డ్ ప్రాంతాలకు పంచాయతీ నిబంధనల విస్తరణ చట్టం 1996) (పిఈఎస్ఏ) సైతం సత్ఫలితాలను అందించలేకపోతోందెందుకు? స్వాతంత్ర్యం సిద్ధించి ఆరు దశాబ్దాలు పూర్తయినప్పటికీ ఆదివాసీల స్వయం పాలన ఇంకా ఎందుకు సాధ్యం కాలేదు? అత్యంత చర్చనీయాంశమవుతున్న ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం అన్వేషించేందుకు పీసా చట్ట రూపం దాల్చటానికి దోహదం చేసిన వివిధ శాసనపరమైన నిబంధనల చరిత్ర తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. అదే విధంగా ఈ చట్టం ఏర్పాటయ్యాక అది అమలుకు నోచుకోకపోవడం వెనుక నేపథ్యాన్ని పరిశీలించాల్సిన అవశ్యకత ఉంది.

ఆదివాసీ నాయకులు ఖాన్ అబ్దుల్ ఘఫ్ఫర్ ఖాన్, జైపాల్ సింగ్ రాజ్యాంగ సభ చర్చల్లో ఆదివాసీ సమూహాల స్వతస్సిద్ధ ప్రజాస్వామిక, దోపిడీ రహిత స్వభావంపై ప్రస్తుతించారు. ఆదివాసీలకు ప్రయోజనం

రాహుల్ బెనర్జీ
ఫ్రీలాన్స్ రచయిత



కలిగించేందుకు వారిని ఆధునిక ఆర్థిక వ్యవస్థలో భాగస్వాముల్ని చేసే చర్చల ప్రక్రియను చేపట్టాలని ఆదివాసీ నాయకులు తమ అభిమతం వ్యక్తం చేశారు(భారత ప్రభుత్వం,1954). తత్ఫలితంగా ఆదివాసీల సంరక్షణకు, అభివృద్ధికి భారత రాజ్యాంగంలో విస్తృతమైన నిబంధనలను రూపొందించారు. అనేక చట్టాలను తీసుకువచ్చారు. అయితే 1950 తొలినాళ్ల నుంచి చేపట్టిన కేంద్రీకృత ప్రణాళికా విధాన ప్రక్రియలో ఆధునిక పారిశ్రామికాభివృద్ధి తప్పనిసరి అని ప్రతిపాదించబడింది. భారత ప్రభుత్వం ముందు అధికారం లేని ఆదివాసీలు సామ్రాజ్యవాద కాలం నాటి కంటే అత్యధికంగా దోపిడీకి గురయ్యారు. విస్తృతమైన సహజ వనరులను కలిగిన ఆదివాసీ ప్రాంతాలు స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం ప్రభుత్వ అధికారవర్గాల విధానాల చేత అత్యధిక దురాక్రమణకు గురయ్యాయి.

వాస్తవానికి ఆధునిక పారిశ్రామిక అభివృద్ధికి వనరుల దోపిడీ అనే బ్రిటిష్ విధానాన్ని స్వతంత్ర భారత ప్రభుత్వమే కొనసాగించింది. బ్రిటిష్ ప్రభుత్వం 1860 సంవత్సరంలో భారత శిక్షా స్మృతి(ఇండియన్ పీనల్ కోడ్-ఐపిసి)ని, 1861లో నేర శిక్ష్మా స్మృతి(కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్-సీఆర్ పీసీ) చట్టాలను తీసుకొచ్చింది. కొన్ని స్వల్ప సవరణలతో ఈ చట్టాలు ఇప్పటికీ అమలులో ఉన్నాయి. వ్యవస్థీకృతమైన ప్రజల అసమ్మతిని అణచివేయడానికి ప్రభుత్వానికి అధికారం ఉండే విధంగా ఈ చట్టాలు అవకాశం కల్పిస్తున్నాయి.

అన్నింటిలోనూ అతిపెద్ద అంతరంగా ఉన్న గాంధీ భావన గ్రామ స్వరాజ్యం లేదా స్వయంప్రతిపత్తిగల గ్రామ స్థాయి ప్రభుత్వాలను

ఏర్పాటు చేయడం ద్వారా కింది స్థాయిలో ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహించే ప్రయత్నం జరిగింది. ప్రాథమిక హక్కుల మాదిరిగా కోర్టులను ఆశ్రయించి సాధించుకోవడానికి వీలుకాని ఆదేశిక సూత్రాలలో పంచాయతీ రాజ్ వ్యవస్థను చేర్చడం జరిగింది. ఉచిత విద్య, ఆరోగ్యం, పోషక సేవలు, గౌరవప్రదంగా జీవించడానికి అనువైన పరిస్థితులు వంటి ప్రాథమిక హక్కులను సైతం ఈ విభాగంలో చేర్చడం జరిగింది. అంటే చైతన్యం, ఆరోగ్యం, స్పష్టతతో కూడిన ఆదివాసీ జనాభాను సృష్టించేందుకు నిబంధనలు, స్వీయ మేధస్సుతో అభివృద్ధి చెందడానికి వ్యవస్థాగత నిర్మాణాన్ని అందించడంపై స్వాతంత్ర్య అనంతరం సైతం అంతర్గత సామ్రాజ్యవాద, బూర్జువా రూపంలో అటు కేంద్ర ప్రభుత్వం ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ పూర్తిగా ఉపేక్షించాయి. పరిహారం కోసం సుప్రీం కోర్టు, హైకోర్టులను ఆశ్రయించడానికి భారీగా ఖర్చు తడిసిమోపెడవుతుండటంతో ప్రాథమిక హక్కులకు హామీ లభించక సమస్యలు మరింత జటిలమవుతున్నాయి. గత కాలపు చక్రవర్తులు, భూస్వాములు, పారిశ్రామిక వేత్తలు పేదలకు న్యాయం అందకుండా కోర్టులను ఆశ్రయిస్తున్నారు. కోర్టు ఖర్చులను భరించలేని పేదలు ప్రభుత్వ అంగాల ద్వారా పాలకుల అక్రమ చర్యలకు బలవుతున్నారు.

**2. ఆదివాసీల సందిగ్ధత**

ఇంతకు ముందు ప్రస్తావించిన విధంగా ఆదివాసీలకు ప్రయోజనం కలిగించేందుకు రాజ్యాంగంలో ప్రత్యేక నిబంధనలను వారు కలిగి ఉన్నారు. అసోం, మేఘాలయ, త్రిపుర, మిజోరాం రాష్ట్రాలలో నివసించేవారు ఆరో షెడ్యూల్ నిబంధనల పరిధిలోకి వస్తారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, చత్తీస్ గఢ్, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన ఆదివాసీలు ఐదో షెడ్యూల్ నిబంధనల పరిధిలోకి వస్తారు. ఆధునిక పారిశ్రామిక అభివృద్ధి వలన ఏర్పడిన వినిమయ సంస్కృతితో పోల్చితే గిరిజనులు ప్రత్యేకమైన సామూహిక సంస్కృతి, సులభంగా కలిసిపోని జీవనశైలి కలిగినవారు అనే తాత్త్విక భూమిక ఈ నిబంధనలకు ఆధారం. కాబట్టి ఆధునిక అభివృద్ధి వినాశాల నుంచి ఈ సంస్కృతిని సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బ్రిటిష్ అధికారి, మానవశాస్త్రజ్ఞుడు, సామాజిక ఉద్యమకారుడైన వెర్రియర్ ఎల్విన్ ఈ దృక్కోణాన్ని ప్రతిపాదించినవారిలో అగ్రగణ్యుడు. ఈ విషయంలో నెహ్రూను ఎల్విన్ ప్రభావితం చేశాడు. ఆదివాసీల ప్రత్యేకతను దృష్టిలో ఉంచుకుని గిరిజన ప్రాంతాల అభివృద్ధి గురించి ఉద్దేశించబడిన నెహ్రూ పంచశీల భావనకు సృష్టికర్త వెర్రియర్ ఎల్విన్. ఏదైతేనేం కింది స్థాయిలో భారీ అధికార అసమతుల్యత వలన ఈ మహోన్నత ఆలోచనలు వాస్తవరూపం దాల్చకుండా కలగానే ఉండిపోయాయి.

స్వయంప్రతిపత్తి కలిగిన జిల్లా మండళ్ల వ్యవస్థ ద్వారా ఆ ప్రాంతాల్లో నివసించే తెగల పరిపాలనకు స్వయంగా ఉన్న నిబంధానవళిని అందించాలని ఆరో షెడ్యూల్ లోని నిబంధనల సారాంశం. తెగలు తమ జీవితంలో అనేక పార్శ్వాలకు సంబంధించి నిర్ణయాలు గైకొనడానికి స్వతంత్రప్రతిపత్తిగల జిల్లా మండళ్లు తెగలకు కొన్ని అధికారాలను ఇచ్చాయి. అయితే ఈ అధికారాలకు రాష్ట్రాల ఉన్నత అధికారాలు పరిమితి విధించాయి. అసోం, త్రిపుర రాష్ట్రాల విషయానికొస్తే రాష్ట్ర అసెంబ్లీలో ఆధిక్యత కలిగిన గిరిజనేతరులు గిరిజనులకు గణనీయమైన రాయితీలు ఇవ్వడానికి ఆసక్తి కలిగి లేరు. అందుకే వారు జిల్లా మండళ్ల అధికారాలను నియంత్రించారు. మేఘాలయ, మిజోరాం రాష్ట్రాలలో గిరిజన నాయకులు జిల్లా మండళ్ల అధికారాలన్నింటినీ స్వాధీనం చేసుకున్నారు. జిల్లా మండళ్లు జారీ చేసిన చట్టాలు, నిబంధనలను ఆమోదించకపోవడంతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలకు అందుబాటులో ఉండే నిధులపై ఆంక్షలు విధించడం ద్వారా కూడా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఐదవ షెడ్యూల్ లోని సెక్షన్ 5లోని విభాగాలు ఈ కింది విధంగా ఉన్నాయి–

5 (2). రాష్ట్రంలో తత్సమానమైన షెడ్యూల్డ్ ప్రాంతంగా ఉన్న ఏదైనా ప్రాంతం శాంతి, సుపరిపాలన కోసం గవర్నర్ రెగ్యులేషన్లు(నిబంధనలు) చేయవచ్చు. అధికార సాధారణతకు భంగం కలగకుండా అటువంటి రెగ్యులేషన్లు(నిబంధనలు) ప్రత్యేకంగా–

ఎ) అట్టి ప్రాంతంలోని షెడ్యూల్డ్ తెగలకు చెందిన వ్యక్తులచే లేక వారి మధ్య భూమి బదిలీలను నిషేధించవచ్చు లేదా పరిమితపరచవచ్చు

బి) అట్టి ప్రాంతంలోని షెడ్యూల్డ్ తెగలకు చెందిన వ్యక్తులకు భూమి కేటాయింపును క్రమబద్ధం చేయవచ్చు

సి) అట్టి ప్రాంతంలోని షెడ్యూల్డ్ తెగలకు చెందిన వ్యక్తులకు డబ్బును అప్పిచ్చే వ్యక్తులు సాగించే వడ్డీ వ్యాపారాన్ని క్రమబద్ధం చేయవచ్చు.

5 (3). ఈ పేరా యొక్క (2)వ ఉప పేరాలో నిర్దేశించబడిన ఏదేని రెగ్యులేషన్(నిబంధనలు) చేయటంలో గవర్నర్ అటువంటి ప్రాంతానికి తత్సమానంగా వర్తించు ఏదైనా పార్లమెంటు చట్టాన్ని లేదా రాష్ట్ర శాసనమండలి చట్టాన్ని లేక అమలులో ఉన్న ఏదైనా శాసనాన్ని రద్దు లేక సవరణ చేయవచ్చు.

కాబట్టి సైద్ధాంతికంగా ఆదివాసీ ఎమ్మెల్యేలతో కూడిన తెగల సలహా మండలి సలహాతో భారత అటవీ చట్టం, భూసేకరణ చట్టాలను అమలు చేయడం లేదా వెనక్కి తీసుకునే అవకాశం ఒక రాష్ట్ర గవర్నర్ కు ఉంటుంది. ఆదివాసీ ప్రాంతాల్లో శాంతి, సుపరిపాలనకు హామీ ఇచ్చేందుకు ఈ నిబంధనలను గవర్నర్ అమలు చేయవచ్చనేది అత్యంత ముఖ్యమైన పార్శ్వం. ఆదివాసీలు వారి సొంత చట్టాలు, ఆచార వ్యవహారాలకనుగుణంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఇవ్వడం ద్వారానే ఇది సాధ్యమవుతుందని భారత రాజ్యాంగ నిర్మాతలు భావించారు. ఇది ఎప్పుడూ సంభవించలేదు. ఎందుకంటే ఆదేశిక సూత్రాల వలె ఇది ఖచ్చితంగా అమలు చేయాల్సిన నిబంధన కాదు. అమలు చేయాల్సిన బాధ్యత కార్యనిర్వాహక వర్గం మీదే ఆధారపడి ఉంటుంది.



ఫలితంగా ఆదివాసీ ప్రాంతాలలో శాంతి కానీ సుపరిపాలన కానీ లేవు. స్వాతంత్ర్యం సిద్ధించిన అనంతరం గత 60 ఏళ్లలో భారత అటవీ చట్టం, భూసేకరణ చట్టాలను నిర్దయగా అమలు చేయడం, ఐదవ షెడ్యూల్ ను అమలు చేయకపోవడం వంటి భారత ప్రభుత్వ చర్యల వలన భారతదేశ ఆదివాసీలు అనేక కష్టాలను ఎదుర్కొన్నారు . ఆదివాసీ ప్రజా సంస్థల ఆందోళనలు విస్తృతమయ్యాయి.

సమత వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్,1997 8 ఎస్ సిసి 1991 కేసు షెడ్యూల్డ్ ఆదివాసీ ప్రాంతాల నుంచి ఖనిజాలు తవ్వటానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అనుమతివ్వటానికి సంబంధించినది. ఈ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన చారిత్రక తీర్పులో రాజ్యాంగ సభ చర్చలను ఉటంకించింది. ఆదివాసీల భూమి దురాక్రమణకు గురికాకుండా వారిని సంరక్షించడం ఐదవ షెడ్యూల్ రూపొందించడం వెనుక రాజ్యాంగ నిర్మాతల ఉద్దేశమని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. రాజ్యాంగంలో గవర్నర్ గిరిజనుల ప్రయోజనం కొరకు చర్యలు తీసుకోవచ్చుని ఉందని, వాస్తవానికి దానిని చర్యలు తీసుకోవడం తప్పనిసరిగా చదువుకోవాలని వ్యాఖ్యానించింది. తద్వారా ఆదివాసీల భూమి ఆదివాసీయేతరులకు బదిలీకాకుండా నిరోధించవచ్చని తీర్పు చెప్పింది. ఒడిశాకు చెందిన నియామగిరి కేసులో సుప్రీంకోర్టు తాజా తీర్పు ఈ దృక్కోణాన్ని మరింత బలోపేతం చేసింది. సాంప్రదాయంగా ఆదివాసీల చేత ఉపయోగించబడుతున్న భూమిని ఇతర అవసరాలకు ఉపయోగించడంపై తుది నిర్ణయం గ్రామ సభలదేనని ఈ కేసులో సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ప్రస్తుతం ఈ తీర్పు గ్రామ స్వయంపాలన ఉద్యమానికి మరింత శక్తిని సమకూర్చింది.

### 3. హామీ లభించిన భూమి

రాజకీయ చైతన్యం, అక్షరాస్యత పెరుగుతుండటం, కేంద్రీకృతమైన అభివృద్ధి పై నుంచి కింది స్థాయికి చేరుతున్న నేపథ్యంలో కిందిస్థాయిలలో పాలన వ్యవస్థలు లేకపోవడం అతిపెద్ద సమస్యగా మారుతుంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల జవాబుదారీతనంపై వస్తున్న ఒత్తిడి నేపథ్యంలో మూడో అంచె ప్రజా స్వామ్య వ్యవస్థలను ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉంది. ప్రధానస్రవంతి రాజకీయ పక్షాలు, అనేక ప్రజా సంఘాలు, ప్రభుత్వేతర సంస్థల నుంచి వచ్చిన ఒత్తిడి ఫలితంగా 1992లో పంచాయతీ రాజ్ తప్పనిసరి చేసే 73వ రాజ్యాంగ సవరణ వాస్తవరూపం దాల్చింది. "పార్లమెంటు శాసనం ద్వారా ఈ భాగంలోని నిబంధనలను ఆ శాసనంలో పేర్కొనబడిన మినహాయింపులు, మార్పులకు లోబడి షెడ్యూల్డ్ ప్రాంతాలకు, ఆదివాసీ ప్రాంతాలకు విస్తరించవచ్చు " అని రాజ్యాంగంలోని 9వ భాగం నందలి ఆర్టికల్ 243ఎమ్(4)(2) స్పష్టం చేస్తోంది. షెడ్యూల్డ్ ప్రాంతాలకు కేంద్ర చట్టం స్వయంగా విస్తరించకపోవడం ఇదే తొలిసారి. పార్లమెంటు చేసిన ఇటువంటి చట్టానికి రాజ్యాంగ సవరణ అవసరం లేదు. సాధారణ మెజారిటీతో ఆమోదం పొందవచ్చు. ఐదవ షెడ్యూల్ లోని నిబంధనలను అమలు చేయడంలో గవర్నర్లు విఫలమవుతుండటాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ ప్రత్యేక చట్టంలోని నిబంధనలను రూపొందించడం జరిగింది.

ఈ ప్రత్యేక చట్టాన్ని ఆమోదించడంలో కానీ, షెడ్యూల్డ్ ప్రాంతాలకు 73వ రాజ్యాంగ సవరణను విస్తరించటంలోనూ కానీ కేంద్రప్రభుత్వం ఆసక్తి కనబరచలేదు. ఆఖరికి ఈ విషయానికి సంబంధించి ప్రత్యేక చట్ట కార్యచట్రాన్ని సూచించడానికి, నూతన చట్ట సారాంశానికి అనుగుణంగా ఇతర చట్టాల్లో తీసుకురావాల్సిన మార్పులను సూచించడానికి 1994లో భారత ప్రభుత్వం పార్లమెంటు సభ్యులు, నిపుణులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. మాజీ ఎంపీ దిలీప్ సింగ్ భూరియా ఛైర్మన్ గా ఉన్న కమిటీ 1995 జనవరి 17న నివేదికను సమర్పించినప్పటి నుంచి ఈ కమిటీని భూరియా కమిటీగా ప్రసిద్ధికెక్కింది. ఈ కమిటీ ఆదివాసీల పరిపాలన, అభివృద్ధికి సంబంధించిన అన్ని అంశాలపై సర్వోన్నత అధికారాన్ని ఆదివాసీ గ్రామ సభకు కట్టబెట్టింది. ఈ నివేదిక గ్రామసభను పరిపాలక పంచాయతీగా నిర్వచించలేదు. గ్రామసభను చిన్న ఆదివాసీ శివారు గ్రామంగా నివేదిక నిర్వచించింది. గ్రామసభలో రెండు లేదా అంతకంటే ఎక్కువ గ్రామాలు కలిగి ఉండవచ్చు. ప్రత్యక్ష ప్రజాస్వామ్యం ద్వారా గ్రామసభ విధులు నిర్వర్తించడానికి గ్రామసభ సైతం పెద్ద విభాగం. గ్రామసభకు విస్తృత స్థాయి అధికారాలు లేనప్పటికీ పీసా చట్టం రావడంతో ఆదివాసీ ప్రాంతాలలో గ్రామసభ సర్వోన్నతాధికార స్వభావం సుస్థాపితమైంది.

### 4. భ్రమ – వాస్తవం

పీసా చట్టానికనుగుణంగా మధ్యప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టాన్ని 1997లో సవరించారు. ఈ చట్టం అమలుకు సంబంధించి 1998లో నిబంధనలు రూపొందించారు. గ్రామ సభ లేదా గ్రామ మండలిని అత్యున్నత నిర్ణయీకరణ వ్యవస్థగా రూపొందించబడింది. తద్వారా ఆదివాసీ జీవనశైలి, సంస్కృతులకు తగిన ఒక ప్రత్యేక స్థానిక ప్రభుత్వ వ్యవస్థ ఏర్పాటు న్యాయపరంగా సాకారమైంది. ఈ నిబంధనలు అమలు చేయాలని భిల్ ఆదివాసీల ఆధిక్యత గల పశ్చిమ మధ్య ప్రదేశ్ ప్రాంతవ్యాప్తంగా కదలిక వచ్చింది.

ఈ ప్రాంతంలో 1999 నుంచి వర్షపాతం లోటు ఉంది. బర్వానీ,

ఝాబువా జిల్లాల్లోని కొన్ని మండలాలను కరువు పీడిత ప్రాంతాలుగా అధికారికంగా ప్రకటించారు. మిగతా ప్రాంతాలు ఆ అదృష్టానికి నోచుకోలేదు. ఒక మండలం లేదా జిల్లా కరువు పీడిత ప్రాంతంగా ప్రకటించడానికి ప్రాతిపదికగా తీసుకునే ప్రామాణిక స్థాయి 37 శాతం కంటే తక్కువ స్థాయి సాధారణ దిగుబడి ఈ ప్రాంతాల్లో నమోదుకాలేదు. ఈ రెండు జిల్లాలను కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించినప్పటికీ వాటికి రూ.3 కోట్లు , 4 కోట్ల మధ్య సహాయనిధి కింద విడుదల చేయడం జరిగింది. ఈ నామమాత్రపు నిధులు సాధారణంగా వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల కింద అందుబాటులో ఉంటాయి. మిగతా ప్రాంతానికి ఈ మాత్రం నిధులు కూడా దక్కలేదు. తగిన సహాయ పనులు చేపట్టాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావటం కోసం ఆదివాసీ ప్రజా సంఘాలు భారీ పోరాటాలు ప్రారంభించాయి. ప్రజలచేత రూపొందించబడిన, గ్రామసభలు మంజూరు చేసిన భూ, జల సంరక్షణ పనుల ప్రణాళికలను అమలు చేయడానికి పరిపాలనా వర్గాలకు పంపించడం జరిగింది.

తత్ఫలితంగా సావుకార్ల వ్యవస్థ కార్యరంగంలోకి వచ్చింది. ఇతర సహాయ వ్యవస్థ ఏదీ లేకపోవడంతో ఆదివాసీలు బలవంతంగా ఈ సావుకార్లను ఆశ్రయించాల్సి వస్తోంది. దీనివల్ల ఆదివాసీలు నెలకు 10 శాతం లేదా అంతకు మించి వడ్డీ రేట్లను భరించాల్సి వస్తోంది. ఈ పరిస్థితి మెరుగుపడటానికి సావుకార్లకు బదులుగా ప్రభుత్వమే వివిధ నిబంధనల ఆధారంగా చర్యలు తీసుకొని పరిష్కరించడం ఒక్కటే ఏకైక మార్గమని ఆదివాసీ ప్రజా సంఘాలు గుర్తించాయి. అయితే ఇది అంత ఫలితాలనివ్వలేదు. ఎందుకంటే పీసా చట్టం నిబంధనలు అమలుచేయడంపై ఆదివాసీ ప్రజా సంఘాలు తగినంత పట్టుదలతో లేవు. సాధారణంగా అనేక ప్రాంతాల్లో ఇదే సమస్య ఉంది. పీసా చట్టం దాదాపు పూర్తిగా కాగితాలకే పరిమితమైంది.

**5. ముందున్న మార్గం**

పీసా చట్టం అమలుకు నోచుకోకపోయినప్పటికీ అది ఆదివాసీ స్వయంప్రతిపత్తి పెంపొందించడానికి అవసరమైన న్యాయపరమైన, భారీ కార్యాచరణకు విస్తృతమైన అవకాశాలను కల్పిస్తోంది. ముఖ్యంగా సుప్రీంకోర్టు యొక్క సమత, నియమగిరి తీర్పులు ఆదివాసీ గ్రామ సభలకు పరిగణించదగిన సాధికారతను కల్పించాయి. న్యాయవ్యవస్థ, మీడియా తోడ్పాటుతో ఆదివాసీలకు నష్టం కలిగించే ఆధునిక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టరాదనే వాదనకు బలంచేకూరుతుంది. గతంలో ఆదివాసీ ప్రాంతాల్లో కొనసాగుతున్న అధికారాన్ని ఉదారవాద ప్రజాస్వామ్య పాలన ప్రాథమిక సూత్రాలు ఉల్లంఘించరాదు. ఆదివాసీ సంస్కృతిని సంరక్షించడంలో , ప్రోత్సహించడంలో పీసా చట్టం ఒక తొలి అడుగు. ఒక్కటిగా జీవించడం కంటే మరింత ప్రయోజనదాయకంగా వనరుల వినియోగం, సమాన ప్రాతిపదికగల అంతర్ సంబధాలకు పీసా చట్టం హామీ ఇస్తుంది. దీనికి నిరూపణ మెక్సికోలోని చియాపా స్వదేశీ ప్రజల ఉద్యమ నేతలు తమ సొంత ముసాయిదా రాజ్యాంగం రూపొందించడానికి పీసా చట్టాన్ని ఒక సంప్రదింపు అంశాల్లో ఉపయోగించుకోవడంలో చూడవచ్చు.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టం 2006 రాకతో పీసా చట్టం సాఫల్యత గణనీయంగా విస్తరించింది. దేశవ్యాప్తంగా ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లోని చిన్న ప్రజా సంస్థలు తదుపరి వచ్చిన చట్టాల్లోని నిబంధనలను ఉపయోగించుకొని పీసా చట్టంలోని స్వయంపాలన హామీలను సాకారం చేసుకున్న ఉదంతాలు అనేకం ఉన్నాయి. అదేవిధంగా అనేక ఆదివాసీ ప్రజా సంఘాలు సుదీర్ఘకాలంగా కొనసాగించిన పోరాటానికి ప్రతిఫలంగా అటవీ హక్కుల చట్టంగా పేరెన్నికగన్న షెడ్యూల్డ్ తెగలు, ఇతర అటవీ ప్రాంత నివాసుల (హక్కుల గుర్తింపు) చట్టం, 2006 వాస్తవ రూపం దాల్చింది. ఈ చట్టం ఐదవ షెడ్యూల్ లోని నిబంధనలకు మరింత పదును చేకూర్చింది. గ్రామ సభకు సర్వోన్నతాధికారం కట్టబెట్టే భారత అటవీ చట్టం అమలు చేయటం ద్వారా ఆదివాసీలకు చారిత్రకంగా జరుగుతున్న అన్యాయాన్ని తొలగించింది.

ఆదివాసీ స్వయం పాలనకు మద్దతు విషయంలో కింది స్థాయిలో చైతన్యపూరిత సమూహ సమీకరణ ద్వారా మాత్రమే ఆదివాసీ స్వయం పాలన సాధ్యమవుతుందని జరిగిన చర్చ స్పష్టచేస్తోంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అనుసరిస్తున్న స్థూల స్థాయి విధానాలు ఆదివాసీలు పాటించే సంప్రదాయ సామూహిక పద్ధతులు పతనమవ్వడానికి కారణమయ్యాయి. వికేంద్రీకరణ స్థాయిలో ఆదివాసీలు స్వయంగా పునరుద్ధరణ ప్రయత్నం చేయాలి. అటువంటి సామూహిక సంస్కృతి శాంతి, ఉత్తమ పాలనలకు హామీనివ్వడంతో పాటు సహజవనరులను భద్రపరుస్తుంది. అంతేకాదు సామూహిక సంస్కృతి వాతావరణ మార్పుపై ఉపశమన ప్రభావం కలిగి ఉంటుంది. కాబట్టి ముందున్న మార్గం ఏంటంటే సమన్వయంతో కూడిన అమలు చర్యలను నిరంతరం కొనసాగించాలి. స్వయం పాలనను ప్రోత్సహించే ఆదివాసీ కేంద్రీకృత రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ లో పేర్కొన్న శాసనాలకు మరింత మెరుగులుదిద్దడమే అశాంతి, ఉత్తమ పాలన లేమికి ఏకైక సర్వరోగనివారిణి.

*అనువాదం : ప్రేమ విఘ్నేశ్వర రావు.కె*


**యోజన**

**ఫిబ్రవరి 2014** సంచిక **"ప్రజా ఆరోగ్యం"** అనే ప్రత్యేకాంశంతో వెలువడనుంది.

**మార్చి 2014** ప్రత్యేక సంచిక **" పాలన సంస్కరణలు "** అనే ప్రత్యేకాంశంతో వెలువడనుంది.

యోజన పత్రికలో తమ వ్యాసాలు ప్రచురించగోరువారు 'పేజిమేకర్ 6.5/ అనుఫాంట్ 6.0'లో చేసి ఇ-మెయిల్ లేదా సిడి ద్వారా మరియు సాఫ్ట్‌కాపీ పంపాలి. తప్పనిసరిగా వ్యాసంతోపాటు హామీ పత్రాన్ని జతచేయడం మరిచిపోవద్దు.

యోజన (తెలుగు) పత్రిక చందా వివరాలు, చిరునామా మార్పు, పత్రిక చేరకపోవడం వంటి విషయాలపై ఫోన్ నెంబర్ 040-23310162 పై సంబంధిత వ్యక్తితో నేరుగా సంప్రదించవచ్చు. యోజన పత్రిక చందాకు సంబంధించిన వివరాలకోసం yojana_subscribe@yahoo.in కి మెయిల్ చేయగలరు.

*- సీనియర్ ఎడిటర్*

# అణగారిన వర్గాలు : ప్రభుత్వ విధానము, అమలు, సమస్యలు

దేశ సంపద సృష్టిలోగాని, సంపదను అనుభవించటంలో గాని – అందరికి భాగస్వామ్యం ఉండాలి. కాని, తరతరాల చరిత్ర, సంప్రదాయ నమ్మకాలు, ఇందుకు వ్యతిరేకంగా పనిచేస్తున్నందున, భారత రాజ్యాంగం సమన్యాయం, సామాజికన్యాయం, సమానత్వం, అనే ఆదర్శాలను తెరమీదికి తెచ్చింది. తదనుగుణంగా ఆర్థికంగా, సామాజికంగా, విద్యావిషయాలలో వెనుకబడిన వర్గాల ప్రజలకు ప్రత్యేక రక్షణలను కల్పించింది. ఈ వర్గాలను అణగారిన వర్గాలని పేర్కొంటున్నారు. షెడ్యూలు తెగలు, షెడ్యూలు జాతులు, వెనుకబడిన తరగతులు, స్త్రీలు – ఈ కోవలోకి వస్తారు. అణగారిన వర్గాలా? అణచివేయబడిన వర్గాలా ? అనే విషయం మీద పెద్ద పెద్ద చర్చలు జరుగుతున్నవి.

సమీకృత అభివృద్ధిని ధ్యేయంగా తీసుకొని భారత ప్రభుత్వం అణగారిన వర్గాల ప్రజలను ప్రధాన జన జీవన స్రవంతిలోకి తీసుకురావాలనే సత్సంకల్పంతో వారి ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధికొరకు పలు ప్రభుత్వ విధానాలను రూపొందించింది. ఆహార హక్కు , మహాత్మాగాంధీ జాతీయ ఉద్యోగ గ్యారంటీ హక్కు, అస్పృశ్యత నివారణ చట్టం, షెడ్యూలు తెగలు, షెడ్యూలు తరగతులపై దాడులు (అట్రాసిటీస్) నివారణ చట్టం మొదలగు వాటి గురించి ఈ సందర్భంలో ప్రస్తావించవచ్చును. రాజకీయ అభివృద్ధి విషయం తీసుకున్నట్లయితే, చట్ట సభలలో సీట్ల రిజర్వేషన్ గురించి చెప్పుకోవాల్సుంటుంది.

దేశ వ్యాప్తంగా గ్రామీణ స్థాయిలో పంచాయితీ రాజ్ వ్యవస్థ 1959 నుండి అమలులో వున్నది. గరిష్ఠ స్థాయిలో ప్రజా ప్రతినిధులు ఈ సంస్థల నిర్వహణ కొరకు ఎన్నిక కావటం జరుగుతున్నది. రిజర్వేషను సదుపాయం లేనందున జనరల్ స్థానాల నుండి పోటీచేసే శక్తి లేక అణగారిన వర్గాలు నిస్సహాయులై, నిశ్శబ్ద ప్రేక్షక పాత్ర పోషించాల్సి వచ్చింది. మనస్సుంటే మార్గం వుంటుందనే సూక్తిని నిజం చేస్తూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ 73వ, సవరణ ద్వారా మహాత్మాగాంధీ కలలుకన్న గ్రామ స్వరాజ్యానికి గట్టి పునాది వేసింది. రాజకీయ పదవులు వీరికి రిజర్వ్ చేసింది. రాజకీయ సాధికారిత కల్పించింది.


ప్రొ. పంజాల నరసయ్య

ప్రభుత్వ పాలన శాస్త్ర విశ్రాంత అచార్యులు

డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ




ఉదాహరణకు, ఆంధ్రప్రదేశ్‌లో 3753 సర్పంచ్ పదవులు, 2586 మండల పరిషత్తు సభ్యులు, 193 మండల పరిషత్తు ప్రెసిడెంట్లు, 196 జిల్లా పరిషత్తు సభ్యులు, 4 జిల్లా పరిషత్తు చైర్‌మన్ పదవులు – షెడ్యూలు కులాలవారికి రిజర్వ్ చేయబడినవి. మొత్తం దేశంలో 19,74,848 షెడ్యూలు కులాల నుండి ఎన్నుకోబడ్డారు. గళముండి మాట్లాడలేని వీరికి మాట్లాడే అవకాశం, అధికారం లేని వీరికి అధికారం యివ్వడం జరిగింది. గత రెండు దశాబ్దాల నుండి ఈ ప్రభుత్వ విధానం అమలులో వున్నది. అమలులో ఈ విధానం పలు సమస్యలను ఎదుర్కొంటున్నది. షెడ్యూలు కులాల వారు, పలు హింసలకు, అవమానాలకు , అణచి వేత చర్యలకు గురవుతున్నారు. కుల సింహం జూలు విదిలించి కుల వివక్షత తెరమీదికి తెచ్చింది. వాటి గురించి యిప్పుడు తెలుసుకుందాం.

**అభ్యర్థుల కొరత**

కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న షెడ్యూలు కులాల వారికి ఇరవై సంవత్సరాల క్రితం రాజకీయ అధికారం ఒక స్వప్నం, 73 రాజ్యాంగ సవరణ ఎన్నికలలో పోటీచేయమని ఆహ్వానించినప్పుడు కలయో, నిజమో తెలియని అయోమయ స్థితివారిని ఆవహించింది. రెక్కాడితేగాని డొక్కాడని ఆర్థిక దుస్థితిలో బ్రతుకుతున్న వీరు, సహజంగానే, ముందుకురాలేదు. వారికి కేటాయించిన

వార్డులనుండి వారే పోటీచేయాలి. వారికి కేటాయించిన పదవులకు వారే పోటీచేయాలి. ఈ సమస్యకు పరిష్కారం సంప్రదాయ గ్రామ పెద్దలు (షెడ్యూలు కులాలకు చెందని వారు) కనుక్కోవాల్సి వచ్చింది. చట్ట ప్రకారం పోటీచేయడానికి వీలు లేదు కనుక దొడ్డివారిన అధికారం హస్తగతం చేసుకున్నారు. ఎలా ? అభ్యర్థులు లభ్యంకానిచోట తమ పొలాలలో పనిచేసే కూలీలను, ఇంటి వద్ద పనిచేసే పాలేర్లను, తదితరులను పోటీకి నిలిపారు. సొమ్మొకడిది – సోకొక్కడిది అన్న చందాన – చట్టరీత్యా అధికారం అణగారిన వారిది – వాస్తవంలో పెత్తందార్లది. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్యానికి ఒక సవాలు. గత ఇరవై సంవత్సరాల అనుభవం చెప్పుతున్న వాస్తవం ఇది.



**సర్పంచ్ ఎన్నిక**

సర్పంచ్ పదవికి పోటీ చేయడానికి కూడా అభ్యర్థులు లేని సంఘటనలు వెలుగులోకి వచ్చినవి. ఇక్కడ కూడా అదే కథ. కొన్ని చోట్ల అభ్యర్థులు ఎన్నికల ప్రచార ఖర్చుల నిమిత్తం అప్పుల పాలైన వార్తలు కూడ ప్రచురించ బడినవి. ఉన్న ఎకరమో, అర ఎకరమో పొలం అమ్ముకొని, పోటీ చేసి, గెలిచిన అభ్యర్థులు, గెలిచిన తరువాత జీవనాధారం కోల్పోవడం, సర్పంచ్‌గా వుంటూనే కూలి పనులు చేసినట్లుగా కూడ పరిశోధనలు తెలియ పరిచినవి. కొద్దిపాటి ఆస్తులను తాకట్టు పెట్టి ఎన్నికలలో పోటీచేసి, అప్పు తీర్చలేక ఆ ఆస్తిని అమ్ముకున్న ఉదాహరణలు కూడా పరిశోధకులు కనుగొన్నారు. కొన్ని చోట్ల ఓటర్ల పట్టికనుండి పేర్లు తొలగించినట్టు, నామినేషన్ పత్రం దాఖలు అడ్డుకున్నట్టు, ఎన్నికైన వ్యక్తిని బలవంతంగా రాజీనామా చేయించినట్టు, గ్రామ బహిష్కరణకు గురిచేసినట్టు కూడ వార్తలు ప్రసారమైనవి.

**విధి నిర్వహణలో సమస్యలు**

ఎన్నికైన అభ్యర్థులు, సర్పంచులు తమ విధి నిర్వహణలో ఎదుర్కొన్న సమస్యలు, మచ్చుకు, కొన్ని ఉపసర్పంచ్ (షెడ్యూలు కులం నుండి కాదు) అధ్యక్షతన, ఇతర సభ్యులు మీటింగ్ నిర్వహించి, మీటింగ్ తీర్మానాలను సర్పంచ్ ఇంటికి పంపించి సంతకం తీసుకోవడం, సర్పంచ్‌కు మీటింగ్‌కు సంబంధించిన సమాచారం అందించకపోవడం, కొన్ని చోట్ల జరిగినట్టు కనుగొనబడింది. సర్పంచ్, మీటింగ్‌కు హాజరైన చోట–అతనిని లేక ఆమెను నేలమీద కూర్చోపెట్టి, ఉపసర్పంచ్ ఆ కుర్చీని ఆక్రమించుకున్న సంఘటనలు కూడా వెలుగులోకి వచ్చినవి.

సర్పంచ్‌గా ఎన్నికైన వ్యక్తి – ఉపసర్పంచ్ ఇంట్లో, మాజీ సర్పంచ్ మరియు ఇతర గ్రామ పెద్దల ఇళ్ళల్లో పనిచేసిన విషయాలు వెలుగు చూసినవి.

**ముగింపు**

గ్రామాలు అభివృద్ధి సూచికలు. ప్రగతికి పట్టుకొమ్మలు. గ్రామీణాభివృద్ధే దేశాభివృద్ధికి దారితీస్తుంది. అత్యధిక జనాభా గ్రామాలలోనే జీవిస్తున్నారు. ఈ నగ్న సత్యాన్ని మహాత్మాగాంధీ ఏనాడో గుర్తించారు. రాజ్యాంగ నిర్మాతలు గ్రామ పాలన గురించి రాజ్యాంగంలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 1993లో గ్రామ పాలనలో కీలక పాత్ర పోషిస్తున్న పంచాయితీరాజ్ వ్యవస్థకు 73వ రాజ్యాంగ సవరణ ద్వారా జవ సత్వాలను సమకూర్చింది. అది వరకు ప్రక్కన పెట్టబడిన అణగారిన వర్గాలకు ఈ సంస్థలలో రిజర్వేషన్ కల్పించారు. సమీకృత అభివృద్ధికి ఈ చర్య ముఖ్యమని భావించారు. తత్ఫలితంగా దేశాభివృద్ధిలో అణగారిన వర్గాలకు చెందిన షెడ్యూలు కులాల వారికి రాజ్య సాధికారిత పాలన సాధికారిత అవకాశం లభించింది.

అధికారం లేనివారికి అధికారమైతే లభించింది. కాని, మానసిక సంసిద్ధత లేకపోవడం నిరక్షరాస్యత, ముఖ్యంగా ఆర్థిక వెనుకబాటు, షెడ్యూల్డు కులాల అభ్యర్థుల కొరత – ప్రతిబంధకాలుగా మారినవి. అధికారం కోల్పోతున్న తరగతుల వారు దీనిని చక్కని అవకాశంగా భావించి సొమ్ము చేసుకుని తమ చెప్పు చేతులలో ఉండే వారిని గెలిపించుకున్నారు. అధికారం వారిది బాధ్యత ఎన్నికైన షెడ్యూలు తరగతికి చెందిన వ్యక్తులది. ఇదొక కొత్త సమస్య.

ఆర్థిక స్వాలంబన లేనందున, పూర్వంవలె, కూలినాలి చేసుకుని జీవనం గడపటం సభ్యులకు, సర్పంచులకు తప్పదు. ప్రజల దృష్టిలో పలచన కావడానికి ఇది దారితీసింది, ఇది మరొక సమస్య.

అధికారుల సహాయ నిరాకరణ, నిర్లక్ష్యధోరణి మరొక సమస్య.

నిరక్షరాస్యత, ఆర్థిక వెనుకబాటుతనం, ఆత్మ విశ్వాసరాహిత్యం, అణచివేతకు గురైనందున ఏర్పడిన భయం, పిరికితనం – పాతతరము వారి లక్షణాలు. నేటితరం వారు ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఇప్పుడు ఎంతైనా వుంది. యువతరం

*తరువాయి 17వ పేజీలో...*

# ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన తెగలు

ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన తెగలు మైదాన ప్రాంతాల్లోను, ఏజెన్సీ ప్రాంతాల్లోను నివసిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాలు అడవులలో, కొండలతో నిండిన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఖమ్మం, వరంగల్, అదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలలో 11,595 చ.మై. విస్తీర్ణంలో విస్తరించివున్నాయి. ఇక్కడ అంధ, బగత, భిల్, చెంచు, గదబ, గోండ్, కమ్మర, ఖోండ్, కోలమ్, కొండదొర, కొండరెడ్డి, కోటియా, కోయ, కులియా, యాలి, మన్నెర, మూకదొర, నాయక్‌పోడ్, పోరజ, ప్రధాన్, రెడ్డిదొర, సవర, తోటి, వాల్మీకి మొదలైనవారు నివసిస్తున్నారు. ఇక మైదాన ప్రాంతాల్లో కట్టునాయకన్, రోన, సుగాలి, యానాది. ఎరుకల మొదలైనవారు నివసిస్తున్నారు.

**గిరిజన తెగల చరిత్ర**

సంస్కృతంలో వున్న చాలా పవిత్రపుస్తకాలు ఆంధ్రప్రదేశ్‌లో వున్న వివిధ గిరిజన తెగల గురించి తెలియజేస్తున్నాయి. ఋగ్వేదంలో భాగమైన ఐతరేయ బ్రాహ్మణంలో భారత ద్వీపకల్పంలోని అంధ గిరిజన తెగల గూర్చి ప్రస్తావన వుంది. అదిలాబాద్ జిల్లాలోని అంధ గిరిజన తెగ ప్రాచీన గిరిజన తెగ అయిన ఆంధ్ర నుండి ఉత్పన్నమైనదని విశ్వసిస్తూ.

రామాయణంలో పేర్కొనబడిన జనస్థాన, కిష్కింధలు గిరిజన తెగల ప్రాంతాలు ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తర, పశ్చిమ ప్రాంతాలుగా పిలువబడుతున్నాయని విశ్వాసం. రామాయణంలో కొండలతో, అడవులతో నిండిన గిరిజన తెగల నివాస ప్రాంతాన్ని దండకారణ్యంగా ప్రస్తావిస్తే వాటిని ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తర ప్రాంతాలే కావచ్చునని విశ్వసిస్తున్నారు.

రామాయణం, మహాభారతాల్లో శబరలుగా పేర్కొనబడినటువంటి గిరిజన తెగల నుంచే శ్రీకాకుళం జిల్లాలో సవరలనే గిరిజన తెగ ఉత్పన్నమైనట్లుగా చెబుతున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం జిల్లాల్లో ఉన్న ఏజెన్సీ ప్రాంతాలలో వాల్మీకి తెగవారు కిరాతకుడిగా వుండి, జ్ఞానిగా మారి రామాయణం


**డా. కె. ఐలయ్య,** అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ సోషియాలజీ, కాకతీయ యూనివర్సిటీ, పిజి కళాశాల

**పోలం సైదులు,** రిసెర్చ్ స్కాలర్, సోషియాలజీ విభాగం, కాకతీయ యూనివర్సిటీ, వరంగల్




రచించిన వాల్మీకి తమ తెగకు మూల పురుషుడని చెబుతున్నారు. ఎరుకల తెగకు సంబంధించిన ప్రచార గాథలు తమ గురువైన ద్రోణాచార్యునికి గురు దక్షిణగా కుడిచేతి బ్రొటనవేలిని అర్పించిన ఏకలవ్యుడే ఎరుకల తెగకు మూల పురుషుడని చెబుతారు.

రాజగోండ్లు చాలాకాలం వరకు ఆంధ్రప్రదేశ్‌లోని అదిలాబాద్, వరంగల్ జిల్లాల వరకు వ్యాపించిన ప్రాంతాన్ని పరిపాలించారు. మరాఠులు వారిని సింహాసనం నుంచి తొలగించే వరకూ, మొగల్ పరిపాలనా కాలంలో వారు స్వతంత్ర పరిపాలకులుగానే ఉన్నారు.

సవరలు కూడా చాలా శతాబ్దాలు శ్రీకాకుళం జిల్లా మొత్తం విస్తరించిన ప్రాంతాన్ని పరిపాలించారు. మూకదొరలు, కొండదొరలు చాలా పెద్ద ప్రాంతాల్ని అంటే ప్రాచీన లేదా ఆది గిరిజన తెగల ఎస్టేట్లయిన కురుపురం, చివమేరంగి అంధ, పాచిపెంట (శ్రీకాకుళం జిల్లా) మొదలైన ప్రదేశాలను పరిపాలించి తెలుగు, ఒరియా భాషల్లో పండితులను ఆదరించి పోషించారు.

కొండరెడ్లు, రాచరెడ్లుగా ప్రస్తుతం పశ్చిమగోదావరి జిల్లాలో వున్న కొవ్వూరు, పోలవరము, చింతలపూడి మొదలైన ప్రాంతాల్ని పరిపాలిస్తూ వుండేవారు. వారి పరిపాలన తర్వాత ఇప్పటికి కూడా ఈ ప్రాంతం రెడ్డి సీమగా పిలువబడుతుంది.

**గిరిజన ఆర్థిక వ్యవస్థ**

ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన తెగలు క్రింది విధాలైన ఆర్థిక వ్యవస్థలను కలిగివున్నాయి.

1. ఆహార సేకరణ ఆర్థిక వ్యవస్థ (చెంచు, యానాది)
2. సామాన్య వ్యవసాయక ఆర్థిక వ్యవస్థ (కొండారెడ్డి, కొండదొర, కోలంచ ఖోండ్, సవర)
3. ఉన్నత వ్యవసాయక ఆర్థిక వ్యవస్థ (బగత, భిల్, కోయ, కొటియా, గదబ, గోండ్, మన్నెదొర, మాలి, నాయక్‌పోడ్స్, పోరజ, వాల్మీకి)
4. పశుపోషణ ఆర్థిక వ్యవస్థ (గౌడ్, సుగాలి)

5. హస్తకళాకారుల సాంకేతిక నైపుణ్యత మీద ఆధారపడ్డ ఆర్థిక వ్యవస్థ (కుమ్మరి, కులిమతోటి, ప్రధాన్, ఎరుకల)

### గిరిజన భాష

ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానంగా ఆస్ట్రియా భాషా కుటుంబం, ద్రవిడ భాషా కుటుంబం, ఇండో యూరోపియన్ భాషా కుటుంబాలకి చెందిన గిరిజన తెగల భాషలు కన్పిస్తాయి. వీటిలో రెండు గిరిజన తెగల భాషలు ఆస్ట్రిక్ భాషా కుటుంబానికి, 19 గిరిజన తెగల భాషలు ద్రావిడ భాషా కుటుంబానికి, రెండు గిరిజన తెగల భాషలు ఇండో యూరోపియన్ భాషా కుటుంబానికి చెందివున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న గిరిజన తెగల భాషల్లో ఎన్నో వైవిధ్యాలు, ప్రత్యేకతలున్నాయి. గదబ లాంటి గిరిజన తెగల్లో భాషకు సంబంధించి ఉపతెగలు కొన్ని ప్రత్యేకతలను చూపేవిగా కూడా వున్నాయి. అత్యధిక తెగలవారు ద్విభాషీయులుగానూ, బహుభాషీయులుగాను వుంటారు. ఎందుకంటే వారు తమ మాతృభాషనే కాకుండా పరిసరాల్లో నివసించే వారి భాషను కూడా నేర్చుకుని మాట్లాడుతుంటారు. గోండు, సవరలు వారు మాట్లాడే మాతృభాషతో పాటు, ఆ పరిసర ప్రాంతాల్లో నివసించే ఇతరులు మాట్లాడే తెలుగును కూడా మాట్లాడటం చేత ఆ భాషలకు ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రాంతీయ భాషా ప్రతిపత్తి కూడా చేకూరింది. కొన్ని ప్రాంతాలలో తమ మాతృభాషను మరిచిపోయి తెలుగు మాట్లాడటం గమనార్హం.

### సామాజిక వ్యవస్థాపన

సామాజిక వ్యవస్థ విభాగాలు ఒక తెగనుంచి మరో తెగకు మారుతుంటాయి. కొండారెడ్డి లాంటి కొన్ని గిరిజన తెగల సామాజిక వ్యవస్థ చాలా సామాన్యంగా వుంటుంది. కొండారెడ్డి తెగలో ప్రాథమిక సామాజిక భాగమైన కుటుంబ విభాగం అటుంచితే కనిపించే ప్రధాన భాగం ఒకే ఇంటి పేరున్న సమూహంగా చెప్పుకోవచ్చు. భిల్, కోయ, కొటియా, మాలి, గోండ్ మొదలైన తెగల సామాజిక వ్యవస్థ స్వరూపం చాలా విస్తృతమైందిగానూ, సంకీర్ణమైందిగానూ వుంటుంది. అన్ని కార్యకలాపాల్లోనూ స్వయంపోషకంగా స్వతంత్రంగా వ్యవహరించే అంతర్వివాహ పద్ధతి కలిగిన గిరిజన ఉపతెగలు ఎన్నో తెగల్లో కన్పిస్తాయి. ప్రతి గిరిజన ఉపతెగ మళ్ళీ రక్త సంబంధం కలిగిన సమూహంగాను అది మళ్ళీ వివిధ కుటుంబాలుగానూ విభజింపబడి వుంటుంది.

కొండరెడ్డి, సుగాలి, కమ్మర, కులియ, మన్నెదొర, నాయక్ పోదు, రెడ్డిదొర మొదలైన గిరిజన తెగల సామాజిక వ్యవస్థ స్వరూపం చాలా సామాన్యంగా వుంటుంది. ప్రతిభావంతులైన సామాజిక జీవనానికి అవసరమైన కార్యకలాపాలను నిర్వర్తించే 3 లేక 4 విధాలైన సమూహాలు ఆ సామాజిక వ్యవస్థలో కన్పిస్తాయి.

ఎరుకల తెగలో తప్ప మిగిలిన గిరిజన తెగల పితృ వంశీయం, పితృ స్థానికం, పితృ అధికారం, పితృక గృహన్యాయం మొదలైన లక్షణాలను కలిగిన కుటుంబాలు వుంటాయి. ఎరుకల తెగకు చెందిన కుటుంబంలో పితృ వంశీయత వుంటుంది. పితృస్థానిక నివాసం అనేది సాధారణం అయినా, పితృస్థానిక కుటుంబం కూడా వాడుకలో ఉండటం గమనార్హమైనది. ■

## నూతన సంవత్సర శుభాకాంక్షలు

పాఠకులకు, చందాదారులకు, ఏజంట్లకు, రచయితలకు 'యోజన' సంపాదక వర్గం నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుతోంది. నూతన సంవత్సరంలో యోజన మరింత యవ్వనంగా తయారై మెరుగైన సేవలందించాలని ఆకాంక్షిస్తోంది. దీనికై మీరందరి సహాయ సహకారాలు ఎప్పటిలా అందచేయాలని కోరుతోంది. కొత్త సంవత్సరంలో ప్రతి పాఠకుని ఇంట విజ్ఞాన వీచికలు విరియాలని, నూతన సంవత్సరంలో మరింత మెరుగ్గా యోజన పాఠకుల ముందుకు రావాలని అందరి సహకారం కోరుతోంది.

**– యోజన సంపాదక వర్గం**

సామాజిక అనుసంధాన వేదిక
**ఫేస్‌బుక్‌లో యోజన మాసపత్రిక లభ్యమవుతోంది.**
ఈ పత్రిక విశేషాలు, వ్యాసాలు, వ్యాసకర్తల వివరాలు
**https://www.facebook.com/pages/Yojana-Journal/181785378644304?ref=hl**
ఫేస్‌బుక్ అడ్రస్‌లో వీక్షించవచ్చును.

*15వ పేజీ తరువాయి...*

### అణగారిన వర్గాలు : ప్రభుత్వ విధానము, అమలు, సమస్యలు

నడుంబిగించాలి. స్వచ్ఛంధ సంస్థలు, కుల సంఘాలు ఏకమై అణగారిన వర్గాలను చైతన్య పరచాలి. ఎన్నికలలో పోటిచేయకుండా ఆపడం, ఓటర్ల లిస్టునుండి పేర్లు తొలిగించడం, కుల వివక్షతకు గురిచేయడం – తదితర చర్యలను శిక్షార్హం చేస్తూ చట్టాలను చేయడం లేదా సవరించడం ప్రభుత్వం చేయాల్సుంటుంది. ఆర్థిక వెనుకబాటుతనం మూలకారణం కావున, అణగారిన వర్గాల ప్రజా ప్రతినిధులకు మాత్రమే గౌరవ ప్రదంగా జీవించడానికి అవసరమైన జీతభత్యాలు ఏర్పాటు చేయడం ఆలోచించదగ్గ ముఖ్య విషయం. ఎం.ఎల్.ఎ. లకు, ఎం.పి.లకు పెన్షన్ ఏర్పాటు చేసినట్టు – వీరికి కూడ ఏర్పాటు చేయడం ఆలోచించదగ్గ మరో విషయం. రిజర్వ్ చేయబడిన స్థానాల నుండి ఒకే వ్యక్తి పోటీచేసినట్టవుతే ఎన్నికల ఖర్చు ఆదా అవుతుంది. ఈ విషయంలో కుల పెద్దల పాత్ర ప్రాధాన్యత వహిస్తుంది.

అణగారిన వర్గాల రాజకీయ సాధికారిత అనే ప్రభుత్వ విధానం సత్ఫలితాలు సాధించాలంటే ఈ సంస్కరణలు అవసరం. పితృస్వామ్య పాలనలో ప్రజలు పిల్లలవలె ప్రభుత్వం పై ఆధారపడి జీవిస్తారు. భాగ స్వామ్య పాలనలో ప్రజలు తమ హక్కులను, బాధ్యతలను గుర్తెరిగి నడుచు కుంటారు. ప్రజా సాధికారిత విధానాలు ఫలితాలు సాధించాలంటే నిర్దేశిత వర్గాలు జాగరూతకతో మెలగాలి. ■

# అలుపెరుగని స్వేచ్ఛా ప్రియుడు 'నెల్సన్ మండేలా'

డిసెంబర్ 5, 2013, వర్ణవివక్షతకు గురి అవుతున్నవారిని, స్వేచ్ఛాప్రియులను, శాంతి కాముకులను, సమానత్వ వాదులను, ప్రజాస్వామ్య వాదులను, ప్రపంచ ప్రజలను ఒక కుదుపు కుదిపింది. చరిత్ర రాస్తారు కొందరు, చరిత్రను చదువుతారు ఎందరో. కాని చాలా తక్కువమంది చరిత్ర సృష్టిస్తారు. ఆ విధంగా చరిత్ర సృష్టించిన వారిలో మహాత్మాగాంధీ, అబ్రహంలింకన్‌ల గురించి చెప్పుకునే ప్రపంచ ప్రజలు మరొక మహనీయుని గురించి చర్చించుకుంటూనే వున్నారు... ఇంతలోనే ఆ పోరాట యోధుడు మహాత్మాంగాధీ, అబ్రహం లింకన్‌ల వలె పేదలను, పీడితులను, బాధితులను వారి మానాన వారిని వదిలి వెళ్ళిపోయాడు. 'మడిబా' (ఆత్మీయులతనిని అలా పిలిచేవారు) నీకిదేమైనా బాగుందా ? నీవు చేసిన పనేమైనా బాగుందా? అయినా ఎక్కడికెళ్లావు? అని ఆత్మీయతతో, కన్నీళ్ళతో అడిగితే పరలోకంలోని ప్రభువు దగ్గరకని కాని, స్వర్గానికని కాని చెప్పలేదు. అతని జీవిత కాలంలో వాటి గురించి అతను పేర్కొన్న దాఖలాలు లేవు. పోరాటయోధులు తమ 'శక్తి' నే నమ్ముకుంటారేమో ! జనన మరణాలు నా చేతిలో లేవు – అనలేదు. మరి ? "మనుష్యులు వస్తారు, మనుష్యులు పోతారు, నేనొచ్చాను, నాకు టైమ్ (పిలుపు) వచ్చినప్పుడు నేను వెళ్ళుతాను". అన్నాడు. డిసెంబర్, 5, 2013న ఆ పిలుపు వచ్చిందేమో! అతను జీవించిన కాలంలో జనన మరణాలు గురించి, ఇహలోకం, పరలోకం గురించి పునర్జన్మ గురించి ఆ విధమైన అభిప్రాయాలను వ్యక్త పరిచాడు. ఎంతటి వేదాంతం ! ఎంత లోతైన ఆలోచన !! భారతీయులకిది కొత్తకాదు.

మనుష్యులలో కారణ జన్ములుంటారనేది లోక ప్రసిద్ధి. నెల్సన్ రోలిహ్‌లహల మండేల ఆ కోవకు చెందిన అతి కొద్దిమందిలో ఒకరు. కాని, అతను కారణ జన్ముడికంటే ఎక్కువ, అవతార పురుషుడికంటే తక్కువ, అని అతని అభిమానులు అంటారు. అతని మరణవార్త నిజం కాకుంటే బాగుండునని భావించిన వారు కూడా వున్నారు. మండేలా అంటే అంత ప్రేమ, అభిమానం ఎందుకు ? ఎందుకంటే ఆ రోజు "ప్రపంచం అతి ప్రభావవంతుడు, ధైర్యశాలి, మంచి వ్యక్తులలో ఒకరిని

**డా. జి.ఆర్. జయానందం,** రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్,
డా.బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ



కోల్పోయింది" అని అమెరికా అధ్యక్షుడు ఒబామా తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. "న్యాయంకోసం పోరాడిన మహా యోధుడు" మండేల అని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ బాన్–కి–మూన్ అభిప్రాయపడ్డారు. సామాన్యుడిగా పుట్టి అసామాన్యుడిగా, మాన్యుడిగా అంతిమ శ్వాస విడిచిన మండేల ప్రపంచానికి తన జీవితమే పోరాటం" అని, "పోరాటమే తన ఊపిర"నే సందేశాన్ని వదిలి వెళ్ళారు.

పందొమ్మిది వందల పద్దెనిమిదవ సంవత్సరంలో జూలై 18వ తేదీన మండేల దక్షిణాఫ్రికాలోని ట్రాన్స్‌కీ అనే మారుమూల గ్రామంలో జన్మించారు. తల్లి దండ్రులతనికి రోహిహ్‌లహాల మండేల అని నామకరణం చేసారు. మండేల అనేది అతని తాతపేరు. విద్యాభ్యాసానికి బోర్డింగ్ స్కూల్‌లో చేరినప్పుడు అక్కడి ఉపాధ్యాయుడతని పేరు ముందు నెల్సన్ చేర్చి నెల్సన్ మండేలాగా పేరు మార్చారు. పెట్టుడు పేరుతో నెల్సన్ మండేలాగా అతను ప్రపంచానికి పరిచయమయ్యాడు. బాల్యంలోనే తండ్రిని కోల్పోయాడు. పూరి గుడిసెలో బాల్యం గడిచింది. మట్టినేలగల ఇంట్లో జీవించేవారు. పశువుల కాపరిగా జీవితం సాగింది. తండ్రి మరణానంతరం ధెంపూ – తెగకు చెందిన రాజు పెంచారు.

రెండువేల పదమూడవ సంవత్సరం డిసెంబర్ ఐదవ తేదీన (2013 డిసెంబర్ 5) ఇహలోకమును విడిచిన మండేలా తొంబై ఐదు సంవత్సరాలకు పైగా జీవించారు. అందులో సుమారు మూడు వంతులు – $27^1/_2$ సంవత్సరాలు జైలు జీవితం గడిపారు. రమారమి ఒక సంవత్సరం పాటు మృత్యువుతో పోరాడి ఓటమినెరుగని మండేలా ఓటమినంగీకరించారు. జనన మరణములు ప్రతి జీవికి సహజమనే

నానుడిని ధృవపరిచారు.

మండేలా న్యాయశాస్త్రం (లా) కోర్సు పూర్తిచేసిన తరుణంలో దక్షిణాఫ్రికాలో అల్ప సంఖ్యాకులైన తెల్లజాతి వారు అధిక సంఖ్యాలైన నల్లజాతీయులను పరిపాలిస్తున్నారు. అణచివేతను పెద్ద ఎత్తున అమలు చేస్తున్నారు. మండేలా స్వయంగా పాలకుల అఘాయిత్యాలను రుచి చూసాడు. బస్సు ప్రయాణంలో అతనిపై ఉమ్మివేసారు. దుకాణదారులు దగ్గరకు రానివ్వలేదు – కొనడానికి వెళ్ళినప్పుడు. చదువురాని వాడివలె చూసారు. అన్యాయాన్ని సహించ లేకపోయాడు – మండేలా 'అది సరైన పద్ధతికాదు' అని అభిప్రాయపడ్డాడు. సరైన పద్ధతి కొరకు అన్వేషణ ప్రారంభమైంది. అవసరం అన్వేషణకు ప్రేరణగా మారింది. సమానత్వం అవసరం అనుకుంటే పోరాటం ఆయుధంగా మారింది.

సమానత్వం, న్యాయం అనే విలువలు మండేలా విద్యార్థిగా వున్నప్పుడే అలవరుచుకున్నాడు. ప్రభుత్వ వ్యతిరేక చర్చల్లో పాల్గొన్నాడు. భావి మండేల విద్యార్థి దశలోనే రూపుదిద్దుకున్నాడు. శ్వేతజాతి ప్రభుత్వానికి తలనొప్పిగా మారాడు. పేరులోనే తిరుగుబాటు తనం వున్నట్టుగా తెలుస్తుంది.

రోలిహ్లహల అంటే ఇబ్బంది కలిగించే వ్యక్తి (ట్రబుల్ మేకర్) అనే అర్థం. పెద్దలు మండేలాకు బాల్యంలో ఆఫ్రికాను పాలించిన రాజుల సాహస గాథలను వినిపించేవారు. శ్వేత జాతీయుల పాలనకు ముందు వారు పాలించారు. ఈ సంఘటలన్నీ మండేలా వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దినవి. ప్రభుత్వ దమన నీతి, వర్ణవివక్ష చర్యలు, అణచివేత, అవమానం మండేలను కార్యోన్ముఖుణ్ణిచేసినవి.

పుస్తకాలు కూడా అతనిని ప్రభావితం చేసినవి. కార్ల్ మార్క్స్, ఎంజెల్స్, లెనిన్ మరియు మావో రచనలు చదివాడు. నల్లవారిని మంచి ఉద్యోగాలకు, మంచి పరిసరాలకు దూరంగా వుంచారు. మంచి పాఠశాలల్లో చేర్చుకోలేదు. అభివృద్ధి చెందని ప్రాంతాలకు తరిమారు. బీడువ్యవసాయ భూములనిచ్చారు. తెల్లవారు నివసించే ప్రాంతాలకు కఠినమైన – కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య రానిచ్చేవారు.

మండేలాలోని తిరుగుబాటుదారు విజృంభించాడు, సభలు, సమావేశాలు నిర్వహించడం, యువతను వ్యవస్థీకరించడం, ప్రభుత్వ దమననీతిని ఎండగట్టడం – తదితర చర్యలు ముమ్మరం చేసాడు. పలుసార్లు కారాగార వాసం తప్పలేదు. చివరి సారిగా 1962వ సంవత్సరంలో యావజ్జీవ కారాగారశిక్ష విధించబడింది.

విడుదల కోరుతు దక్షిణాఫ్రికాలోనే కాదు యావత్ ప్రపంచంలోని ప్రజా స్వామ్య వాదులు, మానవ హక్కులవాదులు మండేలాను విడుదల చేయాలనే పిలుపు నిచ్చారు. కారాగారం నుండే హక్కుల పోరాటం నిర్వహించాడు. మండేల తన భావాలు, ఆలోచనలు అనే రిమోట్ కంట్రోలుతో అణగారిన వర్గాలను ముందుకు నడిపించినవి.

కారాగారంలో కూడ శ్వేతజాతీయులకొక నీతి, నల్లజాతి ఖైదీలకు మరొక నీతి ఉండేది. హింస, అణచి వేత అక్కడ కూడ మండేలను, అతని తోటీ ఖైధీలను వదలలేదు. చిన్న తప్పుకు పెద్ద శిక్ష విధించేవారు. ఆహార వ్యవహారాల విషయంలో భేదాలుండేవి. తిండి, బట్టలు, అతిహీనంగా వుండేవి. నేల మీద చాపమీద నిద్రించాల్సివచ్చేది. మండేలకు కారాగారం ఒక కర్మ భూమిగా మారింది. నిరసనల ద్వారా తమ అసమ్మతిని, వివక్షతకు వ్యతిరేకంగా తెలియపరిచాడు. దేశంలో నిరసనలు, కారాగారంలో నిరసనలు, ప్రపంచ ప్రజల మద్దతు – ఇవ్వన్ని చూసి శ్వేత ప్రభుత్వం తన కఠిన విధానాలను సడలించింది. మెరుగైన సదుపాయాలు, విశ్రాంతి వేళలను మండేల సద్వినియోగపరుచుకొని, తన జైలు జీవిత అనుభవాల నోట్స్ తయారు చేసుకున్నాడు. లాంగ్‌వాక్ టు ఫ్రీడం – పేరున తన ఆత్మకథ రాయడానికి ఆ నోట్స్ పనికొచ్చినవి. ఆ పుస్తకం ఈ తరాలవారికి వారసత్వ సంపదగా వదిలాడు మండేల.

తన జీవితలక్ష్యం సాధించడానికి మండేలా $27^1/_2$ సంవత్సరాలు జైలు జీవితం గడిపాడు. కుటుంబానికి, బంధు మిత్రులకు దూరంగా వున్నాడు. కష్టాలను యిష్టంగా మార్చుకొని భరించాడు. దుఃఖాన్ని దిగమింగుకున్నాడు. చిరునవ్వుతో మానవ జాతిని పట్టిపీడిస్తున్న పలు విషయాల మీద తన అభిప్రాయాలను నెల్సన్ మండేలా వ్యక్తపరిచాడు. ప్రపంచంలోని పేదరికం గురించి మాట్లాడుతూ, "వర్ణవివక్ష మాదిరిగా పేదరికం కూడ అస్వభావికం. పేదరికం మానవ నిర్మితం, నిర్మూలించవచ్చు. మిలియన్ల ప్రజలు పేదరికమనే బందిఖానా లో బంధీలైవున్నారు. వారిని విడుదల చేయాల్సిన సమయ మాసన్నమైనది". అన్నాడు. చరిత్ర, భవిష్యత్తు గురించి మాట్లాడుతూ," మనకు అతి పురాతన చరిత్రే కాదు బంగారు భవిష్యత్తు" కూడ కలదనే ఆశావాదమతనిది.

హింసను హింసతో ఎదిరించాలనేవాడు, ప్రభుత్వహింసను హింసతోనే జవాబివ్వాలనేది అతని దృక్పథం. అహింసావాదం పనిచేయనప్పుడు అహింసే ప్రత్యామ్నాయమం, అన్నాడు.

మనుష్యుల ప్రవర్తన గురించి మాట్లాడుతు, "మనుష్య లందరిలో మంచితనముంటుంది. కఠినులుగా కనిపించేవారిలో కూడ మంచి వారుంటారు. వారి హృదయ తలుపులను తాకితే, వారు మారుతారు."

మండేలా విడుదల కోరుతు తీరప్రాంతాలలో పనిచేసే డాక్ వర్కర్లు దక్షిణాఫ్రికా వస్తువులను ఆవలి తీరాలకు చేర్చమన్నారు. ఐక్యరాజ్యసమితి, అమెరికా కాంగ్రెస్ సభ్యులు, సోవియెట్ యూనియన్ నాయకులు మండేలా విడుదల కోరారు. ప్రపంచవ్యాప్తంగా టీషర్ట్ల మీద, పోస్టర్లమీద "మండేలాను విడుదల చేయండి" అనే నినాదాలు వెలిసినవి. పాప్ గీతాలలో కూడా మండేల విడుదల నినాదం స్థానం సంపాదించుకున్నది.

***తరువాయి 23వ పేజీలో...***

# షెడ్యూల్డ్ కులాల ఉపప్రణాళిక - గిరిజనుల ఉప ప్రణాళిక

దీర్ఘకాలంగా ఇతర వర్గాలనుండి విడివడి ఉన్నందు వలన, సామాజిక, ఆర్థిక దోపిడి కారణంగానూ, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారు ఎన్నో సామాజిక ప్రయోజనాలకు దూరమయ్యారు. వారు ఇతర సామాజిక వర్గాల కంటే, మానవ అభివృద్ధి పరంగానూ, ఆర్థికపరమైన సూచికల పరంగానూ ఎంతో వెనుకబడి ఉన్నారు. ఇతర సామాజిక వర్గాల కంటే, వీరి సామాజిక ఆర్థికాభివృద్ధి సూచికలోని వ్యత్యాసాల్ని పట్టిక 1 స్పష్టంగా ప్రతిబింబిస్తుంది.

అన్ని సామాజిక వర్గాలకంటే, షెడ్యూల్డు కులాలు, తెగలలోనే పేదరికం ప్రస్ఫుటంగా కనిపిస్తున్నట్లుగా 12వ పంచవర్ష ప్రణాళిక గుర్తించింది. వీరిని ఇతర సామాజిక వర్గాల స్థాయికి తీసుకురావడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, ఆ వ్యత్యాసంలో మార్పు రాలేదు. 12 వ పంచవర్ష ప్రణాళిక ముసాయిదాలో 'నేరుగా ప్రయోజనాల్ని కల్పించే పథకాలతో కలిపిగాని, లేదా సాధారణ అభివృద్ధి విధానం ద్వారా లభించే అవకాశాలనుండి ముఖ్యంగా వీరికి సహకరించే పథకాలతోగాని, అభివృద్ధి విధానంలో పాల్గొనేందుకు అవకాశాలను కల్పించే అంతర్గత అభివృద్ధి విధానాన్ని కలపవలసిన అవసరాన్ని' సూచించడం జరిగింది.

**పట్టిక 1: షెడ్యూల్డ్ కులాలవారి నిమిత్తం సామాజిక, ఆర్థిక సూచికలు**

| సూచికలు | సంవత్సరం | ఎస్సీలు | ఎస్టీలు | ఇతరులు |
|---|---|---|---|---|
| అక్షరాస్యత రేటు శాతం (గ్రామీణ) | | 60.5 | 58.8 | 76.9 |
| అక్షరాస్యత రేటు శాతం(పట్టణ) | 2007-08 | 74.9 | 78 | 89.9 |
| నిరుద్యోగపు రేటు-ప్రస్తుత దైనందినస్థాయిలో (గ్రామీణ) | 2007-08 | 11.0 | 7.5 | 8.4 |
| బి.ఎమ్.ఐ.తో మహిళలు 18.5(%) | 2005-06 | 41.2 | 46.6 | 29.3 |
| రక్త క్షీణతతో ఉన్న మహిళల% | 2005-06 | 58.3 | 68.5 | 51.2 |
| శిశు మరణాల రేటు (1000 మందికి) | 2005-06 | 66.4 | 62.1 | 48.9 |
| పక్కాయిళ్లు గలవారి శాతం | 2008-09 | 38.3 | 39.5 | 66.1 |
| విద్యుత్ సదుపాయమున్న ఇళ్లు కలవారి శాతం | 2008-09 | 61.2 | 18.8 | 75 |

**సౌమ్య శ్రీ వాత్సవ,** రీసెర్చ్ అసోసియేట్,
సెంటర్ ఫర్ బడ్జెట్ & గవర్నెన్స్ అకౌంటబిలిటి



**ఆధారం: భారతమానవ అభివృద్ధి రిపోర్టు 2011**

ఎన్నో ఏళ్లుగా అంకితభావంతో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలను ప్రగతిపథంలో ముందుకు నడిపించడానికి, ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, అవగాహనారాహిత్యం వలన, ప్రస్తుతం అమలులో ఉన్న సాధారణ సంక్షేమ పథకాలు మరియు కార్యక్రమాల అమలులో అనేక లోటుపాట్లని ఎదుర్కొనవలసివస్తోంది.

**షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక మరియు గిరిజనుల ఉప ప్రణాళిక:** ఎన్ని అభివృద్ధి ప్రయత్నాలు చేసినా, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల సాంఘిక, ఆర్థిక పరమైన వెనుకబాటుతనం పోనందువలన, ఒక ప్రత్యేక వ్యూహరచన ద్వారా సమగ్ర ఆర్థిక పెరుగుదల ఫలితాల్ని వీరు ఇతరవర్గాలతో సమానంగా పంచుకునే అవకాశం లభిస్తుంది. ప్రత్యేకమైన మధ్యంతరాల ద్వారా షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలకు నేరుగా లభించే మళ్ళింపుల ప్రయోజనాలను నిర్ధయించడానికి, ప్రణాళికా సంఘం 1970లలో ప్రణాళికా వ్యూహ రచనల్ని షెడ్యూల్డు కులాల ప్రత్యేక అంశీభూత ప్రణాళిక ( యస్.సి.పి. ) మరియు గిరిజనుల ఉపప్రణాళిక (టి.యస్.పి)లని ప్రవేశపెట్టింది. తర్వాత, షెడ్యూల్డు కులాలకోసం ఏర్పాటుచేసిన షెడ్యూల్ట్ కులాల ఉప ప్రణాళిక (యస్.సి,యస్.పి. )గా మార్పుచేయడం జరిగింది.

2001 జనాభా లెక్కల ప్రకారం, మొత్తం జనాభాలో జాతీయ స్థాయిలో, 16 శాతంగానూ, 8 శాతంగానూ ఉన్న వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా షెడ్యూల్ట్ కులాల ఉప ప్రణాళిక మరియు గిరిజనుల ఉపప్రణాళిక నిధుల్ని, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల అభివృద్ధికి మార్గాన్ని ఏర్పాటు చేయడమనేదే దీని ప్రధాన లక్ష్యం.

ఈ విధానాల క్రింద, యస్.సి.ఉప ప్రణాళిక మరియు యస్.టి ఉప ప్రణాళికలను అమలుచేసే ప్రతి మంత్రిత్వ శాఖకి, వేరువేరు బడ్జట్ హెడ్స్ క్రింద (789 బడ్జట్ హెడ్‌తో షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక మరియు 796 బడ్జట్ హెడ్‌తో గిరిజనుల ఉపప్రణాళిక) ప్రణాళికా నిధుల్ని షెడ్యూల్డు కులాలకు (ఎస్సీ, ఎస్టీ ద్వారా) మరియు షెడ్యూల్డు తెగలకు (టి.యస్.పి.ద్వారా) కేటాయించడం జరుగుతుంది. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల నివాస గ్రామాలకి ప్రయోజనాల్ని కలిగించే కార్యక్రమాలు, లేదా వారి ఉన్నతికి తగిన నూతన అభివృద్ధి కార్యక్రమాల యోచనకి కేటాయింపులు చేసి వీరి సమూహాల అభివృద్ధికి దోహదపడేలా చూడడం జరుగుతుంది. అంతేగాని ఈ యస్.సి.యస్.పి. మరియు టి.యస్.పి.నిధుల్ని మళ్లించడానికి వీలు పడదు. అలాగే, ఈ నిధులు ఎప్పటికీ మురిగిపోవు.

**యస్.సి.యస్.పి. మరియు టి.యస్.పి.క్రింద కేటాయింపులు ఒక విశ్లేషణ :** యస్.సి. యస్.టి.ల సంక్షేమం కోసం వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల ద్వారా చేయబడిన కేటాయింపుల నివేదనల్ని, ఉప ప్రణాళికలో వివరించబడింది.

2012-13 (సవరించబడిన అంచనా) కేంద్ర బడ్జెట్ మొత్తం కేటాయింపుల్లో యస్.సి.ల కొరకు కేటాయింపు 10.43 శాతంతో అన్ని సంవత్సరాలలో కన్నా ఎక్కువగా ఉంది. కాని, ఇది యస్.సి.యస్.పి. ఒప్పంద నియమాల 16.2 శాతం వాటా కన్నా తక్కువగానే ఉంది. వ్యయంలో పెరుగుదల ప్రధానంగా, కేంద్ర ప్రభుత్వ మొత్తం ప్రణాళికా కేటాయింపుల్లోని వాస్తవమైన తగ్గుదల 321405.55 కోట్ల రూపాయలనుండి 317184.62 కోట్ల రూపాయల వరకు వుంది. దానివల్లే, మొత్తం కేటాయింపుల్లో యస్.సి.యస్.పి. యొక్క వాటా నిష్పత్తి ఎక్కువ ఉంది. అయినప్పటికీ, కేంద్ర ప్రభుత్వ మొత్తం ప్రణాళికా కేటాయింపులో, యస్.సి.యస్.పి. యొక్క వాటా 2013-14 బడ్జెట్ అంచనాలో 9.92 శాతానికి తగ్గింది.

అలాగే, గ్రాఫ్ 2 ప్రకారం, ఏ సంవత్సరంలోనూ టి.యస్.పి. క్రింద కేటాయింపులు అనుకున్న 8 శాతానికి చేరలేదు. అన్ని సంవత్సరాల్లోనూ 6శాతం కన్నా తక్కువగానే ఉన్నాయని విశ్లేషణ ద్వారా తెలుస్తోంది. యస్.సి.యస్.పి. విషయానికి భిన్నంగా, టి.యస్.పి. క్రింద నిష్పత్తి కేటాయింపులు గత కొన్నేళ్లుగా ఇంచుమించు స్థిరంగా నిలిచిపోయాయి.

**సమస్యలా?**

అన్ని మంత్రిత్వ శాఖలు నివేదనలను చేపట్టలేదు. ఇందులో కొన్నిషెడ్యూల్డు కులాల ఉపప్రణాళికక్రింద నిధుల కేటాయింపుకు అనుకూలమైనవి. అదీకాక,కొన్ని శాఖలు, మరియు కేంద్రపాలిత ప్రాంతాలు ఈ స్టేట్‌మెంట్‌క్రింద నివేదనల్ని ఆపివేయడం జరిగింది. అనుబంధములో వివిధ మంత్రిత్వ శాఖలచే ఈ స్టేట్‌మెంట్ క్రింద జరిగిన కేటాయింపులు చూపబడ్డాయి.

2013-14 కేంద్రబడ్జెట్‌లోని 21 స్టేట్‌మెంట్‌ననుసరించి షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక క్రింద ప్రభుత్వం 2012-13 ఆర్థిక సంవత్సరంలోని 33085.04 కోట్ల రూపాయిలకు మించి అనగా 41,561కోట్ల రూపాయిలను కేటాయించడం జరిగింది.

గిరిజన ఉపప్రణాళికలో కూడా అన్ని మంత్రిత్వశాఖలుకూడా ఈ స్టేట్‌మెంట్ క్రింద నిధులను కేటాయించడం లేదు. (అనుబంధము2 చూడండి).

2012-13బడ్జెట్ అంచనా వరకు నిధులను నివేదించిన వ్యవసాయ మంత్రిత్వ శాఖ 2012-13 (సవరించబడిన అంచనా) నుండి స్టేట్‌మెంట్21ఎ క్రింద నివేదనల్ని ఆపేసింది. ఒక సంవత్సరానికి మాత్రమే(2010-11సవరించబడిన అంచనా) నిధులను నివేదించిన పౌరవిమాన మంత్రిత్వశాఖ మరియు బయోటెక్నాలజీ శాఖ కూడా అలాగే చేసాయి. గత సంవత్సరం నుండి దీనిక్రింద నివేదించే మంత్రిత్వశాఖలు/విభాగాలలో ఎటువంటి పెరుగుదల లేదు. గిరిజన ఉపప్రణాళిక కొరకు గత కొన్ని సంవత్సరాలుగా వివిధ మంత్రిత్వశాఖలు/విభాగాలు చేసిన కేటాయింపులను అనుబంధం2 చూపిస్తోంది. 2013-14 కేంద్ర బడ్జెట్‌యొక్క స్టేట్‌మెంట్ 21ఏ ననుసరించి, గిరిజన ఉపప్రణాళిక క్రింద ప్రభుత్వ కేటాయింపులు 2012-13 (సవరించబడిన అంచనా) లోని 18721.33 కోట్ల రూపాయిల నుండి, 24,598.39కోట్ల రూపాయిలకు పెంచబడింది. అంటే 5877.57కోట్ల రూపాయిలవరకు ఈ పెరుగుదలలో వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది.

స్టేట్‌మెంట్‌లు(21, 21ఏ) మొట్టమొదటిసారిగా పారదర్శకత వైపు ముందడుగు వేస్తున్నందుకు ప్రతీకగా 2013-14 కేంద్ర బడ్జెట్‌లో వాస్తవ సంఖ్యలను రిపోర్ట్ చేసినట్లుగా భావించవచ్చును. అంతేకాకుండా, ఆర్థిక శాఖామాత్యులు ఈ ఏడాది తన బడ్జెట్ ప్రసంగంలో ఉపప్రణాళికలకోసం కేటాయించిన నిధులను ఎట్టిపరిస్థితుల్లోను మళ్లించేందుకు వీలు పడదని, వాటిని నిర్దేశించిన ప్రయోజనాలకు మాత్రమే ఖర్చు చేయవలసివుంటుందని స్పష్టంగా నొక్కి వక్కాణించడం జరిగింది. ఏమయితేనేమి, ఈ పట్టికల క్రింద నివేదనల విషయమై ఇంకా చేయవలసినది ఎంతో ఉన్నది. ఈ ప్రణాళికా విధానాల నిర్దిష్ట అమలును ప్రభావితం చేసే విషయాలను రాబోయే విభాగంలో ప్రత్యేకంగా వివరించడం జరుగుతుంది.

**షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక మరియు గిరిజనుల ఉపప్రణాళికల అమలువిషయంలో పట్టించుకోవలసిన అంశాలు**

పైన తెలిపినట్లుగా ఈ రెండు విధానాల అమలులోను మూడు ప్రధాన సమస్యలున్నాయి: ప్రభుత్వ కేటాయింపులు నిర్దేశిత 16 మరియు 8 శాతాలకు సరిపోక పోవడం, చాలా మంత్రిత్వశాఖలలో ఈ స్టేట్‌మెంట్లు కనిపించకపోవడం, చాలా మంత్రిత్వశాఖలకు షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక మరియు గిరిజనుల ఉపప్రణాళికల కొరకు ఆయా సంపూర్ణ బడ్జెట్ పుస్తకాలలో (డీటెయిల్డ్ డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్) తగిన బడ్జెట్ నిర్దేశింపులు లేకపోవడంవంటి సమస్యలున్నాయి. అంతేకాకుండా ఈ మొత్తం ప్రణాళికా విధానాలకు సంబంధించిన మరిన్ని అంశాలు సమస్యలుగానే మిగిలిపోయాయి.

నరేంద్రజాదవ్ టాస్కుఫోర్సు అనుసరించిన విధానం, ఈప్రణాళికలను వ్యతిరేకంగా ప్రభావితం చేసిన మరొక ప్రధానాంశం.

షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక, మరియు గిరిజనుల ఉపప్రణాళికల అమలుకొరకు నరేంద్రయాదవ్ కమిటీ యొక్క మార్గ దర్శకాలు ఉపాంశాలకు సంబంధించిన ప్రధానాంశాలను పెద్దగా పట్టించుకోలేదు. చాలా పథకాలలో, ఆ పథకాలు షెడ్యూల్డు కులాలు/ తెగల ప్రత్యేక అవసరాలను సవాళ్లను ఉద్దేశించకపోయినా నోడల్ మంత్రిత్వ శాఖలు ప్రణాళికా కేటాయింపుల్లో వారి ప్రయోజనార్ధ నిధుల నిష్పత్తిలో కొంతభాగాన్ని మాత్రమే నివేదన చేయడం జరిగింది. ఎన్నో ఏళ్లుగా షెడ్యూల్డు కులాల ఉపప్రణాళికక్రింద సమర్పించే నివేదికలు రిట్రాస్పెక్టివ్ బడ్జెటింగ్ విధానంలోనే ఉంటున్నాయి. అంటే షెడ్యూల్డు కులాల కేటాయింపులకు సంబంధించి మంత్రిత్వశాఖల ప్రణాళికల బడ్జెట్‌లు ఈ ఉపప్రణాళికలను రూపొందించడంలో ఎటువంటి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోకుండానే బడ్జెట్ తయారీ సమయంలోనే అంటే నమూనా యూనియన్ బడ్జెట్ తయారీ విధానసమయంలోనే తుదిరూపుకు వస్తున్నాయి.

రెండవది, అటువంటి ఎన్నో మంత్రిత్వ శాఖలలో ఆయా కార్యక్రమాలు/ పథకాల ప్రాధమిక దశను పరిశీలిస్తే, ఒకానొక పథకంలో షెడ్యూల్డు కులాలు/తెగలకు కొంతమేరకు దేశంలోని వారి జనాభా నిష్పత్తి మేరకు వారికొరకు నిధుల కేటాయింపు సరిపోవచ్చుననే భావన, ఈ షెడ్యూల్డుకులాల మరియు గిరిజనుల ఉపప్రణాళికల క్రింద జాతీయ స్థాయిలో నిధుల కేటాయింపుపై చర్చకు ఆస్కారమిస్తుంది. అంతేకాకుండా కొన్ని కేసులలో ఈ స్టేట్‌మెంట్ల క్రింద సూచించిన ఉపాంశాలు షెడ్యూల్డు కులాలు/తెగలకు సంబంధించినవిగా కాక సాధారణ కేటగిరీకి చెందినవిగా ఉంటున్నాయి. ఇటువంటివే మరికొన్ని ఉదాహరణలు ఈ షెడ్యూల్డు కులాలు/తెగలు, మరియు గిరిజనుల ఉపప్రణాళికల నిధులు, ముఖ్యంగా షెడ్యూల్డు కులాల ఉపప్రణాళికా నిధులు ఏవిధంగా సాధారణ ప్రయోజనాలకు వినియోగించడం జరుగుతోందో తెలియచేస్తున్నాయి. ఈ క్రింద ఉటంకించిన రాష్ట్రస్థాయి ఉదాహరణలను పరిశీలిస్తే ఇది ఎంతో స్పష్టమవుతుంది.

**మధ్య ప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ నుండి ఉదాహరణ**

మధ్య ప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్, షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక క్రింద ఫర్నిచర్ మరియు సాధనాసామగ్రి కొనుగోలు, గొట్టాల నిర్మాణం, ప్రాజెక్టు సర్వే మరియు మ్యాపింగ్ వంటి ఉపాంశాలను నమోదు చేసింది. ఇవన్నీ షెడ్యూల్డు కులాల సాధికారతను పెంచడంగాని వారి ప్రత్యేక అవసరాలను తీర్చడంగాని చేయలేవని స్పష్టంగా చెప్పవచ్చును. ఈ ఉపప్రణాళిక క్రింద అటువంటి ఉపాంశాలను పొందుపరచడంవలన రాష్ట్రంలోని ఈ ఉపప్రణాళిక క్రింద చేసిన నివేదనలవలన ఎన్నో సందేహాలుత్పన్నమవుతాయి.

2010-11 (బడ్జెట్ అంచనా)లో మధ్యప్రదేశ్‌లో షెడ్యూల్డు కులాల ఉపప్రణాళిక నిధులను సరిగ్గా వినియోగించుకోలేని ఉదాహరణలు:

- వైద్యవిద్యాశాఖలో హోమియోపతి మరియు ఆయుర్వేద క్లినిక్‌ల స్థాపనకు ఫర్నిచర్ మరియు సాధనాసామగ్రి కొనుగోలు నిమిత్తం 22లక్షల రూపాయిలు బుక్ చేయడం జరిగింది.
- ఉన్నత విద్యాశాఖలో సిబ్బంది వసతి నిర్మాణానికై కోటి రూపాయిల వరకు ఒక ప్రావిజను ఉంది.
- నీటి వనరుల శాఖలో గొట్టాల నిర్మాణానికి 6.4కోట్ల రూపాయిలను కేటాయించింది.
- నర్మదా వేలీ అభివృద్ధి ప్రణాళిక నిమిత్తం, ఆ సంపూర్ణ ప్రాజెక్టు సర్వే మరియు మ్యాపింగ్‌ల కొరకు 40 లక్షల రూపాయిలు కేటాయించబడ్డాయి.

ఆధారం: దళిత మానవ హక్కులపై జాతీయస్థాయి దండయాత్ర (ఎన్.సి.డి.హెచ్.ఆర్.), 2010-11 సంత్సరానికి మధ్యప్రదేశ్ రాష్ట్ర నిధుల కొరకు ఒక ఢిల్లీ ఆధారిత ప్రభుత్వేతర సంస్థయొక్క సవివరమైన డిమాండ్ల వివరాలు.

**ఒడిషా రాష్ట్ర బడ్జెట్ ఉదాహరణ :** ఒడిషా రాష్ట్ర బడ్జెట్ 2010-11, కారాగారాల భవన నిర్మాణం,పోలీసువారి భవనాలు, అగ్నిమాపక భవనాలు నిమిత్తం స్పష్టమైన యస్.సి.యస్.పి నిధుల కేటాయింపు 4.77 కోట్ల రూపాయలు (4059-60-789 పద్దుల క్రింద) యస్.సి.ల అభివృద్ధికిగాని లేదా వారికి ఎటువంటి ప్రయోజనాల్ని కలిగించలేదు.

**పట్టిక: 2 ఒడిషా రక్షణ శాఖలో గ్రాంటుల కొరకు సంపూర్ణ డిమాండు నుండి కొన్ని భాగాలు (కోట్ల రూపాయలు)**

| పథకాలు | 2009-10 బడ్జెట్‌అంచనా | 2010-11 బడ్జెట్‌అంచనా |
|---|---|---|
| కారాగారాల భవన నిర్మాణం | 2.30 | 4.77 |
| అగ్ని మాపకదళ సేవల భవన నిర్మాణం | 3.34 | 4.11 |
| పోలీసు సంక్షేమ భవన నిర్మాణం (37062- ఒ.యస్.పి.హెచ్.మరియు డబ్ల్యు. కార్పొరేషన్ ద్వారా కార్యాలయ భవన నిర్మాణం | 7.49 | 1.70 |

ఆధారం : ఒడిషా రాష్ట్ర బడ్జెట్‌లో గ్రాంటుల నిమిత్తం సంపూర్ణ డిమాండు నుండి ఢిల్లీకి చెందిన ప్రభుత్వేతర సంస్థ దళిత మానవ హక్కులపై జాతీయ స్థాయి ప్రచార సంస్థ సేకరించిన డేటా.

**గుజరాత్ రాష్ట్ర బడ్జెట్ నుండి ఉదాహరణ :** అలాగే, గుజరాత్ రాష్ట్ర బడ్జెట్ టి.యస్.పి. క్రింద షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి ఈ క్రింద తెలియజేసిన విధంగా ప్రత్యేకంగా ఎటువంటి ప్రావిజన్స్ లేని కొన్ని ఆటంకాల్ని నమోదు చేసింది. షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఎటువంటి ప్రావిజన్లు లేని సాధారణ పథకాలని రిపోర్టు చేయడం లేదా జయంతి ఉత్సవాల్ని జరపడంవంటి కార్యక్రమాలపై కేటాయింపుల్ని రిపోర్టు చేయడంవంటి వాటిని షెడ్యూల్డ్ తెగల వారి అభివృద్ధికి చేపట్టే ప్రత్యేక కార్యక్రమాలుగా చూడలేము.

2012-13 లో గుజరాత్‌లో గిరిజన ఉప ప్రణాళిక నిధుల స్వల్ప ప్రయోజనాలకి ఉదాహరణలు

- మైనర్ హెడ్ 796 సబ్‌హెడ్ 07 క్రింద స్వామి వివేకానంద 150 వ జయంతి ఉత్సవాలకి 2012-13 సంవత్సరానికి 5 కోట్ల రూపాయల మొత్తం కేటాయించబడింది.
- మైనర్ హెడ్ 796 సబ్‌హెడ్ 08 యు.డి.పి.క్రింద 2012-13 సం.కి గాను స్వర్ణజయంతి ముఖ్యమంత్రి సహారీ వికాస్ యోజన

కొరకు 170 కోట్ల రూపాయల మొత్తం కేటాయించబడింది. యు.ఎల్.బి.లకు కనీస సామాజిక మౌలిక సదుపాయాలకు సమయాన్ని అందించేందుకు ఈ పథకం ఉద్దేశించబడింది. ఉదాహరణ : పాఠశాల భవన నిర్మాణము/ పాఠశాల భవనాలని తిరిగి బలోపేతం చేయుట, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో సదుపాయాల కల్పన , అలాగే, కిండర్‌గార్డెన్లు, ఈ- లైబ్రరీలు, ఆట స్థలాలు,ఘన ద్రవ వ్యర్థాల నిర్వహణ, ఈ- గవర్నెన్స్, పార్కింగ్, పబ్లిక్ టాయిలెట్లు, కూరగాయలు,ఆయా ఋతువులలో అమ్మకం చేసే వర్తకుల మార్కెట్లలో సదుపాయాల కల్పన, మొదలగునవి.

**ఆధారం: గుజరాత్ రాష్ట్ర బడ్జెట్ డాక్యుమెంట్లు (2012-13)**

సాధారణ ప్రయోజనాల కోసం, నిధుల్ని ఈ విధంగా వినియోగించడం వలన, షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక మరియు గిరిజనుల ఉప ప్రణాళికా విధానాల్ని ప్రారంభించే ఉద్దేశాలకు ఆటంకం కలుగుతుంది. వీలైనంత వరకు షెడ్యూల్డ్ కులాలు, తెగలకుద్దేశించిన ప్రణాళికలకు ప్రయోజనాత్మకమైన విధానముండి ,ఆ ప్రాజెక్టుల్లో ,షెడ్యూల్డ్ కులాలు, తెగల ప్రజలు ఎక్కువగా ఉన్న గ్రామాలలో వారి మౌలిక సదుపాయాలు, కనీస అవసరాలకు సంబంధించినగా ఉండి వారి ప్రత్యేక అవసరాల్ని తీర్చే ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి దోహద పడేలా చేయవలసి ఉంది.

మూడవది ఏమిటంటే, ప్రాధమికంగా ఈ రంగాల 'అవిభాజ్యత' కారణంగా నరేంద్ర యాదవ్ టాస్క్ ఫోర్సు అనేక మంత్రిత్వ శాఖలని/ విభాగాలని ఈ స్టేట్‌మెంట్ల కింద రిపోర్టు చేయడానికి మినహాయింపునిచ్చింది. కాని, ఏ రంగమూ కూడ అవిభాజ్యం కాదని మంత్రిత్వ శాఖలు ఆయా రంగాలలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన కొన్ని ప్రత్యేక సవాళ్లను గుర్తించగలవని , తద్వారా ఒక క్రొత్త పథకానికి రూపకల్పన చేసి మొత్తం మంత్రిత్వశాఖ బడ్జెట్‌లో వీరికి సంబంధించిన కేటాయింపులు స్వల్పమైనప్పటికీ అటువంటి సవాళ్లను ఎదుర్కొంటా యని గుర్తించవలసిన అవసరం ఎంతయినా ఉంది.

అటువంటి విధానాలు యస్.సి. ఉప ప్రణాళిక మరియు గిరిజనుల ఉప ప్రణాళికల ప్రణాళికా విధానాన్ని పునరాలోచన చేసి వాటిని యస్.సి, యస్.టిల అవసరాలకు తగినట్లుగా మరింత దీటుగా రూపకల్పన చేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్తాయి.

స్పష్టంగా చెప్పాలంటే, అన్ని మంత్రిత్వ శాఖలకు ఈ యస్.సి. ఉప ప్రణాళిక మరియు గిరిజనుల ఉప ప్రణాళికల నిర్దేశిత లక్ష్యం 16/8 శాతం అనే దానిని చేరుకోవడం అనేది అలక్ష్యం చేయవలసి నదిగా గాని మరీ అవసరంగాని కాదు. అయితే, ఈ లక్ష్యాల పరంగా మంత్రిత్వ శాఖలన్నీ తీవ్రమైన కృషిచేసినట్లయితే, అన్ని మంత్రిత్వ శాఖలకు నివేదించిన ఈ ఉమ్మడి ప్రణాళికా కేటాయింపులు నిర్దేశితమైన వాటికంటే కొంచెం అధికంగానే ఉండగలవు. అంటే, మొదటి ఏడాదిలోనే కాకపోయినా క్రమేపీ స్వల్ప వ్యవధిలోనే సాధించుకోవచ్చును.

*అనువాదం : ఆత్మూరి సత్యనారాయణ మూర్తి*

*19వ పేజీ తరువాయి...*

## అలుపెరుగని స్వేచ్ఛా ప్రియుడు నెల్సన్ మండేలా

ప్రభుత్వం మండేలా విడుదలకు షరతును విధించింది. హింసను త్యజిస్తే అతనికి స్వేచ్ఛాయుత జీవితం ప్రసాదిస్తానన్నారు "నేను హింసావాదిని కాను. అన్ని ఇతర మార్గాలు మూసుకు పోయినప్పుడు మాత్రమే హింసను ఆశ్రయించాను. ప్రభుత్వం హింసను త్యజిస్తే.. మేము కూడ త్యజిస్తామన్నాడు. వర్ణవివక్షత గురించి మాట్లాడుతూ" ఏ వ్యక్తికూడ తల్లి గర్భం నుండే శరీరరంగు, మతం ద్వేషిస్తు జన్మించడు". అంటాడు "స్వేచ్ఛ అంటే మన స్వేచ్ఛనే కాదు – ఇతరుల స్వేచ్ఛను కూడ గౌరవించాలి" అంటాడు. "అణచివేతకు గురైనవారు, అణచివేసేవారు – ఇరువురు కూడ మానవత్వం లేనివారే" – అనేది మరో భావన." నా జీవితాన్ని ఆఫ్రికా ప్రజల స్వేచ్ఛకొరకు అంకితం చేసాను. తెల్లవారి, నల్లవారి అధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడాను. నేను కలలు గన్న ప్రజాస్వామ్య దేశంలో ప్రజలందరు సమాన అవకాశాలతో, కలసిమెలిసి జీవించాలి. ఆ ఆదర్శం సాధించడానికి జీవిస్తాను. ఆ ఆదర్శం కోసమే, అవసరమైతే, మరణించడానికి కూడ సిద్ధమే."

కోపతాపాలతో, సలసలమరిగే రక్తంతో కారాగారజీవితంలోకి ప్రవేశించిన మండేలాను జైలు జీవితం పునీతం చేసింది. శత్రువును కూడ క్షమించే దృక్పథాన్ని అలవరించింది. "వ్యక్తిని కాదు వ్యవస్థను ద్వేషించు" అని మండేల అనేవారు. జైలు జీవితంతో తనలో పరిణతి వచ్చినట్టు తనే పేర్కొన్నారు. మండేలా పోరాడింది ఆఫ్రికా ప్రజల స్వేచ్ఛ కొరకే కాదు మానవజాతి స్వేచ్ఛ కొరకు, సమానత్వం కొరకు, సుఖజీవితం కొరకు, కష్టాలను అవకాశంగా మార్చుకున్నాడు. కష్టేఫలి అనే సూక్తిని పాటించాడు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపాడు. అపజయాలను జయానికి మెట్లుగా వాడుకున్నాడు. పెద్ద లక్ష్యసాధన ముందు తన కష్టాలు చిన్నవని, తప్పవని గుర్తించాడు.

తెలివితేటలు, క్షమాగుణం, ఓపిక, ఇతరులను మైమరపించే శక్తి, వినుటయందాసక్తి, త్యాగబుద్ధి – ప్రపంచ ప్రజలకతన్ని దగ్గరచేసాయి. తన జీవితమే ఒక పోరాటం అని నమ్మిన మండేల లక్ష్యసాధనకు నిరంతరం కృషిచేసాడు. కష్టాలకు భయపడలేదు, కష్టాలే అతనికి భయపడినవి. మడిబా స్వేచ్ఛ కొరకు చేపట్టిన సుదీర్ఘ ప్రయాణం (లాంగ్ వాక్ టు ఫ్రీడమ్) అలా ముగిసింది. ప్రపంచంలో వర్గ వివక్షత, అసమానతలు, అణచివేతలు తదితర అమానుష చర్యలు కొనసాగినన్నాళ్ళు దక్షిణాఫ్రికా గాంధీగా, నల్ల సూర్యుడుగా పేరుపొందిన మండేలా అవసరముంటుంది. ■

# భారతదేశంలో మహిళల రక్షణ చర్యలు

## (లైంగిక నేరాల నిరోధక ఆర్డినెన్స్ 2013 ముఖ్యాంశాలు)

ఒక దేశంలోని అభివృద్ధిస్థాయిని సమీక్షించాలంటే ఆదేశంలో స్త్రీకిగల హోదా పరిశీలించడం ద్వారా మాత్రమే ఆ దేశ స్థాయిని అంచనావేయవచ్చు. సనాతన భారతీయ సమాజంలో పురుషునిపై స్త్రీ ఆధారపడటం అత్యంత సాధారణమైన విషయం. ఆర్యుల కాలంలో స్త్రీ గౌరవమర్యాదల విషయాలకు స్వర్ణయుగం అని చెప్పవచ్చు. అయితే మధ్యయుగకాలంలో స్త్రీల పరిస్థితి దిగజారింది. అనంతర బ్రిటీష్ పాలనాకాలంలో స్త్రీ రక్షణ చట్టాలు అమలుపరచడం ప్రారంభమైనది. స్వాతంత్ర్యానంతరం భారతరాజ్యాంగ నిర్మాతలు మహిళలకు సమానహక్కులు కల్పించారు. పురుషులతో సమానమైనహోదా ఉద్యోగ నియామకంలో వివక్షత నిషేధించడం వంటి రక్షణ చర్యలు చేపట్టడం ద్వారా మనదేశంలో మహిళల హోదా పెరిగినది.

**భారతరాజ్యాంగంలో స్త్రీ రక్షణ నిబంధనుల**

- 14. నిబంధన ప్రకారం చట్టం ముందు అందరూ సమానులే.
- 15 (1) ప్రకారం స్త్రీ పురుష వివక్షత చూపరాదు
- 15(3) ప్రకారం స్త్రీల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక సదుపాయాలు కల్పించవచ్చు
- 16(2) ప్రభుత్వ ఉద్యోగాలలో లింగవివక్షత చూపించకూడదు
- 19 స్త్రీ, పురుషులకు వ్యక్తిగత స్వేచ్ఛ హక్కు లున్నవి.
- 23 మనుషులతో బలవంతపు వ్యాపారం, వెట్టిచాకిరి నిషేధించాలి
- 39 (ఎ) ప్రకారం స్త్రీ పురుషులందరికి సమానమైన జీవన భృతి హక్కులు కల్పించేటట్లు ప్రభుత్వ విధానాలు ఉండాలి.
- 39(బి) ప్రకారం స్త్రీ, పురుషులకు సమానమైన పనికి సమానమైన వేతనం ఇవ్వాలి.
- 42 ప్రకారం స్త్రీలకు ప్రసూతి సౌకర్యం కల్పించాలి
- 51 (ఎ,సి) ప్రకారం స్త్రీల గౌరవానికి భంగం లేకుండా చర్యలు తీసుకోవాలి.

**మహిళా రక్షణ కొరకు అమలు పరుస్తున్న చట్టాలు**

- 1829లో సతీసహగమన నిషేధచట్టం
- 1856 వితంతు పునర్వివాహ చట్టం
- 1929 బాల్యవివాహాల నిరోధక చట్టం


షేక్ జాహెదా బేగం

ఎం.ఎ., రాజనీతి శాస్త్రం, ఎమ్మిగనూరు




- 1956 హిందూ వారసత్వ చట్టం
- 1961 వరకట్న నిషేధ చట్టం
- 1961 ప్రసూతి సౌకర్య చట్టం
- 1976 స్త్రీ పురుష సమాన వేతన చట్టం
- 1976 వెట్టిచాకిరి నిషేధ చట్టం
- 1986 అశ్లీల ప్రదర్శన నిషేధ చట్టం
- 1986 బాలకార్మికుల నిరోధ చట్టం
- 1989 షెడ్యులు కులాల, తెగల చట్టం
- 1992 జాతీయ మహిళా కమిషన్
- 1994 మానవ శరీర అంగాల మార్పిడి నిషేధ చట్టం
- 1994 లింగ నిర్ధారణ పరీక్షల నివారణ చట్టం
- 2005 గృహహింస నిరోధక చట్టం

మహిళల రక్షణ కొరకు ఇన్ని చట్టాలను అమలుపరుస్తున్నా విధాన లోపాలు, సామాజిక విలువల పతనం వలన ఇటీవలకాలంలో మనదేశంలో మహిళలపై దాడులు విశృంఖలచర్యగా పెరిగాయి. నేషనల్ క్రైం రీకార్డ్స్ బ్యూరో ప్రకారం మనదేశంలో మహిళలపై దాడులకు సంబంధించి ప్రతి నిముషానికి 5 కేసులు నమోదు అవుతున్నాయి. ప్రతి 20 ని॥లకు ఒక మహిళ అత్యాచారానికి గురిఅవుతున్నది. 2012 నేషనల్ క్రైం రికార్డ్స్ ప్రకారం దేశంలో మొత్తం 2,44,270 కేసులు మహిళలపై దాడులకు సంబంధించినవి. ఇందులో ఉత్తర ప్రదేశ్ 30,952 కేసులతో ప్రథమస్థానం, ఆంధ్రప్రదేశ్ 28,171 కేసులతో రెండవస్థానంలో ఉన్నాయి. వరకట్న వేధింపుల కేసులలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానం, వరకట్న చావులలో ఉత్తర ప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉన్నాయి.

అందుకే భారత ప్రభుత్వం ఢిల్లీ నిర్భయ ఘటన అనంతరం సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జె.ఎస్. వర్మ చైర్మన్‌గా జస్టిస్ లీలాసేథ్, గోపాల్ సుబ్రహ్మణ్యం సభ్యులుగా ఒక కమిటీని నియమించింది. ఈ కమిటి నివేదిక ప్రకారం ప్రభుత్వం ఇండియన్ పీనల్ కోడ్ 1860, భారతీయ సాక్ష్యాధారాల చట్టం 1872, నేరశిక్ష స్మృతి 1972, భారతీయ శిక్షాస్మృతి మొదలగువాటిని సవరణలు చేసి లైంగిక నిరోధాల ఆర్డినెన్స్ 2013ను రూపొందించింది. భారత రాష్ట్రపతి దీనికి ఫిబ్రవరి 3, 2013న ఆమోదం తెలపడంతో తక్షణం ఆమోదంలోకి వచ్చింది. లైంగిక నేరాల నిరోధక ఆర్డినెన్స్ 2013 (క్రిమినల్ లా అమిండ్‌మెంట్ బిల్) మహిళలకు రక్షణగా, కామాంధుల పాలిట యమపాశంగా ఉన్నది.

**లైంగిక నిరోధాల ఆర్డినెన్స్ బిల్లులో ముఖ్యాంశాలు**

- 1. 326 (ఎ) ప్రకారం మహిళపై యాసిడ్‌తో గాని మరి ఏదైనా రసాయనంతో గాని గాయపరచడం, దాడి చేయడం మొదలగు చర్యలకు పాల్పడిన వారికి 10 సంవత్సరాలకు తగ్గకుండా యావజ్జీవ జైలు శిక్ష, మరియు రూ. 10లక్షల వరకు జరిమానా విధించి, ఆ జరిమానాను బాధితులకు చెల్లిస్తారు.
- 326 (బి) ప్రకారం యాసిడ్‌తో ఏదైనా రసాయనంతో దాడిచేసే ప్రయత్నం చేసిన వారికి కనీసం 5 సంవత్సరాలకు తగ్గకుండా 7 సంవత్సరాల వరకు జైలు శిక్ష విధిస్తారు.
- 354 (బి) ప్రకారం స్త్రీని నగ్నంగా, అర్ధనగ్నంగా చేసే ఉద్దేశ్యంతో నేరానికి పాల్పడితే 3 నుండి 7 సంవత్సరాల వరకు జైలు శిక్ష విధిస్తారు.
- 354 (డి) ప్రకారం స్త్రీలను వేధింపులకు, భయాందోళనలకు గురిచేసే విధంగా పాల్పడితే 3సం॥ల వరకు జైలు శిక్ష విధిస్తారు.
- 370 ప్రకారం వ్యభిచారం లేదా ఇతరత్ర రూపాలలో లోబర్చుకోవడం కోసం ప్రలోభపెట్టినా, బల ప్రయోగం చేసినా 7 సం॥ తగ్గకుండా జైలు శిక్ష (యావజ్జీవం) విధిస్తారు.
- 375 ఉద్దేశ్యపూర్వకంగా దాడి జరిపి కామవాంచ తీర్చుకొనే ప్రయత్నం చేస్తే 7 సం॥లు లేదా యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తారు.
- 376 (ఎ) ప్రకారం బాధితురాలి మరణానికి దారితీసే విధంగా లేదా జీవచ్ఛవంలా ఉండే విధంగా దాడిచేస్తే కనీసం 20 సం॥ల నుండి యావజ్జీవ కారాగారశిక్ష లేదా ఉరి శిక్ష విధిస్తారు.
- 376 (సి) ప్రకారం అధికార దుర్వినియోగం చేస్తూ క్రింది స్థాయి స్త్రీలను లోబర్చుకుంటే వారికి 5 సం॥లు తగ్గకుండా 10 సం॥ల వరకు కఠిన జైలు శిక్ష, జరిమానా విధిస్తారు.
- 376 (డి) ప్రకారం స్త్రీ పై సామూహికంగా దాడికి పాల్పడితే వారికి 8 సం॥లకు తగ్గకుండా యావజ్జీవ శిక్ష జరిమానా విధిస్తారు.
- 376 (ఇ) ప్రకారం తరచు ఇటువంటి నేరాలకు పాల్పడితే యావజ్జీవం లేదా ఉరిశిక్ష విధిస్తారు. కావాలని మహిళను తాకే ప్రయత్నం చేస్తే 1 సం॥ నుండి 5 సం॥ జైలు శిక్ష విధిస్తారు.

పనిచేసే చోట మహిళలకు రక్షణ నిమిత్తం 2006 లోనే ప్రభుత్వం ఒక చట్టాన్ని రూపొందించింది. దీని ప్రకారం ప్రతి ప్రభుత్వ మరియు ప్రైవేట్ కార్యాలయాలలో మహిళల రక్షణ నిమిత్తం ఆరు మంది సభ్యులతో ప్రత్యేక కమిటీలు నియమించారు. ఈ కమిటీలో ప్రభుత్వ విభాగం, వైద్య విభాగం, స్వచ్ఛంద సంస్థల వారిని సభ్యులుగా నియమించాలి. అంతే కాక మహిళలు పనిచేసే సంస్థల నుంచి కూడా సభ్యులుగా ఉండాలి. తప్పనిసరి పరిస్థితులలో రాత్రులు విధులకు హాజరయ్యే మహిళలకు ప్రత్యేకంగా రవాణా, రక్షణ సౌకర్యాలను ఆయా సంస్థలే కల్పించాలి. ఈ చట్టం ప్రకారం అత్యాచారానికి గురైన బాధితురాలు ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్‌కు వెళ్ళినప్పుడు పోలీసులు సరిగ్గా స్పందించకపోతే వారికి 6 నెలల నుండి 2 సం॥లవరకు జైలు శిక్ష విధిస్తారు. వైద్య సహాయం నిమిత్తం ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్ళిన బాదితురాలికి సత్వర వైద్య సహాయం అందించక పోయినా, సంబంధిత సిబ్బంది, వైద్యులకు 1సం॥ పాటు జైలు శిక్ష విధించవచ్చును.

సెక్షన్ 228 ప్రకారం మానభంగానికి గురైన స్త్రీ సమ్మతి లేకుండా ఆమె పేరును గాని, గుర్తింపునుగాని ప్రకటించకూడదు. భారతీయ శిక్షాస్మృతి 372, 373 సెక్షన్‌ల ప్రకారం వ్యభిచారం కోసం బాలికల కొనుగోలు,అమ్మకం నిషేధిస్తుంది. అంతే కాక మానభంగానికి పాల్పడితే ఐ.పి.సి. 376, లైంగిక వేదింపులకు గురిచేస్తే ఐ.పి.సి. 354, ఎత్తుకుపోవడానికి పాల్పడితే 363, 373 సెక్షన్‌లు, వరకట్న వేధింపులకు గురిచేస్తే 498 (ఎ), వరకట్న చావులకు, ఆత్మహత్యలకు కారణమైతే 304 (బి) కింద కేసు నమోదు చేసి నిందితులపై చర్యలు తీసుకుంటారు.

ప్రభుత్వం అమలు పరుస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాల వల్ల స్త్రీల అభివృద్ధికి ప్రత్యేక రక్షణ సౌకర్యాలవలన నేడు స్త్రీలు సమాజంలో అన్ని రంగాలలో ముందంజలో ఉన్నారు. ఈ విధమైన పరిస్థితులలో స్త్రీలపై దాడులను, అకృత్యాలు, హత్యలు మొదలైన విషయాలు సరికాదు. మహిళలపై జరిగేహింసలు నిరోధించడానికి కఠినమైన చట్టాలు ఉన్నప్పటికి విచారణ పద్దతులలో లోపాలు ఉండటం వల్లనే నిందితులు తప్పించుకుంటున్నారు. ఇలాంటి వాటికి తావులేకుండా చట్టాలను కఠినంగా అమలుపరచాలి. నేరానికి పాల్పడితే దండన తప్పదన్న బెదురే మనుషుల్లో మృగత్వాన్ని అదుపుతెస్తుంది. స్త్రీలలో వారికి లభించే చట్టపరమైన రక్షణను వినియోగించుకునే విధంగా అవగాహన పెరగాలి. అన్ని రంగాలలో మహిళల స్థాయిని పెంచడం ద్వారా మరియు మానవతా విలువలు, సామాజిక చైతన్యం ద్వారానే ఈ సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారం అని చెప్పవచ్చు. ■

CIVILS - 2014
CSAT-2013
APPSC Gr-I & II, IV
RRB, SSC
SBI Exams
IBPS (PO) Clerk Exams



# విజ్ఞాన విపంచి

ప్రాతూరి పోతయ్యశర్మ

1. టైం మ్యాగ్జయిన్ ఎవర్ని 2013 సంవత్సరపు ప్రముఖ వ్యక్తిగా ప్రకటించింది?
(ఎ) పోప్ ఫ్రాన్సిస్ (76 ఏళ్ళు)
(బి) ఎడ్వార్డ్ స్నోడెన్ (సి) ఎడిత్ విండ్సర్
(డి) బషార్ ఆల్ అస్సాద్
2. మాంట్ వీడియో నగరం ఏ దేశ రాజధాని?
(ఎ) బ్రెజిల్ (బి) ఉరుగ్వే
(సి) పెరుగ్వే (డి) ఛిలీ
3. కలైకుండ ఎయిర్ బేస్ ఏ రాష్ట్రంలో ఉంది?
(ఎ) ఢిల్లీ (బి) పశ్చిమబెంగాల్
(సి) పంజాబ్ (డి) హర్యానా
4. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) SOI : స్ఫియర్ ఆఫ్ ఇన్‌ఫ్లుయెన్స్
(బి) TMI : ట్రాన్స్‌మార్స్ ఇన్‌జెక్షన్
(సి) IDSN : ఇండియన్ డీప్ స్పేస్ నెట్‌వర్క్
(డి) పైవన్నీ (అంతరిక్ష పరిశోధనకి సంబంధించినవి)
5. 1350 కిలోగ్రాముల బరువున్న మంగళయాన్ అంతరిక్ష నౌకలో ఎన్ని కి.గ్రా. ఇంధనం ఉంది?
(ఎ) 850 (బి) 440 (సి) 300 (డి) 500
6. అంగారక గ్రహయాత్ర అంతరిక్ష నౌకతో ఎక్కడెక్కడ నుండి సంభాషిస్తుంటారు?
(ఎ) కాన్‌బెర్రా, ఆస్ట్రేలియా (బి) గోల్డ్ స్టోన్ డీప్ స్పేస్ కమ్యూనికేషన్స్ ట్రాకింగ్ స్టేషన్, యుఎస్ఎ (సి) ఇండియన్ డీప్ స్పేస్ నెట్‌వర్క్, బ్యాలాలూగ్రామం, బెంగళూరు (డి) పైవన్నీ
7. అంగారక గ్రహ పరిశోధనలో ఉన్నవి ఏవి?
(ఎ) MAVEN (USA) (బి) ఆపర్చ్యునిటి
(సి) క్యూరియాసిటి (డి) పైవన్నీ
8. జస్టిస్ బ్రిజేష్ కుమార్, క్రిష్ణవాటర్ డిస్‌ప్యూట్స్ ట్రిబ్యునల్ –2 ఇచ్చిన తీర్పు ప్రకారం ఏ రాష్ట్రాలకు ఎంతెంత కృష్ణాజలాలు ఇచ్చారు?
(ఎ) కర్నాటక : 911 (బి) ఆంధ్రప్రదేశ్ : 1001 (సి) మహారాష్ట్ర:666 (డి) పైవన్నీ
9. కొత్త తీర్పు ప్రకారం ఆల్మట్టి డ్యాం ఎంత ఎత్తు వరకు ఉండవచ్చును? (మీటర్లలో)
(ఎ) 524.26 (బి) 500 (సి) 400(డి) 300
10. యుద్ధ విద్యలలో ఆరితేరిన కోన్యాక్ నాగా 'జాతి'వారు ఏ రాష్ట్రంలో నివశిస్తున్నారు?
(ఎ) పశ్చిమబెంగాల్ (బి) నాగాలాండ్
(సి) ఒడిషా (డి) తమిళనాడు
11. ఐసిసి, ఎల్‌జి పీపుల్స్ ఛాయిస్ బహుమతి, 2013 ఎవరికిచ్చారు?
(ఎ) సచిన్ టెండూల్కర్ (బి) ఎం.ఎస్.ధోని
(సి) సునీల్ గవాస్కర్ (డి) కపిల్ దేవ్
12. ఇటీవల చైనా ప్రయోగించిన చాంగ్ఎ–3 (చంద్రయాన ఉపగ్రహం), చంద్రుని మీద ఎక్కడ దిగుతుంది?
(ఎ) సైనస్ ఇరిడం (ఇంద్ర ధనస్సుఅఖాతం)
(బి) శాంతి సముద్రం
(సి) టైటాన్ (డి) యురేనస్
13. అంతరిక్ష నౌకలు / ఉపగ్రహాలకు విద్యుచ్ఛక్తినిచ్చే రేడియో ఐసోటోప్ ఏది?
(ఎ) ఫ్లుటోనియం – 238 (బి) కార్బన్ –14
(సి) డ్యుటీరియం (డి) ట్రిషియం
14. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) MDR-TB : మల్టిడ్రగ్ రెసిస్టెంట్ ట్యూబర్క్యులోసిస్ (బి) NIRT : నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రిసెర్చ్ ఇన్‌ట్యుబర్ క్యులోసిస్ (సి) NIN : నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (డి) పైవన్నీ
15. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) భగవాన్ మహావీర్ గవర్నమెంట్ మ్యూజియం : కడప (బి) బౌద్ధ ఆర్కియోలాజికల్ మ్యూజియం : గుంటూరు (సి) సాలార్‌జంగ్ మ్యూజియం : హైదరాబాద్ (డి) పైవన్నీ
16. VCES వివరాలేవి?
(ఎ) వాలెంటరీ కంప్లయన్స్ ఎంకరేజ్‌మెంట్ స్కీం (బి) సర్వీస్ టాక్స్ చెల్లింపులకు సంబంధించిన పథకం ఇది (సి) సర్వీస్ టాక్స్‌ల గురించి నెగెటివ్ లిస్ట్ ఉంది (డి) పైవన్నీ
17. ఏ రేట్లను రిగ్గింగ్ చేశారని, డచ్‌బ్యాంక్, రాయల్ బ్యాంక్ ఆఫ్ స్కాట్‌లాండ్, సిటి గ్రూప్‌లపై ఇయు కాంపిటిషన్ కమీషన్ యూరో 1.7 బిలియన్ల జరిమానా విధించింది?
(ఎ)లిబార్ (LIBOR) (బి) టోక్యో ఇంటర్ బ్యాంక్ ఆఫర్డ్ రేట్ (సి) యూరిబార్ (డి) పైవన్నీ
18. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలలో ఏ పార్టీ గెలిచి, అధికారంలోకి వచ్చింది?
(ఎ) ఢిల్లీ : బిజెపి (31 స్థానాలు)
(బి) రాజస్థాన్ : బిజెపి (162స్థానాలు)
(సి) మధ్యప్రదేశ్ : బిజెపి (165 స్థానాలు
(డి) పైవన్నీ
19. రాబెన్ దీవి ఎక్కడుంది? వివరాలేవి?
(ఎ) దక్షిణాఫ్రికాలోని కేప్ టౌన్‌కి దగ్గర్లోఉంది (బి) ఇక్కడ నెల్సన్ మండేలా 18 సంవత్సరాల జైలు జీవితం గడిపాడు. (సి) క్రిస్టో్బ్రాండ్, ఈజైలులో వార్డెన్‌గా పనిచేశాడు (డి) పైవన్నీ
20. ఫారో అఖునాటెన్, ఈజిప్ట్‌ని ఎప్పుడు పరిపాలించాడు (క్రీస్తు పూర్వం)?
(ఎ) 1500 సంవత్సరం(బి) 1000 సంవత్సరం
(సి) 500 సంవత్సరం (డి) 1800 సంవత్సరం
21. వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్, 9వ మినిస్టీరియల్ మీటింగ్ ఎక్కడ నిర్వహించారు?
(ఎ) బాలి, ఇండోనేషియా (బి) జెనీవా
(సి) దోహా (డి) టోక్యో
22. నెల్సన్ మండేలా, వంశంపేరు ఏది?
(ఎ) మడిబా (బి) ఒబామా
(సి) జూమా (డి) ముగాబే
23. మాల్దీవుల క్రొత్త అధ్యక్షుడు ఎవరు?
(ఎ) అబ్దుల్లాయామీన్ (బి) మొహమ్మద్‌నసీద్
(సి) వహీద్ (డి) వీరెవరు కాదు
24. 'మండేలా : లాంగ్ వాక్ టు ఫ్రీడం" సినిమాకు దర్శకత్వం వహించిందెవరు?
(ఎ) జస్టిన్ ఛాడ్విక్ (బి) కిర్సాన్ ఇలి ముజినోవ్
(సి) డేనియల్ వెట్టోరి (డి) మీరానాయక్
25. చక్కెర మిల్లులకు వడ్డీలేని రుణం ఎంత ప్రకటించారు? వివరాలేవి?
(ఎ) రూ. 7500 కోట్లు (బి) 5 సంవత్సరాలలో తిరిగి చెల్లించాలి (మొదటి రెండు సంవత్సరాలు మారిటోరియం) (సి) 2012 –13లో చక్కెర పరిశ్రమ ఆధారాల ప్రకారం రూ. 5,064 కోట్ల బకాయిలున్నాయి (డి) పైవన్నీ
26. అట్లాంటిక్ మహాసముద్రపు గ్జావర్ తుఫాన్ ఏ దేశాలపై ప్రభావం చూపింది?
(ఎ) బ్రిటన్ (బి) జర్మనీ
(సి) పోలాండ్ & స్వీడన్ (డి) పైవన్నీ
27. భారతదేశ విదేశీ మారకద్రవ్యనిల్వలు నవంబర్ 29, 2013 నాటికివెంత? (బిలియన్ యుఎస్ డాలర్లలో)?
(ఎ) 291.3 (బి)263.736
(సి)286.26 (డి) 275
28. FIFA 2014 వరల్డ్ కప్ ఎక్కడ నిర్వహిస్తారు?
(ఎ) స్పెయిన్ (బి) బ్రెజిల్
(సి) జర్మనీ (డి) దక్షిణాఫ్రికా
29. 1993లో నెల్సన్ మండేలా ఎవరితో కల్సి నోబుల్ శాంతి బహుమతి పంచుకున్నారు?
(ఎ) ఎఫ్.డబ్ల్యు. డిక్లర్క్ (బి) మదర్ థెరిస్సా
(సి) మహాత్మాగాంధీ (డి) బారాక్ ఒబామా
30. 'లైసేట్' అనే రక్తాన్ని, ఏ జంతువు నుండి తీసి వైద్య రంగంలో ఔషధాల నాణ్యతకోసం వాడుతున్నారు?
(ఎ) హార్స్‌షూ క్రాబ్ (పీత) (బి) చేప
(సి) తిమింగలం (డి) స్టార్‌ఫిష్
31. 396 కిలోమీటర్ల మయన్‌మార్ – మణిపూర్ సరిహద్దుని ఎవరు కాపలా కాస్తున్నారు?
(ఎ) అస్సాం రైఫిల్స్ (బి) బిఎస్ఎఫ్
(సి) సశస్త్రసీమాబల్ (డి) వీరెవరూ కాదు

32. చైనా కొత్తగా ప్రవేశపెట్టిన ఎయిర్ డిఫెన్స్ ఐడెంటిఫికేషన్ జోన్ (ఎడిఐజడ్) వివరాలేవి?
(ఎ) దీన్ని ఈస్ట్ చైనా సముద్రంపై ఏర్పాటు చేశారు (బి) 55 ఎయిర్ లైన్స్ & 19 దేశాలు ఫ్లైట్ ప్లాన్‌లను ఫైల్ చేశాయి(సి) భారతదేశ విమానాలు గూడ దీనిగుండాపోవాలి(డి) పైవన్నీ
33. తెలంగాణా ప్రాంతంలో ఎంతమంది ఎంపిలు, ఎం.ఎల్.ఎలు, ఎమ్మెల్సీలున్నారు, యూనియన్ కాబినెట్ ఆమోదించిన బిల్లు ప్రకారం?
(ఎ) ఎంపిలు : 17లోక్‌సభలో, 7 రాజ్యసభలో (బి) ఎం.ఎల్.ఎలు : 119 (సి) ఎమ్మెల్సీలు – 40 (డి) పైవన్నీ
34.సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో 49% వాటా కేంద్ర ప్రభుత్వానిది కాగా, ప్రతిపాదిత తెలంగాణా రాష్ట్రానికి ఎంత వాటా వస్తుంది?
(ఎ) 51% (బి) 40% (సి) 35% (డి) 45%
35. ఐఎన్ఎస్ విక్రమాదిత్య రష్యాలో ఎక్కడ నుండి బయలు దేరి, సూయజ్ కాలువ గుండా వస్తోంది? వివరాలేవి?
(ఎ) సేవ్‌మాష్‌షిప్ యార్డ్ (బి) 7500నాటికల్ మైళ్ళు ప్రయాణిస్తుంది (సి) దారిలో పోర్చుగల్ లోని లిస్బాన్ దగ్గర ఆగుతుంది (డి) పైవన్నీ
36. 'బిట్‌కాయిన్స్' ఏమిటి?
(ఎ) కంప్యూటర్ శాస్త్రవేత్తలు సృష్టించారు & పంచబడుతున్నాయి (బి) వీటిని ఏ బ్యాంకు జారీ చేయ్యదు (సి) 2009లో కంప్యూటర్ గురు సృష్టించాడు (డి) పైవన్నీ
37. సెన్‌కాకు దీవులు ఎక్కడున్నాయి?
(ఎ) ఈస్ట్ చైనా సముద్రం (బి) అట్లాంటిక్ మహా సముద్రం(సి) బంగాళాఖాతం (డి) అరేబియన్ సముద్రం
38. అరాక్‌ప్లాంట్ ఎక్కడుంది? వివరాలేవి?
(ఎ) ఇరాన్ (బి) భారజలాన్ని ఉత్పత్తి చేస్తుంది (సి) ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న దీన్ని ఐఎఇఎ ఇన్‌స్పెక్టర్ల చేత తనిఖీకి ఆహ్వానించింది, ఇరాన్ (డి) ఇవేవీకావు
39. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం : రూ. 40,000 కోట్లు (బి) బారోయింగ్ ప్లాన్ : రూ. 5.79 ట్రిలియన్లు (సి) ఫిస్కల్ డెఫిసిట్ : 4.8% (డి) పైవన్నీ (2013–14లో భారతదేశ ఆర్థిక సమాచారం)
40. ఎస్ఇబిఐ ఇన్‌సైడర్ ట్రేడింగ్ గురించి ఏకమిటిని నియమించింది?
(ఎ) ఎన్‌కెసోధి (రిటైర్డ్ ఛీఫ్ జస్టిస్, కర్నాటక హైకోర్టు) (బి) రఘురాం రాజన్ కమిటి (సి) రంగరాజన్ కమిటీ (డి) తాళ్వార్ కమిటి
41. డోరిస్ లెస్సింగ్ రాసిన పుస్తకాలేవి?
(ఎ) దిగోల్డెన్ నోట్ బుక్ & దిగ్రాస్ ఈజ్ సింగింగ్ (బి) గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్ (సి) దివైట్ టైగర్ (డి) వార్ & పీస్
42. మకావ్ ఓపెన్ గ్రాండ్ ప్రిక్స్ గోల్డ్ (2013) విజేత ఎవరు?
(ఎ) పి.వి. సింధు (బి) మిషెల్లీ లీ
(సి) క్విన్‌జిన్ జింగ్ (డి) సైనా నెహ్వాల్
43. సెంట్రల్ కారకోరం నేషనల్ పార్క్ ఎక్కడుంది? వివరాలేవి?
(ఎ) పాకిస్తాన్ (10,000 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణం (బి) 23 లోయల్లో 4,00,000 పశువులు బ్రతుకుతున్నాయి (సి) అడవులు, నీరు, ఔషధ మొక్కలు ఇక్కడ ప్రత్యేకత(డి) పైవన్నీ
44. హడ్సన్ నది & హార్లెంనది ఎక్కడున్నాయి?
(ఎ) న్యూయార్క్ (యుఎస్ఎ) దగ్గర
(బి) లండన్ (సి) టోక్యో (డి) బెర్లిన్
45.ఉక్రెయిన్ దేశ రాజధాని ఏది?
(ఎ) రోం (బి) కీవ్
(సి) దిహేగ్ (డి) ఆమ్‌స్టర్ డ్యాం
46. ఎంఐజి 21 మొదటి బ్యాచ్ యుద్ధ విమానాలను ఎప్పుడు ప్రవేశపెట్టారు?
(ఎ) మార్చ్ – ఏప్రిల్ 1963 (బి) 1971
(సి) 1962 (డి) 1966
47. బాలాటన్ లేక్ (సరస్సు) ఎక్కడుంది?
(ఎ) బుడాపెస్ట్, హంగేరి (బి) మాస్కో
(సి) సెయింట్ పీటర్స్ బర్గ్ (డి) టెహ్రాన్
48. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏ ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టుబడుల ఉపసంహరణ చేశారు?
(ఎ) ఐటిడిసి (బి) ఎంఎంటిసి (సి) నైవేలి లిగ్నైట్ కార్పోరేషన్ (డి) పైవన్నీ
49. ఇంటర్నేషనల్ మౌంటైన్ డే ఎప్పుడు?
(ఎ) డిసెంబర్ 11 (బి) డిసెంబర్ 3
(సి) డిసెంబర్ 22 (డి) నవంబర్ 19
50. ఇండియా – నేపాల్ సరిహద్దులో ప్రవహించే కాళీనదిలో నివశించే జంతువులేవి?
(ఎ) మొసళ్ళు (బి) తాబేళ్ళు
(సి) కాట్‌ఫిష్/ గూంచ్ (డి) పైవన్నీ
51. భారతదేశంలో నివశించే మొసళ్ళుఎన్ని రకాలు?
(ఎ) మగ్గర్ మొసళ్ళు (బి) సాల్టీ మొసళ్ళు (సి) ఘరియాల్ మొసళ్ళు (డి)ప్రధానంగా పై3రకాలు
52. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) దిషాడో ఆఫ్ ది క్రెసెంట్ మూన్ : ఫాతిమా భుట్టో (బి) బాంక్రఫ్ట్ : రవి సుబ్రమణియన్ (సి) స్క్వేర్ ది సర్కిల్ – సెవెన్ స్టెప్స్ టుది ఇండియన్ రినైశాన్స్ : ఎపిజె అబ్దుల్ కలాం & అరుణ్ తివారి (డి) పైవన్నీ (పుస్తకాలు : రచయితలు)
53. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) దివుమన్ బిఫోర్‌మి : రూత్ డగ్‌డాల్ (బి) నానో : రాబిన్ కుక్ (సి) దిసీక్రెట్ హీరో : రోండాబైర్న్ (డి) పైవన్నీ
54. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) దిబర్నింగ్ క్వశ్చన్ : మైక్ బెర్నెర్స్‌లీ & డంకన్ క్లార్క్ (బి) 'హాచింగ్ ట్విట్టర్' : నిక్ బిల్టన్ (సి) ఏజ్ ఆఫ్ ఎంటాంగిల్‌మెంట్ : క్రిస్ మంజప్ప (డి) పైవన్నీ
55. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) LOB : లిమిటేషన్ ఆఫ్ బెనిఫిట్స్ (బి) FSC: ఫైనాన్షియల్ సర్వీసెస్ కమీషన్ (సి) DTAA: డబుల్ టాక్సేషన్ ఎవాయిడెన్స్ ఎగ్రిమెంట్ (డి) పైవన్నీ
56. జనవరి 2014లో స్పెక్ట్రం వేలం వేసి కేంద్ర ప్రభుత్వం ఎంత సంపాదించాలనుకుంటుంది?
(ఎ) 48,000 కోట్లు (బి) 50,000 కోట్లు
(సి) 40,000 కోట్లు(డి) 30,000 కోట్లు
57. 40 సీట్లున్న మిజోరం అసెంబ్లీ ఎన్నికల్లో, ఏ పార్టీకెన్ని సీట్లు వచ్చాయి?
(ఎ) కాంగ్రెస్ : 32 (బి) మిజోనేషనల్ ఫ్రంట్ (ఎం.ఎన్.ఎఫ్) : 5 (సి) మిజోరాం పీపుల్స్ కాన్ఫరెన్స్ (ఎంపిసి) : 1 (డి) పైవన్నీ
58. హెచ్‌బికె (హార్టే బీస్ థోక్) ఎక్కడుంది?
(ఎ) దక్షిణాఫ్రికాలో జోహన్నాస్ బెర్గ్‌కి ఉత్తరాన 60 కిమీ దూరంలో (బి) ఆస్ట్రేలియా
(సి) న్యూజిలాండ్ (డి) జపాన్
59. రామల్లా ఏ దేశంలో ఉంది?
(ఎ) పాలస్తీనా (ప్రస్తుతం ఇది ఇజ్రాయిల్‌లో ఉంది) (బి) రష్యా (సి) మంగోలియా(డి) చైనా
60. మార్స్ ఆర్బిటర్‌కి క్రూషియల్ వెలాసిటి (వేగం) ఏది? సాధారణంగా (దీన్నే ఎస్కేప్ వెలాసిటి అంటారు)?
(ఎ) 11.4 kmps (కిలోమీటర్స్ పర్ సెకండ్) (బి) 9.8 kmps (సి) 8.2 kmps (డి) 7.4 kmps
61. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) OPCW: ఆర్గనైజేషన్ ఫర్ ది ప్రొహిబిషన్ ఆఫ్ కెమికల్ వెపన్స్ (బి) OPCW : డైరెక్టర్ జనరల్ : ఆహమత్ ఉజుంకు (సి) OPCW కి ఇటీవల నోబుల్ శాంతి బహుమతి ఇచ్చారు (డి) పైవన్నీ
62. 'విలియస్' నగరం ఏ దేశం రాజధాని?
(ఎ) లిథువానియా (బి) బెలారస్
(సి) మాల్దోవా (డి) ఉక్రెయిన్
63. అజర్ బైజాన్, ఆర్మేనియా, జార్జియా దేశాలు గతంలో ఏ దేశంలో భాగం?
(ఎ) రష్యా (బి) టర్కీ
(సి) కెనడా (డి) యుఎస్ఎ
64. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) ఎఫ్ఐసిసిఐ : నైనాలాల్ కిద్వాయ్ (బి) ఆసో చెం : రాణా కపూర్ (సి) పిహెచ్‌డి ఛాంబర్ : సుమన్ జ్యోతిఖైతాన్ (డి) పైవన్నీ (సంఘాలు : అధ్యక్షులు)
65. 2013–14 ఆర్థిక సంవత్సరపు రెండవ త్రైమాసికంలో (క్యూ2) (జులై – సెప్టెంబర్‌లో) భారతదేశ జిడిపి వృద్ధి రేటు ఎంత?
(ఎ) 4.8% (బి) 5.2% (సి) 3% (డి) 2%
66. జిఎఐఎల్ ఇండియా లిమిటెడ్ వారి ధాబోల్ బెంగుళూర్ గ్యాస్ పైప్‌లైన్ పొడవు ఎంత?
(ఎ) 1000 కి.మీ (బి) 15,000 కి.మీ.
(సి) 900 కి.మీ. (డి) 800 కి.మీ.
67. క్రిష్ణానది నీరు మీద ఆధారపడి నిర్మించిన / ప్రతిపాదించిన ప్రాజెక్ట్ లేవి?
(ఎ) నెట్టెంపాడు : మహబూబ్‌నగర్ (20 tmcft)
(బి) ఎస్ఎల్‌బిసి : నల్గొండ (30tmcft)
(సి) కల్వకుర్తి : మహబూబ్‌నగర్ (25tmcft)
(డి) పైవన్నీ

68. క్రిష్ణానది మీద తలపెట్టినఏప్రాజెక్టులు, ప్రధానం గా రాయలసీమ ఏరియాను కవర్ చేస్తాయి?
(ఎ) హంద్రీనీవా : కర్నూల్, కడప, అనంతపూర్, చిత్తూరు (40 tmcft ) (బి) గాలేరు నగరి : కడప, చిత్తూర్, నెల్లూరు (38 tmcft ) (సి ) తెలుగు గంగ : రాయలసీమ, నెల్లూరు (29 tmcft ) (డి) పైవన్నీ (బ్రాకెట్‌లో ఉన్నది tmcft వినియోగ సామర్థ్యం)

69. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) క్రిష్ణావాటర్ డిస్‌ప్యూట్ ట్రిబ్యునల్ – 1 : బచావత్ అవార్డ్ (బి) క్రిష్ణావాటర్ డిస్‌ప్యూట్ ట్రిబ్యునల్ – 2 : బ్రజేష్ కుమార్ నిర్ణయం (సి) ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌కి వస్తున్న క్రిష్ణానదీ నీరు సుమారు : 811 tmcft లు (డి) పైవన్నీ (75% డిపెండబిలిటి + 227.5 tmcft లు మిగులునీరు వాడుకునే స్వేచ్ఛతో)

70. ఇండియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ –2 క్రింద సేకరించతలపెట్టిన విదేశీ పెట్టుబడులు సుమారు రూ. 5500 కోట్లు ఏ రంగాలలో వినియోగించదలచారు?
(ఎ) ఎనర్జీ యుటిలిటీస్ (బి) రవాణా
(సి) విమాన, టెలికాం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ & పట్టణ మౌలిక సదుపాయాలు (డి) పైవన్నీ

71. భావిని (భారతీయ నాభికీయ విద్యుత్ నిగం లిమిటెడ్) ఏ రకపు విద్యుత్ కేంద్ర నిర్మాణం చేస్తోంది, కాల్పక్కాంలో?
(ఎ) ప్రోటో టైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ PFBR (బి) BWR (సి) PHWR (డి) LWR

72. భారతదేశంలో లభించే రేర్ ఎర్త్ (మూలకాలు) ఏవి?
(ఎ) ఇల్మినైట్ + ల్యూకాక్సీన్, జిర్కాన్
(బి) రూటైల్, గార్నెట్
(సి) సిల్లి మనైట్ (డి) పైవన్నీ

73. 12వ పంచవర్ష ప్రణాళికా కాలంలో డైరీ ఎంటర్ ప్రిన్యూయర్ షిప్ డెవలప్‌మెంట్ స్కీం క్రింద ఖర్చు పెట్టే రూ. 1400కోట్లలో ఏఏ అంశాలు ఉంటాయి?
(ఎ) ఎంటర్ ప్రిన్యూర్ కంట్రిబ్యూషన్ : ప్రాజెక్టు కాస్ట్‌లో 10% భరించాలి (బి) బ్యాక్ ఎండెడ్ క్యాపిటల్, సబ్సిడీ : 25% ప్రాజెక్టు కాస్ట్‌లో జనరల్ వారికి (సి) బ్యాంక్‌లోన్ – మిగిలిన పైకం కోసం (డి) పైవన్నీ (ఈస్కీం ప్రధాన ఉద్దేశ్యం స్వయం ఉపాధి) (నాబార్డు అమలు చేస్తోంది)

74. 2013–14 ఆర్థిక సంవత్సరంలో బ్యాక్‌వార్డ్ రీజియన్స్ గ్రాంట్ ఫండ్ ప్రోగ్రాం కోసం కేటాయించిన నిధులు ఎంత? (కోట్ల రూ.ల్లో)
(ఎ) రూ. 6500కోట్లు (బి) రూ. 3720కోట్లు
(సి) రూ. 2000కోట్లు (డి) రూ. 5000కోట్లు

75. బ్యాక్‌వర్డ్ రీజియన్స్ గ్రాంట్ ఫండ్ వివరాలేవి?
(ఎ) 19–2–2007 నాడు బార్ పేట, అస్సాంలో ప్రారంభించారు (బి) 27 రాష్ట్రాల లోని 272 వెనుకబడిన జిల్లాలకు నిధులు అందిస్తారు (సి) స్టేట్ కాంపొనెంట్ నిధులు ప్లానింగ్ కమీషన్ ఇస్తుంది (డి) పైవన్నీ

76. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) ది బాంగ్ సెంట్రల్ : అరుణాచల్ ప్రదేశ్
(బి) తిపాయ్ ముఖ్ సెంట్రల్ : మణిపూర్
(సి) పాకాల్ దుల్ : జె & కె
(డి) పైవన్నీ జలవిద్యుత్ కేంద్రాలు

77. మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ (ఎంఐడిహెచ్) క్రింద 12వ పంచవర్ష ప్రణాళికా కాలంలో రూ. 16,840 కోట్లు ఖర్చు పెట్టనున్నారు. దీనిలో కల్సిపోయిన పథకాలేవి?
(ఎ) నేషనల్ హార్టికల్చర్ మిషన్ (బి) HMNEH
(సి) నేషనల్ బాంబూ మిషన్ (డి) పైవన్నీ

78. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన క్రింద 2012–13 నుండి 2016–2017 మధ్య కాలంలో ఎంత ఖర్చు పెడతారు? (కోట్లరూ.ల్లో)
(ఎ) 63,246 (బి) 50,000
(సి) 40,000 (డి) 30,000

79. ట్రాయ్ లెక్కల ప్రకారం భారతదేశంలో టెలిఫోన్ చందాదారుల సంఖ్య 904.56 మిలియన్లు (31–10–2013నాటికి) ప్రతినెలా ఎంతశాతం లో టెలికాం చందా దారులు వృద్ధిరేటు ఉంది?
(ఎ) 0.52%(బి) 2%(సి) 3% (డి) 4%

80. 1-1-2014 నాటికి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ టు ఎల్‌పిజి కన్స్యూమర్స్ స్కీం ఎన్ని జిల్లాలకు విస్తరింపచేస్తారు?
(ఎ) 291 (బి)18 (సి) 184 (డి) ఇవేవి కావు

81. ఇరాన్ దేశం మరియు 6 గ్లోబల్ పవర్ దేశాలు నవంబర్ 24, 2013 రోజున ఎక్కడ ఒప్పందపు సంతకాలు చేసుకున్నాయి?
(ఎ) ఇస్తాన్‌బుల్ (బి) జెనీవా
(సి) బెర్లిన్ (డి) బస్సెల్స్

82. అంటార్కిటికాలో ఇటీవల నమోదైన అతి తక్కువ ఉష్ణోగ్రత ఎంత?
(ఎ) మైనస్ $136^0$ ఎఫ్ (మైనస్ $93.2^0$సి)
(బి) మైనస్ $89.2^0$ సి (సి) మైనస్ $60^0$సి
(డి) మైనస్ $50^0$సి

83. ఛావెలియర్ డిలారీజియన్ డి ఆనర్ ఇటీవల ఎవరికిచ్చారు?
(ఎ) అంజలి గోపాలన్ (బి) అరవింద కేజ్రీవాల్
(సి) అరవిందఅడిగన్(డి) ఇందిరా గోస్వామి

84. సిగాకోటా లీఫ్ స్పాట్ తెగులు ఏ చెట్టు ఆకులకు సోకుతుంది?
(ఎ) వరి మొక్క (బి) అరటి చెట్టు ఆకులు
(సి) గోధుమ మొక్క (డి) మామిడి చెట్టు ఆకులు

85. యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్ రూరల్ వైర్ లైన్ బ్రాండ్ బాండ్ స్కీంతో బిఎస్ఎన్ఎల్ ద్వారా ఎన్ని కనెక్షన్‌లు ఇవ్వదలచింది?
(ఎ) 8,88,832 (బి) 5,47,328
(సి) 5,00,000 (డి) 2,00,000

86. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) NOFN : నేషనల్ ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ (బి) PGCIL : పవర్ గ్రిడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సి) BWA : బ్రాడ్ బాండ్ వైర్ లెస్ యాక్సెస్ (డి) పైవన్నీ

87. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారతదేశ కరెంట్ అకౌంట్ డెఫిసిట్ (సిఎడి) ఎంత ఉండవచ్చును? (బిలియన్ యుఎస్ డాలర్లలో)
(ఎ) 56 (బి) 33 (సి) 40 (డి) 20

88. విదేశీ పెట్టుబడులు /నిధులు రావడంకోసం, భారత దేశం తీసుకున్న చర్యలేవి? ఇటీవలి కాలంలో? సరళతరం చేసిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నియమాలు.
(ఎ) బ్యాంకులకు FCNR (B) (బి) డాలర్ల ఫండ్‌లకు స్వాప్ సౌకర్యం (సి) బ్యాంకులకు, టైర్–1 క్యాపిటల్ కోసం విదేశీ అప్పుల అనుమతి 50% నుండి 100% పెంచటం (డి) పైవన్నీ

89. 16–9–2013 రోజున ప్రారంభించిన ఇన్సూరెన్స్ రెపాసిటరీ సిస్టం వలన లాభాలేవి?
(ఎ) ఇన్సూరెన్స్ పాలసీదారులు, భౌతికం పాలసీలు భద్రపరచుకోనవసరంలేదు (బి) ఇన్సూరెన్స్ పాలసీదారుడికి ఒక ఎలక్ట్రానిక్ ఇన్సూరెన్స్ అకౌంట్ ఓపెన్ చేస్తారు (సి) పాలసీల స్టేటస్ ఇఐఎ ద్వారా ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చును (డి) పైవన్నీ

90. 19–11–2013న ప్రారంభించిన భారతీయ మహిళా బ్యాంకు, 9 బ్రాంచీలు ఎక్కడ ప్రారంభించింది?
(ఎ) ముంబయ్, కోల్‌కత, చెన్నయ్
(బి) బెంగుళూరు, లక్నో, అహ్మదాబాద్
(సి) గౌహతి, న్యూఢిల్లీ, ఇండోర్ (డి) పైవన్నీ

91. నేషనల్ ఎయిడ్స్ రిసెర్చ్ సెంటర్ ఎక్కడుంది?
(ఎ) పూనే, మహారాష్ట్ర (బి) త్రివేండ్రం
(సి) భోపాల్ (డి) రాయ్‌పూర్

92. కంజెనిటల్ రూబెల్లా సిండ్రోం ఎప్పటికి నివారించాలని భారత ప్రభుత్వం అనుకుంటుంది?
(ఎ) 2020 (బి) 2025 (సి) 2030(డి) 2040

93. రాష్ట్రీయ మహిళాకోశ్ ఎన్ని రకాల లోన్ పథకాలు అమలు చేస్తోంది?
(ఎ) లోన్ ప్రామోషన్ స్కీం (బి) గోల్డ్ క్రెడిట్ స్కీం (సి) హౌసింగ్‌లోన్ స్కీం (డి) పైవన్నీ

## జవాబులు (జనవరి 2014)

| | | | |
|---|---|---|---|
| 1 – ఎ | 24 – ఎ | 47 – ఎ | 70 – డి |
| 2 – బి | 25 – డి | 48 – డి | 71 – ఎ |
| 3 – బి | 26 – డి | 49 – ఎ | 72 – డి |
| 4 – డి | 27 – ఎ | 50 – డి | 73 – డి |
| 5 – ఎ | 28 – బి | 51 – డి | 74 – ఎ |
| 6 – డి | 29 – ఎ | 52 – డి | 75 – డి |
| 7 – డి | 30 – ఎ | 53 – డి | 76 – డి |
| 8 – డి | 31 – ఎ | 54 – డి | 77 – డి |
| 9 – ఎ | 32 – డి | 55 – డి | 78 – ఎ |
| 10 – బి | 33 – డి | 56 – ఎ | 79 – ఎ |
| 11 – బి | 34 – ఎ | 57 – డి | 80 – ఎ |
| 12 – ఎ | 35 – డి | 58 – ఎ | 81 – బి |
| 13 – ఎ | 36 – డి | 59 – ఎ | 82 – ఎ |
| 14 – డి | 37 – ఎ | 60 – ఎ | 83 – ఎ |
| 15 – డి | 38 – డి | 61 – డి | 84 – బి |
| 16 – డి | 39 – డి | 62 – ఎ | 85 – ఎ |
| 17 – డి | 40 – ఎ | 63 – ఎ | 86 – డి |
| 18 – డి | 41 – ఎ | 64 – డి | 87 – ఎ |
| 19 – డి | 42 – ఎ | 65 – ఎ | 88 – డి |
| 20 – ఎ | 43 – డి | 66 – ఎ | 89 – డి |
| 21 – ఎ | 44 – ఎ | 67 – డి | 90 – డి |
| 22 – ఎ | 45 – బి | 68 – డి | 91 – ఎ |
| 23 – ఎ | 46 – ఎ | 69 – డి | 92 – ఎ |
| | | | 93 – డి |

# ఇండియన్ ఫారెస్టు సర్వీసు - విహంగ వీక్షణం


ఐ.ఎఫ్.ఎస్. అంటే ఇండియన్ ఫారెస్ట్ సర్వీసు ఇది అడవులు, వన్యప్రాణి సంరక్షణకు సంబంధించిన సర్వీసు. పెరుగుతున్న పర్యావరణ విజ్ఞానం, అవగాహన వల్ల అన్ని ప్రాజెక్టులకు క్లియరెన్సులు ఈశాఖకు చెందిన అధికారుల పర్యవేక్షణలో లభిస్తాయి. అటవీ సంరక్షణ బాధ్యతలు స్వీకరించి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ ఉన్నతోద్యోగంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించే అవకాశం ఇందులో వుంది.

బ్రిటీషు ప్రభుత్వ హయాంలో ఇండియన్ ఫారెస్టు సర్వీసు 1867లో ఐదుగురు ఆఫీసర్లతో తొలిబ్యాచ్ ప్రారంభమై నేటి దాకా వేలసంఖ్యలో అటవీ సంరక్షణాధికారులకు అధికారాన్ని సంక్రమింప చేసింది. బ్రిటీష్ కాలంలో 173 మంది ట్రైయినింగ్ అయ్యారు. తొలినాళ్లల్లో లండన్‌లో శిక్షణ పొందేవారు. 1966లో ఇండియన్ ఫారెస్టు సర్వీసుగా ఆలిండియా సర్వీసుల చట్టం 1951లో నామకరణం చేశారు. దీని శిక్షణా సంస్థ - ఇందిరాగాంధీ నేషనల్ ఫారెస్ట్ అకాడమీ పేర డెహ్రాడూన్ ప్రస్తుత ఉత్తరాఖండ్ రాజధానిలో పనిచేస్తోంది. దీని డైరెక్టరుగా ప్రస్తుతం ఆర్.కె. గోయల్ వ్యవహరిస్తున్నారు. సువిశాలమైన ప్రాంగణంలో అత్యాధునిక వసతులతో, లైబ్రరీతో ఈ శిక్షణా సంస్థ పనిచేస్తోంది.

2013 ఆగస్టు 24న 2013 బ్యాచ్ ఐఎఫ్ఎస్ అభ్యర్థులకు స్నాతకోత్సవం జరిగింది. అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్, ప్రత్యేక కార్యదర్శి అయిన కెజుడే శేఖర్ స్నాతకోపన్యాసం చేశారు. సంస్థ స్థాపించి 75 సంవత్సరాలు. ఈ సంవత్సరంప్లాటినమ్ జుబిలీ జరుపుతున్నారు. రేండేళ్ల శిక్షణ 2011 -13 లో 66 మంది (14 మంది స్త్రీలు, 2విదేశీయులతో కలిపి) పూర్తిచేసుకున్నవారికి డిప్లోమాలు అందించారు. వీరిలో నలుగురు పిహెచ్‌డిలు, 38 మంది పిజిలు, నలుగురు ఇంజనీర్లు ఉన్నాయి. 16 ఇరుగు పొరుగు దేశాల వారికి కూడా ఇందులో శిక్షణ ఇచ్చారు. 75శాతం మార్కులు సాధించినవారికి ఆనర్స్ డిప్లొమా ఇస్తారు. 1013లో 19 మంది ఆనర్స్ డిప్లోమా సాధించారు. మిగతావారికి డిప్లొమా ప్రకటిస్తారు. 2013 బ్యాచ్‌లో హిమాచల్ ప్రదేశ్ క్యాడర్‌కి చెందిన మొనాలిసేన్ ఆల్‌రౌండ్ అవుట్‌స్టాండింగ్ ఫెర్మార్మెన్స్ సాధించింది.

బెస్ట్ ఆల్‌రౌండ్ ఫారెస్టర్‌గా ఉత్తర ప్రదేశ్ క్యాడర్‌కి చెందిన ఆదర్శకుమార్ ఎంపికయ్యారు. ఆంధ్రాకు చెందిన యస్. రాంబాబుకు కులకర్ణి స్వర్ణపతకం లభించింది. 2012 - 14 సంవత్సరానికి గాను 79 మంది శిక్షణ పొందుతున్నారు. ఇందులో 22 మంది స్త్రీలు,


**డా. ఆర్. అనంత పద్మనాభరావు**
విశ్రాంత అదనపు డైరెక్టర్ జనరల్ (దూరదర్శన్)


ఇద్దరు విదేశీయులు. ప్రస్తుతం శిక్షణ పొందుతున్న వారిలో ముగ్గురే తెలుగు వారు ఉన్నారు.

1. పి. సంజీవ రెడ్డి 2. బి. రామప్రసాద్ 3. టి. రవికిరణ్

1938లో స్థాపించబడిన ఈ శిక్షణా సంస్థ 1987లో స్టాఫ్ట్ కాలేజీగా పరిణతి చెందింది. కేవలం ఫారెస్టు శాఖకు చెందిన వారికే గాక జ్యుడిషియరీ, ఐఎఎస్, ఐపిఎస్, ఐఆర్ఎస్, ఐఆర్‌టిఎస్, విభాగాల వారికి కూడా స్వల్పకాలిక కోర్సులు నిర్వహిస్తోంది.

ఈ సంస్థను బడ్డింగ్ ఫారెస్టర్ నర్సరీగా పేర్కొంటారు. ఇందులో ప్రొఫెషనల్ శిక్షణ, మధ్యకాలిక కోర్సులు మానవీయ విలువల పట్ల అవగాహన కల్పిస్తారు.

ఐ.ఎఫ్.ఎస్. సర్వీసుకు అర్హతలు

యుపిఎస్‌సి 2013లో 85 ఖాళీలు ప్రకటించారు.

2013 నుండి పరీక్షా విధానంలో సమూలమైన మార్పులు చేశారు. గతంలో లేని విధంగా ప్రిలిమ్స్ పరీక్ష ప్రవేశపెట్టారు. సివిల్స్ ప్రిలిమ్స్‌ను వీరు కూడా వ్రాయాలి. వీరికి కూడా అవే రెండు పేపర్లు ఉంటాయి. ఈ పరీక్షలో ఎంపికైన అభ్యర్థుల లిస్టు విడిగా ప్రకటిస్తారు. కామన్ ఆన్ లైన్ అప్లికేషన్‌ను నింపాలి.

(1) సివిల్స్‌లో ఉన్న ప్రిలిమ్స్ పేపర్లు 2 వ్రాయాలి.

(2) **మెయిన్స్ :** ఆరు పేపర్లు

(3) **పర్సనల్ ఇంటర్వ్యూ :** దేహదారుడ్య పరీక్ష నడక పరీక్ష

(ఎ) **విద్యార్హతలు :** క్రింది సైన్సు సబ్జెక్టులలో డిగ్రీ పాసయి ఉండాలి. ఆనిమల్ హజ్‌బెండరీ, వెటరినరీ సైన్సు, బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జియాలజీ, మాథమాటిక్స్, స్టాటిస్టిక్స్, అగ్రికల్చర్ బిఎస్సీ, ఫారెస్టు ఇంజనీరింగ్ డిగ్రీలు చదివి ఉండాలి.

(బి) ఒకొక్క అభ్యర్థి నాలుగేసి ప్రయత్నాలు చేయవచ్చు. రిజర్వేషన్ అదనపు మినహాయింపులున్నాయి.

(సి) వయోపరిమితి - ఆగస్టు 1 నాటికి 21-30 సంవత్సరాల మధ్య ఉండాలి.

(డి) **పరీక్ష ఫీజు :** సాధారణ క్యాటగిరీ అభ్యర్థులకు రూ. 100లు

**మెయిన్స్ పరీక్షా ప్రణాళిక**

**1. జనరల్ ఇంగ్లీషు :** 300 మార్కులు 3 గంటలు

2. **జనరల్ నాలెడ్జ్ :** 300 మార్కులు 3 గంటలు

3. ఆప్షనల్ 1 పేపర్ – 1 – 200 మార్కులు 3 గంటలు
4. ఆప్షనల్ 1 పేపర్ – 2 – 200 మార్కులు 3 గంటలు
5. ఆప్షనల్ 2 పేపర్ – 1 – 200 మార్కులు 3 గంటలు
6. ఆప్షనల్ 2 పేపర్ – 2 – 200 మార్కులు 3 గంటలు

మొత్తం 1400 మార్కులు

పర్సనల్ ఇంటర్వ్యూ – 300 మార్కులు

**అప్షనల్స్ :** అగ్రికల్చర్–అగ్రికల్చర్ ఇంజనీరింగ్, ఆనిమల్ హజ్‌బెండ్రీ & వెటర్నరీ, బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మాథమాటిక్స్, స్టాటిస్టిక్స్, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్.

ఈ క్రింది కాంబినేషన్లు పనికిరావు

అగ్రికల్చర్ – అగ్రికల్చర్ ఇంజనీరింగు

అగ్రికల్చర్ – ఆనిమల్ హజ్‌బెండ్రీ & వెటర్నరీ

అగ్రికల్చర్ – ఫారెస్ట్రీ

కెమిస్ట్రీ – కెమికల్ ఇంజనీరింగ్

మాథమాటిక్స్ – స్టాటిస్టిక్స్

ఇంజనీరింగు విభాగంలో ఏదైనా ఒకటి మాత్రమే ఎంపిక చేసుకోవాలి.

**ఈ సంవత్సరం 2014 పరీక్షలు వివరాలు**

**ప్రిలిమ్స్ నోటిఫికేషన్ :** 17 మే 2014

**దరఖాస్తులకు ఆఖరు తేది :** 16 జూన్ 2014

**ప్రిలిమ్స్ పరీక్ష :** 24 ఆగస్టు 14 – ఒకే రోజు (సివిల్స్‌తో కలిపి)

**మెయిన్స్ పరీక్ష :** 22 ఆగస్టు – 10 రోజులు ( 6పేపర్లు)

ఖాళీల సంఖ్య ఏటా మారుతుంటుంది.

అన్ని పేపర్లు ఇంగ్లీషులో ఉంటాయి.

ఇంగ్లీషులోనే సమాధానాలువ్రాయాలి.

ఇంటర్వ్యూ సమయంలో దేహదారుఢ్య పరీక్షను,. వైద్య పరీక్షను సెంట్రల్ స్టాండింగ్ మెడికల్ బోర్డు వారు ఈ క్రింది ఆసుపత్రులలో నిర్వహిస్తారు.

1. సప్దర్ జంగ్ ఆసుపత్రి – కొత్త ఢిల్లీ
2. రామ్‌మనోహర్ లోహియా ఆసుపత్రి కొత్త ఢిల్లీ
3. లేడీ హార్డింజ్ మెడికల్ కాలేజీ, కొత్త ఢిల్లీ

**నడక పరీక్ష :** మరి ఏ సర్వీసులకు లేని నడక పరీక్ష ఐఎఫ్ఎస్‌లో వుంది. వారి ఉద్యోగ బాధ్యతలలో ఎన్నో మైళ్ళు నడవవలసి రావచ్చు. దానికి తగిన శారీరక దారుఢ్యం అవసరం. వైద్య పరీక్షకు ఫీజు లేదు.

ఇంటర్వ్యూతోపాటు కాలి నడక పరీక్షను ఢిల్లీలోని నెహ్రూ జూలాజికల్ పార్కులో నిర్వహిస్తారు. నాలుగు గంటల సమయంలో మగవారు 25 కిలోమీటర్లు ఆడవారు 14 కిలోమీటర్లు నడిచి ఉత్తీర్ణత సంపాదించాలి.

**శిక్షణ :** సెలక్టయిన అభ్యర్థులకు ర్యాంకుల ఆధారంగా ఆయా రాష్ట్రాల క్యాడర్ కేటాయిస్తారు. రెండేళ్ళ శిక్షణ డెహ్రాడూన్‌లో ఇస్తారు. శిక్షణానంతరం ఆయా రాష్ట్రాలలోను, కేంద్రంలోను, ఇతర విభాగాలలోను పనిచేస్తారు.

**ఉద్యోగాల సంఖ్య :** మొత్తం దేశంలో ఐఎఫ్ఎస్ సర్వీసులు ప్రస్తుతం 3079 పోస్టులున్నాయి. ఇందులో డైరక్టు రిక్రూట్‌మెంట్ ద్వారా 2146, ప్రమోషన్ల ద్వారా 939 పోస్టులు మంజూరయ్యాయి. ఇందులో సీనియర్ పోస్టులు 181.

**రాష్ట్రాల వారీగా పోస్టులు వివరాలు :**

1. ఆంధ్రప్రదేశ్ – 132 సీనియర్ పోస్టులు – 80

ఇందులో ఛీఫ్ కన్సర్వేటర్ స్థాయి పోస్టులు 24 ఉన్నాయి

కన్సర్వేటర్లు – 9 ప్రాంతాలలో ఉన్నారు. అనంతపురం, కర్నూలు, గుంటూరు, రాజమండ్రి, విశాఖట్నం, ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్

35 మంది డిప్యూటీ కన్సర్వేటర్లు ఉన్నారు.

ఎల్లందులో ఫారెస్టు స్కూలు ఉంది. మూడు జువాలజికల్ పార్కులకు ముగ్గురు క్యూరేటర్లు ఉన్నారు.

1. నెహ్రూ జూలాజికల్ పార్కు, హైదరాబాద్
2. ఇందిరాగాంధీ జువలాజికల్ పార్కు, విశాఖపట్నం
3. శ్రీ వెంకటేశ్వర జువలాజికల్ పార్కు, తిరుపతి

ఆంధ్రప్రదేశ్‌లో 93 మంది డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా 39 మంది ప్రమోషన్ల ద్వారా సెలక్టు అయ్యారు.

**రాష్ట్రాల వారీ పోస్టులు**

అరుణాచల ప్రదేశ్ – 118, అస్సాం మేఘాలయ –118

బీహార్ – 193, గుజరాత్ – 104, హర్యానా –69

హిమాచల్‌ప్రదేశ్–107, జమ్ముకాశ్మీర్–100, కర్ణాటక–165

కేరళ – 89, మధ్యప్రదేశ్ – 297, మహారాష్ట్ర – 185

మణిపూర్, త్రిపుర – 87, నాగాలాండ్ –33, ఒడిస్సా–121

పంజాబ్ – 45, రాజస్థాన్ – 112, సిక్కిం – 30

తమిళనాడు – 145, ఉత్తరప్రదేశ్ – 283,

పశ్చిమబెంగాల్ – 97

అప్లికేషన్ భర్తీ చేసే టప్పుడు క్యాడర్ ప్రాధాన్యాన్ని ఖాళీలను బట్టి ఇవ్వవచ్చు.

**జీతాల వివరాలు : శిక్షణ పూర్తి అయిన ఆఫీసర్లను జూనియర్ టైం స్కేల్‌లో జిల్లాలకు పంపుతారు. వారికి వివిధ ప్రమోషన్లలో స్కేళ్లు సర్వీసు కాలాన్ని బట్టి టైం స్కేలు లభిస్తుంది. డైరెక్టర్ జనరల్, ప్రత్యేక కార్యదర్శి పదవి అత్యున్నతం. స్కేళ్ళ వివరాలు:**

డైరెక్టర్ జనరల్ (ప్రిన్సిపల్ సిసిఎఫ్) రూ. 80,000

ప్రిన్సిపల్ సిసి ఎఫ్ రూ. 75,500 – 80,000, హెచ్ఎజి+ స్కేలు

అడిషనల్ ప్రిన్సిపల్ సిసిఎఫ్ రూ. 67,000–79000 హెచ్ఎజి

చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రూ. 37,400 – 67000+ 10000పిబి4

కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రూ. 37,400 – 67000+ 8900 పిబి4

డిప్యూటీకన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సెలక్షన్) రూ. 37,400 – 67000+ 8700 పిబి3

జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ రూ. 15600 – 39100+ 7600పిబి3

సీనియర్ టైం స్కేలు రూ. 15600 – 39100+ 6600 పిబి3

జూనియర్ టైం స్కేలు రూ. 15600 – 39100 + 5400 పిబి3

ఈ విధంగా జీత భత్యాలు సూచీ కలిగిన ఈ ఫారెస్ట్ సర్వీసుకు ప్రయత్నించి విజయం సాధించడంలో కృతకృత్యులు కావాలి. ■

# సమష్టి కృషి ఆలంబనగా స్వావలంబన

శైలేంద్ర సిన్హా
చరఖా ఫీచర్స్

సుశీలా ముర్మ్ ఓ గిరిజన వనిత... ఆమె నివసించేది మారుమూల పహార్‌పూర్ గ్రామం. జార్ఖండ్ రాష్ట్రంలోని దుమ్‌కైన్ పట్టణం నుంచి 27 కిలోమీటర్ల దూరానగల కథికుండ్ సమితిలో భాగమీ కుగ్రామం. రేపటి వెలుగుల దిశగా తన గ్రామవాసుల ఆలోచన ధోరణిని దారిలోకి తెచ్చేందుకు ఆమె చేయని ప్రయత్నమంటూ లేదు. ఊరికి ఉజ్వల భవిష్యత్తు కల్పించాలన్న తన ఆశలను సహ గ్రామస్థులు పదేపదే మొగ్గదశలోనే తుంచేస్తున్నా సుశీల పట్టు వీడలేదు. ఇది మూడేళ్ల కిందటి మాట... ఒక్కసారి వెనుకటి రోజులతో పోలిస్తే ఇప్పుడామెలో కనిపించే సంతృప్తి అనంతం. ఎందుకంటే... గ్రామం మొత్తం ఆమెకు పూర్తి మద్దతిస్తోంది మరి! అయితే, ఈ పయనం నల్లేరుపై నడకలా సాగిందేమీ కాదు. ఇంటికి దీపాల్లాంటి ఇల్లాళ్లు ఊరికి మణిదీపాలుగా మారిన ఆ వైనాన్ని ఓసారి పరిశీలిద్దాం...

పహార్‌పూర్ మొత్తంలో పాఠశాల విద్య పూర్తి చేసింది సుశీల మాత్రమే. ఆ విద్యాగంధమే తనవారి సమస్యలపై ఆమెలో చైతన్యం రగిలించింది. వ్యవసాయంలో గ్రామస్థులంతా తీవ్ర కష్టనష్టాలకు గురవుతుండటం, పర్యవసానంగా బతుకు గడవక ఉపాధి వేటలో ఇతర రాష్ట్రాలకు వారు వలసబాట పట్టాల్సి రావడం ఆమెను కలచివేసింది. 'సమష్టి కృషి ఆలంబనగా స్వావలంబన' సాధ్యం కాగలదని నిరూపించి ఈ దుస్థితికి అడ్డుకట్ట వేయాలని సుశీల ఎంతో తపించింది. ఈ కృషికి తానే ఆద్యురాలు కావాలన్న ఆమె పట్టుదలకు భర్త మహదేవ్ టుడ్డు ప్రోత్సాహం కూడా తోడైంది. అటుపైన ఆమె తమకున్న కొద్దిపాటి ఊసర క్షేత్రంలో వ్యవసాయం మొదలుపెట్టి ఉజ్వల భవిష్యత్తు కోసం ఆశల విత్తులు నాటింది. గడ్డిపరకైనా మొలవదన్న ఆ భూమిని అహోరాత్రాలు శ్రమించి హరిత వనంగా తీర్చిదిద్దింది. కానీ, తన వ్యక్తిగత విజయం తమవారిలో స్ఫూర్తి నింపుతుందన్న ఆమె అశలు అడియాసలే అయ్యాయి. ఫలితం ప్రత్యక్షంగా కనిపిస్తున్నా ఆమెతో కలసి ముందడుగు వేయడానికి ఒక్కరూ సిద్ధం కాలేదు. అంతటితో వదిలేస్తే ఆమె సుశీల ఎందుకవుతుంది. అందుకే ఇక మహిళల్లో మొదట చైతన్యం తేవాలని సంకల్పించింది. రోజుల తరబడి ఇల్లిల్లూ తిరిగి ఇల్లాళ్లను ఉత్తేజితుల్ని చేసింది. వారితో ఆలోచనలు పంచుకుంటూ ప్రోత్సహించింది. ఆ



విధంగా తనవారైన ఆదివాసీ మహిళల విశ్వాసాన్ని తొలుత చూరగొంది. ఇలా అటునుంచి నరుక్కొచ్చే ప్రయత్నాలు సఫలం కావడంతో 'లహంతి' అనే లాభాపేక్ష లేని స్వచ్ఛంద సంస్థలో భాగస్వామిగా తనదైన స్వయం సహాయబృందాన్ని ఏర్పాటు చేసింది. దానికి 'బేలి లహంతి స్వయం సహాయ సంఘం'గా నామకరణం చేసింది. ఆ తర్వాత ఆమె ఇక వెనక్కు తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకుండాపోయింది.

శతాబ్దాలుగా మానవజాతి ఆధారపడిన సంప్రదాయ వ్యవసాయం స్వావలంబనకు ఎలా దోహదం చేస్తుందో, కాలపరీక్షకు ఎదురొడ్డి నిలిచిన పద్ధతులు ఎంతటి సత్ఫలితాలివ్వగలవో గడచిన మూడేళ్లలో సుశీల విజయవంతంగా ఆచరణలో చూపింది. ఆమె ప్రణాళికబద్ధ, అవిరళ కృషితోపాటు సామాజిక వ్యవసాయ ఫలాలు చేతికందడంతో ఓ ఆశ్చర్యకరమైన కల కాలక్రమంలో సాకారమైంది. సామాజికంగా వెనుకబడినవారికి ఉద్దేశించిన సంక్షేమ కార్యక్రమాల కింద బ్రిటిష్ ప్రభుత్వ ఆధ్వర్యంలోని అంతర్జాతీయ అభివృద్ధి విభాగం నిర్వహించే 'అత్యంత పేదరిక ప్రాంతాల పౌర సమాజం' (పిఏసిఎస్) పథకం అండదండలు లభించడం మరింత ఊపునిచ్చింది. పేదలకు ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించిన 'పిఏసిఎస్' కింద మహిళా బృందాలను సుశీల ఒక గొడుగు కిందకు తెచ్చి సామాజిక వ్యవసాయంపై మెలకువలు నేర్పి, శిక్షణ ఇప్పించింది. ఆమె నిరంతర ప్రయత్నాలు, కృషి ఫలితంగా మహిళా సాధికారత సిద్ధించింది. అంతేకాదు... సంయుక్త, సహకార, సమన్వయ మార్గాల్లో చేయిచేయీ కలపడం వల్ల పేదరికపు చట్రం బదాబదలైంది. 'సంతాల్ ఆదివాసీ తెగకు జీవితమే ఓ సంఘర్షణ. అయితే, మా తెగ ఆచార–వ్యవహారాలు

మహిళా కేంద్రకంగా ఉంటాయి. కాబట్టే ఆదివాసీ మహిళలు ఆయా తెగలకు వెన్నెముక వంటివారు. అందుకే నేను అటునుంచి నరుక్కొచ్చాను. రాళ్లురప్పలు నిండిన, ఎందుకూ కొరగాని భూమిలో సమష్టి శ్రమద్వారా మహిళలు సాధించిన ఫలితాలు ఇప్పుడు అందరికీ ప్రత్యక్షంగా కనిపిస్తున్నాయి' అని తన అనుభవాలను పంచుకుంటూ సుశీలా ముర్మ ఎంతో గర్వంగా చెప్పింది.

పనుల్లేని కాలంలో ఈ గ్రామం నుంచి సామూహిక వలసలు నేడు చాలావరకు తగ్గిపోయాయి. గ్రామస్థులందరూ సమష్టి సౌభాగ్యం ఫలాన్ని అనుభవిస్తున్నారు. ఏటికేడు అది వారి శ్రమకు తగిన నిష్పత్తిలో వృద్ధి చెందుతుండటం విశేషం. మునుపెన్నడూ కానరాని ఆహార, ఆర్థిక భద్రత ఇప్పుడా గ్రామం సొంతం. వ్యవసాయంలో స్వావలంబన సాధనవల్ల ఉపాధికి లోటు లేకపోవడంతో పొట్టచేతబట్టుకుని ఊరొదిలి పోవాల్సిన దుస్థితి తప్పిందని చెబుతున్నారు. బీళ్లుగా వదిలేసిన భూములు పచ్చని పంటపొలాలుగా మారి తమ బతుకులు పండిస్తున్నాయని సంతోషంతో ఉప్పొంగిపోతున్నారు. తమ బతుకుల్లో వెలుగురేకలు ఇప్పుడిప్పుడే విచ్చుకుంటున్నాయని, వలసల ఫలితంగా చదువుకు దూరమయ్యే తమ పిల్లలు నాగా లేకుండా బడికెళుతున్నారని ఆనందం వెలిబుచ్చుతున్నారు. దీనివల్ల వారి భవిష్యత్తు మరింత ప్రకాశవంతంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సుశీల స్వయం సహాయక బృందం కృషి ఇక్కడితో ఆగిపోలేదు. గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నమోదు దిశగా గ్రామస్థులందరిలోనూ చైతన్యం తెచ్చింది. ప్రతి ఒక్కరూ తమంతట తాము 'పని కార్డులు' తెచ్చుకోగలిగేలా శ్రద్ధ వహించింది. దీంతోపాటు తమను పీడించే ఇతరత్రా సమస్యలపైనా సుశీల బృందం దృష్టి సారించింది. ముఖ్యంగా ఉపాధి హామీ పథకంలో పని కార్డులు, పాస్ పుస్తకాల జారీలో అక్రమాలకు పాల్పడే దళారుల ఆటకట్టించేలా ఉద్యమాన్ని ప్రారంభించింది. మొత్తంమీద కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం కింద గ్రామస్థులందరికీ అవి అందేవిధంగా శ్రద్ధ చూపింది. మరోవైపు పేదలకు అప్పులిచ్చి, వారి భూములే కాకుండా రక్తమాంసాలు పీల్చేసే వడ్డీ వ్యాపారుల బారినుంచి అమాయక గ్రామీణులను రక్షించేందుకు నడుం బిగించింది. 'ప్రహార్‌పూర్‌లోనే కాకుండా కొడర్చెల, లఖన్‌పూర్, కడ్మా, పాకర్డీ, మంజ్‌దీహా గ్రామాల్లోనూ తమ భూములు తమకు అప్పగించాలని వడ్డీ వ్యాపారులను డిమాండ్ చేసేలా గ్రామస్థులను చైతన్యపరిచాం. దీంతోపాటు సాగు రుణం పేరిట సొమ్మిచ్చి అసలు, వడ్డీకింద పంట మొత్తాన్నీ నొక్కేసి పేద రైతు రెక్కల కష్టాన్ని దోచుకునే దుర్మార్గులకు బుద్ధిచెప్పాం. వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారం నుంచి అలాంటి దుష్ట శక్తులను తరిమేశాం' అని సుశీల విజయగర్వంతో చెప్పింది.

ఇలాంటి ఎన్నో వరుస విజయాల తర్వాతే గ్రామంలోని పురుషుల విశ్వాసాన్ని కూడా సుశీల చూరగొనగలిగింది. స్వావలంబన దిశగా ఆమె ప్రయత్నాలను చూసి వాళ్లలో చాలామంది కళ్లెగరేశారు. ఆమె నాయకత్వంలోని మహిళా బృందంపై రకరకాల వ్యంగ్య వ్యాఖ్యలు చేసేవారు. ఇలా ఎన్ని అవరోధాలు ఎదురైతేనేం... చివరకు ఆదివాసీ సమాజాన్ని ఏకతాటిపైకి తేవడంలో ఆమె విజయం సాధించింది. తమ జాతిని పీడిస్తున్న అనేక సమస్యలలో అధికశాతాన్ని పరిష్కరించింది. తద్వారా సామాజికంగా అందరూ ముందంజ వేసేలా చేయడంలో కృతకృత్యురాలైంది. ఈ క్రమాన్ని ఇలా వివరించింది... 'తొలి మహిళా స్వయం సహాయ బృందాన్ని ఏర్పాటు చేయగానే మేం ఓ బ్యాంకునుంచి 25వేల రూపాయల రుణం తీసుకున్నాం. ఆ సొమ్ముతో బంగాళాదుంప సాగు చేపట్టి, 20 క్వింటాళ్ల అద్భుతమైన దిగుబడి సాధించాం. మా అవసరాలకు పోగా మిగులును విక్రయించి, రుణాన్ని పూర్తిగా తీర్చేశాం. ఈ రోజున మేం వ్యవసాయంలోనూ స్వావలంబన సాధించాం. దాదాపు ప్రతి పంటనూ పండించగలుగుతున్నాం. అలాగే గ్రామంలోని ప్రతి మహిళ వ్యవసాయంతోపాటు అనుబంధ కార్యకలాపాలద్వారా నెలకు 1500 రూపాయలదాకా ఆర్జిస్తున్నారు. కొన్ని కుటుంబాలు సొంతంగా చిన్నచిన్న వ్యాపారాలు కూడా ప్రారంభించాయి' అని ఆమె తమ బృందం విజయగాథలను వినిపించింది.

మొత్తంమీద సాధికారత మంత్రాన్ని అందరి మదిలో జొప్పించడమే కాకుండా కష్టించి పనిచేసే మహిళల బాధ్యతలు ఎంత మంచి ఫలితాలు ఇస్తాయో ఈ బృందం ఆచరణలో చూపింది. ఇక సుశీల తోడ్పాటుతో ఉత్తేజితులైన మహిళా బృందాలు సాధికారత సాధనతో సరిపెట్టుకోలేదు. ఆదివాసీ సమాజంలో పాతుకుపోయిన దురాచారాలను, వ్యసనాలను పారదోలేందుకూ కృషిచేశాయి. ముఖ్యంగా వారి అవిశ్రాంత పోరాటంవల్ల ఆ ప్రాంతంలో మద్యం క్రయవిక్రయాలు దాదాపు ఆగిపోయాయి. అక్రమంగా మద్యం తయారుచేసేవారి సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది. గ్రామంలో వ్యవస్థీకృతంగా, సాధికారికంగా నడచుకునే మహిళల నిర్ణయాలను పురుష పుంగవులు తోసిపుచ్చే సాహసం చేయకపోవడం ఓ శుభ పరిణామం. ఈ విజయాల ఉత్సాహంతో ఆ మహిళలు పంచాయతీ భవనం దిశగానూ అడుగులేశారు. ప్రతి గురువారం అక్కడ సమావేశమై, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమాచారాన్ని సాకల్యంగా తెలుసుకుంటున్నారు. అలాగే సామాజికాభివృద్ధి సంబంధిత అంశాలపైనా చర్చిస్తున్నారు. 'మా బృందంలోని మహిళలకు అటవీ హక్కుల చట్టం గురించి కూడా ఇప్పుడు బాగా తెలుసు. ఉదాహరణకు... వారు పంచాయతీ ఎన్నికలలో ఓటు వేయడమే కాదు. అభ్యర్థులుగా పోటీపడి గెలిచే స్థాయికి చేరారు. మా బృందం కృషిని గుర్తించిన జిల్లా అధికార యంత్రాంగం ప్రజా పంపిణీ వ్యవస్థను మా చేతుల్లో పెట్టింది. దీనివల్ల ఇప్పటిదాకా ఈ పథకం సవ్యంగా అమలుకావడంలేదన్న ఆరోపణలు సమసిపోయి, పూర్తిపారదర్శకతకు మారుపేరుగా మారింది' అని సుశీల ఆనందంగా చెప్పింది.

ఓ మారుమూల రాష్ట్రంలో... అందులోనూ ఒక కుగ్రామంలో... పెద్దగా చదువుసంధ్యలు లేని మహిళలు... ఇంతటి చైతన్య స్ఫూర్తిని ప్రదర్శిస్తున్నప్పటికీ సమస్యలు పూర్తిగా తొలగిపోకపోవడం ఒక లోపమే. కడ్మా పంచాయతీ వార్డు సభ్యురాలు సుహాసిని సొరెన్ ఆవేదనే ఇందుకు తార్కాణం. 'మాలాంటి చిన్న రైతులకు బ్యాంకులు సహకరించకపోవడం ఓ చేదు నిజం. మేమంతా ఇప్పటికీ గుర్తింపులేని రైతులుగానే కొనసాగుతున్నాం. రుణాలు పొందడానికి విధించే సవాలక్ష నిబంధనలను కాస్తంత సరళం చేస్తే అనేక స్వయం ఉపాధి పథకాలను గ్రామస్థులు సమర్థంగా ఉపయోగించుకోగలరు. అది జరిగిన నాడు ప్రభుత్వ ప్రకటనలలో కనిపించే స్థాయిలో లబ్ధి పొందడమే కాకుండా దేశ ఆర్థిక వృద్ధిలోనూ మేం పాలుపంచుకోగలం' అని ఆమె స్పష్టం చేసింది.

**అనువాదం: ఇమ్మానేని కృష్ణమోహన్**

# హిమాలయ ఆవరణ వ్యవస్థ -ఆర్థిక స్థిరత్వం

ప్రొ. బి.కె. కొన్వర్
వైస్ ఛాన్సలర్, నాగాలాండ్ యూనివర్సిటీ

హిమాలయ ఆవరణ వ్యవస్థ 51 మిలియన్ల(5 కోట్ల 10 లక్షల) జనాభా కలిగి ఉంది. అడవులతో తులతూగుతూ ఉండే ఈ ప్రాంతం దేశ ఉత్తర, ఈశాన్య ప్రాంతాల పర్యావరణ భద్రతకు అత్యంత కీలకమైనది. ఈ ప్రాంతం జీవనదులకు జన్మస్థలం. ఈ జీవనదులు తాగునీరు, నీటిపారుదల, జల విద్యుత్ కు మూలాధారాలు. ఈ ఆవరణ వ్యవస్థ జీవవైవిధ్యాన్ని సంరక్షిస్తోంది. అత్యంత విలువైన వ్యవసాయ సంపదను అందిస్తోంది. పర్యాటక రంగానికి అనువైన అద్భుతమైన భూస్వరూపాలను కలిగి ఉంది. ఈ ఆవరణ వ్యవస్థ సున్నితమైంది. వైవిధ్యంతో కూడిన ఆవరణ వ్యవస్థ. హిమాలయ ఆవరణ వ్యవస్థలోని పర్వత ప్రాంతాల ప్రజలు పర్వత వ్యవసాయం చేస్తారు. ఈ ప్రాంతం వివిధ పర్యావరణ భౌగోళిక సంబంధిత నష్టాలు సంభవించే అవకాశాలు కలిగి ఉంది. హిమాలయాలు భారీగా మంచు, హిమం కలిగి ఉన్నాయి. సింధు, గంగ, లూట్(బ్రహ్మపుత్ర) వంటి జీవనదులకు అవసరమైన నీటికి హిమాలయాల  హిమానీనదాలే ఆధారం. హిమానీనదాలిరి కరిగిపోవడం దీర్ఘకాలిక గడ్డు కాల ప్రవాహాలపై ప్రభావం చూపించవచ్చు. దీనివల్ల నీటి లభ్యత, జల విద్యుత్ ఉత్పత్తి రూపంలో ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడనుంది. గ్రీన్ హౌస్(హరిత గృహ) ప్రభావం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కారణంగా హిమాలయ హిమానీనదాలు పతనం చెందడం దేశానికి ముఖ్యంగా ఈ ప్రాంతానికి ప్రమాదకరంగా పరిణమించింది.

**ఆగ్నేయ హిమాలయ ప్రాంతం**

భారతదేశ ఈశాన్య ప్రాంతం వైపరీత్యాల భూభాగం. అత్యంత ఆకర్షణీయమైన ప్రాంతాల్లో ఒకటని నిస్సందేహంగా చెప్పవచ్చు. 2,55,997 ళీ.కిలో మీటర్ల  వైశాల్యం కలిగి ఉంది. అరుణాచల్ ప్రదేశ్ లో నిటారైన, మిట్టపల్లాలతో కూడిన, దుర్భేధ్యమైన శిఖరాలు సగటు సముద్ర ఉపరితలానికి 6000 మీటర్ల కంటే ఎత్తులో ఉన్నాయి. సమశీతోష్ణం నుంచి శీతల వాతావరణం కలిగి ఉంటుంది. 90,000 చ.కి.మీ  విస్తరించిన బ్రహ్మపుత్ర(లూట్) నది యొక్క విస్తృత ప్రవాహ మైదానం ఉప ఆయనరేఖా ఉష్ణోగ్రత కలిగి ఉంటుంది. ఈ ప్రాంతం వ్యవసాయ పంటలతో భారీ జనాభాకు నిలయంగా ఉంది. దక్షిణంలో బంగ్లాదేశ్ మైదానాలు, ఉత్తరంలో బ్రహ్మపుత్ర లోయలకు మధ్య ఉన్న మేఘాలయ ఉన్నత భూమి దక్షిణ ప్రాంతం (సగటు సముద్ర మట్టం నుంచి 600-1800 మీటర్లు) వెడల్పాటి లోయలతో అత్యంత లోతైన ఇరుకైన మార్గాలతో కూడి ఉంటాయి. ప్రపంచంలో అత్యధిక వర్షపాతం నమోదయ్యే మాసిన్ రాం ఈ ప్రాంతంలోనే ఉంది. ఈ ప్రాంత భూ అంతర్భాగంలో ఆర్కియన్ నుంచి క్వార్టర్నరీ యుగాలకు చెందిన విభిన్న శిలలు ఉన్నాయి.



**ప్రాంత ప్రవేశయోగ్యత**

లోయ ప్రదేశాలకు మినహా ఈ ప్రాంతంలోని అత్యధిక భాగానికి ప్రసారవ్యవస్థ లేదు. విమానాశ్రయాలు, రైల్వే లైన్లు, అత్యధిక భాగం వాహన రహదారులు బ్రహ్మపుత్ర, బారాక్ లోయల్లోనే కేంద్రీకృతమై ఉన్నాయి. పర్వత సానువుల్లో రైల్వే లైన్లు లేనేలేవు. పర్వత ప్రాంతాలను లోయ మైదానాలతో కలుపుతూ అతి స్వల్పంగా వాహనాల రహదారులు ఉన్నాయి. మౌలిక సదుపాయాల లేమి, కొరత  ఈ ప్రాంతంలోని ఖనిజ సంపదకు, పారిశ్రామికాభివృద్ధికి ప్రధాన అవరోధంగా మారాయి.

**హిమాలయ ప్రాంతంలో ఖనిజ నిక్షేపాలు గల ప్రదేశాలు:**

ఈశాన్య భారతదేశం అలోహ ఖనిజ వనరులను సమృద్ధిగా కలిగి ఉంది.  ముఖ్యంగా ఉన్నత స్థాయి సున్నపు రాయి, అధిక సల్ఫర్, తక్కువ బూడిద కలిగిన బొగ్గు పుష్కలంగా ఉన్నాయి. ఇక్కడ డోలమైట్, బంకమన్ను, దిగువ తరగతి గాజు ఇసుక,  తక్కువ స్థాయి గ్రాఫైట్ నిక్షేపాలు గమనించదగ్గ స్థాయిలో ఉన్నాయి. కంకర, ఇసుక, ఒండ్రుమట్టి, మృదు శిలాశకలాలు తదితర నిర్మాణ సంబంధ ముడి సరకులు విస్తృతంగా లభిస్తున్నాయి.  దుర్భేధ్యత, మెట్టపల్లాలతో కూడిన

భూభాగం, తీవ్ర వాతావరణ పరిస్థితులు, దట్టమైన వృక్షజాలం తదితర భూసంబంధ పరిస్థితులు సంప్రదాయ లోహ నిక్షేపాల అన్వేషణ పద్ధతులకు సవాలుగా మారుతున్నాయి.

**పెట్రోలియం:**

భారతదేశంలో ముడి పెట్రోలియం ఉత్పత్తిలో సుసంపన్నమైన రాష్ట్రాలలో అసోం రాష్ట్రం ఒకటి. వాస్తవానికి ఎగువ అసోంలోని దిగ్బాయ్ లో ముడి పెట్రోలియంను తొలిసారిగా కనుగొన్నారు. అక్కడ 1892 నుంచే ఆసియాలోని మొదటి చమురు శుద్ధి కర్మాగారం పనిచేస్తోంది. అరేబియా మహాసముద్రంలోని గుజరాత్ బేసిన్, బాంబే హై కనుగొనే వరకు భారతదేశంలోని మొత్తం చమురు ఉత్పత్తిలో 54 శాతం వరకు అసోం రాష్ట్రమే ఉత్పత్తి చేసేది. గత 10 –15 ఏళ్లలో చమురు అన్వేషణ అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర, నాగాలాండ్ లకు విస్తరించింది.

**ప్రాంత ఆర్థిక వ్యవస్థ:**

అటవీ ఉత్పత్తులు, నదులు, అటవీ పర్యావరణ పర్యాటకరంగం, సిమెంట్ పరిశ్రమ, పెట్రోలియం, బొగ్గు తవ్వకం, ధాన్యం, కూరగాయలు, తేయాకు పంట తదితరాలు అసోం రాష్ట్రంలో ప్రధాన ఆర్థిక వ్యాపారాలు. అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, సిక్కిం వంటి పర్వత భూయిష్ఠ ఈశాన్య ప్రాంత రాష్ట్రాల విషయంలో అటవీ ఉత్పత్తులు, బొగ్గు తవ్వకం (మేఘాలయ మినహా మిగతా రాష్ట్రాలలో వ్యవస్థీకృత రంగం లేదు), చెట్లు నరికి, మొదళ్లను కాల్చివేసి చేసే పోడు వ్యవసాయం, పండ్ల తోటలు, నిర్మాణ సామగ్రి(రాతి ముక్కలు), పర్యాటకరంగం రాష్ట్రాల ఆర్థికరంగానికి కొంత వరకు దోహదం చేస్తున్నాయి.

**నాగాలాండ్:**

అరకన్–యోమా పర్వత శ్రేణి ఉత్తరాగ్రాన నాగాలాండ్ కేంద్రీకృతమై ఉంది. పర్వత పాదాల వెంబడి ఉండే అసోం మైదానాలను మినహాయిస్తే నాగాలాండ్ రాష్ట్రమంతా దాదాపుగా పర్వతప్రాంతమే. వ్యూహాత్మక స్థానంలో ఉండటం వల్ల తూర్పు ఆసియా ప్రాంతంలో నాగాలాండ్ అంతర్జాతీయ వాణిజ్య, వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చేయడానికి విస్తృత అవకాశాలను కలిగి ఉంది.

**పట్టిక1. ఈశాన్య ప్రాంతం, నాగాలాండ్ లకు సంబంధించిన మౌలిక గణాంకాలు**

| కొలతలు | ఈశాన్య ప్రాంతం | నాగాలాండ్ |
|---|---|---|
| రహదారి పొడవు | 1,16,551 చ.కి.మీ. | 8,805 చ.కి.మీ. |
| జనాభా | 3,65,47,314 | 19,79,000 |
| అడవుల విస్తీర్ణం | 1,66,270 చ.కి.మీ. | 14,360 చ.కి.మీ. |
| వైశాల్యం | 2,55,997 చ.కి.మీ. | 16,527 చ.కి.మీ |
| మొత్తం కఠిన శిలల ప్రాంతం | 1,87,621 చ.కి.మీ. | 15,700 చ.కి.మీ. |
| జన సాంద్రత | 124 జనాభా/చ.కి.మీ. | 75 జనాభా/చ.కి.మీ. |
| Quaternary area | 67,376 చ.కి.మీ. | 827 చ.కి.మీ. |
| గ్రామాలు | 39,720 | 963 |
| అక్షరాస్యత | 47% | 70% |

**ప్రధాన ఖనిజాలు**

బొగ్గు, డోలమైట్, సున్నపురాయి, మ్యాగ్నటైట్, సహజవాయువు, చమురు, సిలిమనైట్, యురేనియం. బొగ్గు, లైమ్ స్టోన్, మ్యాగ్నెట్

**ఉప ఖనిజాలు**

అపటైట్,ఆస్బెస్టాస్,నిర్మాణశిలలు,ఒండ్రుమట్టి,క్రోమైట్,కోబాల్ట్, రాగి,బంకమన్ను, ఫుల్లర్స్ ఎర్త్, గాజు ఇసుక, బంగారం,గ్రాఫైట్, ఇనుప ఖనిజం, కావ్ లిన్, లెడ్–జింక్,లిగ్నైట్,మార్బుల్,నికెల్, ఫాస్ఫేట్, ప్లాటినాయిడ్స్, రేర్ ఎర్త్స్, సిలిమనైట్, టాల్క్, టిన్,టంగ్స్టన్ బేస్ మెటల్ సల్ఫైడ్స్, క్రోమైట్, కోబాల్ట్, నికెల్, ప్లాటినాయిడ్స్.

**నాగాలాండ్ లో వ్యవసాయం**

భారతదేశంలో గిరిజనులు అత్యధికంగా నివసించే పర్వత, అరణ్య భూభాగాలు కలిగిన నాగాలాండ్ తో సహా ఈశాన్య రాష్ట్రాల్లో పోడు వ్యవసాయం చేస్తున్నారు. నాగా గిరిజన జనజీవితంలో ఝుమ్ వ్యవసాయానికి అనువైన విశాల అరణ్య భూభాగాలను గ్రామ పెద్దలు ఎంపిక చేస్తారు. ఆ భూములను గ్రామంలోని కుటుంబాలకు పంపిణీ చేస్తారు. రుతుపవనాలు రావటానికి ముందే దట్టమైన అడవులను నరికేస్తారు. సాధారణంగా కొంత సమయం పాటు ఆ ప్రాంతాన్ని తేమలేకుండా చేస్తారు. భారీ చెట్ల మొదళ్లను నరికేస్తారు. తరువాత వాటిని వేళ్లతో సహా పెకిలించేస్తారు. మిగిలిన పొదలను, మొక్కలను, చెట్ల మొదళ్లను నిప్పంటించి మంటపెడతారు. రుతుపవనాలు మొదలవ్వటానికి ముందే విత్తనాలు నాటడానికి అనుకూలంగా భూమిని చదునుగా సిద్ధం చేస్తారు. రుతుపవనాలు ప్రవేశించగానే నేలలో వరి, ఇతర విత్తనాలను చల్లుతారు. ఈ కార్యకలాపాలన్నీ సామూహికంగా జరుగుతాయి. ఎరువులను కానీ పురుగు మందులను కానీ వినియోగించరు. నీరు కూడా సరఫరా చేయరు. అయితే కలుపును మాత్రం తొలగిస్తారు.

పంట పొలం అంచుల వెంబడి బీన్స్, టొమాటో, ఉల్లి, అల్లం, పైనాపిల్,మిర్చి, బేరీ పండు, ప్యాసన్ పళ్లు, అరటి, సొరకాయలు, దోసకాయలు సైతం సాగుచేస్తారు. ధాన్యంతో పాటు మొక్కజొన్న, చిరుధాన్యాలు కూడా సాగు చేస్తున్నారు. ధాన్యం కోతలు ఒక సామాజిక కార్యక్రమం కూడా.

87,339 హెక్టార్ల వైశాల్యంలో ఝుమ్ సాగు కొనసాగుతోంది. 62,091 హెక్టార్లలో అంచెల(అంతర) సాగు కొనసాగుతోంది. అడవుల్ని తొలగించి, నిప్పంటించి, విత్తులు నాటి బూడిదను ఎరువుగా ఉపయోగిస్తారు. పంట భూమి విస్తీర్ణంపై ఆధారపడి పూర్తి ఆవృతానికి 4 నుంచి 5 ఏళ్లు పడుతుంది. ఈ సమయం ఎంత ఎక్కువ అయితే భూమి అంత సారవంతంగానూ, మంచి పంటలు పండుతున్నాయని చెప్పవచ్చు.

**రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ**

నాగాలాండ్ ప్రాథమికంగా వ్యవసాయాధార ఆర్థిక వ్యవస్థను కలిగి ఉంది. ఈ వ్యవస్థలో భూస్వాములు లేరు. భూమిలేని రైతులు అనబడే తరగతి కూడా ఈ వ్యవస్థలో కనిపించదు. సభ్యులందరికీ అవసరమైన ఆహారం, బట్టలు, నివాసం మొదలైన కనీస సౌకర్యాలకు హామీనిచ్చే విధంగా గ్రామ సమాజం వ్యవస్థీకృతమై ఉంది. జనాభా మొత్తం ఉత్పత్తి

కార్యకలాపాల్లో పాల్పంచుకుంటుంది. ఇక్కడ మిగులు కార్మికులు ఉండరు. గ్రామానికి చెందిన స్త్రీ, పురుష సమూహంతో కూడిన వర్గ ఉపాధి వ్యవస్థ ఉంది. ఈ సమూహంలోని ప్రతీ ఒక్క సభ్యుడు క్రమ పద్ధతిలో ఉపాధిని పొందుతాడు.

నాగాలాండ్‌లో మొత్తం రహదారుల పొడవు 9,315 కిమీ దిమాపూర్ రైలు, విమాన సర్వీసుల్ని కలిగి ఉంది. రాష్ట్ర అటవీ ప్రాంతం మూడు తరగతులుగా విభజించబడి ఉంది. అవి : ప్రత్యేకించబడినవి. సంరక్షించబడినవి. ప్రైవేటు అడవులు, మొత్తం భూభాగంలో అటవీ ప్రాంతం 33 శాతంగా వుంది. విస్తృత నిశిత ఖనిజ సర్వే, విచారణలు రాష్ట్ర ఖనిజ సామర్థ్యంపై ప్రోత్సాహకర దృశ్యాలను అందిస్తున్నాయి. ఉన్నత ప్రమాణాల సున్నపురాయి, బొగ్గు, రాగి, క్రోమియం, పలక, చమురు, సహజవాయువు మొదలైన ముఖ్యమైన ఖనిజాలు.

**వ్యవసాయ వాణిజ్యం మరియు ఆర్థిక వ్యవస్థ**

నాగాలాండ్ ఆర్థిక వ్యవస్థ అటవీ పరిశ్రమ, కుటీర పరిశ్రమ, పర్యాటక రంగాలపై కూడా ఆధారపడి ఉంది. 2009లో నాగాలాండ్ స్థూల దేశీయోత్పత్తి 9,288 కోట్లు ఉంది. రాష్ట్రంలో భూమిలేని రైతు లేకపోవడం గుర్తించదగిన అంశం. నాగాలాండ్ లో జొన్నలు, పప్పుధాన్యాలు, నూనె గింజలు, చెరకు, చామగడ్డలు, పొగాకు, చిరుధాన్యాలు, ధాన్యం వంటి వివిధ పంటలు పండిస్తారు. అంతర్గత ఉత్పత్తి సరిపోకపోవడంతో రాష్ట్రం ఇతర రాష్ట్రాల నుంచి ఆహార ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటోంది. పాత కాలం నాటి పనికిరాని ఝుమ్ (పోడు) వ్యవసాయ విధానాలను అత్యధికశాతం మంది ప్రజలు కొనసాగించడం వల్ల నేల సారం కోల్పోవడం, చెట్లు నరకడం వల్ల ఉపరితలం కోతకు గురికావడం, మృత్తికా క్రమక్షయం తలెత్తడం వలన ఈ పరిస్థితి దారితీస్తుంది. ఇది రాష్ట్ర ఆర్థిక వృద్ధికి ప్రతిబంధకంగా మారింది. రాష్ట్రం అత్యధికశాతం అడవుల( 33 శాతం అటవీ విస్తీర్ణం)ను కలిగి ఉండటం వల్ల ఆర్థికవ్యవస్థ అడవులపై కూడా ఆధారపడి ఉంది. అడవుల నుంచి లభించే వివిధ ఉత్పత్తులను ప్రాంతీయ, జాతీయ మార్కెట్లకు విక్రయించడం ద్వారా రాష్ట్రానికి ఆదాయం లభిస్తోంది. కుటీర పరిశ్రమల ద్వారా కూడా నాగాలాండ్ ఆర్థిక వ్యవస్థ ఆదాయాన్ని ఆర్జిస్తుంది. కుటీర పరిశ్రమ మృణ్మయ పాత్రలు, చేనేత సామగ్రి, కొయ్య వస్తువులను తయారుచేస్తోంది. కుటీర పరిశ్రమ చేత రూపుదిద్దుకున్న చేనేత ఉత్పత్తులు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో విక్రయించబడుతున్నాయి.

**ఉద్యానవన పంటల విస్తృతి**

ఉద్యానవన పంటలు మొత్తం 36,177 హెక్టార్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉన్నాయి. ఇది స్థూల పంటల విస్తీర్ణం(3.63 లక్షల హెక్టార్లు)లో 9.95 శాతం. నాగాలాండ్ రాష్ట్రం 1.57 లక్షల మిలియన్ టన్నుల పండ్లను, 1.40 లక్షల మిలియన్ టన్నుల కూరగాయలు, 0.08 లక్షల మిలియన్ టన్నుల తోట మొక్కలను ఉత్పత్తి చేస్తోంది. నాగాలాండ్ లో 58,370 హెక్టార్ల బంజరభూమి ఉంది. 1,57,210 హెక్టార్ల శాశ్వత బీడు భూములున్నాయి. వాటిలో 29,000 హెక్టార్లను ఉద్యానవన పంటల కింద అభివృద్ధి చేయబడ్డాయి. దీంతో పాటు ఉపరితల జల వనరులను ఉపయోగించుకోవడం ద్వారా నీటిపారుదల కిందకు తీసుకువచ్చిన 10 శాతం అదనపు విస్తీర్ణాన్ని ఉద్యానవన పంటలు, కూరగాయల అనాసపనాస, అరటి, ఉసిరి, జామ తదితర ఉప ఆయన రేఖ పండ్లను, రేగు, బేరీ, ప్యాసన్ వంటి ఉష్ణ మండల పండ్లను ఈ సాగులోకి తీసుకొచ్చేందుకు అవకాశముంది. బంగాళాదుంపలు, కర్రపెండలం, చామగడ్డలు, క్యాబేజీ, క్యాలీ ఫ్లవర్, బఠాణీ, దోసకాయ మొదలైనవి పెంచే కాయగూరల పంటల్లో ముఖ్యమైనవి. అల్లం, మిర్చి, యాలికలు, వెల్లుల్లి, నల్లమిరియాలు మొదలైనవి ప్రధాన సుగంధ ద్రవ్యాల పంటలు. పోక చెక్క, కొబ్బరి, టీ, రబ్బరు మొదలైన తోట పంటల్లో వాణిజ్యావకాశాలు విస్తృతంగా ఉన్నాయి. పండ్ల తోటల్లో అనాసపనాస, మాండరిన్ నారింజ, ప్యాసన్ పండ్లను వాణిజ్యపరంగా ఉత్పత్తి చేస్తున్నారు. వాతావరణ అనుకూలత, స్థలాకృతి, మార్కెట్ సామర్థ్యం ఆధారంగా ఉద్యానవన శాఖ నాగాలాండ్ లో వాణిజ్య అభివృద్ధి కోసం దిగువ పేర్కొన్న పంటలను గుర్తించింది.

**నాగాలాండ్ లో పండించడానికి అవకాశం గల పంటలు:**

**పండ్లు:** ప్యాసన్ పండు, నారింజ, అనాస పనాస, అరటి

**కూరగాయలు:** సొరకాయ, గుమ్మడికాయ, క్యాబేజీ, బంగాళాదుంప, బీన్స్, ఉల్లి

**పుష్పాలు:** గులాబీలు, లిల్లీలు, ఆర్కిడ్లు, గ్లాడియోలి, అంథూరియమ్

సుగంధ ద్రవ్యాలు: అల్లం, యాలికలు, వెల్లుల్లి, నల్ల మిరియాలు ఔషధ,

సువాసనభరిత మొక్కలు: పట్చొలి, నీమ్, అగర్, జిన్సెంగ్

తోట పంటలు: కొబ్బరి, తేయాకు, పోక చెక్క, జీడి.

**సామర్థ్యం కల ఉద్యానవన కార్యక్రమాలు:**

**పండ్ల సాగు:** అనాసపనాస, నారింజ, ప్యాసన్ పళ్లు, కివి పళ్లు, అరటి మొదలైనవాటిని వాణిజ్య పరంగా భారీ స్థాయిలో సాగుచేయడం వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతుంది.

**సుగంధ ద్రవ్యాల అభివృద్ధి:** సుగంధ ద్రవ్యాల్లో అల్లం, వెల్లుల్లి, నల్ల మిరియాలు, యాలుకలు, మిర్చి అభివృద్ధి చేయాల్సిన ప్రధాన పంటలు. అనుకూలమైన వ్యవసాయ– వాతావరణ పరిస్థితులు అటువంటి పంటల అభివృద్ధికి దోహదం చేస్తున్నాయి. వాణిజ్యపరంగా మంచి విలువ ఉండటం, మార్కెట్లకు హామీ ఉండటంతో రైతులు అల్లం, మిర్చి సాగుచేస్తున్నారని క్షేత్ర స్థాయి సర్వేలు సూచిస్తున్నాయి.

**తేయాకు సాగు:** అసోంను అనుకొని ఉన్న పర్వతాలు, పర్వత పాదాలు రెండింటిలోనూ విభిన్న ఎత్తుల్లో ఉన్నత స్థాయి తేయాకును వాణిజ్య పరంగా ఉత్పత్తి చేయడానికి నాగాలాండ్ రాష్ట్రం నిరూపించబడిన సామర్థ్యం కలిగి ఉంది. కమతాల విభజించబడిన స్వభావం వల్ల సాధారణంగా నాగాలాండ్ లో తేయాకు సాగు చిన్న రైతుల పంటగా ఉంది. కొన్ని గ్రామాల సమూహంగా సమాజ ప్రాతిపదికగా తేయాకు పంట సాగు చేయవచ్చు. ఇది పనికూలీల కొరత సమస్యను పరిష్కరించగలదు. కర్మాగారం ఏర్పాటు చేయడం వల్ల పచ్చని ఆకుల శుద్ధికి దోహదపడుతుంది. సంపూర్ణ సౌకర్యాలతో కూడిన కర్మాగారాన్ని ఏర్పాటు చేయటానికి తగిన ఉత్పత్తిని సాధించేటంత వరకు అసోంలోని చేరువలో ఉన్న టీ ఎస్టేట్స్ కి పచ్చని ఆకుల్ని తరలించవచ్చు. శుద్ధి సౌకర్యాలు, అధిక కూలీ రేట్లు, నైపుణ్యం గల సిబ్బంది లేమి, అమలులో ఉన్న భూయాజమాన్య వ్యవస్థ అవరోధాలుగా ఉన్నాయి. రాష్ట్రంలో చిన్న స్థాయి తేయాకు సాగుదార్ల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

అనేకానేక మంది రైతులు తేయాకు ఉద్యానవనాలను(గార్డెన్లను) అభివృద్ధి చేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో వోఖా, మోన్ జిల్లాలు తేయాకు సాగుకు అనువైనవి.

**రబ్బరు సాగు:** రబ్బరు వర్షాధార పంట. వ్యవసాయ నిర్వహణ పద్ధతులతో పరిమిత నేలల్లో సైతం అభివృద్ధి చేయవచ్చు. వృక్షాలు లేకపోవడం వల్ల కోతకు గురైన పర్వత పాదాలలో సైతం రబ్బరు సాగు చేయవచ్చు. విస్తృతంగా ఝుమ్ వ్యవసాయ పద్ధతిని పాటించిన నేలల్లోనూ పండించవచ్చు. అదేవిధంగా ఎటువంటి ఆర్థిక కార్య కలాపాలు లేని బీడు భూముల్లోనూ సాగుచేయవచ్చు. స్వల్ప ప్రాంతాల్లో రబ్బరు తోటలను అభివృద్ధి చేయటానికి సమూహ పద్ధతిని అనుసరించవచ్చు.

**పుట్టగొడుగుల సాగు:** అనుకూలమైన వ్యవసాయ– వాతావరణ పరిస్థితులు, మార్కెట్లు అందుబాటులో ఉండటం వల్ల పుట్టగొడుగుల పెంపకాన్ని అభివృద్ధి చేయటానికి అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఆసక్తి కలిగిన పెంపకం దార్లకు పుట్టగొడుగుల గుడ్లను అతి తక్కువ ధరకే ఉద్యానవన శాఖ ఉత్పత్తి చేసి అందజేస్తోంది.

**ప్రాసెసింగ్(శుద్ధిచేయడం) విలువ జోడించడం:**
అనాసపనాస, జామ, నారింజ, ప్యాసన్ ఫ్రూట్ మొదలైనవి అత్యధిక పరిమాణంలో ఉత్పత్తి చేస్తున్నప్పటికీ ఉత్పత్తి కాలం స్వల్పమే. పైగా రుతుసంబంధమైనది. కోత అనంతర టెక్నాలజీ లేమి, స్టోరేజీ సదుపాయాల కొరత, రవాణా, ప్రసార వ్యవస్థ సరిపడినంత లేకపోవడం, సరైన మార్కెటింగ్, మౌలిక సదుపాయాల లేమి మొదలైనవి ఈ సామర్థ్యం కల రంగం వృద్ధికి మరింత ప్రతిబంధకాలుగా ఉన్నాయి. స్థానిక వస్తు సమృద్ధి, తత్ఫలితంగా పెంపకందారుల ధరలు పతనమవ్వడం/ అమ్మకాల దురవస్థకు కారణమవుతుంది. రసాలు శుద్ధిచేయడం, సాంద్రీకరణలు, నిల్వచేయబడిన రసాలు, ముక్కలు, తేమరహిత ఉత్పత్తులు, జాములు మొదలైన విలువ జోడించిన ఉత్పత్తులను తయారుచేయడం అందుబాటులో ఉన్న అత్యుత్తమమైన ఐచ్ఛికం.

**ఔషధ, సువాసనభరిత మొక్కలు:** నాగాలాండ్ రాష్ట్రం సంపద్వంతమైన జీవవైవిధ్యాన్ని కలిగి ఉంది. తేమతో కూడిన ఒంఢ్రు లోయ నుంచి సతతహరిత అరణ్యాల గుండా మంచురేఖ వరకు స్థాయీభేదాలతో ఉన్న ఈ ప్రాంత ప్రత్యేక వాతావరణం వైవిధ్య భరిత జంతు వృక్షజాలాన్ని ఉత్పత్తి చేస్తోంది. చిన్న మొక్కలు, పొదలు ఉపరితలమంతా దట్టంగా వ్యాపించి ఉన్న సతతహరిత అడవులున్నాయి. ఈ చిన్న మొక్కలు, పొదల్లో చాలామటుకు ఔషధ లేదా అవసరమైన నూనెల ధర్మాలు కలిగి ఉంటాయి. వాటిని అసంపూర్ణంగా ఉపయోగిస్తున్నారు.

**సిట్రనెల్లా సాగు:** నిమ్మగడ్డి ప్రధానమైన ఔషధ, మూలికా మొక్క. నిమ్మగడ్డిని రాష్ట్రంలో వాణిజ్య పరంగా సేకరిస్తున్నారు. సిట్రనెల్లా నూనెకు జావా సిట్రనెల్లా ఉత్తమమైన మూలాధారం. జెర్మేనియం నూనె, సెట్రనెల్లా నూనె, హైడ్రాక్సైల్ సిట్రనెల్లా ఉత్పత్తి ఇతర సమానమైన అధిక విలువ కలిగిన సువాసభరిత మూలాలు. సువాసన భరిత సబ్బులు, దుర్గంధహారి, పిచికారులు, బట్టల సబ్బులు, మెరుగులు, దోమల నివారణ క్రీములు వంటి వివిధ సుగంధభరిత రసాయనాలు కోసం ఆరంభ మెటీరియల్ గా ఈ నూనెను విస్తృతంగా ఉపయోగిస్తారు.

**నిమ్మగడ్డి సాగు:** నిమ్మగడ్డి నుంచి తీసిన నూనె విటమిన్ ఎ సంశ్లేషణానికి ప్రధాన వనరు. 1980లో నాగాలాండ్ రాష్ట్ర రైతులకు ఈ టెక్నాలజీని ఆర్ఆర్ఎల్ ద్వారా విడుదల చేశారు. స్వల్ప కాలంలోనే అనేక మంది రైతులు ఈ గడ్డిని సాగు చేయడం ఆరంభించారు. నాగాలాండ్ లోఈ మొక్క రకాల సాగుకు సంబంధించి ఆర్ఆర్ఎల్ ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. తద్వారా ఈ గడ్డిని వాణిజ్య సాగు చేసే విషయంలో అనేక మంది రైతులకు ప్రోత్సాహం లభించింది.

పండ్లు, పుష్పాలు, కూరగాయల నిర్వహణ, గ్రేడింగ్, ప్యాకేజింగ్, రవాణా, అమ్మకాలకు సంబంధించి ఉత్పత్తి కంపెనీలు, రైతుల సంఘాలు ఏర్పాటును అన్వేషించాల్సిన అవసరం ఉంది. వాణిజ్య పరంగా ఈ పంటలను భారీ స్థాయిలో సాగు చేయటం వల్ల ప్రజల జీవితాల్లో మార్పు సంభవిస్తుంది. కొన్ని సంవత్సరాల క్రితం వరకు నాగాలాండ్ పుష్పాలను దిగుమతి చేసుకునే పరిస్థితి ఉండేది. ఉన్నత ప్రమాణాలతో కూడిన నాగాలాండ్ లో పెంచుతున్న పుష్పాలు ప్రస్తుతం రాష్ట్రానికి వెలుపల మార్కెట్ ను సంతరించుకున్నాయి. జీవ సంబంధ వ్యవసాయానికి అవసరమైన వర్మి కంపోస్టింగ్ (వానపాములతో కూడిన ఎరువు) రాష్ట్రంలో సమర్థవంతమైన పరిశ్రమ. అంతర్గత/ బహిర్గత మార్కెట్ల కోసం పుష్పాలు, పండ్లు, కూరగాయలతో పాటు వర్మి కంపోస్ట్ భారీ పరిమాణంలో ఉత్పత్తి చేయడం వల్ల నాగాలాండ్ రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు భారీగా ప్రోత్సాహం లభిస్తుంది.

**వాతావరణ మార్పుపై కార్యాచరణ ప్రణాళిక (ఎపిసిసి)**
హిమాలయ ఆవరణ వ్యవస్థ సంరక్షణకు ఎన్ఎపిసిసి మాదిరిగా వాతావరణ మార్పుపై రాష్ట్ర కార్యాచరణ ప్రణాళిక(ఎస్ఎపిసిసి) ఏర్పాటుచేయాలి. ఈ ప్రణాళిక కింద పేర్కొన్న అంశాలపై దృష్టిసారించాలి.

ఎ) జీవవైవిధ్యం, అటవీ జీవజాలం సంరక్షణ, పరిరక్షణ
బి) సంప్రదాయ విజ్ఞాన సమాజాలు, వాటి జీవనాధారం
సి) హిమాలయ ఆవరణ వ్యవస్థ పరిరక్షణ కోసం ప్రణాళిక
డి) పర్యావరణానుకూల వ్యవసాయం, పరిశ్రమ
ఇ) భూమి, మృత్తికల సంరక్షణ

**వివిధ సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి అనుసరించదగిన పద్ధతులు:**

ఎ) ప్రజల విజ్ఞాన సామర్థ్యాలను పెంపొందించుకోవడం
బి) వ్యవస్థాగత సామర్థ్యాలను పెంపొందించుకోవడం
1) విజ్ఞాన సంస్థల మధ్య ఉత్తమమైన సమన్వయం
2) కాల పరిమితితో విజ్ఞాన అంతరాల ప్రాంతాల్లో నూతన సంస్థలను అభివృద్ధి చేయడం
3) సంప్రదాయ విజ్ఞాన వ్యవస్థలు, హిమాలయ వ్యవసాయం, పర్యావరణ పర్యాటకం, జీవవైవిధ్యం మొదలైన రంగాల్లో వ్యవస్థాగత సామర్థ్యాలను పెంపొందించడం
సి) నిరంతర అధ్యయనం, అభివృద్ధి వ్యూహాల ప్రొ యాక్టివ్ డిజైనింగ్ కోసం సామర్థ్యాలను వృద్ధి చేయడం

*అనువాదం : కె. ప్రేమ లావణ్య*

# శీతోష్ణస్థితి మార్పు - భారత్ సంసిద్ధత

**ఉపోద్ఘాతం:** ఒక శతాబ్దకాలపు అనగా దీర్ఘకాలికంగా వాతావరణ పరిస్థితుల మొత్తం తీరుతెన్నులనే శీతోష్ణ స్థితి అని చెప్పు కుంటున్నాం. అయితే వాతావరణమనేది ఒక స్వల్పకాలిక పరిస్థితి. 1992లో జరిగిన రియో ఎర్త్ శిఖరాగ్ర సమావేశం, అదేసంవత్సరంలో వాతావరణ మార్పులపై జరిగిన ఐక్యరాజ్య కూటమి సమావేశాల్లోను ప్రపంచంలోని వేరువేరు ప్రాంతాలలో వివిధరకాలైన శీతోష్ణస్థితిలోని మార్పులను అందరూ గుర్తించడమే కాక అంగీకరించారు కూడా. అవేమిటంటే, వేసవి ఉష్ణోగ్రతలలో ఆధిక్యం, స్వల్పకాలికమే అయినా తీవ్రమైన శీతాకాలము, అకాల వర్షపాతాలు, చాలా తరచుగా వరదలు, కరువు, ఏడాదిలో ఎప్పటిలాగే వర్షాలు పడినా కూడా తీవ్రమైన కరువు, భారీ వరదలవంటి ఉపద్రవాలు, ఆమ్లవర్షాలు మొదలైన మార్పులు సంభవించాయి. భూవాతావరణం తీవ్రంగా వేడెక్కడాన్ని ప్రపంచ దేశాలన్నీ గుర్తించాయి.

ప్రతి దశాబ్దానికి ప్రపంచ సరాసరి ఉష్ణోగ్రత 0-15 డిగ్రీల సెల్సియస్ పెరుగుతోందని యుకె వాతావరణ పరిశోధనాకేంద్రం తెలియజేస్తోంది. 2001-2010 దశాబ్దంలో ఇది 0-20డిగ్రీల సెల్సియస్‌గా ఉంది. అంటే 1991-2000దశాబ్దం కంటె అధిక ఉష్ణోగ్రతా దశాబ్దం అని చెప్పవచ్చును. (1961-90లోని ఉష్ణోగ్రత కంటె 0.24డిగ్రీల సెల్సియస్ ఎక్కువ. అలాగే 2001-2010లలో ఇది 0.44డిగ్రీల సెల్సియస్ ఎక్కువ.)

**ఈ క్రింది అంశాల కారణంగా శీతోష్ణస్థితి ప్రభావితమైనదని నిస్సందేహంగా చెప్పవచ్చును:**

1. ఇన్సిడెంట్ సోలార్ రేడియేషన్ - అక్షాంశరేఖతో మార్పు-ఉదా: ఎగువ అక్షాంశంలో శక్తిలోపం ఉండగా దిగువ అక్షాంశంలో అధిక శక్తి ఉంటుంది.
2. భారీ జలవనరుల సామీప్యము-నేల మరియు జల పంపిణీ
3. పర్వతశ్రేణుల అడ్డుగోడలు- ఉదా: మహారాష్ట్ర, ముంబై, మరియు పూనేలలో నెలకొనివున్న పర్వతాల వైవిధ్యం కారణంగా ముంబైకంటె పూనే ఎక్కువ చల్లగా ఉంటుంది.
4. సముద్ర ఉష్ణోగ్రత మరియు ప్రవాహాలు


డా. సుభాష్ శర్మ
ప్రిన్సిపల్ సెక్రటరీ, లేబర్ రిసోర్స్ డిపార్ట్‌మెంట్ , పాట్నా




5. ఎత్తు- ఎక్కువ ఎత్తైన ప్రాంతాలలో చల్లగా ఉంటుంది.
6. పచ్చదనం పరచుకున్న నేల మరియు అడవులు
7. వాతావరణ పీడనము( వాతావరణంలో 78.09శాతం నైట్రోజన్, 20.95 శాతం ఆక్సిజన్, 0.93శాతం ఆర్గాన్ మరియు 0.04 శాతం కార్బన్ డై యాక్సైడ్ ఉన్నాయి.)

**శీతోష్ణస్థితి మార్పులో ముఖ్యంగా మూడు ముఖ్యాంశాలను గుర్తించడం జరిగింది.**

1. మిత విస్తారములనుండి మార్పు
2. నిర్ణీత కాలికతలో దశలవారీ మార్పు
3. తరచుగా మార్పుచెందిన సంఘటనల సంభావ్యత అయినా శీతోష్ణస్థితి మార్పునకు సంబంధించి వివిధ అసందిగ్ధతలు కూడా ఉన్నాయి అందులో మూడింటిని చూద్దాం.

మొదటిది, ప్రాంతానికీ ప్రాంతానికీ శీతోష్ణస్థితి మార్పులో ఎందుకు వైవిధ్యాలున్నాయనేది సందిగ్ధమే.

రెండవది, వివిధ సెక్టార్లపై శీతోష్ణస్థితి మార్పు యొక్క అసందిగ్ధ ప్రభావము.

మూడవది, అనుకోని ఉపద్రవాల(అగ్ని పర్వతాల విస్ఫోటనం) నుండి ఆశ్చర్యకరమైన పరిణామాల సంభావ్యత

**(2) మానవ ప్రేరిత కార్యకలాపాలు మరియు శీతోష్ణస్థితి మార్పు**

ఐపిసిసి-ఎఆర్4 ననుసరించి గత పదివేల సంవత్సరాలలో వెలువడిన మొత్తం వాయువులకంటె 1750 నుండి వెలువడిన కార్బన్ డయాక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ వంటి వివిధ గ్రీన్‌హౌస్ వాయువుల ప్రభావం ప్రపంచం మీద ఎక్కువగా ఉంది అన్నవిషయాన్ని అంగీకరించక తప్పదు. అంతేకాకుండా 1995-2005 మధ్యకాలంలో వెలువడిన కార్బన్ డయాక్సైడ్ స్థాయి 20శాతానికి మించి ఉంది. అయినా గానీ భూమిమీద సహజసిద్ధంగా ఏర్పడే నీటి ఆవిరివంటి గ్రీన్ హౌస్

వాయువులు కూడా వాతావరణానికి యాభైశాతం వేడిమిని చేర్చి భూమిపై నివసించే అన్ని జీవరాసులకు అవసరమైన సుస్థిరమైన శీతోష్ణస్థితిని సృష్టిస్తాయనేది గమనార్హం.

ప్రధాన విడుదలలలో జరిగే ప్రతి ఆలస్యం కారణంగా సుమారు 0.5 డిగ్రీల సెల్సియస్ వేడిమి జతకూరుతుంది. ఈనాడు వెలువడుతున్న గ్రీన్‌హౌస్‌వాయువుల సంపూర్ణ వేడిమి ఫలితాన్ని రాబోయే దశాబ్దాలలోని ప్రపంచం అనుభవించాల్సివస్తుందనే ఐపిసిసి చెబుతోంది.

భారత్‌లో కార్బన్ డయాక్సైడ్ శిలాజ ఇంధన వినియోగం ద్వారా 56శాతం గ్రీన్‌హౌస్‌వాయువులు విడుదలవుతున్నాయని వేరే చెప్పనవసరం లేదు. 2005లో ప్రపంచవ్యాప్తంగా కార్బన్‌డయాక్సైడ్ తలసరి విడుదల 4.5 టన్నులయితే, 2030లో భారత్‌లో కార్బన్‌డయాక్సైడ్ తలసరి విడుదల 5 టన్నుల వరకు ఉండగలదు.

దీనికి అదనంగా, జీవసంబంధ వైవిధ్యంపై ఐక్యరాజ్యసమితి శిఖరాగ్రసమావేశముననుసరించి మనమంతా ఈ క్రింది స్వాభావిక మార్పులను గుర్తించవలసివున్నది:

1. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సముద్రమట్టాలు 10–20 సెంటీమీటర్లకు పెరుగుతాయి. (ఏడాదికి 3మిల్లీ మీటర్లు పెరుగుతున్నాయి.)
2. స్విట్జర్లాండ్‌లోని మొత్తం గ్లేసియర్ల ఘనపరిమాణము 2/3కు పతనమయ్యింది.
3. ఆర్కిటిక్ మంచు మందము వేసవి చివరిలోను మరియు హేమంతపు తొలిభాగంలోను 40శాతంవరకు తగ్గిపోయింది.
4. మౌంట్ కెన్యా 92శాతం మంచును కోల్పోవగా మౌంట్ కిలిమంజరో 82శాతం కోల్పోయింది.
5. అధికమొత్తాల్లో నీటిని నిలువరించే నైగర్, లేక్ చాడ్ మరియు సెనెగల్ బేసిన్లలో మొత్తం నీటి లభ్యతలో 40–60శాతంవరకు తరుగుదల.
6. సముద్రతీరాలలో 70శాతం మేరకు ఇసుకమేటలు.
7. ఉష్ణోగ్రత ఒక్కో డిగ్రీ పెరుగుతున్నకొలదీ ప్రతి డిగ్రీకి 100కిలో మీటర్ల అలాస్కా యొక్క బోరియల్ ఫారెస్ట్‌లైన్ ఉత్తరంగా చలనం.

ప్రపంచవ్యాప్తంగా మొత్తం గ్రీన్‌హౌస్‌వాయువుల విడుదలను పరిశీలిస్తే, చైనా, యుయస్, రష్యా, యూరోపియన్ యూనియన్ మరియు భారత్‌లు వాటిని భారీస్థాయిలో అత్యధికంగా విడుదల చేస్తున్న దేశాలుగా గమనించగలము.(పట్టిక1):

**పట్టిక: 2006లో ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల గ్రీన్ హౌస్ వాయువుల విడుదల**

| దేశం | మొత్తం జిహెచ్‌జి విడుదల (ఏడాదికి మిలియన్‌టన్నులు) | గ్లోబల్ జిహెచ్‌జి విడుదల శాతం |
|---|---|---|
| 1.చైనా | 6017 | 21.8శాతం |
| 2.యుయస్ | 5902 | 20.3శాతం |
| 3.రష్యా | 1704 | 05.7శాతం |
| 4.యూరోపియన్‌యూనియన్ | – | 24.5శాతం |
| 5.ఇండియా | 1293 | 04.7శాతం |

2020నాటికి భారత్‌లో గ్రీన్‌హౌస్‌వాయువుల విడుదల ఏడాదికి1293మిలియన్ టన్నులనుండి 2750–3600 మిలియన్‌టన్నుల వరకు అధికం కావచ్చునని, అలాగే 2031నాటికి ఏడాదికి 4900–5700 మిలియన్ టన్నులకు పెరగవచ్చునని అంచనా. భారత్ యొక్క విడుదలయొక్క వివరణ చిత్రము ననుసరించి విద్యుత్ వినియోగ రంగం అత్యధికంగా 37.8శాతం, తర్వాత వ్యవసాయరంగం 17.6శాతం, రవాణారంగం 7.5శాతం, నివాస రంగం 7.2శాతం, సిమెంట్ రంగం 6.8శాతం, ఇనుము మరియు స్టీలు రంగం 6.2శాతం విడుదల చేస్తున్నాయని వెల్లడవుతోంది.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 50శాతంవరకు పట్టణ జనాభా ఉంది. వీరంతా ఆహారం, నీరు, నివాసం, రవాణా, ఇంధనం, కమ్యూనికేషన్ కోసం వివిధ రకాలుగా శీతోష్ణస్థితి ప్రభావాలకు లోనవుతున్నప్పటికీ, తమకు సమీపంలోనే ఉన్న స్థానిక ప్రాంతాలలో లభించే సంస్థాగతమైన, పర్యావరణ మరియు భౌతిక పరమైన విధానాలపైనే ఆధారపడి జీవిస్తున్నారు.ఉష్ణోగ్రత యొక్క పెరుగుదల మానవ సంతానోత్పత్తి, ఆరోగ్యం మరియు శక్తి అనేవాటిపై నేరుగానే ప్రభావం చూపిస్తోందనడంలో ఎంతమాత్రం సందేహం లేదు.

భారత్ యొక్క పట్టణ జనాభా ఏడాదికి 70లక్షలు పెరుగుతోంది. కేవలం ఢిల్లీలోనే 5లక్షలు పెరుగుతోంది.రిఫ్రిజిరేటర్లు, ఏసీలు, కూలర్ల వాడకం పెరిగేందుకు కేవలం ఉష్ణోగ్రతలు పెరగడం మాత్రమే కారణం కాదు.చాలా నగరాల్లో డ్రెయినేజి సౌకర్యం ఏమాత్రం లేని రోడ్లమీద తరచుగా ముంపు కారణంగా వరదలు రావడంతో ట్రాఫిక్‌కు బాగా అంతరాయం కలుగుతోంది.ప్రధానంగా ముంబై, ఢిల్లీలో ఈ పట్టణప్రాంత ముంపు అనేది కొత్తగా ఏర్పడిన తీవ్రమైన ఉపద్రవం.

ప్రస్తుతం ఢిల్లీ నగరీకరణ 55శాతం ఉంది. ఇది 2021నాటికి 85శాతం కావచ్చునని భావిస్తున్నారు.ప్రస్తుతం నెలకొన్న ఇదేపరిస్థితి గనుక కొనసాగితే ఢిల్లీలో వాయువుల విడుదల మరింత అధికస్థాయికి చేరుకోవచ్చును.అయితే, సైన్సు మరియు పర్యావరణ కేంద్రాలవంటి పౌరసమాజ సంస్థల ఒత్తిడివలన ప్రజారవాణా వాహనాలయిన బస్సు, టాక్సీ, ఆటోరిక్షాలలో కాలుష్య రహిత సియన్‌జి ఇంధనం వాడకం ప్రవేశపెట్టబడింది.

2007–12మధ్యకాలంలో పాట్నావంటి చాలా రాష్ట్ర రాజధానుల్లో ప్రయివేటువాహనాలు ఎక్కువైపోయినందున వాహనాలు విడుదలచేసే వాయుకాలుష్యం పర్యావరణ కాలుష్యానికి దారితీసింది. భారత్‌లో ప్రతిరోజూ 1375 కార్ల వాడకం పెరుగుతున్నందున రవాణా రంగం ద్వారా అధిక కాలుష్యం విడుదలవుతోంది. ప్రపంచవ్యాప్తంగా 75శాతంవరకు ఈ విడుదలలు ఎనర్జీ ఆధారితవనరులనుండి భారత్‌లో 86శాతం ఎనర్జీ శిలాజ ఇంధనం నుండి జరుగుతున్నట్టు అంచనా. అంతకంటె అధికంగా నగరాలలో స్థిర నివాసముండే జనాభాతోపాటు వలసవచ్చిన జనాభా, నగరాలకు రాకపోకలు జరిపే జనాభాయొక్క నీరు, పారిశుధ్యం, ఆహారం, విద్య, ఆరోగ్యము మరియు ఇతర అవసరాలను తీర్చడంలో మరింత కాలుష్యం ఏర్పడుతోంది. వాస్తవానికి నగరాల్లోని ప్రజలు శీతోష్ణస్థితి మార్పులను ఏవిధంగా ఎంతవరకు అనుభవిస్తారు, తట్టుకుని నిలబడగలుగుతారు అనేది తీవ్రంగా ఆలోచించవలసిన అంశం. ప్రణాళికారహితమైన పట్టణాలు, నగరాలు,

మెట్రోల అభివృద్ధి పెరిగిపోతున్న దృష్ట్యా నిర్మాణాత్మక వనరులు మరియు పట్టణీకరణ హక్కును పొందడం అనేది ఎంతో జటిలమనే చెప్పాలి. బలహీన విధానాలు, సన్నకారు జనాభా, శీతోష్ణస్థితిమార్పుల ప్రభావానికి లోనుకావడం యొక్క పరిణామాల ఫలితమే నగరాలు శీతోష్ణస్థితి మార్పులకు గురికావడమంటారు మార్కస్ మోయించ్ .

ఉదాహరణకు, మైదాన పట్టణప్రాంతాల్లోని పేదలకంటె కోస్తా నగరాల్లో నివసించే ధనికులు ఆకస్మిక తుఫానులు, వాయుగుండాలు, సముద్రపు మట్టాల పెరుగుదల యొక్క ప్రత్యక్ష ప్రభావాలకు గురికావడం అనేది గమనార్హమే. అయితే ఈ తుఫానులు వాయుగుండాలు, సముద్రమట్టాల పెరుగుదల వ్యవసాయ ఉత్పత్తిని ప్రభావితం చేస్తే, ధరల పెరుగుదలవలన కోస్తానగరాల్లోని ధనికులంతగా ప్రభావితులు కాకపోయినా రక్షిత మైదాన ప్రాంతాల్లో నివసించే పట్టణ పేదలపై మాత్రం పరోక్షంగా తీవ్రమైన ప్రభావం పడుతుంది.

'నీటిసరఫరా మరియు మురుగుతొలగింపు విధానం' అనే పద్ధతి 'మురుగు సరఫరా మరియు నీటి తొలగింపువిధానం'గా మార్పు చెందింది.! శీతోష్ణస్థితి మార్పు ఈ అస్తవ్యస్త పరిస్థితిని మరింత దిగజారుస్తుంది. మరోవిధంగా చెప్పాలంటే, భారత్‌లో 60శాతం జనాభా ఏ వ్యవసాయంమీద అయితే ఆధారపడి జీవిస్తున్నారో దానికి వివిధ శీతోష్ణస్థితి పరిస్థితుల కారణంగా దారుణమైన నష్టం సంభవించింది.:

1. 60% వ్యవసాయభూముల ప్రాంతం భూకంపాలకు ఆలవాలం
2. 40శాతం వ్యవసాయం వరదనష్టానికి గురి కావడం
3. 68శాతం వ్యవసాయం కరువుకు గురవడం
4. 76శాతం తీరప్రాంతాలు హరికేన్ల నష్టానికి లోను కావడం(మొత్తం 800కిలోమీటర్ల కోస్తా ప్రాంతం)

**3. వివిధ పరిష్కారమార్గాలు**

ఏసమస్య కయినా పరిష్కారములు ఒకవైపు గ్రహణయోగ్యం గాను మరోవైపు వైవిధ్యంగాను ఉంటాయి. అంటే భారత్‌లోని వివిధ ప్రాంతాలు/రాష్ట్రాలలోని అంశాలు, తీవ్రత, స్థాయి, పరిమాణములను అనుసరించి ఉంటాయన్నమాట.

పరిష్కారాల విషయమై వివిధ రాష్ట్రాలలో తీవ్రత, స్థాయి మరియు పరిమాణాలు వివిధ రకాలుగా ఉన్నాయి. ఉదాహరణకు, బీహారులో 73శాతం ప్రాంతం వరదలకు 17శాతం కరువునకు, 10శాతం నీటిముంపుకు గురయ్యే ప్రాంతాలున్నాయి. 2013(జూన్-అక్టోబరు)లో చాలా జిల్లాలు కరువు పీడితం కాగా, ఐదారు జిల్లాలు వరదలకు గురయ్యాయి. దాదాపుగా ఉత్తర బీహారు నదుల యొక్క 85శాతం క్యాచ్‌మెంట్ ప్రాంతం బీహారుకు అంతర్గతంగా ఉన్నది. (ముఖ్యంగా నేపాల్). కోసి నది బీహారు దుఃఖ కారణమైన నది. బీహారు మూడు విధాలైన నదుల కారణంగా వరదలకు గురవుతోంది.

హిమాలయాల్లో పుట్టిన జీవనదులు వేసవికాలంలో ప్రయోజనకరమైన విడుదలతో మంచుతో కూడిన ప్రవాహాలను మోసుకువస్తున్నాయి–కోసి, గండక్, కర్నాలి(ఘాఘ్రా) మరియు మహాకాళి(శర్దా) నదులు

మహాభారతపర్వతశ్రేణుల మధ్యప్రాంతంనుండి పుట్టిన నదులు అవక్షేపము మరియు భూగర్భజలాలను సంపన్నంచేస్తున్నాయి.– మేచి, కంకాయ్, కమల,బాగమతి, పశ్చిమ రాప్తి, మరియు బబాయ్ నదులు ఇవన్నీ జీవనదులే అయినా విడుదల విషయంలో విస్తృతంగా ఋతుమార్పులకు లోనవుతున్నాయి.

దక్షిణ శివాలిక్ పర్వత శ్రేణులనుండి పుట్టిన చిన్న నదులు ఋతుపరమైనవేకాక వర్షాకాలంలో ఆకస్మిక వరదల స్వభావము కలవి.

వాస్తవానికి నేపాల్‌లో ప్రారంభమైన వరదల కారణంగా ఉత్తర బీహారులోని 21 జిల్లాలు కూడా ఎంతో నష్టపోయాయి. అందువలన స్థానిక ప్రజలు వరదలను తమ 'మూడవ పంట' గా భావిస్తూ ఎల్లప్పుడూ వరద నష్టపరిహారంకోసమే ఎదురు చూస్తుంటారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, గుజరాత్, పశ్చిమ బెంగాలు, ఒడిషా, అండమాన్ మరియు నికోబార్, గోవాలలోని ఎన్నో తీరప్రాంత నగరాలు సముద్రమట్టాల పెరుగుదల మరియు తుఫాను, వాయుగుండాల తీరుతెన్నులకు సంబంధించి భయభ్రాంత మవుతూనే ఉంటాయి.

**ఉపశమన ప్రయత్నాలు**

శీతోష్ణస్థితి మార్పులకు సంబంధించి వివిధ రాష్ట్రాలకు వేర్వేరు ప్రాధాన్యతాంశాలున్నాయి. అందువలన ఉపశమనంకొరకు వివిధ స్థాయిలలో వివిధ స్టేక్‌హోల్డర్లచే రాష్ట్ర కార్యాచరణ ప్రణాళికను (యస్ఏపి) తయారు చేయవలసి వుంది. 2013 సెప్టెంబరు నాటికి భారత్‌లోని 20 రాష్ట్రాలు మాత్రమే రాష్ట్ర కార్యాచరణ ప్రణాళికను తయారు చేయగా అందులో ఒడిషా రాష్ట్రం ప్రథమస్థానంలో ఉంది. శీతోష్ణస్థితి మార్పులకు సంబంధించి ప్రత్యేకమైన శాఖను కలిగివున్న రాష్ట్రం కేవలం గుజరాత్ మాత్రమే. ప్రణాళిక సహిత, ప్రణాళికా రహితమని(స్వయంసమృద్ధమైనవి) రెండు ప్రధానమైన అనుసరణ పద్ధతున్నాయి. ప్రణాళికా సహిత అనుసరణీయము అంటే అనుకున్న లక్ష్య సాధనకు నిర్ద్వందమైన విధాన నిర్ణయమన్నమాట. ఉదా: మాగాణి భూముల పునరుద్ధరణ, తుఫాను ఉపశమన చర్యలు మొదలైనవి. అయితే అనుసరణీయత విషయంలో నాలుగు ప్రధాన కోణాలున్నాయి.:

1. సంపూర్ణం – సర్వస్వతంత్రము లేదా ప్రణాళికాబద్ధము
2. కార్యాచరణం– ప్రతిస్పందనగా (అనంతరం), ఉమ్మడిగా (జరుగుతున్నపుడు), ముందస్తుగా (పూర్వము)
3. తాత్కాలికం – స్వల్పకాలికం(అప్పటికప్పుడు) లేదా దీర్ఘకాలికము (సంచితము అనగా కూడబెట్టుట)
4. స్థానిక విస్తరణ– స్థానికము లేదా విస్తృతము

వాస్తవానికి విషయ పరిజ్ఞానముగలిగిన ప్రజలు వెనువెంటనే లభించే కంటికి కనిపించే ఫలితాలకొరకు ప్రణాళికాబద్ధమైన ముందస్తు దయిన మరియు స్థానికమైన అనుసరణీయతను ఎంచుకుంటారు.

భారత్‌లో ఇంతవరకు వాతావరణసమాచారసూచన అంతగా పరిణతిచెందకపోవడంతోబాటు ఖచ్చితముకూడా కాదు కాబట్టి సాంకేతిక నూతన ఆవిష్కరణలు ఎంతో అవసరం. అంతేకాకుండా వ్యవసాయభూములలో ప్రత్యేక మట్టినమూనాలను పోషకాల స్థాయిని పంటకవసరమయ్యేనీటి సమాచారంతో ప్రస్తుతం కలిసి వాతావరణ సమాచారాన్ని అందించాలి. ఆకస్మిక వర్షాలను తట్టుకునేరీతిలో మురుగునీటి పారుదల విధానాలను మెరుగు పరచాలి. కరువు కాలంలోను, తుఫానుల సమయంలోను త్రాగునీటిని సరఫరా చేసేందుకు వీలుగా భారీ నీటి నిలువ ట్యాంకులను నిర్మించాలి.

తుఫానులు, వాయు గుండాలను తట్టుకునే నిర్మాణాలను చేపట్టాలి. లోతట్టు ప్రాంతాలలో చెరువు గట్లను పటిష్టంగా నిర్మించాలి.

భారత్‌లో పారిశుద్ధ్య అభివృద్ధి సాంకేతికతల నమూనాల విషయంలో నాలుగు అంశాలను లెక్కలోనికి తీసుకోవాల్సి వుంటుంది: అవేమిటంటే సమాజ శ్రేయస్సు (అదనపు ఉపాధికల్పన, ద్వారా పేదరిక నిర్మూలన, సామాజిక అడ్డుగోడలను తొలగించుట, (జీవన నాణ్యతను పెంచేందుకు కనీసావసరాల కల్పన), ఆర్థిక శ్రేయస్సు ((ప్రజల అవసరాలతో కూడిన అదనపు పెట్టుబడి), పర్యావరణ శ్రేయస్సు (వనరుల సుస్థిరత, జీవవైవిధ్య స్నేహితం, కాలుష్యస్థాయిలో తగ్గుదల, ఉత్తమ పారిశుద్ధ్యము), మరియు సాంకేతిక శ్రేయస్సు (పర్యావరణ రక్షిత సాంకేతికత, శక్తి సామర్థ్య ప్రాజెక్టుల బదిలీ మొదలైనవి).

ప్రస్తుతం సిడియమ్ వ్యవహారమంతా పెద్ద పెద్ద భారతీయ కార్పొరేట్ సంస్థల ఆధిపత్యంలో వారి స్వాధీనంలోఉన్నందున స్థానిక స్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో దీనిని విస్తృతం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. భారత్‌లోని సిడియమ్ ప్రాజెక్టులు స్థానికులకు పర్యావరణానికి వ్యతిరేకంగా ఉండకుండా ఉండేందుకు ఆ ప్రాజెక్టులను సమగ్రంగా పరీక్షించి క్రమబద్ధీకరణ చేసేందుకు బలమైన, పారదర్శకమైన సానుకూలమైన రెగ్యులేటరీ అథారిటీని ఏర్పాటు చేయడమనేది తక్షణ కర్తవ్యం.

భారత్, గ్రీన్ ఇండియా మిషన్, సంయుక్త అటవీ యాజమాన్య కమిటీ, ఫారెస్ట్ డ్వెల్లర్స్ హక్కుల చట్టం, సామాజిక అడవుల యాజమాన్య సంస్థలద్వారా ఆర్ఇడిడిని(REDD+ రెడ్యూసింగ్ ఎమిషన్స్ ఫ్రం డిఫోరెస్టేషన్ అండ్ డిగ్రేడేషన్)ని అభివృద్ధి చేసేందుకు కంకణం కట్టుకున్నప్పటికీ, ఆచరణలోనికి వచ్చేసరికి, REDD+ లేదా అటవీ సంరక్షణ, లేదా వన్యప్రాణి సంరక్షణ పేరుతో స్థానిక వర్గాల ప్రజలు, అటవీ అధికారుల దోపిడీకి గురవుతున్నారు. మరోవైపు, అటవీ అధికారులు, కాంట్రాక్టర్లు – వ్యాపారులు ఒక వలయంగా అభివృద్ధిచెందుతుండడం, స్థానికుల నుండి ఎంతటి వ్యతిరేకత ఎదురయినా ప్రభుత్వం అడవులను, భూములను, నీటిని, గనులను ఎంతో ఉదారంగా ప్రయివేటు వ్యక్తుల పరం చేయడం జరుగుతోంది. అందువలన పరిష్కారాలకు సంబంధించి స్థానికప్రజలను వాస్తవాలను గుర్తించేలా చైతన్యపరచడం ద్వారాను, స్థానికులు నూతన సమాచార సేకరణవిధానాలను వినియోగించుకుంటూ తమ సామూహిక అనుభవాలకు ప్రాధాన్యతనిస్తూ ఈ ఉపశమన ప్రయత్నాలలో పూర్తిగా భాగస్వామ్యం వహించేలాగున, పూర్తి పారదర్శకతతో ఈ అనుసరణీయమైన భద్రతా చర్యలను చేపట్టవలసిన అవసరం ఉంది.

ఆధునిక ఔదార్య భావనా సూత్రీకరణ యొక్క అభివృద్ధి (సామానీక ప్రజానీకంకంటె కార్పొరేట్‌వ్యక్తుల అభిరుచులను సంరక్షించే భావనాసూత్రీకరణవిధానాన్ని) ప్రజల అభివృద్ధినే పరమావధి చేసే భావనతో మార్పు చేయవలసివుంది. ఎందుకంటే తద్వారా స్థానిక ప్రజలకు ముఖ్యంగా పేదలకు ప్రజాభాగసామ్యం, రాజకీయ వికేంద్రీకరణ, సామాజిక సమానత్వం, ఆర్థిక దార్శనికత, సాంకేతికత సాధన, పర్యావరణ సుస్థిరత, సాంస్కృతిక ఆమోదము వైపు దృష్టిని కేంద్రీకరించే అవకాశం లభిస్తుంది. అటువంటి ప్రత్యామ్నాయ అభివృద్ధి సూత్రీకరణకు ప్రజాధానాన్ని ప్రయివేటురంగ లాభాలుగా మార్చుకునే పిపిపి(ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్యం) కంటె కూడా క్షేత్రస్థాయిలో స్థానికులను, పౌరసమాజసంస్థలను (సియస్ఓలు) కలుపుకునిపోయే సానుకూల విధానం మరియు పరస్పర విశ్వాసము, ప్రభుత్వ, సియస్ఓల, సామాన్య ప్రజానీక భాగస్వామ్యం ఎంతో అవసరం.

అందువలన శీతోష్ణస్థితిమార్పును జీవితంలో భాగంగా చేసుకోవడానికి ప్రతి అంశానికి సంబంధించిన సమాచారాన్ని పంచుకోవడమనేది ఎంతో కీలకమైనది. శీఘ్రగతిన స్టేక్‌హోల్డర్ల మధ్య సమాచార వారధులను నిర్మించవలసివుంది. పట్టణ ప్రాంతాలలో సుస్థిరతను ఉన్నతరీతిలో తీర్చిదిద్దడం ద్వారా జాతీయ మిషన్ సుస్థిర వసతికై పటిష్టమైన భవంతులను, ఘనవ్యర్థాల నిర్వహణ, ప్రజారవాణా సాధనాలవైపు మళ్లించే అంశాలకు కట్టుబడి వున్నా, ఆచరణలో ఎన్నో భారీ అడ్డంకులున్నాయి. ఏదిఏమయినా నిరోధం అనేది నివారణకంటే ఉత్తమం కనుక ఉపద్రవాలకు సంబంధించి ముందస్తు హెచ్చరిక విధానాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేయడం మంచిది.

ఇంక చివరిగా చెప్పవలసినదేమంటే, భారత ప్రభుత్వం, ప్రయివేటు రంగం, ప్రభుత్వేతర సంస్థలు, సియస్ఓలు సంయుక్తంగా అనేక స్థాయిలలో అనేక విధాలుగా పౌరులను అంతర్జాతీయ ప్రభుత్వేతర సంస్థలను, బహుళదాయక ఏజెన్సీలను చైతన్యపరచినట్లయితే అభివృద్ధి చెందిన దేశాలు తాము చేసిన చారిత్రాత్మక తప్పిదాలను సరిదిద్దుకునేందుకు, అవి అభివృద్ధి చెందుతున్న దేశాలలో శీతోష్ణస్థితి మార్పులను ఎదుర్కొనే పరిష్కారాలకు అవసరమయ్యే వ్యయాన్ని భరించవలసివుంటుంది. UNFCCC వంటి అంతర్జాతీయవేదికపై భారత్ ప్రత్యేకించి అధిక కార్బన్ స్పేస్‌కొరకు శక్తివంతంగా తన హక్కును ఖరారు చేసుకోవలసివుంది. ఎందుకంటే అభివృద్ధి చెందిన దేశాలయిన యుయస్, రష్యా, యూరోపియన్ యూనియన్, జపాన్ మరియు నూతన ప్రాంతీయ శక్తిగా ఆవిర్భవిస్తున్నచైనా దేశాల కంటె భారత్ తలసరి గ్రీన్‌హౌస్‌వాయువుల విడుదల చాలా తక్కువగా ఉంది. భారత్ 'సామూహికమే అయినా ప్రత్యేకమయిన బాధ్యత' సిద్ధాంతానికి మనసావాచాకర్మణా అంకితం కావలసివుంది. అందువలన అభివృద్ధి చెందుతున్న దేశాలు స్వచ్ఛమైన సాంకేతికత బదిలీని, దానితోబాటు గతంలో అధిక విడుదలలను, ఇప్పటికీ తక్కిన దేశాలకంటె ఎక్కువగా విడుదలలు చేస్తున్న అభివృద్ధి చెందిన దేశాలనుండి శీతోష్ణస్థితి మార్పుల అనుసరణీయతకు సంబంధించిన అవసరమైన నిధులను పొందే అవకాశం లభిస్తుంది.

భారత్ స్వచ్ఛందంగానే LED, CNG వంటి స్వచ్ఛమైన సాంకేతిక రీతిలో కార్బన్‌వాడకాన్ని తగ్గించుకునే అన్ని చర్యలు చేపట్టాలి. అంతేకాదు, పచ్చదనాన్ని పెంపొందించడం, సుస్థిరమైన వసతి నిర్మాణం, ఎనర్జీ కోడ్‌లను పాటించడం, ప్రజా రవాణాను, ఇంధన రహిత రవాణా (సైకిలు, రిక్షా, ఒంటె, గుర్రము, ఎడ్లబళ్లు) వాహనాలను ప్రోత్సహించడం చేయవలసివుంది. ఇంధన పునర్వినియోగాలను (గాలి,సోలార్ మొదలైనవి) అందరికీ తెలియజేసేందుకు ఆదిశగా బలమైన రాజకీయ అభిమతాన్ని ఏర్పరచుకోవడం, భారీ స్థాయిలో 'తగ్గింపు, రీసైకిల్ మరియు పునర్వినియోగం' సిద్ధాంతాన్ని ఆచరించడం చేయవలసివుంది.

*అనువాదం: శ్రీమతి పి.వి.శేషారత్నం*

# గ్రామీణ భూ నిర్వహణలో మార్పు

ప్రపంచవ్యాప్తంగా సాధారణ కుటుంబాలకు అసలు సిసలైన ఎంతో విలువున్న ఆస్తి భూమి. ఆ భూమిని అనుభవిస్తూ, పరిరక్షిస్తూ, ఒక తరం నుంచి మరో తరానికి బదిలీ చేస్తూ వారి ఉనికిని, ఆత్మ గౌరవాన్ని దాన్నుంచే పొందుతుంటారు. అయితే చాలా సందర్భాల్లో కనీసమాత్రంగానే భూమి ఉన్న రైతులు, లేదంటే అసలు ఏ చిన్న భూ కమతాన్ని కూడా సొంతం చేసుకోలేని స్థితిలో ఉన్న రైతాంగం, సొంత భూముల నుంచి వెళ్లగొట్టబడిన రైతులున్న గ్రామీణ వాతావరణం నుంచి ఆవిర్భవించిన అత్యంత సంక్లిష్టమైన ఆర్థిక, సామాజిక, రాజకీయ ఘర్షణలు దేశంలో నెలకొని ఉన్నాయి. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లోలానే మన దేశంలో కూడా గ్రామీణ పేదరికానికి మూలం భూమిపై నియంత్రణలో, భూ వినియోగంలోనే ఇమిడి ఉంది.

లోపభూయిష్టమైన, దోపిడీకి కారణమైన భూ రెవెన్యూ అంచనాలకు మూలాలు వలస భారతంలో వేళ్లూనుకొని ఉన్నాయి. స్వాతంత్ర్యానంతరం వీటి సంస్కరణలకే భూ చట్టాలను ఉద్దేశించారు. వలస పాలనలో ఎన్నో ఈతి బాధలు అనుభవించిన గ్రామీణ పేదల స్థితిగతులను మెరుగుపరచడానికి 'వ్యవసాయాభివృద్ధి' అనే నినాదం దేశంలో మార్మోగింది. కౌలు రైతులకు భూమిపై హక్కులు కల్పించడానికి మధ్య దళారీ వ్యవస్థను రూపుమాపాల్సిన అవసరాన్ని ప్రభుత్వాలు గుర్తించాయి. గ్రామీణ భారతంలోని భూమి లేని నిరుపేదలకు, భూస్వాములకు మధ్య అంతరాలను పూడ్చడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 1947 తరువాత అనేక భూసంస్కరణల చట్టాలను తీసుకొచ్చాయి. దున్నేవాడికే భూమి అనే అంతిమ లక్ష్యాన్ని చేరడానికి అనేక సీలింగ్ నిబంధనల ద్వారా అందుబాటులోకి వచ్చిన భూమిని నిరుపేదలకు పంచడానికి పురోగామి చట్టాలను రూపొందించారు. వ్యవసాయ ఉత్పాదనను పెంచడానికి భూ వినియోగాన్ని ఆచరణాత్మకంగా సద్వినియోగం చేసుకోవడమే లక్ష్యంగా చట్ట రూపకల్పనలో నిబంధనలను పొందుపరిచారు. సీలింగ్ నిబంధనలను అమలు చేయడం ద్వారా భూమిలేని పేదలకు మరీ ముఖ్యంగా షెడ్యూల్ తెగలు, కులాల కుటుంబాలకు భూమిపై యాజమాన్య హక్కు కల్పించడానికి, కౌలు సంరక్షణకు అనువుగా ఒడిశా ప్రభుత్వం అనేకమైన భూ సంస్కరణల చట్టాలను అమల్లోనికి తెచ్చింది. భూ బదలాయింపు విషయంలో గిరిజనులకు చెందిన భూమిని గిరిజనేతరులకు మార్పిడి చేయడం, విక్రయించడం వంటి విషయాల్లో ఒడిశా ప్రభుత్వం కఠినమైన చట్ట నిబంధనలను ఏర్పాటు చేసింది. అయితే ఈ నిబంధనల అమలులో తలెత్తిన అనేకానేక సమస్యల కారణంగా ఒడిశా ప్రభుత్వ ప్రయత్నాలు కొంతమేరకే ఫలించాయని చెప్పాలి. దీంతో అక్కడ భూ యాజమాన్య హక్కు వివాదాలు పుంఖానుపుంఖంగా తలెత్తాయి. ఈ కారణంగా గ్రామీణ పేదలు హక్కు పత్రాలు పట్టాలు లేకుండానే ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవడమో, లేదంటే ప్రభుత్వం పట్టా ఇచ్చినప్పటికీ భూమిని పొందలేని స్థితిలో ఉండిపోవడమో జరిగింది.

**సంజయ్ పట్నాయక్**
స్టేట్ డైరెక్టర్, లాండెసా, ఒడిషా



2005 – 06లో రెవెన్యూ విభాగం సేకరించిన భూమి లేని పేదల గణాంకాల ఆధారంగా ఒడిశా ప్రభుత్వం వ్యవసాయ భూపంపిణీ కార్యక్రమానికి 'వసుంధర' పథకాన్ని ప్రారంభించింది. తొలుత లభ్యమైన గణాంక సమాచారం మేరకు దాదాపు రెండున్న లక్షలమంది భూమిలేని గ్రామీణ పేదలకు నాలుగు కుంటలు ఆ తరువాత 2008లో దాన్నే పదికుంటలకు పెంచుతూ 'వసుంధర' పథకం కింద పంపిణీ చేయడం జరిగింది. అయితే 'వసుంధర'పథకాన్ని ఏ లక్ష్య సాధన కోసం ఏర్పాటు చేశారో దాన్ని సాధించడంలో ఆచరణలో, క్షేత్రస్థాయిలో విస్తారమైన సమస్యలున్నట్లు ఒడిశా ప్రభుత్వ యంత్రాంగం గుర్తించింది.

2009–10లో 'లాండెసా' అనే గ్రామీణాభివృద్ధి సంస్థ కొన్ని ఎంపిక చేసుకున్న గ్రామాల్లో 'వసుంధర' పథకం అమలుపై క్షేత్రస్థాయి అధ్యయనాన్ని నిర్వహించింది. వసుంధర పథకం అమలు ఆచరణలో అతి తక్కువగానే విజయం సాధించిందని, దీనికి ప్రధాన కారణంగా

తగినంత భూ రెవెన్యూ సిబ్బంది లేకపోవడమేనని గుర్తించింది. భూమిలేని గ్రామీణ కుటుంబాలను గుర్తించి, వారికి భూ హక్కులు కల్పించే ప్రత్యేక అధికరణ 'వసుంధర' పథకంలో పొందుపరచక పోవడం కూడా దీని వైఫల్యానికి మరో కారణంగా 'లాండెసా' సంస్థ తన అధ్యయనంలో తేల్చింది.

**దీర్ఘకాలిక భూసంబంధ సమస్యల అన్వేషణ!**

భూసంబంధ సమస్యల పరిష్కారం కోసం 'లాండెసా' సంస్థ ఓ పైలెట్ ప్రాజెక్టను చేపట్టింది. స్థానిక యువతకు శిక్షణ ఇచ్చి రంగంలోకి దింపింది. అప్పటికే ఉన్న రెవెన్యూ సిబ్బందికి వీరు అదనంగా జత అయ్యారు. స్థానిక యువతను లాండెసా ఎన్నుకొని వారికి తగిన శిక్షణ ఇచ్చి రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌కి సహాయకులుగా నియమిస్తారు. వీరిని భూ సంజోక్ లేదా భూ మిత్రులుగా పిలుస్తారు. భూమి లేని వారి వివరాలను క్షేత్రస్థాయిలో ఇంటింటికీ తిరిగి రెవెన్యూ సిబ్బంది ఖచ్చితంగా సేకరించలేని స్థితి నుంచి ఉత్పన్నమైందే ఈ భూ మిత్ర వ్యవస్థ. భూమి లేని వారి వివరాలను ఖచ్చితత్వంతో నమోదు చేయడానికి అదనపు సిబ్బంది తప్పనిసరి అయింది. రెవెన్యూ విభాగానికి సహాయకారిగా ఉండే ఉద్దేశ్యంతోనే స్థానిక యువతను భూ మిత్రులుగా ఎంపిక చేసి భూమి లేని వారి వివరాలను క్షేత్రస్థాయిలో నమోదు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ పైలెట్ ప్రాజెక్ట్ రూపకల్పన కోసం లాండెసా సంస్థ దశల వారీ ప్రణాళికలను సిద్ధం చేసింది. భూ మిత్రులు చేయాల్సిన పనులు, లక్ష్యాలు మున్నగువాటిని రెవెన్యూ విభాగంతో సంయుక్తంగా క్రోడీకరించి రూపొందించింది. ఈ పైలెట్ ప్రాజెక్ట్‌లో పాల్గొనే భూ మిత్రులు రెవెన్యూ సిబ్బందితో ముఖ్యంగా రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌తో కలిసి పని చేయాల్సి ఉన్నందున వారి సహకారంతో లాండెసా పక్కా కార్యాచరణను సిద్ధం చేసింది. ఈ భూ మిత్రులు క్షేత్రస్థాయిలో చేయాల్సిన విధులు, కర్తవ్యాలు ఈ విధంగా ఉన్నాయి.

1. భూ మిత్రులు క్షేత్రస్థాయిలో భూమి లేని వారి వివరాలను సేకరించడం.
2. స్థానికంగా ప్రతి ఇంటికి సంబంధించిన సమాచారాన్ని సేకరించి, ప్రభుత్వ రికార్డులతో సరిచూసుకొనడం.
3. భూ హక్కు రికార్డుల్లోని పేర్లతో భూమి లేని వారి కుటుంబ సభ్యుల పేర్లను సరిపోల్చడం.
4. రెవెన్యూ సిబ్బందికి ఈ దిశగా క్షేత్ర పరిశీలనలో అవసరమైన సమాచార సహకారాన్ని అందించడం.
5. అవసరమైన దరఖాస్తులను, నమూనా పత్రాలను నింపడం.
6. రెవెన్యూ విభాగం నిర్వహించే శిబిరాల్లో వ్యవసాయ భూమిలేని, ఇంటి స్థలాలు లేని వారు విధిగా పాల్గొనేలా చేయడం.
7. వీటితో పాటు రెవెన్యూ విభాగం నూతనంగా తీసుకొచ్చే పలు పథకాలు, కార్యక్రమాలు అంటే 'వసుంధర' వంటి వాటిపై స్థానికులకు అవగాహన కల్పిస్తూ వారిలో చైతన్యం తీసుకొని రావడం ద్వారా ద్వారా ప్రభుత్వానికి, లబ్ధిదారులకు మధ్య దూరాన్ని తగ్గించడం.

**భూమిత్ర వ్యవస్థకు కొలమానాలు**

ఒక కాల పరిమితిలో భూమి లేని వారికి భూ వసతి కల్పించడానికి, స్థానిక యువతకు శిక్షణ ఇవ్వడం, వారిని రెవెన్యూ విభాగానికి సహాయకారిగా చేయడం ద్వారా ఏర్పరుచుకున్న లక్ష్య సాధన పరిపూర్తి చేసే భూ మిత్ర పైలెట్ ప్రాజెక్ట్ సంపూర్ణ విజయాన్ని సాధించింది. దీని కోసం వెలుపలి నుంచి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తున్న 'ఒడిశా గిరిజన సాధికారత, జీవనోపాధి కార్యక్రమాన్ని లాండెసా ఎంచుకుంది. 'వసుంధర' వంటి కార్యక్రమం ద్వారా సుదీర్ఘకాలంగా భూమి లేని వారిని గుర్తించడానికి, వారికి భూ కేటాయింపులు చేయడానికి ఈ 'ఒడిశా గిరిజన సాధికారత, జీవనోపాధి కార్యక్రమం' ఎంతో దోహదపడింది.

ఒడిశాలో 7 జిల్లాల్లో 1056 ప్రాజెక్టు గ్రామాల్లో భూమి లేని వారిని గుర్తించి వారికి భూ కేటాయింపులు జరపడానికి అవసరమైన సాంకేతిక శిక్షణను 'లాండెసా' అందివ్వగా ఈ సంస్థతో 'ఒడిశా గిరిజన సాధికారత, జీవనోపాధి కార్యక్రమం' ఒడంబడిక చేసుకోవడం ద్వారా అవసరమైన స్థానిక భూ మిత్రుల ఎంపిక, శిక్షణ సాధ్యపడింది.

అతి తక్కువ సమయంలో భూమి లేని 30,000 కుటుంబాలను ప్రాజెక్టు గ్రామాల్లో లాండెసా గుర్తించింది. దాదాపు 98 శాతం భూమి లేని గ్రామీణ పేదల గుర్తింపు కార్యక్రమాన్ని లాండెసా 'ఒడిశా గిరిజన సాధికారత, జీవనోపాధి కార్యక్రమం' సహాయంతో పూర్తి చేయగలిగింది. ఈ ప్రాజెక్టు గ్రామాల్లో దాదాపు 16,000 పట్టాల పంపిణీ కార్యక్రమం పూర్తయింది.

ఈ విజయాన్ని ఆధారంగా చేసుకొని ఒడిశా ప్రభుత్వం 12 జిల్లాల్లోని 119 గిరిజన తండాల్లోని 18,000 గ్రామాలకు 'భూ మిత్ర' కార్యక్రమాన్ని విస్తరించింది. ఈ గిరిజన తండాల్లోని అయిదు లక్షల కుటుంబాల్లో ఉన్న 12 లక్షలమందికి లబ్ధి చేకూరేలా భూ కేటాయింపులు ఉంటాయని ఓ అంచనా. ఒడిశా ప్రభుత్వానికి చెందిన షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల శాఖ ఈ మొత్తం కార్యక్రమానికి నోడల్ ఏజెన్సీగా పనిచేస్తోంది. భూమి లేని వారికి భూ కేటాయింపుల్లో లాండెసా, 'ఒడిశా గిరిజన సాధికారత, జీవనోపాధి కార్యక్రమం' సంయుక్తంగా ఒడిశా ప్రభుత్వానికి రెవెన్యూ విభాగానికి, ఆయా జిల్లాల్లోని అధికార యంత్రాంగానికి అవసరమైన మద్దతును అందిస్తున్నాయి. బ్లాకు స్థాయిలో ఎన్జీవోలు, జిల్లా స్థాయిలో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఈ భూ కేటాయింపు కార్యక్రమానికి అవసరమైన హంగులను సమకూరుస్తున్నాయి.

**ప్రజా ప్రాతినిధ్యం ద్వారా పాలన సంస్కరణలు**

భూ పరిపాలన ప్రత్యేకించి భూమి లేని వారికి భూ కేటాయింపుల అంశం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిదే! 'భూ మిత్రుల' సహకారంతో క్షేత్రస్థాయిలో భూమి లేని వారిని గుర్తించడానికి దీనికి సంబంధించిన ప్రభుత్వ నిర్వచనాన్ని అనుసరిస్తూ జాబితాను తయారు చేయడంలో రెవెన్యూ సిబ్బంది సహకారంతో సంప్రదాయంగా వస్తున్న జ్ఞానంతో, స్థానిక గ్రామీణులే పాల్గొంటున్న ఈ ప్రాజెక్టు విజయం మరిన్ని కార్యక్రమాలకు పునాదిగా నిలిచింది. ఇప్పుడు భూ కేటాయింపులు కార్యక్రమం ప్రజా ప్రాతినిధ్యం ఉన్న పథకంగా రూపాంతరం చెందింది.

స్థానిక ప్రజలను సమన్వయం చేసుకొంటూ భూమి లేని వారి జాబితాలను సిద్ధం చేయడానికి మాత్రమే పరిమితం కాలేదు. క్షేత్రస్థాయి పరిశీలనలో భూమి లేని వారు చురుగ్గా తమకు వచ్చిన భూమిని గుర్తించడంలో, వాటి సరిహద్దులను నిర్ధారించుకోవడంలో వ్యవహరించడం ద్వారా భవిష్యత్‌లో ఎదురయ్యే సంక్లిష్టతలను అధిగమించడం సాధ్యమైంది. గతంలో ఎవరికి భూమి ఉంది, ఎవరికి భూమి లేదు అన్న విషయం స్థానిక గ్రామస్థులకు తెలిసేది కాదు. భూ కేటాయింపు కార్యక్రమంలో 'భూ మిత్రులు' భూమి లేని వారిని పాల్గనేలా చేయడం ద్వారా ఈ మొత్తం పథకం ప్రజా ప్రాతినిథ్య వ్యవహారంగా ఆవిర్భవించింది. ఒడిశాలో ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల సహకారంతో అతి సంక్లిష్టమైన భూ కేటాయింపులు, భూ సమస్యల పరిష్కారాల్లో 'భూ మిత్ర' వ్యవస్థ అమోఘమైన పాత్ర పోషించింది.

ప్రభుత్వం నిర్వర్తించాల్సిన అతి సంక్లిష్టమైన భూ పంపిణీ కార్యక్రమంలో ప్రజలను పాల్గొనేలా చేయడం, తద్వారా పౌర సమాజం నేతృత్వంలో భూ కేటాయింపులు జరపడం ఒక అసాధారణ ఉదాహరణగా చెప్పాలి. సమష్టి పర్యవేక్షణ, ప్రణాళికతో భూ కేటాయింపు కార్యక్రమం నిర్వహణలో 'భూ మిత్ర' వ్యవస్థ సత్ఫలితాలను ఇవ్వడంలో మంచి గుర్తింపును సాధించింది. ఇక్కడ వ్యక్తిగత కృషి సమష్టి వృద్ధికి దోహదపడే పరిణామం ఆవిష్కృతమైంది. ప్రభుత్వ యంత్రాంగానికి ప్రజా సమూహాల సహకారం తోడైతే సాధించే విజయాలకు, అభివృద్ధికి ఇది నిలువెత్తు ఉదాహరణగా నిలిచింది. భూమి లేని వారిని గుర్తించడంలో స్థానిక ప్రజలను పాల్గొనేలా చేసే 'భూ మిత్ర' వ్యవస్థ తను రూపొందించిన లబ్ధిదారుల జాబితాను ప్రభుత్వ యంత్రాంగంతో సరిపోల్చుకోవడం, అక్కడి నుంచి అంతిమ సమాచారాన్ని క్షేత్రస్థాయిలో అమలు పర్చడం ద్వారా స్థానిక ప్రజా నాయకత్వం మరింత బలోపేతం కావడాన్ని మనం ఇక్కడ చూడొచ్చు. ప్రజలకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేయడంలో విజయం అంతా పూర్తిగా స్థానిక ప్రజలపై ఉంచిన విశ్వాసం, వారిని కార్యక్రమాల్లో భాగస్వాములుగా చేయడం ద్వారానే ఈ భూ కేటాయింపు కార్యక్రమం అత్యంత విజయాన్ని సాధించింది. దీంతో గతంలో ఉన్న ప్రభుత్వం, స్థానిక ప్రజల మధ్య సహకారంతో సంయుక్తంగా కలిసి పనిచేయడం సాధ్యం కాదన్న అపోహ తొలిగిపోయింది.

అభివృద్ధి ప్రక్రియలో కొత్త కొత్త అధ్యాయాలు ఆవిష్కృతం అవుతున్న కొద్దీ సంక్లిష్టమైన అభివృద్ధి సవాళ్లను విజయవంతంగా ఎదుర్కొనడానికి ప్రభుత్వ యంత్రాంగం కూడా సరికొత్త విధానాలను అవలంభించాల్సి వస్తుంది. భూమి లేని వారికి భూ కేటాయింపు వ్యవహారం అత్యంత సంక్లిష్టమైన వ్యవహారం. వివిధ స్థాయిల్లో, వివిధ దశల్లో ఉమ్మడి సహకారం లేకుండా, క్షేత్రస్థాయి పరిశీలనలో స్థానికుల ప్రవేశం లేకుండా భూ కేటాయింపు కార్యక్రమం సాధ్యమయ్యేది కాదు. భూమి లేని వారి వివరాలను తెలుసుకొనే అతి కీలకమైన ప్రభుత్వ కర్తవ్యాన్ని సంపూర్ణంగా నెరవేర్చడంలో 'భూ మిత్ర' వ్యవస్థ అందించిన సహకారం తద్వారా భూ పాలనలో స్థానికుల ప్రమేయానికి ఆస్కారమేర్పడడం సాధ్యమైంది.

భూమి హక్కుల ప్రాధాన్యత గురించి ప్రజల్లో అవగాహన పెంచడం! భూమి లేని వారిని గుర్తించే విధానం ఎలాంటిదంటే భూమికి సంబంధించిన అన్ని విషయాలను బహిరంగ పరచడం సాధ్యమయింది. 'భూ మిత్ర' వెనుకున్న తాత్వికత కారణంగా భూ సంబంధమైన అన్ని విషయాల్లో కమ్యూనిటీలకు, ప్రభుత్వానికి మధ్య సత్సంబంధాలను నెలకొల్పడం సాధ్యమయింది. ఒక చిన్న భూ కమతాన్ని సొంతం చేసుకోవడం ప్రజల హక్కుగా వారు గుర్తించడంలో ఈ పైలట్ ప్రాజెక్టు, 'ఒడిశా గిరిజన సాధికారత, జీవనోపాధి కార్యక్రమం', 'భూ మిత్ర' విజయం సాధించాయి.

'భూ మిత్ర' కేవలం భూమి లేని వారిని గుర్తించడమే కాకుండా ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారి వివరాలను క్షేత్రస్థాయి పరిశీలనలో తెలుసుకోవడానికి రెవెన్యూ విభాగానికి ఎంతో దోహదపడింది. అనధికార ఆక్రమణలను 'భూ మిత్ర' ప్రభుత్వం దృష్టికి తీసుకొని రావడం ద్వారా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విధుల నిర్వహణకు ఎంతగానో దోహదపడింది. తద్వారా 'భూ మిత్ర' గ్రామస్థుల విశ్వాసాన్ని, నమ్మకాన్ని చూరగొంది. దీంతో గ్రామస్థులు, ఇతర పేదలు తమ సమస్యలను 'భూ మిత్ర' ద్వారా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో పరిష్కరించుకొనే సదుపాయం ఏర్పడింది.

గతంలో మొత్తం రెవెన్యూ ప్రక్రియలో కమ్యూనిటీలు పాల్గొనే అవకాశం లేకపోవడంతో ప్రభుత్వ భూమి దురాక్రమణకు గురైన సందర్భంలో దాన్ని గుర్తించి, వారిని తొలగించే కార్యక్రమానికి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చొరవ తీసుకోవడం సాధారంగా జరిగేది కాదు. ప్రభుత్వ భూమిని దబ్బున్న, పలుకుబడి ఉన్నవారు ఆక్రమించుకున్న వ్యవహారం ఇప్పుడు మొత్తం గ్రామ సమస్యగా మారిపోయింది. గ్రామాల్లో చదువుకున్న యువతను ప్రభుత్వ భూ క్రమబద్ధీకరణలో భాగస్వాములను చేయడంతో భూ కేటాయింపుల్లో నూతన అధ్యాయం మొదలైంది. అదనపు భూమి వచ్చి చేరడంతో వ్యక్తికి చెందాల్సిన వాటా మొత్తం కూడా పెరగడంతో ఉమ్మడిగా అందరూ లాభపడే అంశం గ్రామ స్థాయిలో ఆవిష్కృతమైంది.

గ్రామాల్లోని చదువుకున్న యువతను ప్రభుత్వ భూమికి సంబంధించిన క్రమబద్ధీకరణలో భాగస్వాములను చేయడంతో భూమి లేని వారికి భూమిని కేటాయించే ప్రక్రియ మరింత సులభతరమైంది. గతంలో పౌర సమాజానికి, గ్రామ కమ్యూనిటీలకు రెవెన్యూ ప్రక్రియలో ఇలాంటి ప్రత్యక్ష పాత్ర ఉండేది కాదు. ప్రజా ప్రాతినిథ్యంతో భూ కేటాయింపులు, భూ సంబంధ సమస్యల పరిష్కారాన్ని ఎవరూ ఊహించను కూడా ఊహించలేని స్థితి ఉండేది. కేవలం ప్రభుత్వానికి మాత్రమే బాధ్యత, హక్కు ఉన్న రెవెన్యూ విభాగంలో దేశంలోనే మొట్టమొదటిసారిగా ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల సంయుక్త సహాయ, సహకారాలతో అపూర్వ భాగస్వామ్యం సాక్షాత్కరించింది. భూ కేటాయింపుల్లో ప్రభుత్వేతర వ్యక్తుల భాగస్వామ్యాన్ని అనుమతించడం ద్వారా ప్రభుత్వానికి గ్రామాల్లో మద్దతిచ్చే కమ్యూనిటీ సామర్థ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం బహిరంగంగా గుర్తించినట్లైంది. అసాధ్యమైన వాటిని సామాజికంగా సాధ్యం చేయడంలో స్థానిక యువత శక్తియుక్తులను కూడా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది.

*తరువాయి 45వ పేజీలో...*

# మీకు తెలుసా ?

## ఇస్లామిక్ బ్యాంకింగ్ అంటే ఏమిటి?

ఇస్లాం మత సిద్ధాంతం ఆధారంగా సాగేదే ఇస్లామిక్ బ్యాంకింగ్. ఆ మత సూత్రాల ప్రకారం ఏర్పాటైన బ్యాంకు తానిచ్చే రుణంపై వడ్డీ వసూలు చేయడం నిషిద్ధం. లాభాంశంతోపాటు నష్టభయాన్నీ పంచుకోవడమే దీని మూల సూత్రం. కాబట్టే రుణగ్రహీతపై రుణదాతకు అధికారమిచ్చే వడ్డీ విధించడం నేరం. సొమ్ము అవసరమైన వ్యక్తి వడ్డీ చెల్లించాల్సిన సందర్భాల్లో అప్పిచ్చినవాడి దోపిడీకి బాధితుడుగా మిగిలిపోతాడు. డబ్బును విలువకట్టే సాధనంగానే తప్ప ఆస్తిగా ఇస్లాం అంగీకరించదు. డబ్బుద్వారా ఆదాయార్జన కాకుండా లాభనష్టాలను పంచుకోవాలన్నదే ఇందులో ముఖ్యోద్దేశం. ఇలా రుణం ఇవ్వడాన్ని ఓ సామాజిక మదుపుగానే పరిగణిస్తుంది. వడ్డీ వసూలును ఒక అన్యాయంగానూ, రుణదాతకు రుణగ్రహీతపై పెత్తనం ఇచ్చేదిగానూ భావిస్తుంది. కాబట్టే వడ్డీ వ్యాపారాన్ని అంగీకరించదు. ఏదైనా కంపెనీ వాటాలలో పెట్టుబడి పెట్టడాన్ని ఇస్లామిక్ చట్టం షరియా అనుమతి స్తుంది. అదీ సదరు సంస్థకు జూదం, మద్యం ఉత్పత్తి వంటి నిషేధిత కార్యకలాపాలతో సంబంధం లేనప్పుడు మాత్రమే.

ఈ తరహా బ్యాంకింగ్ వ్యవస్థ 1960 దశకంలో ఇస్లామిక్ దేశాల్లో ఊపందుకుంది. ఆ తర్వాత 1975లో సభ్యదేశాలకు నిధులు సమకూర్చేందుకు వీలుగా సౌదీ అరేబియా రాజధాని జెడ్డా ప్రధాన కేంద్రంగా ఇస్లామిక్ అభివృద్ధి బ్యాంకు (ఐడీబీ) ఏర్పాటైంది. దీనికి కజకిస్థాన్, మొరాకో, మలేసియా, సెనెగల్ దేశాల్లో ప్రాంతీయ కార్యాలయాలున్నాయి. చాంద్రమాన హిజ్రి సంవత్సరాన్ని ఐడీబీ ఆర్థిక సంవత్సరంగా పరిగణిస్తారు. ఇస్లాం సిద్ధాంతాలకు అనుగుణంగా సామాజికార్థిక అభివృద్ధి సాధనే ఈ బ్యాంకు ప్రధాన లక్ష్యం. ఐడీబీ మూలధన మార్కెట్లలో మదుపు చేస్తుంది. అలాగే ఉత్పాదక కార్యకలాపాలకు రుణాలు మంజూరు చేయడంతోపాటు సభ్యదేశాలకు ఆర్థిక ఆసరా ఇస్తుంది. అంతేకాకుండా షరియాకు అనుగుణమైన పద్ధతులలో డిపాజిట్లు స్వీకరిస్తుంది. వనరులను కూడగడుతుంది. విదేశీ వాణిజ్యాన్ని ప్రోత్సహిస్తుంది. సభ్య దేశాలు ప్రత్యేకించి యంత్ర పరికరాల వంటి మూలధన ఆస్తుల కొనుగోలుకు తోడ్పడుతుంది. ప్రస్తుతం 56 ఇస్లాం దేశాలకు సభ్యత్వం ఉన్న ఐడీబీ అధీకృత మూలధనం 1992 జూన్ నాటికి 200 కోట్ల ఇస్లాం దినార్లు. ఐడీబీలో ఒక యూనిట్ ఖాతా అంతర్జాతీయ ద్రవ్య నిధిలో ఒక ప్రత్యేక నిధి హక్కు (ఎస్‌డీఆర్)తో సమానం. ఓ నివేదిక ప్రకారం ఇస్లామిక్ బ్యాంక్ వృద్ధి రేటు ఏటా 10 నుంచి 15 శాతంగా ఉంది. ఇస్లామిక్ బ్యాంకులు మొత్తం 51 దేశాల్లో 300 సంస్థలు కలిగి ఉన్నాయి. షరియా అనుగుణమైన ఆస్తుల విలువ 82,200 కోట్ల డాలర్లని అంచనా. ఇది 2005లో ప్రపంచ ఆస్తుల మొత్తం అంచనా విలువలో 0.5 శాతం.

సంప్రదాయ బ్యాంకుల్లాగానే ఇస్లామిక్ బ్యాంకులు కూడా విస్తృత కార్యకలాపాలు నిర్వహిస్తాయి. అయితే, సమధర్మం పాటించాలన్న ఇస్లామిక్ చట్టానికి కట్టుబడి ఉండటమే వాటి ప్రత్యేకత. కాగా కొన్ని ఇస్లామిక్ బ్యాంకులు వందశాతం నగదు నిల్వల నిష్పత్తి కలిగి ఉన్నాయని సమాచారం. తాము నైతిక మదుపు, విలువలకు కట్టుబడిన కొనుగోళ్ల వ్యవహారాలలో నిమగ్నమై ఉంటామని కొన్ని ఇస్లామిక్ బ్యాంకులు పేర్కొంటాయి. అదే సమయంలో వాటిపై కొన్ని ఇస్లాం దేశాల్లో వాటి కార్యకలాపాలు అప్రాధాన్య రంగాలకు పరిమితమై ఉండటం వల్ల సవాళ్లను ఎదుర్కొంటున్న ఉదాహరణలూ ఉన్నాయి.

## ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్ అంటే...

ఎవరైనా, ఎక్కడైనా స్వేచ్ఛగా, ఉచితంగా వాడుకోగలిగేది... మార్పుచేర్పులకు వీలున్నదీ, సులభంగా పంచుకోదగినది... దీన్నే సాంకేతికంగా ఓపెన్ సోర్స్ ఇనిషియేటివ్ (ఓఎస్ఐ)గా పిలుస్తారు. వీటికి అనేకమంది రూపకర్తలుంటారు. ఓఎస్ఐ నిర్వచనానికి అనుగుణమైన లైసెన్సులకింద పంపిణీ చేస్తారు. ఇది కంప్యూటర్ ప్రోగ్రాములకు సంబంధించినది. రూపకర్తలకు సాఫ్ట్‌వేర్‌పై పూర్తి హక్కులున్నా దాని అధ్యయనానికి, మార్పుచేర్పులు చేసేందుకు, నిర్దేశిత లైసెన్సుతో ఇతరులకు అందించేందుకు అవకాశం ఉంటుంది. ఓపెన్ సోర్స్ లేబుల్‌ను అమెరికాలోని కాలిఫోర్నియాలోగల పాలో ఆల్టో నగరంలో 1998 ఫిబ్రవరి 3న ఆవిష్కరించారు. ఇందుకోసం ఏర్పాటైన సమావేశంలో ఈ ఉద్యమ ప్రోత్సాహకులు ఎరిక్ రేమాండ్, మైకేల్ టీమాన్ కూడా పాల్గొన్నారు. అటుపైన 1999 అక్టోబర్ నాటికి ఓఎస్ఐ లాంఛనప్రాయంగా ఆమోదించిన లైసెన్సుల తొలి జాబితాను

ప్రచురించింది. దీన్ని వివిధ దేశాల ప్రభుత్వాలు, ప్రామాణిక సంస్థలుసహా ఎందరో అధ్యయనం చేశారు. ఆ తర్వాత ఉచిత సాఫ్ట్‌వేర్ ఫౌండేషన్‌తో సమానంగా ఓఎస్ఐ కూడా ఉచిత, అందరికీ అందుబాటులో ఉండే సాఫ్ట్‌వేర్ రూపకర్తలకు సలహా సంస్థగా రూపుదాల్చింది. పూర్తి హక్కులున్న సాఫ్ట్‌వేర్‌లతో పోలిస్తే ఉచితంగా లభ్యమయ్యేవి వాడుకదారులకు ఎంతో స్వేచ్ఛనిస్తాయి. సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయాలంటే అనేకమంది భాగస్వామ్యం తప్పనిసరి. వాణిజ్యపరంగా రూపొందే సాఫ్ట్‌వేర్ తన మూలసూత్రాన్ని బహిరంగపరచదు. అయితే, అందరికీ అందుబాటులో ఉండే ఎన్నో ఉచిత సాఫ్ట్‌వేర్‌లు టెలికమ్యూనికేషన్ పరికరాలు, విద్యా పరిశోధన వంటి రంగాల్లో ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయి.

సమాజంలో భిన్న మార్గాల్లోని వారిమధ్య వారధిగా నిలవడమే ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్ పరమోద్దేశం. సమాజానికంతటికీ మేలు కలగాలన్నదే దీని ధ్యేయం. ఈ పద్ధతిని ప్రోత్సహించేవారి అభిప్రాయం ప్రకారం ఇది ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలిస్తుంది. ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్‌ను వాణిజ్యావసరాల కోసం కూడా ఉపయోగించవచ్చు. అయితే, వాటిని ఉపయోగించే వ్యక్తి, తనద్వారా అదే సాఫ్ట్‌వేర్‌లను వాడుకునేవారిపై ఎలాంటి ఆంక్షలు విధించరాదు. అలాగే దాన్ని వారెలా వాడుకుంటున్నారన్న అంశాన్ని కూడా నిర్దేశించరాదు. ఆయా ప్రోగ్రాములను వాడుకునే వ్యక్తులు, సమూహాల విషయంలో వివక్ష ప్రదర్శించకూడదు. ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్ ప్రబోధకుల అభిప్రాయం మేరకు ఇది ఆచరణాత్మకంగా సాగాలి తప్ప ఓ సిద్ధాంతంగా మిగిలిపోరాదు. ఇక ఆమోదిత లైసెన్సు లేనిదే దేన్నయినా ఓపెన్ సోర్స్ ప్రోగ్రామ్‌గా పరిగణించరాదు. ప్రభుత్వ వెబ్‌సైట్లలో లభ్యమయ్యే సాఫ్ట్‌వేర్ కూడా ఓ రకంగా ఓపెన్ సోర్స్ రకానికి చెందినదే. అయితే, ఈ అంశంలో కొన్ని చిక్కులూ ఉన్నాయి. చివరగా లైసెన్సులకు సంబంధించి ఉల్లంఘనకు పాల్పడితే చట్టబద్ధ సంస్థలు కావుగనుక తమవంటివారు ఎలాంటి సహాయం చేసే పరిస్థితి ఉండదని ఓఎస్ఐ వంటి సంస్థలు స్పష్టం చేస్తున్నాయి. ***యోజన సంపాదకవర్గం***

*43వ పేజీ తరువాయి...*

## గ్రామీణ భూ నిర్వహణలో మార్పు

రికార్డ్ కాల వ్యవధిలో ఫలితాలను సాధించడం ద్వారా 'భూ మిత్ర' ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య మరోసారి గట్టి సంబంధాలను పునఃప్రతిష్ఠించడంలో విజయం సాధించింది. భూ కేటాయింపు వంటి అతి సంక్లిష్టమైన వ్యవహారంలో పౌర సమాజం, ప్రభుత్వ సంస్థలు తమతమ పాత్రలను ఇతోధికంగా గుర్తిస్తూ, పరస్పరం సహకరించుకొనే ఆచరణకు వీలైన అసమాన్యమైన అనుభవాన్ని 'భూ మిత్ర' వ్యవస్థ సాకారం చేసింది. భూమి లేని వారిని గుర్తించడంలోనే కాకుండా భూమికి సంబంధించిన కీలక విషయాలను రెవెన్యూ విభాగానికి తెలియచేయడంలో 'భూ మిత్ర' క్రియాశీలక పాత్ర పోషించింది.

భూ సంబంధమైన సమాచారాన్ని కమ్యూనిటీ స్థాయిలో అందరికీ అందుబాటులోఉంచుతూ, దాన్ని ఎప్పటికప్పుడు అందరికీ అందుబాటులో ఉంచడంతో కమ్యూనిటీల క్రియాశీలత పెరగడానికి దోహదపడిరది. భూ సంబంధ పత్రాలు అందుబాటులోకి రావడం, 'భూ మిత్ర' వ్యవస్థ ఉనికిలో ఉండడం కారణంగా ప్రజలే పదే పదే రెవెన్యూ కార్యాలయాలకి రావడం, భూ సంబంధ వివరాలను సరిచూసుకోవడం సాధ్యమైంది. భూ కేటాయింపుల కార్యక్రమంలో స్థానిక ప్రజలకు విస్తారమైన సాధికారత లభ్యం కావడానికి 'భూ మిత్ర' పాత్ర అత్యంత కీలకమైంది. రెవెన్యూ అధికారులకు, స్థానిక కమ్యూనిటీలకు అనుసంధానంగా ఉన్న 'భూ మిత్ర' వ్యవస్థ దాని పరిధిలోకి రానప్పటికీ భూ సంబంధ తగాదాల పరిష్కారంలోనూ సముచిత పాత్ర పోషించడం సాధ్యమైంది. కేటాయించిన భూకమతాలపై హక్కు ఉమ్మడిగా భార్యాభర్తకు ఉన్నప్పటికీ, 'భూ మిత్ర' వ్యవస్థ కారణంగా భూ కేటాయింపులపై మహిళలకు సముచిత స్థానం లభించింది. ఇందులో మహిళల భాగస్వామ్యమూ పెరిగింది. 2013, నవంబర్ నాటికి అందుబాటులో ఉన్న పట్టా పంపిణీ గణాంకాల ప్రకారం ప్రాజెక్టు గ్రామాల్లో ఇంటి స్థలాలు, వ్యవసాయభూముల కేటాయింపును కుటుంబంలోని భార్యాభర్తపేరుపై సంయుక్తంగా 94 శాతం కేటాయించగా మహిళలే ఇంటి పెద్దలుగా ఉన్న కుటుంబాలకు 2.5 శాతం పట్టా పంపిణీ చేయడం జరిగింది. ఈ విధంగా భూ స్థలాలకు సంబంధించిన పట్టాలు పొందిన తరువాత చాలా మంది మహిళలు ఇలాంటి విషయాలను గతంలో తామెన్నడూ వినలేదని, భూమికి తమకు సంయుక్త హక్కు లేదా సంపూర్ణ హక్కు రావడం అపూర్వ అనుభవంగా పేర్కొన్నారు. ఇంటి స్థలాలను పొందిన తరువాత మహిళల్లో మరింత ఉత్పాదకత పెరిగి, ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గనడం జరిగింది. ఇంటిస్థలాలు, వ్యవసాయ భూములపై హక్కు దఖలైన మహిళలు ఓ సంఘంగా ఏర్పడి మరింత ఉత్పాదక కార్యక్రమాలకు, మరిన్ని ప్రభుత్వ సేవలను పొందడానికి శ్రీకారం చుట్టిన ఉదాహరణలు కోకొల్లలు. మహిళలే ఇంటి పెద్దలుగా ఉన్న కుటుంబాల్లో పట్టా రావడం కారణంగా వారికి నివాసిత ధృవ పత్రాలను పొందడం మరింత సులువవడంతో వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పించడానికి ఆస్కారమేర్పడింది.

***అనువాదం : జి. దత్తాత్రేయ***

# మహాప్రతిభావంతుడు కొమర్రాజు వెంకట లక్ష్మణరావు

కొమర్రాజు వెంకటలక్ష్మణరావు ఈ శతాబ్ది తెలుగు వారి సర్వతోముఖ వికాసానికి, సమగ్ర సామాజికాభ్యుదయానికి ఉదయించిన వేగుచుక్క. తెలుగు వారిని చైతన్యోత్తేజితులను చేసిన వైతాళికుడు. సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక, సారస్వత, చారిత్రక సమగ్ర వికాసానికి ఘంటాపథం నిర్మించే ప్రణాళికలు వేసిన మేధావి కొమర్రాజు వెంకటలక్ష్మణరావు.

కొమర్రాజు వెంకటలక్ష్మణరావు గంగమ్మ, వెంకటప్పయ్య దంపతులకు కృష్ణా జిల్లా పెనుగంచిప్రోలు గ్రామము నందు 1877 మే 18న జన్మించారు.

లక్ష్మణరావు తెలుగు నాట విజ్ఞాన చంద్రికలు విరియింపజేసిన మహావ్యక్తి. దార్శనికుడు. చరిత్రవేత్త. సారస్వతమూర్తి. సంస్థా నిర్మాత. ఇరవయ్యో శతాబ్ధి తెలుగు వారి కీర్తి పతాక క్రాంత దర్శి భావితరాల తెలుగు వారికి ఆరాధ్యుడు.

సాహిత్యం, వేదాంతం, లలిత కళలు, దర్శన శాస్త్రాలు, విజ్ఞానశాస్త్రం,దేశ చరిత్ర, ప్రపంచ చరిత్ర, రాజకీయ శాస్త్రం, సామాజిక శాస్త్రం, శాసన పరిశోధనలన్నింటిలోనూ లక్ష్మణరావు గొప్ప ప్రతిభావంతుడు. తన జీవిత కాలంలో మౌలికమైన కృషి చేసాడు. సంస్కృత ప్రాకృతాలలో, పాలీ భాషలో, ఇంగ్లీషు, తెలుగులలో ఆయన గొప్ప పండితుడు. కాబట్టి ప్రాచ్య పాశ్చాత్య విజ్ఞాన సమ్మేళనం, సమన్వయ వికాసం ఆయన వ్యక్తిత్వంలో రూపుదిద్దుకున్నాయి.

మునగాల రాజు గారి దివాన్‌గా ఉన్న కొమర్రాజు లక్ష్మణరావు మునగాల రాజు గారి పక్షాన హైకోర్టులో లాయర్ల చేత పని చేయించటానికి 1905 సంవత్సరారంభంలో సకుటుంబంగా చెన్నపట్నంవెళ్ళి కచ్చాళీశ్వరాగ్రహారంలో కాపురమున్నారు. కొమర్రాజు తెలుగు వారిలో పుస్తక పఠనాభిలాషను పెంచడం ఒక ఉద్యమంలాగా పుస్తక పఠనాభిరుచిని తెలుగుదేశంలో ఆయన వ్యాపింపజేసారు.

“విజ్ఞాన చంద్రిక మండలి”ని 1906లో స్థాపించి స్థిర ప్రాతిపదికపై చందా దారులను చేర్పించారు. గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, అయ్యదేవర కాళేశ్వరరావు, మల్లంపల్లి సోమశేఖర శర్మ మొదలైన

మోసర్ల శ్రీ అంజని
తెలుగు అధ్యాపకురాలు, లాల్‌బహదూర్ కళాశాల, వరంగల్



మేధావులు ఆ సంస్థ నిర్వహణలో పాలు పంచుకొన్నారు.

దేశ చరిత్రలు, స్వీయ చరిత్రలు, మహా పురుషుల జీవిత చరిత్రలు అన్నీ కలిపి పది సంవత్స రాల వ్యవధిలో ముప్పై గ్రంథాలు ప్రకటించారు లక్ష్మణరావు గారు.

1901 లోనే హైదరాబాదులో శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం స్థాపించడంలో కృషి చేసి తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి దోహదం చేసారు. చిలుకూరి వీరభద్రరావు రచించిన ‘ఆంధ్రుల చరిత్ర”లో ఎన్నో స్ఖాలిత్యాలను సవరించి, పరిష్కరించి కొమ్మరాజు లక్ష్మణరావు ప్రచురించారు. అలాగే కేతవరపు వెంకటశాస్త్రి రచించిన ‘రాయ చూరు యుద్ధము” లోను, దుగ్గిరాల రామచంద్రయ్య రచించిన ‘విజయ నగర సామ్రాజ్యము” ఏవి. నరసింహం పంతులు రచించిన “పాతాళభైరవి” లోను, భోగరాజు నారాయణ మూర్తి గారి విమలాదేవిలోనూ ఎన్నో పరిష్కారాలు కొమర్రాజు లక్ష్మణరావు స్వయం గా చేసారు. ఎన్నో చారిత్రకాంశాలలోని దోషాలను పరిష్కరించారు.

కొమర్రాజు లక్ష్మణరావు మల్లికార్జున పండితారాధ్యుల ‘శివతత్వసార’మనే మహత్తర గ్రంథాన్ని పరిష్కరించి విపుల పీఠికను సిద్ధం చేసారు. ఈ గ్రంథాన్ని పిఠాపురం రాజావారి ఆంధ్రసారస్వత పరిషత్ వారు ముద్రించారు. ఈ గ్రంథ పీఠికలో ఎన్నో చారిత్రకాంశాలు పొందుపరిచారు. ఒక ఉదాహరణ, చిత్ర భారతంలో మనభూనాదు చిత్తాపఖాను అని ఉన్న ప్రయోగం కందుకూరి వీరేశలింగం పంతులు గారికి అంతుపట్టలేదు. గ్రంథాన్ని పరిష్కరించి ప్రచురిస్తున్న సమయంలో ఈ చిత్తాపఖాను ఒక సమస్యగా నిలిచింది. అప్పుడాయన తేలికగా “చిత్తాబ్జఖాను”గా సంస్కరించి బయటపడ్డాడు. 30 సంవత్సరాలు పెనుగులాడితే, చిత్తాపఖాను అసలు రహస్యం బయటపడింది.

మనభూపాలుని కుమారుడు చిత్రాపభాను అనే ముస్లిం భూపాలకుడుండే వాడు. మత సామరస్యం గల చక్రవర్తి. అతడు స్వయంగా హిందూ దేవాలయాలు నిర్మించాడు. విరివిగా దానాలు చేసాడు. ఈ విషయాలు లక్ష్మణరావు వెలువరించారు. ఆయన వరంగల్‌కు చెందిన ఒక శాసనం కనుక్కున్నారు. పాంచాలీశ్వర దేవాలయానికి చిత్తాపఖాను భూరి దానాలెన్నో చేసిన సంగతి ఆ శాసనంలో ఉంది. మరమత్తులు చేయించారు. ఈ శాసనం శాలివాహన శకం 1425వ నాటిది. అంటే క్రీ.శ. 1503 నాటిదన్న మాట. 1902 నాటి ఎపిగ్రాపికల్ రిపోర్టులలో కూడ ఈ శాసన పాఠం ఉంది. ఈ పరిశోధనలో తనకు సహాయ పడిన ఆంధ్రసాహిత్య పరిషత్ పత్రిక కార్యాలయ మేనేజర్ కొత్తపల్లి సూర్యారావు, సంపాదకత్వంలో సహాయపడిన కర్రి సాంబమూర్తికి లక్ష్మణరావు కృతజ్ఞతలందించారు.

లక్ష్మణరావు గొప్ప సారస్వత వేత్త, చరిత్రవేత్త, విజ్ఞాన సర్వస్వ నిర్మాత మాత్రమే కాదు తెలుగునాట జాతీయోద్యమ భావజాలానికి అత్యంత ప్రాచుర్యం కల్పించి స్వాతంత్ర్యోద్యమ చైతన్యానికి పూర్వరంగం సిద్ధపరచిన మహనీయుడు. 1907వ సంవత్సరం నాటికే కృష్ణా జిల్లా రాజకీయ మహాసభను, సంఘ సంస్కరణ మహాసభను నిర్వహించిన ఘనకీర్తి లక్ష్మణరావుది. అనాటికి భారతదేశంలో గాంధీజీ పేరు కూడా ఎవరూ విని ఉండరు. ఆ సభలలోనే లక్ష్మణరావు ఆధునిక భారతదేశ సర్వతోముఖ అభ్యుదయానికి స్వరాజ్యం, స్వతంత్ర్యం, స్వదేశి, స్వభాష నాలుగు వేదాలనీ ఈ నాటి వేద సంస్కృతిగా వీటిని మనం ఆరాధించాలనీ రాజానాయని వెంకట రంగారెడ్డి అధ్యక్షోపన్యాసం ద్వారా ప్రకటింపజేసారు. అందువల్లే తెలుగునాట జాతీయోద్యమంలో మునగాల సంస్థానం ముందున్నది. ఆనాటి కృష్ణా జిల్లా సంఘ సంస్కరణ మహాసభల కార్యదర్శి లక్ష్మణరావు, సభాధ్యక్షులు కొండ వెంకటప్పయ్య పంతులు.

అంటరానితనం నిర్మూలనం కోసం లక్ష్మణరావు ఆనాడే చేసిన కృషి ఈనాడు ఎంతో ఆశ్చర్యం కలిగిస్తుంది. స్త్రీ విద్య, మహిళల సమగ్ర వ్యక్తిత్వ వికాసాన్ని ఎంతగానో కాంక్షించారు లక్ష్మణరావు. తన మనుమరాలు అచ్చమాంబకు యుక్త వయసు రాకుండానే సంప్రదాయానుసారం వివాహం జరిపించాలని లక్ష్మణరావు తల్లి గంగమ్మ మంకుపట్టు పట్టినపుడు ఆయన వినిపించుకోలేదు. ఆమెను చదివించారు, గంగమ్మ సహించలేక పోయింది. సమాధాన పడలేక పోయింది. లక్ష్మణరావు తాను చేసే పనులన్నీ శాస్త్ర సమ్మతాలేనని నిరూపించినా సంప్రదాయాచార పరాయణురాలైన గంగమ్మ అంగీకరించలేక పోయేవారు. లక్ష్మణరావు కుమార్తెను పై చదువుల కోసం విదేశాలకు పంపగా గంగమ్మ కోపాగ్ని మరీ ప్రజ్వలించింది. ఇక తానా ఇంట ఉండలేనని నిశ్చయించుకొంది. ఒంటరిగా కాశీకి వెళ్ళిపోయింది. తనకంటే ముందుగా కుమారుడు చనిపోయాడన్న వార్త అందినా ఆమె తిరిగి రానే లేదు. అంత సంస్కరణ శీలి లక్ష్మణరావు. ఆయన కుమార్తె అచ్చమాంబ ఆ రోజులలోనే వైద్యవృత్తిలో గొప్ప పేరు సంపాదించుకోగలిగింది.

అఖిల భారత స్థాయిలో గోపాలకృష్ణ గోఖలే, రామకృష్ణ గోపాల భండార్కర్, మహాదేవ గోవింద రానడేల వంటి ప్రాబోధికుడు లక్ష్మణరావు. ఆధునికాంధ్ర దేశంలో చరిత్ర రచనకు ప్రామాణికమైన మార్గం ఏర్పరచిన చిలుకూరి వీరభద్రరావు, మల్లంపల్లి సోమశేఖర శర్మల వంటి చరిత్ర రచయితలను తీర్చిదిద్దింది లక్ష్మణరావే. దేశ చరిత్ర రచనలో ఏ విధమైన అధ్యయనం అవసరమో, ఏ విధమైన దృక్పథం అగత్యమో ఈ విధంగా వివరించారు లక్ష్మణరావు.

"దేశ చరిత్ర యనగా రాజుల జీవితములు అప్పటి జనుల స్థితి గతులను, విద్యా విభవములను గనుగొనుటయు నావశ్యము. అప్పటి జన సామాన్యపు స్థితిని గనుగొనుటకు నాయాశతాబ్దములలో నీ దేశమునకు వచ్చిన పరదేశీయులైన బాట సారుల వ్రాతలు ముఖ్యాధారములు. టెరీ, డిలాలేక్, ట్యావర్నియర్, థెవెనాట్, ఫ్రాయర్, హ్యామిల్టన్ మొదలగునవి పాశ్చాత్య ప్రవాసులనేకులీ దేశమునకు వచ్చిరి. వారు వ్రాసియుంచిన ప్రవాస వర్ణనలప్పటి దేశస్థితి సూచకములు" అన్నారు, మహమ్మదీయ మహాయుగంలో.


మహమ్మదీయ పరిపాలకుల కాలంలో ఆర్థికంగా దేశం అభివృద్ధి చెందిందనీ బ్రిటీష్ వారి పరిపాలన కాలంలో దేశ సంపదను కొల్లగొట్టి వారు విదేశాలకు తరలించారని 1908 నాటికే లక్ష్మణరావు గారు విమర్శించారు. లక్ష్మణరావు గారికి పూర్వం దేశ చరిత్ర అంటే కేవలం రాజవంశాల చరిత్రగానే ఉండేది. అనలు ఆంధ్ర దేశానికి సంబంధించినంత వరకు చరిత్ర వేత్తలు కాని, చరిత్ర రచయితలు కాని లేనేలేరు. అందువల్ల చరిత్ర అధ్యయనం, చరిత్ర రచన తెలుగునాట లక్ష్మణరావుతోనే ప్రారంభమైనాయని చెప్పాలి.

ఆయన మహారాష్ట్రంలో ఎంతటి పాండిత్యం సంపాదించగలిగారంటే మరాటీలో మోరోపంత్ అనే ప్రాచీన కవి వ్రాసిన మహాభారతం కర్ణపర్వానికి సంపాదకత్వ బాధ్యత వహించి పరిష్కరించి అచ్చువేసారు. అందువల్ల మహారాష్ట్ర సాహిత్య పరిషత్తులో స్మృతి నివాళి పూర్వకంగా లక్ష్మణరావు ఛాయా చిత్రాన్ని నేటికీ మహారాష్ట్రులు అభిమానిస్తున్నారు.

కొమర్రాజు లక్ష్మణరావు 1923 జులై 12న ఆంధ్ర భాషా సరస్వతిలో లీనమయ్యారు. లక్ష్మణరావు గారికి కావ్య కళాదృష్టి, కావ్య రసాస్వాదనా శక్తి కూడా ఉంది. కాని కావ్యాల వల్లనే వాఙ్మయానికి శాశ్వతత్వం కలగదని ఆయన గట్టి నమ్మకం. అందువల్ల చరిత్ర, శాసనాల పరిశోధనలకు, శాస్త్ర గ్రంథాల రచనకు, వాటి ప్రకటనకు జీవితమంతా అంకితం చేసారు.

ఆధునిక భారతదేశ జాతీయోద్యమ చిరయశస్వి, 'భారతదేశం రత్న గర్భ' అని లోకానికి మరోసారి చాటి చెప్పిన లోకమాన్య బాల గంగాధర తిలక్‌తో చరిత్ర, ఇతిహాస, సామాజిక విజ్ఞాన సంవాదాలలో పాల్గొన్న మహా ప్రతిభావంతుడు కొమర్రాజు. వెంకట లక్ష్మణరావు గారు. అసలు ఆయనే ఒక విజ్ఞాన సర్వస్వం అని చెప్పాలి. ■

# ప్రాథమిక విధులు - ఒక పరిశీలన




ప్రాథమిక విధులు అనేవి భారత రాజ్యాంగ ముఖ్య లక్షణాలలో ఒకటి. భారత రాజ్యాంగం అములులోకి వచ్చిన సమయంలో ప్రాథమిక విధుల గురించి ప్రస్తావన లేదు. అయితే స్వాతంత్ర్యానికి పూర్వం శ్రీమన్నారాయణ అగర్వాల్ 'గాంధీయన్ కాన్‌స్టిట్యుషన్ ఫర్ ఫ్రీ ఇండియా" (1946) అనే గ్రంథంలో ప్రాథమిక హక్కులతో పాటుగా ప్రాథమిక విధులను గురించి పేర్కొన్నారు. ఈ గ్రంథానికి మహాత్మాగాంధి పీఠిక వ్రాస్తు ప్రాథమిక విధులను నిర్వర్తించిన పౌరులకు మాత్రమే ప్రాథమిక హక్కులను అందుబాటులో ఉంచాలని తెలియజేశాడు. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో రాజకీయ, రాజ్యాంగ సంబంధమైన వ్యవహారాలలో అనేక మార్పులు వచ్చాయి. భారతదేశంలో అనేక రాష్ట్రాలలో ఉవ్వెత్తున భాషాపరమైన, భౌగోళికపరమైన ఉద్యమాలు ఉత్పన్నమై ప్రత్యేక రాష్ట్రాల ఏర్పాటు కావాలనే డిమాండ్ అధికమైంది. ఆ ఉద్యమాల సమయంలో సంయమనం కోల్పోయిన మన రాజకీయ నాయకులు సామాన్య ప్రజలను రెచ్చగొట్టి వారిని హింసామార్గాలు చేపట్టేటట్లు చూశారు. ప్రాథమిక హక్కుల వినియోగం పేరుతో బాధ్యతలని విస్మరించి వ్యవహరించాయి. ఇలాంటి సమయంలో ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులకు, కార్యాలయాలకు విశేష నష్టం కల్గించారు. దీంతో భారత ప్రభుత్వ వైఖరిలో కొంత మార్పు వచ్చి అంతరంగిక అత్యవసర పరిస్థితి (1975-77) కాలంలో కొన్ని ప్రాథమిక విధులను రాజ్యాంగంలో పొందుపరచాలనే ఆలోచన ఏర్పడింది.

ఐక్యరాజ్య సమితి విశ్వజనీన మానవహక్కుల ప్రకటన (Universal Declaration of Human Rights) సోవియట్ యూనియన్ తరహాలోని ప్రాథమిక విధులను భారత రాజ్యాంగంలో చేర్చాలని భావించి అత్యవసర పరిస్థితి కాలం నాటి అధికార పార్టీ ఈ విషయంలో చొరవ తీసికొని స్వరణ్‌సింగ్ కమిటిని 1976లో ఏర్పాటు చేసింది. ఈ కమిటి భారత రాజ్యాంగంలో 8 రకాల ప్రాథమిక విధులను పొందుపరచాలని సూచించింది. దీనికి అనుగుణంగా అప్పటి అధికార పార్టీ అయిన భారత జాతీయ కాంగ్రెస్ పార్లమెంట్‌లో 42వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. పార్లమెంట్ ఈ రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించింది దీంతో భారత రాజ్యాంగంలో 10 ప్రాథమిక విధులను చేర్చడం జరిగింది. వీటిని రాజ్యాంగంలోని 4(ఎ) భాగంలో 51(ఎ) అనే అధికరణలో తెలియజేయడం జరిగింది. తరువాత 2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా 6-14 సంవత్సరాల లోపు బాలబాలికలకు ఉచిత నిర్బంధ విద్యను అందించుటకు తల్లిదండ్రులు మరియు సంరక్షకులు కృషి చేయవలెను అనే 11వ విధిని చేర్చడం జరిగింది. ఈ విధంగా ప్రస్తుతం 11 ప్రాథమిక విధులు కలవు. అయితే "విధి" అంటే కర్తవ్యం, బాధ్యత, చేయవల్సిన పనిగా చెప్పవచ్చును. ఈ విధంగా హక్కులు విధులు అనేవి ఒకే నాణానికి గల ఇరు ప్రక్కలు అని హెచ్.జె. లాస్కి పేర్కొన్నారు. అదే విధంగా 1976లో నాటి న్యాయశాఖమంత్రి అయిన జె.ఆర్. గోఖలే 1950లో రాజ్యాంగ నిర్మాతలు విస్మరించిన రాజ్యాంగ బాధ్యతను విధులను రాజ్యాంగంలో చేర్చడం ద్వారా మేము ఈ లోపాన్ని పూరిస్తున్నాం అని పేర్కొన్నారు.

**స్వరణ్‌సింగ్ కమిటి చేసిన సూచనలలోని క్రింది అంశాలను ప్రాథమిక విధులలో చేర్చలేదు.**

1. సకాలంలో పన్నులు చెల్లించుట
2. విధులను తప్పనిసరిగా పాటించునట్లు చట్టాలు చేయుట
3. విధులను పాటించని వారిని శిక్షించుట.

**ప్రస్తుతం భారత రాజ్యంగంలో 11 ప్రాథమిక విధులు కలవు అవి**

1. భారత రాజ్యాంగాన్ని, జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని ప్రతి పౌరుడు గౌరవించాలి.
2. స్వాతంత్ర్య ఉద్యమ, లక్ష్యసాధనకు మరియు ఉన్నత ఆదర్శాల సాధనకు కృషి చేయుట.
3. దేశ సమైక్యత, సమగ్రతను పరిరక్షించుట.
4. దేశ సార్వభౌమత్వాన్ని సంరక్షించుటకు జాతీయ సేవకు కంకణబద్ధులు కావడం
5. భారత ప్రజల మధ్య సామరస్యాన్ని సోదరభావాన్ని పెంపొం దిస్తు, స్త్రీలగౌరవమర్యాదలకు భంగం కలిగించకుండ ఉండాలి.
6. భారతీయుల వారసత్వానికి చిహ్నం అయిన ఉమ్మడి పౌర సంస్కృతిని సంరక్షించడం.
7. పర్యావరణాన్ని, వన్యమృగాల సంరక్షణకు కృషి చేయడం.
8. శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకుంటూ సంస్కరణల పట్ల ప్రోత్సాహక వైఖరిని కల్గి ఉండటము.
9. ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఆస్తులకు నష్టం కలిగించకూడదు.
10. వ్యక్తిగతంగాను మరియు సమిష్టిగాను ఔన్నత్యాన్ని పెంపొందించుటకు ఉన్నత స్థితికి చేరుకొనుటకు కృషి చేయాలి.
11. 6 సంవత్సరాల నుండి 14 సంవత్సరాలలోపు బాలబాలిక లందరికి ఉచిత నిర్బంధ విద్యను అందించుటకు తల్లిదండ్రులు మరియు పౌరులు సంరక్షకులు కృషి చేయ్యాలి.

*తరువాయి 50వ పేజీలో...*

**మార్క కిరణ్, రాపెల్లి వెంకటేష్**
ఫ్రీలాన్స్ రచయితలు

# త్యాగరాజ కృతుల ప్రచార సారథి
# సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రులు



తెలుగు ప్రాంతమున సంగీతాది సకల శాస్త్ర విద్వాంసులలో పలువురు చారిత్రక కారణాల వల్ల దక్షిణాది తంజావూరు నాయకరాజుల పాలనలో వున్న ప్రాంతానికి వలసపోవాల్సి వచ్చింది. వారిలో మేలట్టూరు భాగవతులనే నృత్యకళాకారులు, త్యాగరాజస్వామి గారి పూర్వీకుల వంటి ఎందరో నృత్య, సాహిత్యవేత్తలు ఉన్నారు. తంజావూరులో వీరు తెలుగు నాయకరాజుల ఆశ్రయం ఆర్థించగా, అర్హతలను బట్టి, విజయరాఘవ నాయకుడు, అచ్యుతప్ప నాయకుడు, రఘునాథ నాయకుడు వంటి నాయకరాజులు ఈ పండితులకు అగ్రహారాలిచ్చి, వారి వారి కళాభివృద్ధిని చేసుకోవడానికి సౌకర్యం కల్పించారు. త్యాగరాజస్వామి వారి తాతగారు, గిరిరాజ కవి సంగీతజ్ఞులు కనుక వారి వంశంలో త్యాగరాజు ఆవిర్భవించి రచించిన మహోన్నత కృతులు, తెలుగు మాట్లాడే ప్రాంతానికి వచ్చేందుకు ఐదారు దశాబ్దాలకు పైగా పట్టింది. ఈ సంగీత గంగను ప్రవహింపచేయడానికి కొందరు భగీరథులు కావాల్సి వచ్చింది. అటువంటి వారిలో కృష్ణాజిల్లా పెదకళ్లేపల్లి గ్రామస్థులు, సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రులు ఒకరు.

సుసర్ల దక్షిణామూర్తి సంగీత విద్యాభివృద్ధిని, ముఖ్యంగా సద్గురు త్యాగరాజస్వామి కృతి సంపదను సేకరించడానికి, త్యాగరాజుల వారికి దగ్గర బంధువు, అత్యంత ఆప్త శిష్యులు కూడా ఐన మానాంబువాపది గ్రామస్థులు, ఆకుమళ్ళ వెంకటసుబ్బయ్యని కలుసుకోవడానికి కాలినడకన దక్షిణాదికి వలస వెళ్ళారు. ఆ సమయానికి వెంకటసుబ్బయ్య దాదాపు అవసానదశలో ఉన్నారట. ఇంత దూరం నడిచి వచ్చారన్న విషయం అడిగి తెలుసుకుని తమకు శక్తి ఉన్నంతవరకూ సంగీత బోధన చేస్తానని మాటిచ్చి, సుసర్ల వారిని అంతేవాసులుగా ఉండమన్నారు. సుసర్ల దక్షిణామూర్తి అప్పటికే, 22 సంవత్సరాల వయసు వారు, కచేరీలు చేసి, పేరు గడించినవారు.

1859 ప్రాంతాల్లో వచ్చిన రౌద్రి నామ సంవత్సరం, ఆషాఢ బహుళ త్రయోదశినాడు, సీతామహాలక్ష్మి, గంగాధర శాస్త్రి పుణ్యదంపతుల కనిష్ఠ (మూడవ) పుత్రునిగా శాస్త్రి జన్మించారు. ఆయన సంగీతాభ్యాసానికి దక్షిణాధి యాత్రకు పయనమయ్యే ముందే, మైలవరపు లక్ష్మీ నరసింహ శాస్త్రి గారి కుమార్తె, వేంకట సుబ్బమ్మని వివాహమాడారు. భార్యను స్వస్థలంలోనే ఉండమని, తాను సంగీత విద్యార్జనకోసం దక్షిణాది వెళ్లి గురువు వెంకటసుబ్బయ్యని ఆశ్రయించారు. గురువు మంచం పట్టిన తరువాత కూడా సుసర్ల అక్కడే వుండి, గురువుకి సకల సపర్యలూ చేశారు. గురువు వెంకట సుబ్బయ్య తుదిశ్వాస విడిచే ముందు, దక్షిణామూర్తిని పిలిచి, రెండు కావడి పెట్టెలు చూపించి, నాయనా ఈ పెట్టెలలో సద్గురు త్యాగరాజ స్వామి కృతి సంపదలు, నా స్వదస్తూరీతో రాసి పెట్టినది ఉన్నది. దీనికి నిన్ను వారసుడిని చేస్తున్నాను. సద్వినియోగం చేసుకో" అంటూ పరమపదించారట! ఆ పెట్టెలను దక్షిణామూర్తి నానా యాతనలను పడి, ఏదో విధంగా ఆంధ్రలో స్వగ్రామం పెద్ద కళ్లేపల్లి చేర్చారు.

శ్రీ త్యాగరాజస్వామి మూడవతరం శిష్యుడైన కారణంగా


రేవూరి ఉమా సంజీవిని రామకృష్ణ
ఫ్రీలాన్స్ రచయిత్రి

దక్షిణామూర్తి శాస్త్రి గురువు ఆదర్శాలనే పాటిస్తూ, తన స్వగృహాన్నే ఒక గురుకులంగా చేసి, ఎందరో శిష్యులకు సంగీత బిక్ష పెట్టిన వితరణ శీలి. వారిలో పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారు ఒకరు. సుసర్ల గురించి చెప్పాలంటే, శిష్యవాత్సల్యంతో ఎంతో ఆదర్శంగా జీవితం గడిపినారు. కేవలం గాత్రజ్ఞులు, వయోలిన్ వారికే కాదు, నాదస్వరం వాయించే వారికి సైతం ఆయన గురుత్వం వహించి, జాతి, కుల బేధాలు పాటించకుండా, ఆర్జించిన వారి కందరకూ సంగీత విద్య గరిపారు. కొన్ని పనులు చేయడానికి కొందరు కారణ జన్ములు పుడుతుంటారు. అందులో సంగీత విద్య ప్రత్యేకంగా త్యాగరాజ కృతులు తెలుగునాట ప్రచారం చేయడానికి జన్మించిన కారణ జన్ములలో సుసర్ల ప్రముఖులు. మరికొందరు బొబ్బిలి కేశవయ్య, వీణ వెంకట రమణ దాసు వంటి వారున్నారు. కాని సుసర్ల వారి శిష్యకోటికి సమాన సంఖ్యలో శిష్యులు కలవారు తక్కువ. సుసర్ల వారు సరస్వతీ మాత ఉపాసకులు. ఆపాత మధురమైన సంగీతం, ఆలోచనామృతమైన సాహిత్యంలో ముఖ్యంగా సంస్కృతం రెండూ అభ్యసించి ప్రవీణులైన వారు, గురువు, మానాంబుచావడి వెంకట సుబ్బయ్య వద్ద సంగీతం అభ్యసించారు. పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్, మహావైద్యనాధ అయ్యర్, పంచాపకేశయ్య (ఈయన శ్రీ త్యాగరాజస్వామి అన్న మనుమడు) మున్నుగువారుతోపాటు సుసర్ల తమ గురువు వెంకటసుబ్బయ్య ద్వారా తెలుసుకున్నారు. దక్షిణామూర్తి శిష్యులలో ముఖ్యులు, సుసర్ల సహాధ్యాయులు, శరభశాస్త్రి వీరి శిష్యులే వేణుగాన ధురీణులు పల్లడం సంజీవయ్య. వీరిలో పలువురు తమిళులనిపించే నామధేయుము కలవారైనా, ఆ రోజుల్లో తమిళ, తెలుగు అనే భాషా బేధం లేదు. ఏ భాష వారైనా, అందరూ వేషమ్యం లేకుండా, భావ సమైఖ్యతతో సహ జీవనం చేసేవారు అని సుసర్ల తమశిష్యులకు కూడా అదే ఆదర్శం నేర్పారట.

సుసర్ల, ఆదర్శం, ప్రతిఫలం అపేక్ష లేకుండా, అడిగిన వారందరికీ, సంగీతం బోధించేవారు. ఇదే ఆదర్శం త్యాగరాజ స్వామి కూడా అనుసరించి, తమ శిష్యులకూ అదే వరవడి అనుసరించ వలసిందిగా బోధించారట! సుసర్ల అనేక మంది పేద విద్యార్థులకు ప్రతిఫలం ఆశించకుండానే, భోజన వసతి సౌకర్యాలు కల్పించారట. ఉంచ వృత్తిని పోలిన పద్దతిని కూడా ఆయన పాటిస్తూ, తమ వద్ద ఉన్న సొంత వారసులకు అదనంగా త్యాగరాజ వర్ధంతి శ్రీరామ నవమి మొదలైన సందర్భాలలో వారి వద్ద నుంచి ధాన్యాది సామగ్రులు విరాళంగా తీసుకుంటూ పేద విద్యార్థులకు ఉచిత భోజన సౌకర్యం కోసం ఉపయోగించేవారని ప్రతీతి. గురుకుల ఆశ్రమ పద్దతిలో సంగీత భోదన సీనియర్ శిష్యులకు తామే సంగీతం బోధిస్తూ చిన్నవారికి సీనియర్ శిష్యుల చేత విద్యాబోధన చేయిస్తూ వారి వివాహముల విషయంలో కూడా శ్రద్ధ తీసుకుంటూ వారి భవిష్యత్తు గురించి తన సొంత కుమారులవలె ఎంతో శ్రద్ధ వహించేవారని వారి శిష్యులు చెప్పేవారు. అన్నం పెడితే, ఆకలి తీరిన తరువాత మరచిపోతాం. విద్యాదానం చేస్తే ఆ జన్మాంతం గుర్తుంటుంది. గురుభావం ఉంటుంది. అన్నదానం విద్యాదానం రెండూ చేసిన దాతలే సుసర్లవారు. ■

*48వ పేజీ తరువాయి...*

## ప్రాథమిక విధులు - ఒక పరిశీలన

**ప్రాథమిక విధులపై వివిధ కమిటీలు** : మన దేశంలో జనవరి 3వ తేదీన ప్రాథమిక విధుల దినోత్సవంగా జరుపుకుంటారు. ప్రాథమిక విధుల కోసము 1999లో కేంద్రంలో హెచ్.ఆర్.డి. జస్టిస్ జె.ఎస్. వర్మ నేతృత్వంలోని ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు.

**జస్టిస్‌వర్మ కమిటి సూచనలు :** ప్రాథమిక స్థాయిని మొదలుకొని ఉన్నత విద్యాస్థాయి వరకు అనగా ప్రతిదశలోను పాఠ్యప్రణాళికలో ప్రాథమిక విధులను చేర్చాలని సూచించింది. అదే విధంగా ప్రాథమిక విధులను పాటించడం కోసం ప్రత్యేక చట్టాలు చేయవల్సిన అవసరం లేదని పేర్కొన్నది. క్రింది చట్టాలను పాటించినట్లయితే ప్రాథమిక విధులు పాటించినట్లుగానే భావించవచ్చునని సూచించారు.

1. జాతీయ చిహ్నాల గౌరవ చట్టం - 1950
2. అస్పృశ్యత నివారణ చట్టం - 1955
3. పౌరహక్కుల చట్టం - 1976
4. ఆటవీ సంరక్షణ చట్టం - 1980

ఈ చట్టాలను సక్రమంగా పాటించినట్లయితే ప్రాథమిక విధులను పాటించినట్లేనని జస్టిస్ జె.ఎస్. వర్మ కమిటి సూచించింది. అయితే 2003లో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి మరియు ఎన్‌హెచ్ఆర్‌సి (National Human Rights commission) మొదటి చైర్మన్ అయిన జస్టిస్ రంగనాథ్ మిశ్రా కేంద్ర ప్రభుత్వం ప్రాథమిక విధులను అమలుపర్చడం కోసం అవసరమైన చట్టాలను రూపొందించునట్లుగా పిల్స్‌ను జారీ చేయాలని సుప్రీంకోర్టులో పిటిషన్ వేసినారు.

2002లో సుప్రీంకోర్టు All India Institute of Medical Sciences విద్యార్థి సంఘానికి V/s. యాజమాన్యానికి మధ్య జరిగిన కేసులో సుప్రీంకోర్టు ప్రాథమిక విధులను పూర్తిగా విస్మరింపదగినవి కావని సమాజం పట్ల వ్యక్తి యొక్క బాధ్యతలను తెలియజేసేవిగా గుర్తించాలని పేర్కొంది.

**ప్రాథమిక విధులపై విమర్శనాత్మక పరిశీలన** : ప్రాథమిక విధులు కేవలం సలహా పూర్వకమైనవి మాత్రమే. ఇవి కేవలం సామాజిక, నైతిక విలువలను పెంపొందించుటకు ఉద్దేశించబడినవి. వీటిని అమలు చేయుటకు ఎలాంటి యంత్రాంగం లేదు. వీటిని ధిక్కరించిన, పాటించని యెడల ఎలాంటి శిక్షలు ఉండవు. వీటికి న్యాయ సంరక్షణ కూడా లేదు. ప్రాథమిక విధులు అమలు కోసం ఏ వ్యక్తి ఉన్నత న్యాయస్థానాలను సంప్రదించుటకు అవకాశంలేదు.

ఉన్నత న్యాయస్థానాలు వీటి అమలు కోసం ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు. జస్టిస్ ముఖర్జీ రాజ్యాంగంలో ప్రాథమిక విధులు కేవలం అలంకార ప్రాయమైనవి మాత్రమేనని విమర్శించినాడు. అదే విధంగా డి.కె. భాలువా ప్రాథమిక విధులను సలహాపూర్వకమైనవిగా మాత్రమే గుర్తించాలని పేర్కొన్నారు. అదే విధంగా డి.డి.బసు ఆదేశిక సూత్రాలను అమలు పర్చడంలో ప్రభుత్వం చిత్తశుద్ధి ఎలాంటివో ప్రాథమిక విధులను పాటించడంలో పౌరులు చిత్తశుద్ధి కూడా అలాంటిదే అని పేర్కొన్నారు. ■

# వారసత్వపు సంపద ఈ విద్యాలయం!

పురాతన భవనాలు! వారసత్వపు సంపదకు నిలువెత్తు నిదర్శనాలు. కొన్ని శిధిలాలుగా మిగులుతుంటే - మరికొన్ని పునర్జీవనం పోసుకుంటూ అలనాటి వైభవానికి ప్రతీకలై నిలుస్తున్నాయి.

హైదరాబాద్ నగరంలో పాతబస్తీకి ఆనుకుని ఉన్న సిటీ కాలేజ్. ఒక వైపు హైకోర్టు - మరో వైపు సాలర్‌జంగ్ మ్యూజియమ్, నయాపూల్‌కి అవతల ఉస్మానియా హాస్పిటల్. ఇన్ని వైభవ కట్టడాల మధ్య వున్న ప్రాంతంలో నెలకొని ఉన్న సిటీ కాలేజి! ఎప్పటికప్పుడు సంరక్షించబడుతుంది. కనుక ఈ సిటీ కాలేజీ భవనం ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించబడినా ఇప్పటికీ చెక్కు చెదరకుండా చరిత్రకు సాక్షిభూతంగా అలాగే నిలిచి ఉంది. ఈ భవంతిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారసత్వపు చిహ్నంగా ప్రకటించింది.

నవాబ్ ఉస్మాన్ ఆలీఖాన్ నవీన కాలపు నిర్మాణ కర్తగా పేరు పొందాడు. 1915-20 మధ్య కాలంలో ఈ కాలేజీ నిర్మాణానికి అయిన వ్యయం ఎనిమిది లక్షల ముప్పై ఆరు వేల తొమ్మిది వందల పందొమ్మిది రూపాయలు మాత్రమే. ఈ కాలేజీ భవనాన్ని ఆకాలంలో ప్రసిద్ధి చెందిన విన్‌సెంట్ ఎరిక్ రూపకల్పన చేస్తే నిర్మాణాన్ని పర్యవేక్షించింది మాత్రం నిజాం. ఈ భవనం యొక్క నిర్మాణ శైలిలోని కళాకృత సమ్మేళనం చూసేందుకు రెండు కళ్లు చాలవన్నట్లు అత్యంత మనోహర రూపాన్ని సంతరించుకుని ఉంటుంది.

ఈ భవనం ఎంత చక్కగా రూపొందించబడిందంటే చుట్టూ ఆరు భవన సముదాయాలను కలుపుతూ నిర్మించబడిన ప్రవేశ ద్వారాలతో అలరారుతూ మధ్యలో ఉన్న బహిరంగ ప్రదేశం ఉంటుంది. అలా వుండటం వలన ఆ భవన సముదాయాలలో ఉన్న క్లాస్‌రూమ్స్‌లోకి ధారళమైన గాలీ - వెలుతురూ వచ్చి వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మనోహరంగా తీర్చిదిద్దిన స్థంబాలూ, ద్వార బంధాలూ అజంతా ఎల్లోరా గుహలలోని విశిష్ఠతను సంతరించుకుని ఉంటాయి.

నిజాం మహబూబ్ ఆలీఖాన్ అసిఫ్ జా మొట్టమొదటి మదర్‌సా దార్ - ఉల్ ఉలూకు 1865కు పూర్వమే స్థాపించాడు. తరువాత కాలంలో నిజాం ఉస్మాన్ ఆలీఖాన్ - అసిఫ్ జా దానిని సిటీ హైస్కూల్‌గా మార్చారు.

**జి.ఎన్. సూరి**
ఫ్రీలాన్స్ రచయిత



1921లో ఈ గొప్ప భవంతిలోకి స్కూలుని మార్చటం జరిగింది. 'ఉర్దూ మాధ్యమంగా ఇక్కడ 1921లోనే ఇంటర్మీడియట్ సెక్షన్స్‌ని ఉస్మానియా యూనివర్సిటీ కేవలం ముప్పై మంది విద్యార్థులతో ఈ హైస్కూలు యాజమాన్యపు పర్యవేక్షణలో ప్రారంభించింది. ఈ స్కూలు మరికొంతకాలం తర్వాత తన స్థాయిని మార్చుకుని సిటీ కాలేజీగా రూపొందింది. అది ఉస్మానియా యూనివర్సిటీకి అనుబంధం అయింది.

1956లో ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్మీడియట్ కోర్సుని రద్దుచేసి ప్రీ యూనివర్సిటీ తరగతులను ప్రారంభించింది. కాలక్రమేణా సైన్స్ కోర్సులు కూడా ప్రారంభించడబడటంతో 1962లో ఈ సంస్థ సిటీ సైన్స్ కాలేజిగా మారి దాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి స్వాధీన పరుచుకోవడం జరిగింది. ఆ సమయంలోనే అది ప్రభుత్వ సిటీ సైన్స్ కాలేజీగా దాని పేరుని మార్చుకుంది. 2001 నుంచి 2003 మధ్యలో పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులు బయోటెక్నాలజీ - మ్యాథమాటిక్స్ ప్రవేశపెట్టారు.

అంతవరకూ ఆర్ట్స్ కాలేజీగా ఉన్న ఇందులో బయోటెక్నాలజీ లాబ్ జత పర్చటంతో దాని ఖ్యాతి మరింత ఇనుమడించింది. పదహారు ఎకరాల విశాలమైన స్థలంలో ఈకాలేజీ విస్తరించి ఉంది. ఈ కాలేజీ భవంతిని వారసత్వపు సంపదగా ప్రభుత్వం గుర్తించింది. ఈ కాలేజీ ఆవరణలో ఎన్నో చలన చిత్రాలు రూపుదిద్దుకున్నాయి. ఎందరో విద్యావేత్తలూ, రాజకీయ నాయకులు, కేంద్ర ప్రభుత్వంలో మంత్రులుగా చేసిన ఎస్.బి. చవాన్, శివరాజ్ పాటిల్, పి. శివశంకర్, వీరేంద్ర పాటిల్, మర్రి చెన్నారెడ్డి వంటి వారే కాకుండా సైనికాధికారులూ, పద్మశ్రీ అర్జునా అవార్డ్ గ్రహీతలూ ఈ విద్యాప్రాంగణం నుంచి వచ్చిన వారే.

తరాలు గడచినా ఈ కట్టడం ఒక మహోన్నత జ్ఞాపకంగా ఇక్కడి పూర్వ విద్యార్థులకు మదిలో నిలుస్తూనే ఉంటుంది. చెక్కు చెదరని ఈ నిర్మాణం హైదరాబాద్ నగరానికి ఒక మకుటాయమానంగా నిలుస్తోందనటానికి ఏమాత్రం సందేహం లేదు.

Published on 6th January 2014, posted on 7 - 8 January,2014

Yojana (Telugu) January, 2014 RNI Regd. No. 37729/80 Regd. No. H/HD-663/2012-14

## Check List & important instructions for subscription of Journal(s)

1. Subscriber must ensure that DD/IPO/MOs are in favour of ADG (I/c), Publications Division, M/o I&B payable at New Delhi and of requisite amount. The annual subscription is following:

| | Ajkal/Kurukshetra/Yojana | Bal Bharti |
|---|---|---|
| One Year | ` 100/- | ` 80/- |
| Two Year | ` 180/- | ` 150/- |
| Three Year | ` 250/- | ` 200/- |
| For SAARC countries (for one year only) | ` 530/- | ` 510/- |
| For other countries (For one year only) | ` 730/- | ` 710/- |

2. Subscription for Ajkal Hindi/Urdu, Bal Bharti, Kurukshetra Hindi/English and Yojana Hindi/English/Urdu/Punjabi/Oriya may sent to Business Manager, Publications Division, East Block 4, Level 7, R.K. Puram, New Delhi. The language of journal must be clearly indicated.
3. Subscriber must ensure that MOs (ordinary as well as e-MO) must contain name and language of journal required either in message box or at address column, otherwise it could not be accepted.
4. DD & IPO must be accompanied either with dully filled subscription coupon published in our Journals or in a plain paper containing name and address of subscriber alongwith name and language of Journal required.
5. In case of non receipt of magazine or any other problem please intimate to Business Manager (C&A) within a month period after which complaint will not be entertained.
6. Subscription for regional languages of Yojana shall be sent directly to Regional Centres on the following address:

| S. No | Magazine | Language | Officer Concerned | Office Address | Email/phone |
|---|---|---|---|---|---|
| 1 | Ajkal | Hindi/Urdu | Business Manager | Publications Division, Min. of I&B, East Block 4, Level 7, R.K. Puram, New Delhi 110066 | pdjucir@gmai.com<br>011-26100207 |
| 2. | Bal Bharti | Hindi | -do- | -do- | -do- |
| 3. | Kurukshetra | Hindi/ English | -do- | -do- | -do- |
| 4. | Yojana | Hindi/ English/ Punjabi/ Urdu/ Oriya | -do- | -do- | -do- |
| 5. | Yojana | Assamee | Business Manager | Sales Unit, Publications Division, KKB Road, New Colony, House no. 7, Chenikuthi, Guwahati, Assam 781003 | yojanaasomia@yahoo.co.in<br>0361-2665090 |
| 6 | Yojana | Bengali | Business Manager | Sales Emporium, Publications Division, 8, Esplanade East, Kolkatta, West Bengal 700069 | bengaliyojana@gmail.com<br>033-22488030 |
| 7. | Yojana | Gujrati | Business Manager | Sales Unit, Publications Division, Ambica Complex, 1st Floor, Paldi, Ahmedabad, Gujarat 380007 | yojanagujrati@gmail.com<br>079-26588669 |
| 8. | Yojana | Kannada | Business Manager | Sales Unit, Publications Division, 1st Floor, 'F' Wing, Kendriya Sadan, Kormangala, Bangalore 560034 | yojanakannada@yahoo.co.in<br>080-25537244 |
| 9 | Yojana | Marathi | Business Manager | Sales Unit, Publications Division, 701-C wing, 7th Floor, Kendriya Sadan, Belapur, Navi Mumbai, Maharastra 400614 | 022-27570686 |
| 10 | Yojana | Malayalam | Business Manager | Sales Emporium, Publications Division, Press Road, Near Govt. Press, Thiruvananthapuram, Kerala 695001 | yojanamalayalam@yahoo.co.in<br>0471-2330650 |
| 11 | Yojana (Thittam) | Tamil | Business Manager | Sales Emporium, Publications Division, 'A' wing, Rajaji Bhawan, Besant Nagar, Chennai, Tamil Nadu 600090 | editorthittam@yahoo.co.in<br>044-24917673 |
| 12 | Sales Emporium | Telugu | Business Manager | .Publications Division, Block 4, 1st Floor, Gruhakalpa Complex, M.G. Road, Nampally, Hyd. | yojana_telugu@yahoo.co.in<br>040-24605383 |
| | Yojana | Telugu Journal | Senior Editor | 10-2-1, F.D.C. Complex, A.C. Guards, Hyderabad - 500 028 | 040-23315288, 23314823<br>23310162 (Enquiries) |

Printed and Published by Ms. Ira Joshi, Additional Director General & Head on behalf of Publications Division, Ministry of I & B, Government of India and Printed at Micro Offset Printers, 11-6-868, Red Hills, Lak di ka pool, Hyderabad - 500 004. Ph. 040 - 66750291 and Published at Yojana (Telugu) 10-2-1, F.D.C. Complex, A.C. Guards, Hyderabad - 500 028. Senior Editor : **Suresh Dharmapuri,** Tel : 23315288